Dwaraka

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంతఋతువు, పుష్య మాసం, తిథి: బహుళ చవితి రా. 11.21 వరకు, అనంతరం పంచమి; నక్షత్రం: ఆశ్లేష ఉ. 9.00 వరకు, అనంతరం మఖ; అమృతకాలం: లేదు; వర్జ్యం: రా. 8.24 నుండి 9.54 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, మ. 12.24 నుండి 1.12 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు

సంపుటి:56 • సంచిక:265 • శుక్రవారం 5 జనవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ఫీజులకు బ్రేక్

10% స్కూలు ఫీజుల పెంపు ప్రస్తుతానికి లేదు...



ఫీజుల పెంపు ప్రతిపాదనపై నిరసనలు.. వెనక్కి తగ్గిన సర్కార్

- తిరుపతిరావు కమిటీ సిఫారసులు పక్కనబెట్టిన సర్కార్
- ప్రస్తుత ఫీజులే కొనసాగింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ?

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రైవేట్, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో వార్షిక ఫీజు (రుసుములు)లను ఏటా 10శాతం పెంచుకునే వీలు కల్పిస్తూ వచ్చిన సిఫారసులను తెలంగాణ ప్రభుత్వం నిలుపుదల చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఫీజులనే వచ్చే విద్యాసంవత్సరం కొనసాగించాలని ఆదేశాలు జారీచేసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని పాఠశాలల్లో వార్షిక ఫీజులు, డొనేషన్లు, ప్రత్యేక ఫీజులకు సంబంధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ మూడు రోజుల క్రితం నివేదిక అందజేసిన సంగతి తెలిసిందే. ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వపు ఉపకులపతి, రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఆచార్య తిరుపతిరావు నేతృత్వంలో ప్రభుత్వం ఫీజుల ఖరారుకు సంబంధించి కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. దాదాపు రెండేళ్ళు ఫీజుల నిర్ధారణకు సంబంధించి లోతుగా అధ్యయనం చేసిన ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఇందులో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఫీజులు, డొనేషన్లు ఇష్టారీతిన పెంచుకునేలా వీలు కల్పించడంతో విద్యార్థి తల్లిదండ్రుల సంఘాలు, వివిధ రాజకీయ పక్షాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడంతో పాటు ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యాయి. విద్యాశాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరిని ఈ సంఘాల నేతలు

⇨ 7వ పేజీలో...



అమ్మా నాన్నని గెంటేసిన ఓ కొడుకు!

- కష్టపడి కట్టుకున్న ఇంట్లోంచి వెళ్లగొట్టిన ప్రబుద్ధుడు
- కొడుకుపై చర్యలు తీసుకోవాలని బాధితుల వేడుకోలు

పాల్వంచ, ప్రభ న్యూస్: కనిపెంచిన అమ్మానాన్ననే బైటికి నెట్టి తలుపులు వేసుకున్న ఓ ప్రబుద్ధుడి నిర్వాకమిది. మాయమైపోతున్నడమ్మా.. మనిషన్నవాడు.. మృగమైపోయాడమ్మా... కొడుకన్నవాడు... మాతృత్వం విలువ లేకుండా మంట కలిసిపోతున్నది. పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని గట్టాయిగూడెంకు చెందిన సుదర్శనాచారి స్థానిక కేటీపీఎస్ కర్మాగారంలో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ కష్టపడి ఇల్లు కట్టుకున్నాడు. భార్య, బిడ్డలతో అక్కడే ఉంటూ ఈ మధ్యనే ఉద్యోగ విరమణ చేసాడు. కొడుకు సతీష్ కులాంతర వివాహమైనప్పటికీ ఘనంగా జరిపించాడు. కొద్దికాలంపాటు ప్రశాంతంగా ఉన్న ఆ కుటుంబంలో భేదాభిప్రాయాలు మొదలయ్యాయి. తల్లిదండ్రులను లెక్కచేయకుండా, వారి మాటలకు

⇨ 7వ పేజీలో...

మిగిలింది ఏడాదిన్నరే...

ఇక పరుగులే!



- తరుముకొస్తున్న సార్వత్రిక ఎన్నికలు
- ఆ మూడు పథకాలే ప్రాణం
- వేగం పెంచాలని నిర్ణయం
- రాష్ట్ర ప్రభుత్వానికి కీలక ఏడాది
- ప్రాధమ్యాలపై ప్రత్యేక దృష్టి
- సీఎం కేసీఆర్ ప్రత్యక్ష పర్యవేక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం వేగిరంగా లక్ష్యసాధన వైపు అడుగులు వేయాలని నిర్ణయించింది. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు ముగిసి... ఏడాది మాత్రమే ఇంకా వ్యవధి ఉన్న నేపథ్యంలో... అన్ని కోణాల్లో వేగం పెంచి, ప్రతిష్ఠాత్మక పథకాలను పూర్తి చేసే దిశగా కార్యాచరణలోకి దిగుతున్నది. ప్రతిష్ఠాత్మక పథకాలైన మిషన్ భగీరథ, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు, రెండు పడక గదుల ఇళ్ళ నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. కోటి ఆశలు, ఎన్నో ఆశయాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కాల గమనంలో 2017 సంవత్సరాన్ని పూర్తి చేసుకుని 2018లో అడుగు పెట్టింది. 2014 సంవత్సరం జూన్ 2వ తేదీన రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం కొలువుదీరింది. అధికారంలోకి వచ్చి ఈ నూతన ఏడాదితో మూడున్నరేళ్ళు పూర్తి చేసుకుంది. 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు కేవలం ఏడాదిన్నర వ్యవధి మాత్రమే ఉండడంతో చేపట్టిన పథకాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను పూర్తిచేసేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. కొత్తగా ఏర్పాటైన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా మంతనాలు జరిపి ప్రతిష్ఠాత్మకమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పథకాలకు అంకురార్పణ చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు పథకాలను శరవేగంతో పూర్తిచేసేందుకు నిధులు కేటాయించడంతో పాటు పనులను వేగవంతం చేసేందుకు నడుం బిగించింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ఈ ఏడాది మే నెలలో పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవలె సాగునీటి పారుదలశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు కాళేశ్వరం పనులను పర్యవేక్షించేందుకు క్షేత్రస్థాయిలో పర్యటనను పూర్తిచేశారు. ఈనెల నుంచి వారంలో ఒకసారి ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తానని అధికారులకు చెప్పిన సంగతి విదితమే. మరో ప్రతిష్ఠాత్మక పథకం రెండు పడక గదుల ఇళ్ళ నిర్మాణ పథకాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరాను నూతన సంవత్సరాన ఆరంభించిన

⇨ 9వ పేజీలో...

నీళ్లు.. నిధులు సీఎం చూసుకుంటున్నారు

ఉద్యోగాల భర్తీ ఎంతవరకొచ్చింది!

టీఎస్‌పీఎస్సీ బృందంతో గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ఏర్పడిందే నిధులు, నీళ్ళు, నియామకాల కోసం. నిధులు, నీళ్ళు ముఖ్యమంత్రి కేసీఆర్ చూసుకుంటున్నారు. మరి

⇨ 7వ పేజీలో...



నెలనెలా ఖాళీల భర్తీ.. అందరికీ పదోన్నతులు: డీజీపీ 10లో



ఆత్మహత్యకు ప్రయత్నించిన నిందితుడు నరేష్

భార్యే సుపారీ ఇచ్చింది ప్రియుడి కోసం భర్తని చంపించింది

టెక్కీ నాగరాజు కేసులో కొత్త ట్విస్ట్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అక్రమ సంబంధం చేయించిన మరో హత్య. ఇటీవల స్వాతి ఉదంతం మరువకముందే మరో స్వాతిలాంటి జ్యోతి పైశాచిక కథ ఇది. భార్యే ప్రియుడితో కలిసి కుట్రపన్ని సుపారీ

⇨ 7వ పేజీలో...

తుంగభద్ర దౌత్యముద్ర



- నాడు మహారాష్ట్రతో కాళేశ్వర విజయం
- నేడు కర్ణాటక, ఏపీలతోనూ అదే పంథా
- ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో ముందడుగు

జల వివాదాల పరిష్కారానికి దిక్సూచి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇరుగు,పొరుగు రాష్ట్రాలంటే నీటి కోసం కలహించుకోవాలి.. ప్రాజెక్టుల ఎత్తుపల్లాలపై ఢీ అంటే ఢీ అనాలి. కరువు కాటేసినపుడు.. నీటి కొరత తీవ్రమైనపుడు.. ఒక రాష్ట్రానికి వ్యతిరేకంగా మరో రాష్ట్రంలో బంద్‌లు, హర్తాళ్‌లు, అలజడులూ.. రాజకీయ రగడలు జరగాలి.. ఇదంతా జరిగిన చరిత్ర. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇవి నిన్నమొన్నటి వరకూ జరిగాయి. వీటికి భిన్నంగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఎన్నుకున్న వ్యూహాత్మక దౌత్యపంథా విజయవంతమవడంతో.. అన్ని రాష్ట్రాలు ఇపుడు ఇదే మంత్రాన్ని పఠిస్తున్నాయి. రాజకీయాలు పక్కనపెట్టి జలమంత్రాన్ని జయమంత్రంగా వల్లిస్తున్నాయి. నిన్న

⇨ 2వ పేజీలో...

మంత్రి హరీష్‌తో కర్ణాటక మంత్రి భేటీ 2

భారత బయోటెక్ నుంచి

టైఫాయిడ్ వ్యాక్సిన్

ఒక్కో డోసు రూ. 1500

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టైఫాయిడ్ జ్వరం నుంచి రక్షణ కల్పించే సరికొత్త వ్యాక్సిన్‌ను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భారత్ బయోటెక్

⇨ 9వ పేజీలో...

ఔరా..!



కమ్ముకొస్తున్న యుద్ధ మేఘాలు

పాక్‌పై ఆంక్షలకు రెడీ: అమెరికా • డ్రాగన్ సమర సన్నాహం



సైనిక స్థావరంలో జిన్‌పింగ్

మరో యుద్ధానికి నాంది పలకడానికి అగ్రదేశం అమెరికాను సవాలు చేస్తూ ఉత్తర కొరియా సంసిద్ధతను తెలుపగా ఇటు అమెరికా అంతే స్థాయిలో స్పందించింది. చైనా కూడా యుద్ధానికి మేము సిద్ధమే అని ప్రకటించింది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన సైన్యాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ యుద్ధానికి సమాయత్తం కావాలని ఆదేశాలను జారీచేశాడు. చైనాకు మిత్రుడిగా మారిన పాకిస్తాన్‌పై అమెరికా ఆంక్షలు, చర్యలరూపంలో విరుచుకుపడటం మరో యుద్ధం తప్పదేమో అన్న సంకేతాలు సూచిస్తున్నాయి. పాకిస్తాన్‌లో అమెరికాపై వ్యతిరేకత అప్పుడే మొదలైంది. పాక్, అమెరికాను మోసం చేసిందని ట్రంప్ ప్రకటించడంపై తెహరిక్ ఎ ఇన్సాఫ్ పార్టీ అధినేత ఇమ్రాన్ ఖాన్ తీవ్రస్థాయిలో ఖండించారు. అప్ఘనిస్తాన్‌కు వెళ్లే అమెరికా దళాలను పాకిస్తాన్ నుంచి అనుమతించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అమెరికా నేతృత్వంలో ఉగ్రవాదంపై పాక్ పోరాడి 70వేలమందికి పైగా ప్రజలను పోగొట్టుకుందన్నారు. 100 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని తమ దేశం చవిచూసిందన్నారు.

11లో



జూబ్లీహిల్స్‌లో

పట్టపగలు దారి దోపిడీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.10లో దారుణ ఘటన చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పట్టపగలు అందరూ చూస్తుండగానే నడిరోడ్డుపై దోపిడీ ఘటన జరగడం తీవ్ర కలకలం రేపుతోంది. ముగ్గురు దుండగులు ఓ వ్యక్తిని బెదిరించి ద్విచక్రవాహనం, పర్సు, రెండు సెల్‌ఫోన్లను కొట్టేసి పారిపోయారు. బాధితుడు ప్రతిఘటించినప్పటికీ లాభం లేకుండా పోయింది. దుండగులు కత్తితో బెదిరిస్తూ ఈ దోపిడీకి పాల్పడ్డారు. రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహనదారులు చూస్తూ నిలబడ్డారే కానీ, ఎవ్వరూ ప్రశ్నించక పోవడం గమనార్హం. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ఇది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ముఠాగా భావిస్తున్నారు. ఇంతకు బరితెగించారంటే..

⇨ 7వ పేజీలో...

రామాయణం నుంచి భారతం దాకా...

చరిత్రతో చెలగాటం!

- వ్యక్తిత్వ హననంతో వాస్తవాలకు వక్రభాష్యం
- దుర్యోధన, దుశ్శాసన, రావణ బ్రహ్మలే హీరోలు
- పాండవులు, ద్రౌపది, కుంతి అనైతికులే
- చరిత్ర వక్రీకరణ వల్లే మహారాష్ట్రలో దాడులు
- భావవ్యక్తీకరణ స్వేచ్ఛ పేరిట ప్రభుత్వాల మౌనం
- కంచ ఐలయ్య పుస్తకం మీదా ఇదే ధోరణి
- శాంతిభద్రతల పరిరక్షణ పైనే కోర్టుల దృష్టి
- మతవిశ్వాసాలు దెబ్బతింటే ఉద్యమాలే



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

రెండ్రోజులుగా మహారాష్ట్రలో చోటుచేసుకున్న పరిణామాలు పరిశీలకుల్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. చరిత్ర వక్రీకరణ కారణంగానే ఈ పరస్పర దాడులు జరిగాయి. ప్రతి ఏటా జనవరి 1న భీమ్ కోరెగామ్‌ను వేలాది మంది దళితులు, అంబేద్కర్ అభిమానులు సందర్శించడం సంప్రదాయంగా మారింది. 1818 జనవరి 1న అప్పటి బ్రిటీష్ ఈస్ట్ఇండియా కంపెనీకి, పేష్వాల సారథ్యంలోని మరాఠాలకు మధ్య భీమ్ కోరెగామ్ ప్రాంతంలో యుద్ధం జరిగింది. దీన్నే దళితులు తమకు అత్యంత పవిత్ర ప్రాంతంగా భావిస్తారు. ఆ యుద్ధంలో పేష్వాలు ఓడిపోయారు. అయితే ఓడించింది మహర్ రెజిమెంట్

⇨ 3వ పేజీలో...

సీఎం కల నెరవేరుతున్న వేళ...

శరవేగంగా 'భగీరథ'

20వేల గ్రామాలకు తాగునీరు

- మార్చినాటికి సర్వం సిద్ధం • తిరుమలగిరిలో నీటి సరఫరాకు శ్రీకారం • ఆనందంలో గ్రామ ప్రజలు



మిషన్ భగీరథ పనులు జరుగుతున్న దృశ్యం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ ఆడబిడ్డలు తాగునీటి కోసం బిందెలు చేతపట్టి గంటల తరబడి నల్లాల వద్ద ఎదురు చూడకుండా ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని సరఫరా చేయాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ కల సాకారమవుతోంది. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. టీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భగీరథ పథకం ఇప్పటికే పలు జిల్లాల్లో పాక్షికంగా అమల్లోకి వచ్చి జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటోంది. మార్చినాటికి అన్ని జిల్లాల్లో మిషన్ భగీరథ పనులు పూర్తి చేసేందుకు ఈ పనులు చేపట్టిన ఏజెన్సీలను ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోంది. రాష్ట్రంలో ప్రతిఇంటికి శుద్ధిచేసిన ,సురక్షితమైన నీటిని అందించాలన్న సంకల్పంతో మిషన్ భగీరథ పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. 43791కోట్ల రూపాయల వ్యయపు అంచనాలతో ఈ పథకం పనులను చేపట్టింది. రాష్ట్రంలో ఉన్న 24225 గ్రామాల పరిధిలోని 54.59 లక్షల కుటుంబాలకు నల్లానీటిని అందించాలని ఈ పథకాన్ని డిజైన్ చేశారు. ఏడాది పొడవునా తాగు నీటి అవసరాలు తీరేందుకు 59.94టీఎంసీల నీరు అవసరం అని అంచనా వేశారు. అందులో కృష్ణా బేసిన్ పరిధిలో ఉన్న నీటి వనరుల ద్వారా 23.44టీఎంసీలు, గోదావరి బేసిన్ పరిధిలోని నీటి వనరుల ద్వార 32.58టీఎంసీల నీటితో పాటుగా , ఎల్లంపల్లి లైన్ ద్వారా హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై సిస్టం ద్వారా 3.92టీఎంసీలను కూడా కలిపి మొత్తం 59.94టీఎంసీల నీటిని వినియోగించుకునేలా మిషన్ భగీరథను రూపొందించారు. పథకం పనులను మొత్తం 26 సెగ్మెంట్లుగా విభజించి ఎత్తిపోతల పథకాలు , నీటి సరఫరా పథకాల పనుల్లో పేరుమోసిన మెగా ఇంజనీరింగ్ కంపెనీ , ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలకు ఈ పనులు అప్పగించారు. మొత్తం 26 సెగ్మెంట్ల పరిధిలో ఏడాది పొడవును నీటిలభ్యత ఉండే 19 జలాశయాలను ఎంపిక చేసుకున్నారు. మొత్తం 19 ఇంటేక్ వెల్స్ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా భౌగోళిక పరిస్థితులకు తగ్గట్టు 50 వాటర్ ట్రీట్ మెంట్ వెల్స్ నిర్మాణం చేపట్టారు . ఇన్‌టెక్ వెల్స్ నుంచి స్వీకరించే రావాటర్‌ను నీటి శుద్ధి కేంద్రాలకు సరఫరా చేయటం, అక్కడ వివిధ పద్దుతుల్లో రావాటర్‌ను శుద్ది చేసి పరిశుభ్ర నీటిని ఓవర్‌హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు ఎక్కించి అక్కడి నుంచి గ్రామాల ఉపరితల జలశయాలకు పంపిణీ చేసి గ్రామాల్లో ఇంటింటికి నల్లా దాక నీటిని చేరవేసే ప్రక్రియలో భాగంగా మొత్తం 92798 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ల పనులు చేపట్టారు. ఇందులో 48923కిలో మీటర్ల మేరకు నీటి సరఫరాకు సంబందించిన పైప్‌లైన్లు కాగా , 43875కిలోమీటర్ల మేరకు నీటి పంపిణీకి సంబందించిన పైప్‌లైన్లు ఉన్నాయి. ఇవి కాకుండా విలేజ్ ఓహెచ్‌ఎస్ఆర్ పరిధిగా మరో 18515 కిలోమీటర్ల మేరకు పైప్‌లైన్లు ఉన్నాయి. ఇంటేక్ దగ్గర జలాశయం నుంచి రావాటర్ సేకరుణ నుంచి సరఫరా , పంపిణీ, గ్రామంలో నల్లా దాక పైప్‌లైన్ల పనులు వివిధ దశలో జరుగుతున్నాయి.

చివరి దశలో పాలేరు పనులు

మిషన్ భగీరథ పథకంలో భాగంగా కృష్ణాబేసిన్ పరిధిలో నల్లగొండ, ఖమ్మం , జిల్లాల పరిధిలోని 2400 గ్రామాలకు తాగునీరందించాలన్న లక్ష్యంతో చేపట్టిన పాలేరు సెగ్మెంట్ పనులు చివరిదశకు చేరుకున్నాయి. గ్రామీణ తాగునీటిసరఫరా విభాగం ఈఎన్‌సీ సురేందర్ రెడ్డి పాలేరు సెగ్మెంట్ పరిధిలో జరుగుతున్న పనులను ప్రత్యక్ష్యంగా చూపేందుకు బుధవారం మీడియా బృందాన్ని తీసుకు వెళ్లారు. పాలేరు రిజర్వాయర్ నీటినిలువ సామర్థ్యం 2.5టీ ఎంసీలు కాగా ఈ బ్యాలెన్సిగ్ రిజర్వాయర్ నుంచి రోజుకు రోజుకు 260 మిలియన్ లీటర్ల వంతున ఏడాదికి 4.8 టీఎంసీల నీటిని వినియోగించుకుని 2400గ్రామాలకు తాగునీటిని అందచేసే పనులు చేపట్టారు . ఇప్పటికే పాలేరు ఇంటేక్ పాయింట్ వద్ద పంప్‌హౌజ్ నిర్మాణం పూర్తయింది. ఒక్కోటి 240 హెచ్.పి సామర్ధ్యంతో ఉన్న 12మోటర్లను ఇక్కడ బిగించాల్సిఉండడా అందులు నాలుగు మోటర్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా రిజర్వాయర్ నుంచి నీటి పంపింగ్ కూడా ప్రారంబించారు. ఇందులో మధిరాపురం పైప్‌లైన్ ద్వారా 170 మిలియన్ లీటర్లు , జీల చెరువు పైప్‌లైన్ ద్వారా 90ఎంఎల్‌డీ నీటి సరఫరా ప్రారంభించారు. జీల చెరువ గ్రామం వద్ద నీటిశుద్ధికి సంబిందించిన ప్లాంట్ పనులు పూర్తి చేసి నీటి పంపిణీ కూడా ప్రారంబించారు . పాలేరు రిజర్వాయర్ నుంచి మొత్తం 2400గ్రామాలకు నీటి పంపిణీ చేపట్టాలన్నది లక్ష్యంకాగా ఇప్పటికే పాక్షికంగా పలు గ్రామాలకు నీటి పంపిణీ ప్రారంబించినట్టు ఈ సెగ్మెంట్ సీఈ జయపాల్ రెడ్డి మీడియాకు వివరించారు. ఇదే సెగ్మెంట్‌లో భాగంగా ఉన్న ఖమ్మం పట్టణానికి తాగునీటిని అందచేసే వైరా స్కీంలోని తనికెళ్ల ప్లాంట్ పనులు కూడా చివరిదశకు చేరుకున్నాయి.

ఆనందోత్సాహంలో తిరుమల గిరి

కరీనగర్ జిల్లా పరిధిలోని పాలకుర్తి మండలంలో ఉన్న తిరుమలగిరి గ్రామ ప్రజలు మిషన్ భగీరథ నీటి రాకతో సంబరాలు చేసుకుంటున్నారు. బుధవారం రాత్రి గ్రామ సర్పంచి కె.శ్రీలత మిషన్ భగీరథ ప్రథకం కింద ఏర్పాటు చేసిన నల్లాకు కొబ్బెరికాయ కొట్టి పూజలు చేసి ఇంటింటికీ నీటి సరఫరాను ప్రారంబించారు. సీఈ జయపాల్ రెడ్డితోపాటు ఎస్ఇ కృష్ణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామ సర్పంచు శ్రీలతను అభినందించారు. 841జానాభా ఉన్న ఈ గ్రామంలో మొత్తం 220 కుటుంబాలు ఉన్నాయని అన్ని ఇళ్లకు నల్లాలు ఏర్పాటు చేసినట్టు మిషన్ భగీరథ జేఈ ప్రశాంతి పేర్కొన్నారు. ఈ నెల చివరినాటికి పెండింగ్ పనులు పూర్తి చేసి ఈ సెగ్మెంట్ పరిధిలో మిగిలిన గ్రామాలకు కూడా తాగునీటిని అందచేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి.



తాగునీటి పంపింగ్ ఓవర్‌హెడ్‌లు

మిషన్ నాలుగోదశ చెరువులకు మోక్షం

- ఒకే రోజు 23 జీవోలు..685 చెరువుల పనులకు గ్రీన్‌సిగ్నల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మిషన్ కాకతీయ నాలుగో దశ చెరువుల పనులకు ప్రభుత్వం గురువారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఒకేరోజు 23జీవోలను నీటిపారుదల శాఖ ఇవ్వగా, వీటివిలువ రూ.157.63కోట్లు. ఇప్పటికే వేయికి పైగా చెరువుల మంజూరీకి ఉత్తర్వులు ఇచ్చిన నీటిపారుదల శాఖ 685 చెరువుల పునరుద్దరణకు గురువారం పచ్చజెండా ఊపింది. ఐదువిడతల్లో 46వేల చెరువుల పునరుద్దరణను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 20వేల చెరువులకు పైగా పునరుద్దరణ పూర్తయి తెలంగాణ గ్రామీణ ముఖచిత్రాన్ని మార్పుకు దోహదపడింది. నీటిపారుదల శాఖ కార్యదర్శి వికాస్‌రాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

సార్! మనమే గెలిచాం

- తప్పులేదని ఆనాడే చెప్పా • నేడు అదే రుజువైంది • మన్మోహన్‌కు రాజా లేఖ • శుభాకాంక్షలతో మాజీ పీఎం ప్రత్యుత్తరం



న్యూఢిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో తానెలాంటి తప్పు చేయ లేదని అప్పట్లోనే మీకు అనేకసార్లు విన్నవించుకున్నానంటూ డీఎంకే నేత, కేంద్ర మాజీ టెలికామ్ మంత్రి ఎ.రాజా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు లేఖ రాయగా కేసు నుంచి బైటపడినందుకు శుభాకాంక్షలు తెలుపుతూ రాజాకు మన్మోహన్ ప్రత్యుత్తరం ఇచ్చారు. 2జీ కేసులో రాజా, డీఎంకే ఎంపీ కనిమొళి సహ నిందితులందరినీ ప్రత్యేక సీబీఐ కోర్టు గత నెల 21న నిర్దోషులుగా నిర్ధా రించిన నేపథ్యంలో ఇరువురి మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు చోటు చేసుకున్నాయి. మొదటగా రాజా గత నెల 26న మాజీ ప్రధానికి ఇలా లేఖ రాశారు.. ఒక దశాబ్దం క్రితం, ఇదే రోజున కొత్తగా యూఏఎస్ లైసెన్సుల జారీ, 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపు అంశంపై నేను మీకు ఒక లేఖ రాశాను. వచ్చే పదేళ్ళలో మన వ్యక్తిగత,రాజకీయ జీవితాల్లో మలుపులు, నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయని మనలో ఏ ఒక్కరం ఊహించనైనా ఊహించలేదు. కొందరు శక్తిమంతమైన వ్యక్తులు పెద్ద ఎత్తున దుష్ప్రచారం మొదలుపెట్టారు. దురుద్దేశ్యంతో వంచనకు పాల్పడిన మీడియా గోరంతను కొండంతలుగా చూపించింది. వారు కడకు పార్లమెంట్‌ను, సర్వోన్నతమైన న్యాయవ్యవస్థను తప్పుదారి పట్టించారు. అందుకు మీరు యూపీఏ ప్రభుత్వాన్ని పణంగా పెట్టాల్సి వచ్చింది. అది నా జీవితంలో ఏడు సంవత్సరాల కాలాన్ని నాకు కాకుండా చేసింది. అదే కాల వ్యవధిలో 15 నెలలు జైల్లో ఉన్నాను అని మాజీ టెలికామ్ మంత్రి పేర్కొన్నారు. 2జీ కేసులో వాస్తవం వెలుగులోకి వచ్చినందున కాంగ్రెస్ పార్టీకి అత్యంత విధేయత కనబరిచే వ్యక్తిగా తనకు మద్దతు ఇవ్వాలని సింగ్‌ను రాజా కోరారు. నేను జాతి ప్రయోజనం కోసం పనిచేస్తున్నానే తప్ప ఎలాంటి తప్పు చేయడంలేదు. కావాలంటే నిరూపిస్తాను అని నేను మీతో అనేక పర్యాయాలు చెప్పిన సంగతి ఒకసారి గుర్తు చేసుకోండి. నాకు బాహటంగా మద్దతు ఇవ్వడంలో మీకు గల పరిమితులను కూడా నేను అర్థం చేసుకున్నాను. నేడు నేను పునీతుడనై నిలిచాను. అది మీరు అవగతం చేసుకున్నారని భావిస్తున్నాను. మీకు ఎప్పటికీ విధేయుడిగా ఉంటాను. కేసు విచారణల సందర్భంగా వ్యక్తిగతంగా మీరెలాంటి అసౌకర్యానికి గురికాలేదని చెప్పగలను. ఇప్పుడు వాస్తవం వెలుగులోకి వచ్చింది కాబట్టి గతంలో మీ నుంచి రాని మద్దతును ప్రస్తుతం నేను కోరుకుంటున్నాను అని మన్మోహన్‌కు రాసిన లేఖలో రాజా విజ్ఞప్తి చేశారు. అందుకు ప్రత్యుత్తరంగా.. మీరు నిర్దోషిగా నిలబడినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. ఈ ప్రక్రియలో(కేసు విచారణలో) మీరు, మీ కుటుంబ సభ్యులు ఎంతగానో ఇక్కట్ల పాలయ్యారు. కానీ నిజం వెలుగులోకి రావడంతో మీరు, మీ మిత్రులు ఊరట చెందారు. మీకు, మీ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్నాను అని ఈ నెల రెండవ తేదీన రాజాకు రాసిన లేఖలో మాజీ ప్రధాని పేర్కొన్నారు.

తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్‌వన్

- సౌకర్యాలు మెరుగుపరిచేందుకే మోడల్ పోలీస్ స్టేషన్లు : మునిసిపల్‌శాఖ మంత్రి కేటీఆర్



ఎల్లారెడ్డిపేట, ప్రభ న్యూస్ : దేశంలోనే తెలంగాణ పోలీస్‌శాఖ మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మాత్యులు కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మోడల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌ను ప్రభుత్వం రూ.7లక్షల నిధులతో ఆధునీకరించి మోడల్ పోలీస్‌స్టేషన్‌గా తీర్చిదిద్దామన్నారు. ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకే మోడల్ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్ల ఆధునీకరణకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. పోలీసులు ఆధునిక సాంకేతికతను వాడుకొని ఉత్తమ సేవలందించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే రాష్ట్రంలో నూతన కమిషనరేట్లు, సబ్‌డివిజన్లు, సర్కిళ్లతోపాటు నూతన ఠాణాలను ఏర్పాటు చేశామన్నారు. మోడల్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్‌కు ఎస్పీ విశ్వజిత్ కంపాటి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కేటీఆర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విశ్వజిత్‌కంపాటి, అడిషనల్ ఎస్పీ రవీందర్‌రావు, డీఎస్పీలు చంద్రశేఖర్ అవధాని, సీఐలు రవీందర్, రవిచందర్, ఎస్సైలు శ్రీనివాస్‌గౌడ్, నరేష్, లింగమూర్తి, ప్రవీణ్, లక్ష్మారెడ్డి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, కార్యక్రమం అనంతరం పలువురు గ్రామస్తులు మంత్రి కేటీఆర్‌కు పలు సమస్యలపై వినతులు సమర్పించారు.

మీ నీళ్లు..వాడుకుంటాం!

హరీశ్‌తో కర్నాటక మంత్రి పాటిల్!

- తుంగభద్ర నీటి పంపకాలపై కర్నాటక మంత్రితో హరీశ్‌రావు భేటీ
- ఆర్డీఎస్ ఆధునికీకరణపై కర్నాటక సహకారం కోరిన టీఎస్• త్వరలో మూడు రాష్ట్రాల మంత్రుల భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో ఈఏడాది నీటికొరత తీవ్రంగా ఉన్నందున తమ రాష్ట్రంలో తుంగభద్ర ఆయకట్టును కాపాడుకోవడానికి, తాగునీటి అవస రాలకు ఆర్‌డిఎస్‌లో తెలంగాణకు కేటాయించిన నీటిని వాడుకునేందుకు అనుమతిని ఇవ్వాలని తెలంగాణ నీటిపారుదల శాఖా మంత్రి హరీష్ రావుకు, కర్ణాటక ఇరిగేషన్ శాఖామంత్రి పాటిల్ వినతిపత్రం అందజేశారు. గురువారం హైదరాబాద్ లోని జలసౌధకు కర్ణాటక ఇరిగేషన్ మంత్రి నేతృత్వం లోని ఆ రాష్ట్ర మంత్రులు, ఇరిగేషన్ అధికారుల బృందం రాగా, రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరిగా యి. తుంగభద్ర డ్యాం నుండి తెలంగాణకు 3.5టి ఎంసిల నీటివాటా ఉందని మంత్రి హరీష్ చెప్పారు. ఆర్‌డిఎస్ ఆయకట్టుకు అవసరమయ్యే నీటివిని యోగంపై కర్ణాటకకు ఎంతమేర నీటివాడకానికి అనుమతించగలమనే అంశాలపై తెలంగాణ, కర్ణాట కల మధ్య ప్రధానంగా చర్చ జరిగింది. ఆలంపూర్ అసెంబ్లీ నియోజక వర్గంలోని 7వేల ఎకరాల ఆరుతడి పంటలకు అవసరమైన సాగునీటి వాడకంపై రెండు రాష్ట్రాల ఇంజనీర్లు అంచనావేసిన అనంతరం మిగిలిన నీటిని కర్ణాటక వాడుకునే అంశాన్ని పరిశీలి స్తామని మంత్రి హరీష్ కర్ణాటక ప్రభుత్వానికి తెల్పి చెప్పారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కెసిఆర్‌తో చర్చించిన తర్వాత నిర్ణయం చెబుతామని మంత్రి హరీష్ కర్ణాటక మంత్రికి చెప్పారు. తుంగభద్ర నీటిని వాడుకున్న దానికి బదులుగా తెలంగాణ ప్రభుత్వం ఎపుడు కోరినా నారాయణపూర్ డ్యాం నుండి జూరాలకు 2టిఎంసిల నీటిని విడుదల చేస్తామని కర్ణాటక హామీనిచ్చింది.గతంలో మహ బూబ్‌నగర్ జిల్లా తాగు నీటి అవసరాల కోసం ఒక టిఎంసి నీటిని జూరాలకు తెలంగాణ ప్రభుత్వం కోరిక మేరకు విడుదల చేసిన సంగతిని మంత్రి పాటిల్ గురుచేశారు. పొరుగు రాష్ట్రాలతో తెలంగాణ స్నేహసం బంధాలు సాగిస్తున్నదని, కర్ణాటక గత ఏడాది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరా లకు 1టిఎంసి నీటిని విడుదలచేసిందని, ఇపుడు మళ్ళీ అదే రకమైన స్ఫూర్తిని కొనసాగిస్తోందని మంత్రి హరీష్ ప్రశంసించారు. ఆలంపూర్ నియోజక వర్గం లో ఉన్న పంటను కాపాడుకుంటూ కర్ణాటకకు తుంగ భద్ర నీటిని వాడుకునేందుకు అనుమతిచ్చే విష యం లో తనకు అభ్యంతరం లేదని ఆలంపూర్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు.



కర్నాటక జల మంత్రివర్గ బృందంతో తెలంగాణ జలవనరులశాఖ మంత్రి హరీశ్‌రావు బృందం

రాజోలిబండపై త్వరలో భేటీ..

రాజోలిబండ డైవర్షన్ పథకం ఆధునీకరణ పనులపై త్వరలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల సమావేశం నిర్వహించాలని తెలంగాణ, కర్ణాటక గురువారం నిర్ణయించాయి. గద్వాల ప్రాంతం రైతాంగానికి 87వేల ఎకరాలకు సాగునీరు అందిం చవలసిన రాజోలిబండ డైవర్షన్ స్కీం నుండి ప్రస్తుతం 20వేల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదని మంత్రి హరీష్ అన్నారు. ఆర్‌డిఎస్ ఆధునీకరణ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టినప్పటికీ ఇంకా పూర్తికాలేదన్నారు. ఎపి సహకారం లేకుండా ఆర్‌డిఎస్ పనులు పూర్తి చేయడం సాధ్యం కాదని కర్ణాటక ఇరి గేషన్ మంత్రి పాటిల్ అభిప్రాయపడ్డారు. ఈ అంశ ంపై మూడు రాష్ట్రాల ఇరిగేషన్ మంత్రులు, కార్య దర్శులతో త్రైపాక్షిక సమావేశానికి తెలంగాణ చొరవ చూపాలని కర్ణాటక చేసిన విజ్ఞప్తికి మంత్రి హరీష్ అంగీకరించారు.

ఎపి ఇరిగేషన్ మంత్రి దేవి నేని ఉమతో బుధవారమే తాను మాట్లాడానని, ఇరు రాష్ట్రాలు ఉమ్మడి ఇండెంట్‌ను తుంగభద్ర బోర్డుకు పంపించడానికి అంగీకారం కుదిరిందని హరీష్ తెలిపారు. త్రైపాక్షిక సమావేశంపై కూడా తాను ఎపి మంత్రితో మాట్లాడుతానని అన్నారు.

తుంగభద్ర దౌత్య ముద్ర

(మొదటిపేజీ తరువాయి)

కాళేశ్వరం విషయంలో తెలంగాణ చూపినమార్గం.. ఇపుడు తుంగభద్ర విషయంలో కర్ణాటక అనుసరిస్తోంది. ఎపి కూడా ఇచ్చిపుచ్చుకునే ధోరణికి, చర్చల ద్వారా ఇరురాష్ట్రాల ప్రయోజనాల పరిరక్షణకు సై అంటోంది. 36లక్షల ఎకరాలకు సాగునీరందించే అతిభారీ ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల విషయంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పొరుగురాష్ట్రంతో నెరిపిన వ్యూహాత్మక సఖ్యత, తొలగిన చిక్కులు.. లభించిన ఫలితంతో ఇతర రాష్ట్రాలే విస్తుపోయాయి. గతంలో తీవ్ర అభ్యంతరాలు పెట్టిన పొరుగురాష్ట్రమైన మహారాష్ట్రను, ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించిన వారినే ప్రాజెక్టుకు అభ్యంతరంలేదని చెప్పించడం అనన్యసామాన్యం. దౌత్యవిజయం.. అభిప్రాయాలను, ప్రజలను పరస్పర గౌరవ భావంతో చూడడం ద్వారానే ఇది సాధ్యమైంది. ముఖ్యమంత్రి కెసిఆర్ మహారాష్ట్రతో చర్చల ద్వారా అంతర్రాష్ట్ర సమస్యను పరిష్కరిం చుకుందామని ముందుకు రాకపోతే, స్వయంగా ముంబైకి వెళ్ళకుంటే కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఇప్పటికీ ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉండేది. ప్రాజెక్టుకు పర్యావరణ, అటవీ, సాంకేతిక అనుమతులు వచ్చిఉండేవి కావు. తెలంగాణ ప్రభుత్వం మహారాష్ట్రను ఒప్పించి.. వారి అభ్యంతరాలను అన్నింటినీ ఓపికగా తీర్చి.. అడిగిన సమాచారం అంతా ఇచ్చి అనుమానాలు నివృత్తిచేసి కీలకమైన ప్రాజెక్టుకు నిరభ్యంతరపత్రం సాధించింది. ఒక మహాప్రాజెక్టుకు స్వల్ప ముంపు ఉన్నా పక్క రాష్ట్రం నిరభ్యంతరపత్రం ఇవ్వడం అసాధరణం. ఈ చర్య వల్లే తెలంగాణ ప్రభుత్వం 9మాసాల్లోనే కాళేశ్వరం మహాప్రాజెక్టుకు సంబంధించి 206అనుమతులు అనుమతులు సాధించి రికార్డు సృష్టించింది. మంత్రి హరీష్ రావు పదులసార్లు మహారాష్ట్ర, ఢిల్లీలలో పర్యటించి అనుమతుల సాధనలో కీలకం గా వ్యవహరించారు. అనుమతులు లభించడంతో పనుల వేగంలోనూ దీని జోష్ కనపడుతోంది. ఇక గతంలో ఆ ప్రభుత్వంతో ఇక్కడి ముఖ్యమంత్రులు, ప్రతిపక్ష నేతలు ఘర్షణకు దిగిన సందర్భాలు ఆవేశకావేశాలకు వెళ్ళిన సందర్భాలు మాత్ర మే చూడగా.. దౌత్యంతో జలవిజయాలు సాధించవచ్చని తెలంగాణ ప్రభుత్వం నిరూపించింది. కర్ణాటకతోనూ మంత్రి హరీష్ గతంలో చర్చలు జరిపి ఒకటిఎంసి నీటిని సాధించారు. ఆర్‌డిఎస్ పనులకు ఒప్పించారు. ఇపుడు తెలంగాణ చూపిన బాటలోనే కర్ణాటక పొరుగురాష్ట్రంతో చర్చలకు వచ్చింది. బతకండి.. బతికించండి.. అనే నినాదాన్ని గతంలోనే తెలంగాణ ప్రభుత్వం ఇవ్వగా, ముఖ్య మంత్రి కర్ణాటకకు స్నేహహస్తం అందించే అవకాశాలున్నాయి. సమస్యల పరిష్కా రానికి ఇచ్చిపుచ్చుకునేధోరణితో వ్యవహ రిస్తున్న తీరు జఠిల సమస్యలకు పరిష్కా రాన్ని అందిస్తోంది. త్వరలో మూడు రాష్ట్రాల జలమంత్రులు ఆర్‌డిఎస్ ఆధు నీకరణ పనుల ప్రాజెక్టుపై చర్చించేందుకు సమావేశం కానుండగా, తెలంగాణలో 87వేల ఎకరాలకు ఇది పూర్తయితే లబ్దిచేకూరనుంది. కర్ణాటకకు కూడా ప్రాజెక్టు ద్వారా మేలు కలగనుండగా, ఎపి కూడా పలు చిక్కులు తొలగించుకుని లబ్దిపొందే అవకాశాలున్నాయి. దౌత్యంతో జలవివాదాలు పరిష్కరించుకునేందుకు తెలంగాణ చూపిన మార్గం, సాధించిన విజయం దేశానికి నమూనాగా నిలుస్తోంది. కర్ణాటక ప్రభుత్వానికి చెందిన ముగ్గురు మంత్రులు మునుపెన్నడూ లేనిరీతిలో తెలంగాణ ప్రభుత్వంతో చర్చలకు రాగా, ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ తరహా ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

గంగిరెద్దులకు ఎన్ని కష్టాలు!

- యాచకులుగా గుర్తించి అదుపులోనికి తీసుకుంటున్న పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు
- ఆందోళనలో కులవృత్తిదారులు
- సంక్రాంతిలో గంగిరెద్దు విన్యాసాలుండవా?



వాడ వాడలా....వీధి వీధినా.... ప్రతి ఇంటిముందు కనిపిస్తుంటాయి. ఈ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సంక్రాంతి పండగ అనగానే..... తెల్లవారు జామునే ఇళ్ళముందు గంగిరెద్దులు (బసవన్నల) విన్యా సాలు గుర్తుకొస్తాయి.... హరిదాసుల కీర్తనలు (నాద స్వరం) వినిపిస్తుంటాయి. ఇవే పండుగకు ప్రధాన ఆకర్షణగా ఉంటా యి. ఈ సందడితోనే సంక్రాంతి శోభ మొదలవుతుందనే చెప్పుకోవాలి.

సంక్రాంతి సమయంలో గంగిరెద్దుల వాళ్ళు నాదస్వరంతో పాడే పాటలు, తబలా వాద్యం, రంగురంగుల దుస్తులతో గంగిరెద్దులకు చేసే అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. వారికి డబ్బులు, పాతవస్తువులు, బియ్యం వంటి వాటిని ప్రజలు తమ స్థాయికి తగ్గట్టుగా దానం చేస్తుంటారు .ఈ సంప్రదాయం. ఆచారం మనకు ఆనవాయితీగా వస్తోంది.

అందువల్లే సంవత్సరం పొడువునా ఎప్పుడు కనిపించని గంగిరెద్దుల విన్యాసాలు సంక్రాంతి పండగ సందర్భంలో నేపథ్యంలోనే పండుగకు పక్షం రోజులకు ముందుగా కీసర సమీపంలోని అంకిరెడ్డి పల్లె, బాచారం, ఘట్‌కేసర్, పోచారం, తొర్రూర్, బాలాజీనగర్, రాజీవ్‌గాంధీనగర్ తదితర ప్రాంతాల నుంచి గంగిరెద్దుల వాళ్లు నగరానికి వస్తుంటారు. ఇప్పటికే అడిక్‌మెంట్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట తదితర ప్రాంతాల్లో తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరంతా సంక్రాంతి అనంతరం తిరిగి తమ సొంతూళ్ళకు వెలుతుంటారు.

కానీ ఈ సారి బసవన్నలు విన్యాసాలు....హరిదాసుల కీర్తనలు వినిపించే అవకాశాలు మాత్రం కనిపించడం లేదు. వారిని మన పోలీసులు యాచకులుగా గుర్తించి అదుపులోకి తీసుకుంటున్నారు. రెండు, మూడు రోజులుగా ఈ పరిణామాలు నగరంలో పెద్దఎత్తున చోటుచేసుకుంటున్నాయి.


భిక్షాటనపై సర్కార్ నిషేధం విధించడంతో పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గంగిరెద్దుల వాళ్ళను సైతం అదుపులోకి తీసుకుని వారిని చంచల్‌గుడా జైల్లోని పునరావాస కేంద్రానికి తరలిస్తున్నారు. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్న గంగిరెద్దుల వాళ్ళకుటుంబాలు భయాందోళనకు గురువుతున్నాయి. ఈ చర్యలపై వారు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా తాము గంగిరెద్దులను ఆడిస్తున్నామని, ఇది తమ కులవృత్తే కానీ.....యాచకవృత్తి కాదని స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇవేమీ పట్టించుకోకుండా తమను నియంత్రించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సంక్రాంతి ఉత్సవాలలో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. అయినప్పటికీ తమను పోలీసులు అరెస్టు చేయడం ఏ మేరకు సబబు అని అడుగుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమను కులవృత్తివారిగా గుర్తించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి వారిపై ఉన్న పోలీసుల ఆంక్షనలను ఎత్తివేస్తుందా? లేదా అన్నది ప్రస్తుతం వేచిచూడాల్సిందే.

జాగృతిని బలోపేతం చేద్దాం

- తెలంగాణ జాగృతి ఉపాధ్యక్షుడు రాజీవ్‌సాగర్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఎంపి కవిత సారథ్యంలోని తెలంగాణ జాగృతిని గ్రామ స్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు మేడే రాజీవ్ సాగర్ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సదస్సులో మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి , సంప్రదాయాలను పరిరక్షిం చడం లో జాగృతి సంస్థ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జాగృతి ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోనే 3వేల మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, 30 వేల నోట్ పుస్తకాలు, ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాగృతి యూత్ కన్వీనర్ కోరబోయిన విజయ కుమార్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు కోదారి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు రంగినేని ఉపేందర్ రావు, నియోజకవర్గం మహిళా విభాగం కన్వీనర్ బెడద రమ పాల్గొన్నారు.ఈ సందర్భంగా తిరుమలగిరికి చెందిన 400 మంది యువకులు జాగృతిలో చేరారు.

సమాచార కమిషనర్‌గా అరవింద్ కుమార్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమీషనర్‌గా సీని యర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌కు ప్రభుత్వం పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్ప గించింది.ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండురోజుల క్రితం జరిగిన ఐఏఎస్ అధికారుల బదలీల్లో అర్వింద్ కుమార్‌కు పుర పాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంతో పాటు సమాచార శాఖ కమీషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల్లో సమాచార శాఖ కమీషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

రామాయణం నుంచి భారతం దాకా...
చరిత్రతో చెలగాటం!



(మొదటిపేజీ తరువాయి)

సైనికులు. వీరు కూడా భారతీయులే. అయితే అప్పట్లో మహార్‌లను అంటరానివారుగా పరిగణించేవారు. తమపై ఆధిపత్యం చలాయించిన అగ్రకుల దురహంకారులు పేష్వాలపై తాము సాధించిన విజయాన్ని ఇప్పటికీ మహార్‌లు పవిత్రదినంగా పరిగణిస్తున్నారు. ఈ స్థలాన్ని 1927లో అంబేద్కర్ స్వయంగా సందర్శించడంతో దీనికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. పైగా ఈ ఏడాదికి ఈ యుద్ధం జరిగిన రెండొందల సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తిరిగి రెండు జాతుల మధ్య దాడులు జరిగాయి. ఇందుకు కారణం చారిత్రక వక్రీకరణలే. చరిత్రను తిరగరాసే క్రమంలో ఒక వర్గానికి చెందిన తప్పొప్పుల్ని ఎంచిచూపడం తాజా ఘర్షణలకు దారితీసింది. ఇదొక్కటే కాదు.. ఇటీవల కాలంలో ఈ విధానం ఓ సంప్రదాయంగా మారింది.

ఇటీవల కాలంలో ఆధునికత, భావవ్యక్తీకరణ స్వేచ్ఛల పేరిట దేశంలోని కొందరు కవులు, రచయితలు, విమర్శకులు సనాతన ఆలయ సంస్కృతికి, సంప్రదాయాలకు అద్దంపట్టే గ్రంథాల్ని వివిధ కోణాల్లో తిరిగి రాయడం అందులో కొందరి వ్యక్తిత్వాల్ని కించపరుస్తూ విశ్లేషించడం ఓ గొప్పగా భావిస్తున్నారు. గతంలో చారిత్రక గ్రంథాల్ని తిరగరాస్తూ అందులో తమ సొంత దృక్పథాల్ని చొప్పించేవారు. ఇప్పుడు ఏకంగా భారత ఇతిహాసాల్లో కూడా చొచ్చుకుపోతున్నారు. రామాయణ, మహాభారతాలు భారతీయ వారసత్వ చిహ్నాలు. హిందూమత పురాతన సంస్కృతికి ఆనవాళ్ళు. ఆధునిక కాలంలోకూడా రాజకీయ శాస్త్రానికి మహాభారతమే ప్రామాణికంగా నిలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అప్పటికీ ఇప్పటికీ మారుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక గుణగణాలకు మహాభారతగాథ అద్దంపట్టింది. ఒక్క భారత్‌లోనే కాదు..



ప్రపంచవ్యాప్తంగా 83 దేశాలకు చెందిన పలు భాషల్లోకి మహాభారతం అనువాదమైంది. రష్యా, అమెరికా వంటి అగ్రరాజ్యాల్లో కూడా లక్షలాది కాపీలు అమ్ముడయ్యాయి. ఇప్పటికీ దీన్ని ప్రపంచ సమాజం ఓ ఉద్గ్రంథంగానే భావిస్తోంది. బైబిల్ తరహాలోనే భగవద్గీతతో పాటు మహాభారతాన్ని కూడా గుర్తిస్తున్నారు. మానవ మనుగడకు అవసరమైన విధి విధానాల్ని రామాయణం బోధించింది. విలువలతో కూడిన సంప్రదాయ సిద్ధ జీవిత గమనానికి అద్దంపట్టింది. అలాంటి ఉద్గ్రంథాల్లోకి సొంత పైత్యాన్ని చొప్పించడం, ఇందులోని పాత్రల్ని అవహేళన చేయడాన్ని సభ్యసమాజం జీర్ణించుకోలేక పోతోంది. వేల ఏళ్ళ నాటి క్రితంవైనా ఇప్పటికీ ఈ గ్రంథాల్లోని సుమధుర పరిమళం ఏమాత్రం తగ్గలేదు. ఆధునిక యువతను కూడా ఈ గ్రంథాలు ఆకర్షిస్తున్నాయి.

కాలగమనంలో కలిసిపోయిన చరిత్రలోని గూఢార్థాల్ని వెలికితీసి విమర్శించడం ద్వారా తమ ప్రజ్ఞాపాటవాల్ని ప్రదర్శించాలన్న ఆతృత కొందరు కవులు, రచయితల్లో పెరిగింది. ఇందులో భాగంగానే మహాభారత, రామాయణాల్లోని ఒక్కో పాత్రను ఎంచుకుని వారి దృక్కోణంలోంచి ఆయా చారిత్రక గ్రంథాల విశ్లేషణ చేయడం మొదలైంది. అప్పటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించిన తీరును పక్కనపెట్టి వ్యక్తిగత దృక్పథంతో యోచిస్తూ మిగిలిన పాత్రధారులందర్నీ చెడ్డవారిగా, దుష్టులుగా చిత్రీకరించడం జోరందుకుంది. మహాభారతగాథను సహజంగానే పాండవుల దృక్పథం వైపు నుంచే పరిగణనలోకి తీసుకుంటారు. పాండవుల్ని అణగదొక్కబడ్డ లేదా మోసగించబడ్డ వారిగానే పరిగణిస్తారు. వారి పట్ల సానుభూతితోనే మిగిలిన పాత్రల పట్ల అవగాహన పెంచుకుంటారు. కొన్ని సందర్భాల్లో కొన్ని పాత్రలు ఎంతో ఉదాత్తంగా ప్రవర్తించినా సమగ్ర కథాంశం మేరకు వారి వ్యక్తిత్వాల్ని అంచనాలేస్తారు. కానీ అందుకు భిన్నంగా దుర్యోధనుడ్ని హీరోగా భావిస్తూ ఆయన దృక్పథం నుంచి మహాభారత గాథను అధ్యయనం చేయడం మొదలైంది. ఇదక్కడితో ఆగలేదు. బీష్ముడివైపు నుంచి కూడా ఈ కథా విశ్లేషణ మొదలెట్టారు. ఆ తర్వాత కుంతి, ధర్మరాజు, భీముడు, నకుల, సహదేవులే కాదు.. ఆఖరకు దుశ్శాసనుడి వైపు నుంచి కూడా కథనాల్ని రాశారు. వీరితో పాటు ద్రౌపది దృక్పథం వైపు నుంచి మరో కథనం వెలువడింది. ఇంకోవైపు అర్జునుడు దృక్కోణం నుంచి కొందరు విశ్లేషణలు సాగిస్తే ఇంకొందరు దృతరాష్ట్రుడి వైపు నుంచి ఆలొచించడం మొదలెట్టారు. సహజంగానే ఒక పాత్రను మంచిగా భావిస్తే ఎదుటి పాత్రల్లోని కొన్ని అపశవ్యంగానే గోచరిస్తాయి. లేకుంటే కథనం పూర్తికాదు. కథలో మంచితో పాటు చెడు కూడా ఉండాలి. చెడుపై మంచి విజయం సాధించాలి. లేదా మోసం చేసే చెడు పైచేయి ప్రదర్శించాలి. ఏ కథకైనా ఈ దృక్పథం అవసరం. అందుకు అనుగుణంగానే పాత్రల తీరును ఆధునిక రచయితలు మలచడం మొదలెట్టారు. సహజంగానే ఈ ప్రక్రియలో ఇంతవరకు సాత్వికులుగా దీక్షాకంకణ బద్ధులుగా గోచరించిన పాండవులు, కుంతి, ద్రౌపది కూడా అపశవ్యంగా విశ్లేషణలకు కనిపించారు. దుర్యోధనుడు ఒక చక్రవర్తిగా శ్లాఘనీయమైన వ్యక్తే. భార్య భానుమతి పట్ల ఆయనకున్నది అవాజ్యమైన ప్రేమే. అలాగే స్నేహానికి ఆయనిచ్చే విలువ కూడా విలువకట్టలేనిదే. అంతవమాత్రాన దుర్యోధనుడి దృక్పథంలో యోచిస్తూ యదిష్టరుడ్ని చెడుగా చిత్రీకరించడం పలు విమర్శలకు తావిస్తోంది. తాజాగా ద్రౌపదిపై ఓ సందర్భంలో దుర్యోధనుడు చేసిన తీవ్ర విమర్శల్ని ఆయన దృక్పథంతో చూస్తూ తన రచనల్లో కొందరు ప్రస్తావించడం, వాటిపై మరికొందరు విశ్లేషకులు, రాజకీయ నాయకులు కూడా ప్రసంగాలు చేయడం రామాయణ, మహాభారత ఇతిహాసాల్ని పవిత్రంగా విశ్వసించే వారి మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. ద్రౌపది వంటి గొప్ప సౌందర్యరాశి తన మిత్రుడు కర్ణుడ్ని స్వయంవర సభలో అవమానానికి గురిచేయడం, అలాగే మయసభలో తనను చూసి నవ్వడం వంటి సంఘటనలతో సహజంగానే దుర్యోధనుడికి ద్రౌపది పట్ల ఆగ్రహావేశాలు మిక్కిలిగా ఉంటాయి. ఈ కోపంతో పలు సందర్భాల్లో ద్రౌపదినుద్దేశించి దుర్యోధనుడు చేసిన వ్యాఖ్యల్ని ఇప్పుడు సానుకూల దృక్పథంతో ప్రస్తావించడం ఫ్యాషన్‌గా మారింది. కొంతకాలంగా మహాభారతంలో వెలుగుచూడని యదార్థాలంటూ విమర్శకులు పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు రాసి ప్రజలపైకి వదిలేస్తునారు. పెళ్ళికి ముందే ద్రౌపది కర్ణుడిపై మనసు పారేసుకుందని, సూతపుత్రుడు కావడంతో వివాహానికి మాత్రం అంగీకరించలేదంటూ ఓ కథనం వెలువడింది. అలాగే ''ప్యాలస్ ఆఫ్ ఇల్యూజన్స్'' పేరిట చిత్రాబెనర్జీ రాసిన మహాభారత కథనంలో ద్రౌపదిలో వెలుగుచూడని కోణాలంటూ ఆమె వ్యక్తిత్వాన్ని కించపర్చే పలు వ్యాఖ్యలు రాయడం జరిగింది. అలాగే జయాపేరిట దేవదత్ పట్నాయక్ రాసిన భారత కథనంలోనూ కొన్ని సానుకూల పాత్రల్ని విలన్లుగా చిత్రీకరించారు.

సురేంద్రనాథ్ రాసిన కర్నాస్ ఆల్టర్ ఇగోలోనూ పాండవులు విలన్లే, కానీ కవిత రాసిన కర్నాస్ వైఫ్ పుస్తక దృక్పథంలోనూ ద్రౌపది, పాండవులు, కుంతి అందరిదీ చెడునైతిక ప్రవర్తనే. మరికొన్ని ఆధునిక విశ్లేషణల్లో బీష్ముడు అతిపెద్ద విలన్. ఆయన కారణంగానే కురుక్షేత్ర మహాసంగ్రామం చోటుచేసుకుంది. బీష్ముడే తలుచుకుంటే అసలు యుద్ధాన్నే నివారించగలడు. కావాలనే కౌరవ వినాశనానికి బీష్ముడు నడుంకట్టాడంటూ విశ్లేషించారు. అలాంటివే రామాయణం పట్ల కూడా సాగుతున్నాయి. అత్యద్భుత గుణసంపదుడిగా రావణుడ్ని కీర్తిస్తూ కొన్ని పుస్తకాలు వెలువడ్డాయి. మరికొన్ని అయితే అసలు రాముడు భారతీయుడేకాదంటూ తేల్చిచెప్పాయి. ప్రస్తుతం ఆఫ్ఘనిస్థాన్ దేశం ఉన్న ప్రాంతం నుంచి వలసొచ్చిన ఆర్యుల ప్రతినిధిగా రాముడ్ని విశ్లేషించాయి. ద్రావిడులపై రాముడు దాడిచేసినట్లు కూడా జాతుల మధ్య విద్వేషాగ్ని రగిల్చే ప్రయత్నం చేశాయి. ఈ వక్రీకరణ పట్ల ప్రభుత్వాలు ఏమాత్రం స్పందించ డంలేదు. మాట్లాడితే రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ అంటూ పేర్కొంటున్నాయి. ఇటీవలె కంచె ఐలయ్య అనే రచయిత ఓ సామాజికవర్గాన్ని కించపరుస్తూ పుస్తకాన్ని వెలువరించారు. దీంతో సమాజంలోని ఓ వర్గం తీవ్ర నిరసనలు వ్యక్తంచేసింది. కానీ ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. ఇరుపక్షాల రాజీకే ప్రయత్నించింది తప్ప ఓ సామాజికవర్గ మనోభావాల్ని కించపర్చే హక్కులేదంటూ తేల్చిచెప్పలేక పోయింది. ఇక న్యాయస్థానాలు కూడా శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడండంటూ ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాయి. అంతకు మించి ప్రజల మనోభావాల పరిరక్షణపై దృష్టిపెట్టడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితోనే ఆధునికత నెపంతో మత విశ్వాసాల్ని, మనోభావాల్ని దెబ్బతీసే ప్రయత్నం సాగుతోంది. దీనికి ప్రభుత్వం అడ్డుకట్టేయలేని పరిస్థితుల్లో అంతర్గత ఆగ్రహంతో పెచ్చుమీరి ఉద్యమానికి దారితీసే ప్రమాదముందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

వాసవి క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా వంకదారవాసుదేవరావు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్‌గా విజయవాడకు చెందిన వంకదార వాసుదేవరావు ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని గాంధీనగర్‌లో ఉన్న ప్రధాన కార్యాలయంలో ఆయన ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. 2018 కి సంబంధించిన ప్రెసిడెంట్‌గా ఎన్నికైన వెంటనే తెలంగాణ రాష్ట్రంలోని నకిరేకల్‌కు చెందిన గజ్జల రామకృష్ణను అంతర్జాతీయ కార్యదర్శిగా, పొలచ్చికి చెందిన ఎన్ బలరామన్‌ను కోశాధికారిగా నియమించారు. బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పూర్వ అధ్యక్షులు ఎ అతికేశన్, కార్యదర్శి కనమర్లపూడి శ్రీనివాసరావు, కోశాధికారి వేముల హజరతయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పని చేద్దాం: వాసుదేవరావు

బాధ్యతలు స్వీకరించిన అనంతరం వాసుదేవరావు విలేఖరులతో మాట్లాడారు. మంచి సమాజ నిర్మాణం, పేదవర్గాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరు వ్యవహరించాలని కోరారు.ఈ సందర్భంగా స్నేహం, వైభవం పేర రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను ఆయన విడుదల చేశారు.

మొక్కలకు సెన్సర్ అంటుకట్టు నీటి వాడకాన్ని కనిపెట్టు

- అమెరికా పరిశోధకుల ఆవిష్కరణ



వాషింగ్టన్: మొక్కల్లో నీటి వాడకాన్ని కొలిచేందుకు చవకైన, సరికొత్త గ్రాఫైన్ ఆధారిత సెన్సర్‌ను అమెరికాలో లోవా స్టేట్ యూనివర్శిటీ పరిశోధకులు కనిపెట్టారు. సదరు సెన్సర్‌ను రెండు రకాల మొక్కజొన్న మొక్కలకు కట్టారు. మొక్కల వేళ్ల నుంచి కాండానికి, అక్కడి నుంచి ఆకులకు నీటి కదలికలను, ఎంత పరిణామంలో నీరు చేరుకుంటున్నదీ కొత్త సెన్సర్ ద్వారా పక్కాగా లెక్క కట్టారు. తాజా సెన్సర్ ద్వారా సమర్థమంతమైన నీటి వినియోగంతో మొక్కలు పెంపకం చేపట్టవచ్చని ప్లాంట్ సైంటిస్ట్ ప్యాట్రిక్ షెనాబిల్ తెలిపారు. గ్రాఫైన్ ఒక అద్భుతమైన పదార్థం. విద్యుత్ మరియు వేడిమి వాహకంగా అది పటిష్టంగా, నిలకడగా పనిచేస్తుంది. మరింత చవగ్గా లభిస్తూ బ్రహ్మాండంగా పనిచేసే సెన్సర్ల రూపకల్పనకు తాము ప్రయత్నిస్తున్నట్టు లోవా స్టేట్ యూనివర్శిటీ అసోసియేట్ ప్రొఫెసర్ లియాంగ్ డాంగ్ తెలిపారు. ఒక టేపుపై గ్రాఫైన్‌ను స్థిరంగా అమర్చడానికి పరిశోధకులు ఒక ప్రక్రియను అభివృద్ధి చేశారు. మొక్కలపై అధ్యయనాల కోసం గ్రాఫైన్ ఆక్సైడ్‌తో సెన్సర్లను రూపొందించారు. అది నీటి ఆవిరికి అత్యంత చురుగ్గా స్పందిస్తుంది. నీటి ఆవిరి కారణంగా గ్రాఫైన్ ఆక్సైడ్ వాహకంలో మార్పు చోటు చేసుకుంటుంది. తద్వారా ఎంత మేరకు నీటి వాడకం జరిగిందీ కచ్చితంగా తెలుస్తుందని పరిశోధకులు వెల్లడించారు.

చేతిని చేసి చూపించారు

- కృత్రిమ చెయ్యి ఆవిష్కారం
- స్విస్ సైంటిస్టుల ఘనత



లండన్: స్పర్శ జ్ఞానం సంతరించుకున్న మొట్టమొదటి పోర్టబుల్ బయోనిక్ చేతిని సైంటిస్టులు అభివృద్ధి చేశారు. దాదాపు పాతిక సంవత్సరాల క్రితం ఒక ప్రమాదంలో చేతిని కోల్పోయిన అల్‌మెరినా మస్కరెల్లో అనే మహిళకు కృత్రిమ హస్తాన్ని అమర్చారు. స్టార్ వార్స్ లాంటి సైన్ ఫిక్షన్ సినిమాల తరహాలో పూర్తి నియంత్రిత, సహజసిద్ధమైన, మానవ హస్తాన్ని అచ్చు గుద్దినట్టుగా బయోనిక్ హ్యాండ్‌ను అభివృద్ధి చేశాం అని స్విట్జర్లాండ్‌లో ఎకోలె పాలిటెక్నిక్ ఫెడరలే డె ల్యూసన్నే వద్ద న్యూరో ఇంజినీర్‌గా వ్యవహరిస్తున్న సిల్వెస్ట్రో మెసెరో తెలిపారు. ఒక వస్తువు సున్నితమైందా కఠినమైందా అనే దాన్ని గుర్తించే సెన్సర్లను కృత్రిమ హస్తానికి అమర్చారు. సెన్సర్లు పంపించే సందేశాలను కృత్రిమ హస్తం కలిగి ఉన్న మస్కరెల్లో తగిలించుకున్న బ్యాగ్‌లోని ఒక కంప్యూటర్ అందుకుంటుంది. ఎగువ భుజంలోని నరాల్లో అమర్చిన సూక్ష్మమైన ఎలక్ట్రోడ్ల ద్వారా మస్కరెల్లో మెదడుకు సమాచారం చేరుతుంది. పరీక్షల్లో భాగంగా ఆమె కళ్ళకు గంతలు కట్టినప్పుడు కృత్రిమ హస్తం ద్వారా తాను అందుకున్న వస్తువు ఎలాంటిదో ఆమె ఇట్టే గరుపట్టగలిగింది. ఆ అనుభూతి అద్భుతంగా ఉందని ఆమె అన్నారు. సహజసిద్ధమైన చెయ్యి తరహాలో తాను దుస్తులు ధరిస్తున్నట్టు, బూట్లు తొడుక్కుంటున్నానని తెలిపారు. మస్కరెల్లో కృత్రిమ చేతిని ఆరు నెలల పాటు ఉంచుకున్నారు. అయితే ప్రయోగ దశలో ఉన్న కారణంగా ఆ తర్వాత దానిని తొలగించారు.

ఉత్తర కొరియా అణు కార్యక్రమాలు ఆపాలి



టోక్యో: ఉత్తర కొరియా తన అణు కార్యక్రమం, క్షిపణి పరీక్షలు నిలిపివేయాలని జపాన్ ప్రధానమంత్రి షింజో అబె కోరారు. గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ అబె... ఉత్తర కొరియా భాగ్యవంతంగా మారాలంటే అణు కార్యక్రమం, క్షిపణి పరీక్షలు ఆపేయాలి. ఉత్తర కొరియాపై అంతర్జాతీయ సమాజం విధించిన ఆంక్షల ప్రభావాన్ని జపాన్ గమనిస్తున్నది. ముఖ్యంగా శీతాకాలంలో వెచ్చదనంకోసం బొగ్గు, ద్రవ ఇంధనాలపై ఆధారపడతాం. ఉద్రిక్తతల నేపథ్యంలో వీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు కష్టపడతారు అని చెప్పారు. అయితే ఉత్తర కొరియా ఇటీవల తన దాయాది దక్షిణ కొరియాతో సమాచార సంబంధాలు పునరుద్ధరించుకున్న విషయంపై షింజో అబె మాట్లాడలేదు. ఉత్తర కొరియా క్షిపణిలు, అణు ఆయుధాల కార్యక్రమంతో మా జాతీయ భద్రతకు ముప్పు పొంచివుంది. మా దేశాన్ని రక్షించుకునేందుకు మేము మా సైన్యాన్ని శక్తివంతంగా నిర్మించుకుంటున్నాం అని అబె చెప్పారు.

'సహకారం' బలోపేతం

- పారదర్శకతకు పెద్దపీట
- ఎన్నికల విధానంలో సమూల మార్పులు
- పనితీరు మెరుగు పర్చడమే లక్ష్యం
- నూతన చట్టం అమలులోకి తెచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సహకార రంగంలో మరింత పారదర్శకతను తెచ్చేలా ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చింది. కో ఆపరేటివ్ సొసైటీల పనితీరును మరింత ప్రభావవంతం చేయడంతోపాటు పనితీరును మెర్గు పర్చడమే లక్ష్యంగా కీలక మార్పులు చేసింది. అదేవిధంగా సహకార ఎన్నికల ప్రక్రియలో కూడా సమూల మార్పులకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గత ఉమ్మడి రాష్ట్రంలోని సహకార చట్టంలో కీలక మార్పులు తెస్తూ గురువారం తెలంగాణ సహకార చట్టాన్ని సొంతంగా ఏర్పాటు చేసుకుంది. ఈ మేరకు నూతన చట్టం అమలులోకి తెస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే తీవ్ర విమర్శల పాలవుతున్న సహకార వ్యవస్థలో మార్పులు తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేసింది. ఇందులో భాగంగానే తాజా చట్టంలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వ్యవస్థీకృత మార్పుల్లో భాగంగా ఏపీ కో ఆపరేటివ్ సొసైటీస్ యాక్టు-1964లో కీలక సవరణలను చేసింది. సవరించిన టిసిఎస్ చట్టంలోని సెక్షన్ 31 బి ప్రకారం అన్ని సహకార సొసైటీల ఎన్నికలను అదనపు రిజిస్ట్రార్ ర్యాంక్ అధికారి నేతృత్వంలో ఏర్పాటు చేయనున్న కో ఆపరేటీవ్ ఎలక్షన్ అథారిటీ నిర్వహించనుంది. ఈ మేరకు గురువారం రాష్ట్రప్రభుత్వం ఎన్నికల నిర్వహణకుగానూ నిర్దేశిత రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీని అదనపు రిజిస్ట్రార్ శ్రీనివాసరావు నేతృత్వంలో ఏర్పాటు చేసింది. కో ఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికల నియమావళి, నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన విధానాలను ఈ చట్టంలోని నిబంధన 22 కల్పించనుంది. ఈ నిబంధనల మేరకు జిల్లా రిజిస్ట్రార్, జిల్లా కలెక్టర్లు ఎన్నికలకు ఆదేశించే అధికారం, సహకార సంఘాలు, సొసైటీలకు ఎన్నికల అధికారులను నియమించే హక్కును, రాష్ట్రప్రభుత్వంనుంచి ఎలాంటి సాయం పొందకుండానే సహకార సంఘాలకు సొంతంగా ఎన్నికల నిర్వహణకు వీలు కలుగుతుంది. సవరించిన చట్టంలోని సెక్షన్ 31బికు అనుగుణంగా రూల్ 22ను ప్రభుత్వం తెచ్చింది. తెలంగాణ కో ఆపరేటివ్ సొసైటీస్ రూల్ 22 ప్రకారం కీలక నిబంధనలను తెరపైకి తెచ్చింది.

➥ అన్ని సహకార సంఘాలు, అన్ ఎయిడెడ్ సొసైటీలు తమ పదవీ కాలం ముగిసేందుకు 60 రోజులముందే రాష్ట్రసహకార ఎన్నికల అథారిటీకి ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది.

➥ ఎన్నికల వ్యయం అభ్యర్థులు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీలో జమ చేయాలి.

జడ్జీల జీతాల పెంపునకు గ్రీన్ సిగ్నల్

- బిల్లుకు ఆమోదం తెలిపిన లోక్‌సభ
- కోరెగావ్ అల్లర్లను ఖండించిన రాజ్యసభ
- నిరుద్యోగంపై వాడీవేడి చర్చ
- త్వరలో ఆర్థికరంగం పుంజుకుంటుందన్న జైట్లీ
- నేటితో ముగియనున్న శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల జీతాల పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. గురువారం లోక్‌సభలో ఈ బిల్లుపై సభ్యులు చర్చించి మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపారు. పార్లమెంటు ఆమోదం పొందిన తర్వాత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రస్తుతం పొందుతున్న లక్షరూపాయల జీతం స్థానంలో 2.80లక్షల జీతాన్ని అందుకుంటారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు 2.50 లక్షల రూపాయల జీతాన్ని పొందనున్నారు. రాజ్యసభ దీనిపై శుక్రవారం ఆమోదించాల్సి ఉంది. ఒకవేళ ఇది సాధ్యం కాకపోతే వచ్చే బడ్జెట్ సమావేశాల వరకు వేచి చూడాల్సి ఉంటుంది. చర్చ సందరఇ ంగా సభ్యులు పలుఆసక్తిక అంశాలను లేవనెత్తారు. దక్షిణభారతదేశం, ఈశాన్యభారతంలో సుప్రీంకోర్టు బెంచ్‌లు ఏర్పాటుచేయాలని, కోర్టు హాళ్లలో కనీస సౌకర్యాలు మెరుగపర్చాలని సిపిఎం సభ్యుడు సంపత్ అన్నారు.

కోరెగావ్ అల్లర్లను ఖండించిన రాజ్యసభ

బీమా కోరెగావ్ అల్లర్లపై రాజ్యసభ ఆందోళన వ్యక్తం చేసింది. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టవద్దని, శాంతి సామరస్యంతో



కలిసి మెలిసి జీవించే విధంగా రాజకీయపార్టీలు సైతం కృషిచేయాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు విజ్ఞప్తి చేశారు. రాజ్యసభలో అన్ని పక్షాల సభ్యులు కోరెగావ్ అల్లర్ల ఘటనను ఖండించారు. ఇరువర్గాలతో చర్చలు జరిపి శాంతిని నెలకొల్పాలని ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్ సూచించారు. ఈ ఘటనపై జుడిషియల్ విచారణ జరపాలని డిఎంకె ఎంపీ కనిమొళి డిమాండ్ చేశారు. అయితే దళితులపై జరిగే ప్రతి దాడిని ఆర్ ఎస్ ఎస్‌కు అంటగట్టడాన్ని కూడా ఖండించాలని బిజెపి సభ్యుడొకరు డిమాండ్‌చేశారు.

నిరుద్యోగంపై చర్చించినరాజ్యసభ

పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ అమలు తర్వాత నిరుద్యోగం భారీగా పెరిగిపోయిందని విపక్ష సభ్యులు ప్రస్తావించారు. పెద్దనోట్ల రద్దు, జిఎస్టీ తర్వాత జిడిపిరేటు పడిపోయిందని కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ అన్నారు. దాంతో దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలతో సమాజంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయని సిపిఐ ఎంపీ డి.రాజా అన్నారు. 2008 ఆర్థిక సంక్షోభాన్ని ప్రభుత్వం ఎదుర్కోవడానికి నాటి ప్రభుత్వ రంగ సంస్థలేకారణమని అన్నారు. అయితే పెట్టుబడుల ఉపసంహరణ పేరుతో వాటిని మూసేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడీస్ నివేదిక గురించి గొప్పలు చెపుతున్నప్రభుత్వం, ప్రపంచ ఆకలి నివేదిక కూడా చూడాలన్నారు. పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్న దేశాల్లో భారతదేశం ముందు ఉండడం శోచనీయమని అన్నారు.ప్రజల నుంచే లాభాలు ఆర్జిస్తున్న ప్రైవేటు సంస్థల్లోకూడా రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్‌చేశారు. పంటలకు గిట్టుబాటుధరలు ఇవ్వకుండా రైతుల ఆదాయాన్ని రెండింతలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. జిఎస్టీ, పెద్దనోట్ల రద్దు వల్ల వచ్చిన ఇబ్బందులు తాత్కాలికమేనని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ తెలిపారు. ప్రభుత్వ పథకాలు లబ్దిదారులకు నేరుగా చేర్చేందుకే ఆధార్‌ను అమల్లోకి తీసుకువచ్చారని అన్నారు. అక్రమాలు ఆరికట్టాలంటున్న విపక్షా లు, ఆధార్ అమలు చేస్తే ప్రశ్నించడంలో ఔచిత్యం ఏమిటన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలోనే జిఎస్టీ కి బీజం పడిందని అన్నారు. జిఎస్టీ రేటు తగ్గించాలని అంటున్న ప్రతిపక్షాలు, ప్రభుత్వ ఆదాయం తగ్గడాన్ని ప్రశ్నిస్తున్నాయన్నారు.

నేనిక్కడ క్షేమం.. వేధింపుల్లేవ్

- పాక్ బాగానే చూసుకుంటోంది
- తాజా వీడియో సందేశంలో జాదవ్
- వీడియోపై భారత్ అనుమానాలు



ఇస్లామాబాద్: కస్టడీలో ఉన్న తనను పాక్ అధికారులు హింసించడంలేదని, తనక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నారని కులభూషణ్ యాదవ్ అన్నట్లు ఒక వీడియోను పాక్ విదేశాంగ శాఖ గురువారం బయట పెట్టింది. అయితే ఈ వీడియో యదార్థతపై సందేహం ను భారత్ వ్యక్తం చేసింది. భారత దౌత్యవేత్తనే తన తల్లిని వేధించాడని పాక్‌లో మరణశిక్షకు గురైన కులభూషణ్ జాదవ్ చెపుతున్నట్లుగా వీడియోలో చూపారు. పాకిస్తాన్‌లో మరణ శిక్షకు గురైన కులభూషణ్ జాదవ్ డిసెంబర్ 25న తన తల్లి, భార్యతో మాట్లాడిన సమయంలో వారి పట్ల పాకిస్తాన్ అధికారులు అమర్యాదగా వ్యవహరించారని సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పాక్ ప్రభుత్వం వారిద్దరి భేటీకి సంబంధించిన వీడియోను మీడియాకు విడుదల చేసింది. ఈ సంభాషణలు సాగుతున్నపుడు భారత కమిషనర్ జెపి సింగ్ వారితో పాటు కూర్చోలేదు. కాని వీడియోలో తన తల్లిపై భారత కమిషనర్ అరుస్తున్నట్లుగా జాదవ్ పేర్కొనటం పాక్ పన్నిన వ్యూహంగా భారత్ అధికారులు చెపుతున్నారు. ఈ వీడియో ఇప్పటికే భారత్‌లో ప్రదర్శిస్తుండగా, పాకిస్తాన్ ఆలస్యంగా దీన్ని బయట పెట్టింది. వీడియోలో జాదవ్ భయంతో బలవంతంగా మాట్లాడుతున్నట్లు కన్పించింది. 40 నిమిషాలపాటు సాగిన ఈ సంభాషణను పాకిస్తాన్ అధికారులు వీడియో తీశారు. నేను మాట్లాడుతున్న సమయంలో తన తల్లి కళ్లల్లో భయంను గమనించాను. భారత దౌత్యవేత్త తన తల్లిపై అరుస్తుండటం విన్పించింది అని జాదవ్ తెలిపారు. అయితే జాదవ్ ఏవిధంగా దౌత్యవేత్తను చూశారో స్పష్టంగా కన్పించలేదు. పైపెచ్చు పాకిస్తాన్ ప్రభుత్వానికి జాదవ్ ధన్యవాదాలు తెలుపుతుండటం, తనకు ఇప్పుడు సంతోషంగా ఉందని చెప్పటాన్ని భారత్ కొట్టి పారేసింది. ఇది తప్పకుండా బలవంతంగా చెప్పించిన వీడియోగా పేర్కొంది. భారత్ ఈ వీడియో స్టేట్‌మెంట్‌ను పాకిస్తాన్ వ్యూహం పన్ని తప్పుగా రికార్డు చేసిందని అన్నారు. దీన్ని మేము లెక్కలోకి తీసుకోమని ప్రభుత్వం ప్రకటించింది. ఇలాంటి వీడియోలు పాక్‌కు మంచి పేరును తేవని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ చెప్పారు. ఉగ్రవాదం లేదా మానవ హక్కులకు సంబంధించి ఐక్యరాజ్య సమితి తీర్మానాలు 1267, 1373 నిబంధనలను పాక్ పాటించాలన్నారు. గూఢచర్యానికి పాలుపడుతున్నాడన్న కారణంపై జాదవ్‌కు పాక్ కోర్టు 2017 ఏప్రిల్‌లో మరణ శిక్షను విధించింది. జాదవ్ గూఢచారి కాదు, ఆయన వ్యాపారం నిమిత్తం ఇరాన్ వెళ్లగా అక్కడి నుంచి పట్టుకొని పోయారని భారత్ వాదిస్తోంది. జాదవ్‌ను తాము బెలూచిస్తాన్‌లో అరెస్టు చేసినట్లు పాక్ చెప్తోంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శుక్రవారం 5 జనవరి 2018

7వేల కోట్ల సందేశాలు

వాట్సాపా మజాకానా.. ఒకే రోజు 70బిలియన్లసందేశాలు వెళ్ళాయట. జనవరి ఒకటో తేదీన ప్రపంచవ్యాప్తంగా శుభాకాంక్షలు తెలుపుకోవడానికి వాట్సాప్‌ను వినియోగించుకున్నారు. ఇందులో భారత్ వాటా 20బిలియన్ల సందేశాలట. వాట్సాప్ ఈ విషయాలను అధికారికంగా వెల్లడించింది. ఈ సందేశాల్లో ఇమేజ్‌ల వాటా 13 బిలియన్లనీ, వీడియోలు 5 బిలియన్లనీ వివరించింది. ఒకప్పుడు శుభాకాంక్షలు చెప్పాలంటే పావురాల్ని ఉపయోగించేవారు. ఆ తరువాత సందేశకుల్ని పంపే వారు. ఫోన్లొచ్చిన తరవాత ట్రంక్ కాల్స్ బుక్ చేసుకోవడం. మొబైల్స్ ప్రవేశంతో ఎస్ఎమ్ఎస్‌ల శకం ప్రారంభమైంది. వాట్సాప్ వీటన్నింటినీ పక్కకు నెట్టేసింది. అరక్షణంలో ప్రపంచంలో ఏ మూలనున్నా సందేశం అందించే సౌకర్యం దీని స్వంతం. డేటా ఖర్చవుతుందని తప్ప.. స్పెషల్ డేస్‌కి స్పెషల్ చార్జెస్ అనే దిగులు లేదు. వాట్సాప్‌లో భారత్ కు 200మిలియన్ల మంది వినియోగ దారులున్నారు. కొత్త సంవత్సరం రోజు వాట్సాప్ చరిత్రలో అతిపెద్దసంఖ్యలో సందేశాలు పంపిన రోజని ప్రకటించింది. దీనివల్ల ఆ రోజున వినియోగదారులు వాట్సాప్ సెర్వర్ డౌనై రెండు గంటలపాటు ఇబ్బందులూ పడ్డారు. భారత్, జపా న్, బ్రిటన్, బార్బడోస్, పనామా, దక్షిణాఫ్రికా, స్పెయిన్, ఖతర్ దేశా ల్లోని వినియోగ దారులు ఈ అసౌక ర్యానికి ఎక్కువగా గురయ్యారు.

చైనా ద్రోహబుద్ధికి మరో నిదర్శనం

టేబిల్‌పై పెట్టుకునే గ్లోబులు, గోడలకు వేలాడదీసే మ్యాప్‌లు చిన్న విద్యార్థుల కోసమే రూపొందించేవే వాటిల్లో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూసుకోవడం వాటిని విడుదల చేసిన దేశాల బాధ్యత. కొన్ని సందర్భాల్లో పొరపాట్లు జరుగుతుంటాయి. వాటిని దిద్దుకోవాలి. లేదా భావితరాలకు సరైన సమాచారం అందదు. కానీ, చైనా విడుదల చేసే గ్లోబులు, మ్యాప్‌లలో అరుణాచల్‌ప్రదేశ్, కాశ్మీర్ వంటి భారత్ అంతర్భాగాలను విస్మరించడం ఇది మొదటి సారి కాదు. కెనడాలోని టొరొంటో శివారులో ఒక స్టోర్‌లో చైనా నుంచి దిగుమతి అయిన గ్లోబ్‌లో అరుణాచల్, కాశ్మీర్‌లు లేకపోవడంచూసి సందీప్ దేశ్వాల్ అనే ప్రవాస భారతీయుడు దిగ్భ్రాంతి చెందాడు. గత ఏడాది డిసెంబర్‌లో కొనుగోలు చేసిన చైనా గ్లోబులో కాశ్మీర్‌పై వివాదాస్పద ప్రాంతం అని రాసి ఉండటం చూసి దిమ్మెర పోయాడు. ఇలా ఇప్పటికి మూడు సార్లు అతడికి అనుభవం ఎదురైందట. చైనా వస్తువుల కోసం ఎగబడే భారతీయులకు ఇది ఒక గుణపాఠం. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ఢిల్లీ సందర్శించినప్పుడూ, తాను బీజింగ్ వెళ్ళినప్పుడూ ద్వైపాక్షిక వాణిజ్యం పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని మన ప్రధాని నరేంద్రమోడీ కోరినా, చైనా నుంచి స్పందన లేదు. చైనాతో వాణిజ్యం అంటే ఎప్పుడూ ఏక పక్షంగానే సాగుతుంది. చైనా మన వస్తువులను దిగుమతి చేసుకోకపోయినా, మనం మాత్రం చైనా నుంచి దిగుమతి అయ్యే సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులపై మోజు పెంచుకుంటున్నాం. చైనా నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు గ్లోబులు, మ్యాప్‌లు కూడా మన దేశంలోకి వచ్చి పడవన్న గ్యారంటీ లేదు. మన ఇంటిలిజెన్స్ విభాగాల నిఘా అంతంత మాత్రమేనని ఎన్నో సార్లు రుజువు అయింది. ఆఫ్ఘనిస్థాన్ నుంచి పాక్ మీదుగా గంజాయి నిల్వలు దిగుమతి అవుతున్నా, బంగ్లాదేశ్ మీదుగా పాక్ నుంచి నకిలీ కరెన్సీ దిగుమతి అవుతున్నా నియంత్రించలేకపోవడమే వాటి వైఫల్యానికి నిదర్శనం.

డోక్లామ్ ఉద్రిక్తత అనంతరం ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాల మెరుగు కోసం ఒక వంక ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే, అరుణాచల్ ప్రదేశ్ భారత్‌లో అంతర్భాగంగా తాము గుర్తించడంలేదని చైనా విదేశాంగ ప్రతినిధి ప్రకటించడం డ్రాగన్ బరితెగింపు ధోరణికి నిదర్శనం. ఇప్పుడు కెనడాలో విడుదలైన ఈ ప్రపంచ పటాలు, గ్లోబులపై చైనాకు తీవ్ర నిరసన తెలపాల్సిన అవసరంఎంతైనా ఉంది. చైనా కమ్యూనిస్టు పార్టీలో సీనియర్ నాయకుడితో బీజింగ్‌లో భారత రాయబారి గౌతమ్ బాంబా వాలే కలుసుకున్న తరుణంలోనే చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, అరుణాచల్‌ని భారత్ అంతర్భాగంగా గుర్తించడం లేదని ఖరాకండీగా స్పష్టం చేశారు. ఒకవంక నెయ్యానికి సిద్ధమేనంటూ నంగనాచి ప్రకటనలు చేస్తూ, మరో వంక అరుణాచల్, కాశ్మీర్ వివాదాలను లేవనెత్తడం చైనీస్ నాయకుల ద్రోహ బుద్ధికి నిదర్శనం. పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులు తమ పౌరులను కూడా మట్టుబెడుతున్నారంటూ ఇటీవల గగ్గోలు పెట్టిన చైనా, ఇటీవల పాకిస్తాన్‌కి సహాయం నిలిపేస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించగానే ఘాటుగా స్పందించింది. బలూచిస్థాన్‌లో పని చేస్తున్న చైనీస్ కార్మికులు నలుగురిని పాక్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదసంస్థ సభ్యులు ఆ మధ్య కాల్చి చంపగానే, పాక్‌ని చైనా తీవ్రంగా హెచ్చరించింది. తనదాకా వచ్చింది కనుక, చైనాలో మార్పు వచ్చిందేమోనని అంతా అనుకున్నారు. మళ్ళీ ఇలా మాట మార్చడం చైనా అవకాశవాదానికి పరాకాష్ట. సరిహద్దులను అతిక్రమించాలన్న ద్రోహ చింతనలో పాక్‌దీ తన నైజమే కనుక, పాక్‌ని సమర్థిస్తుందనే అనుకోవల్సి ఉంటుంది. చైనా నుంచి విడుదలయ్యే మ్యాప్‌లు, గ్లోబులనే కాదు, ఇతరవస్తువులను నిషేధించాల్సిన అవసరం ఎంతైనాఉంది. దౌత్య స్థాయిలో చైనీస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి. సర్వసత్తాక ప్రతిపత్తి కలిగిన ఒక దేశంలోని అంతర్భాగాలను మ్యాప్‌లో తొలగించే హక్కు ఏ దేశానికీలేదు. ఈ విషయమై ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేయాలి.

అనుసంధానంతోనే ప్రగతి

భారతదేశ భూతలాన్ని సస్యశ్యామలం చేయడానికి నదుల అనుసంధానం చేయడం తప్పితే మరో మార్గాంతరం లేదు. జల వనరులను ఎక్కడికక్కడే నిల్వచేసే ప్రాజెక్టుల వలన క్షామ పీడిత ప్రాంతాలను జలసిరితో నింపడమే కాకుండా వరద బీభత్సాల్ని నిరోధించే కీలక పాత్రకు నదుల అనుసంధానంతో భారతీయ జన ఆహారోత్పత్తికి చేవ తీసుకురాగలిగిన ప్రాజ్ఞత ఈ కార్యక్రమంతో నింపారుతుంది. దశాబ్దాలుగా దస్త్రాలకే పరిమితమైన ఆ భూరి ప్రాజెక్టులను పట్టాలెక్కించడానికి మోడీ ప్రభుత్వం సంసిద్ధం కావడం హర్షణీయాంశం. దేశవ్యాప్తంగా అరవై నదుల్ని అనుసంధా నించే విషయంలో అయిదున్నర కోట్ల వ్యయానికి పైగా వెచ్చించాల్సి ఉంటుందని జలప్రాజెక్టులలో అనుభవం ఉన్న పరిశీలకుల అంచనా. ప్రాజెక్టుల ఏర్పాటే కాదు అందువల్ల పర్యావర ణానికి ఏమాత్రం క్షోభ కలగకుండా ప్రాజెక్టుల ఏర్పాటు అసమానమైన ప్రక్రియ. అప్పటి ప్రధాని వాజ్‌పేయి ఎప్పటి నుంచో సంకల్పించిన ఈ పథకాన్ని మోడీ ప్రభుత్వం నేతృత్వంలో సాకారమైతే నేల నాలుగు చెరగులా జలసిరితో భారతావని సస్యశ్యామలమవుతోంది. నదీ జలాలను ఒడిసిపట్టి వాటిని సక్రమంగా సమగ్రంగా వినియోగించుకోలేక ప్రాంతీయత, నదుల జలాలు తమకే దక్కాలనే ఆతృత ఈ కారణంగా ప్రాంతీయ భేదాలు తలఎత్తి హింసాకాండలు చోటుచేసుకొన్న సంఘటనలు కోకొల్లలు. 2005 ఆగస్టులో కెన్, బెట్వా నదుల మిగులు జలాల్ని ఉభయతారకంగా మళ్ళించేందుకు ఒప్పందం కుదిరినా అది అమలుకు నోచుకోకపోవడం గత ప్రభుత్వాలు అనుసరించిన నిర్లక్ష్యం, అమలులో అనుసరించిన విపరీత జాప్యమే అందు కు అద్దం పడుతోంది. ద్వీపకల్ప నదుల్ని, హిమాలయ ప్రాంతాలనుండి ప్రవహించే నదుల్ని వేర్వేరుగా అనుసంధా నించాలన్న అభిప్రాయంపై దాదాపు ఏకాభిప్రాయం పొడచూపుతూ ఉంది. దక్షిణ భారతదేశంలో 16 నదుల్ని అనుసంధానించి 27 చెక్‌డ్యాముల నిర్మాణంతో నీటికొరత తీర్చి, 4000 విద్యుదుత్పత్తి సాధించాలన్న సురేష్‌ప్రభు కమిటీ నివేదికను, జలవనరుల మేధావుల సూచనల్ని ఎన్డీయే ప్రభుత్వం వీలైనంత త్వరగా పట్టాలెక్కించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రపంచ జనాభాలో 18 శాతం భారత్‌లోనే ఉన్నారు. 2030 నాటికి మనదేశ జనాభా చైనాను మించిపో తుందనే నిపుణుల అంచనాల్ని కొట్టిపారేయలేనివి. చైనా దేశంలో జనాభాను నియంత్రిస్తూ, వనరులను పెంపొందించే దిశగా పయనిస్తుండగా, భారత్‌లో మాత్రం వనరులను సద్వినియోగం చేసుకొనే ప్రయత్నాలు సజావుగా సాగడం లేదు. ఇంకిపో తున్న భూగర్భజలాలు భూమి ఉపరితలం మూడొంతులు నీటితో నిండి ఉంది. ఇందులో 97.5 శాతం సముద్ర జలాలు, ఇవి వ్యవసాయానికి, ప్రజావసరాలకు పనికిరావు. మిగిలిన రెండున్నర శాతం మంచినీటితో ఒకటి న్నర శాతం ధృవప్రాంతాల్లో మంచుగడ్డల రూపంలో భూగ ర్భ జలాలుగా మిగిలి ఉన్నాయి.కేవలం ఒక శాతం మాత్రమే ఉపరితల జలాలుగా మానవాళికి ఉపయోగపడుతోంది.



నీటి దుర్వినియోగాన్ని అరికట్టాలి

అన్నింటికంటే ముఖ్యంగా నీటి దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఉంది. దేశంలో చాలాప్రాంతాల్లో ఏటా 800 మిల్లీమీటర్లకు మించి వర్షం పడుతూనే ఉన్నా, వాటిని సక్రమంగా వినియోగించుకొనే సామర్థ్యం కొరవడి ఇందులో అధికశాతం నీరు సముద్రం పాలవుతోంది. ఆ జలాలను ప్రణాళికాబద్ధంగా నిల్వచేసుకునే స్థోమత లేకపోవడం, ప్రయత్నలోపంతో మంచినీటి కొరత ఏటా తాండవిస్తోందన్న అభిప్రాయం బలపడుతోంది. భూమిపై ప్రవహించేనీటివనరుల సంగతలా ఉంచితే, భూగర్భ జలాల విషయంలోనూ దేశవ్యాప్తంగా నీటిమట్టాలు పడిపోయి జలనిల్వలు హరించుకుపోయాయి.

12వ పంచవర్ష ప్రణాళిక అమలేదీ?

రక్షిత మంచినీరు మురుగు నీటి శుద్ధికి, వ్యవసాయరంగ నీటిపారుదల సౌకర్యాలు ఏర్పాటుకు ప్రణాళికలో లక్షా పదివేల కోట్ల రూపాయల అంచనాలు ఆచరణలో చిత్తశుద్ధి లేని కారణంగా తూతూ మంత్రంగా మిగిలిపోతుంది. దేశంలో ఇప్పటికే 388 ప్రాజెక్టులు అసంపూర్ణంగా ఉన్నాయి. వీటిలో ఫలవంతమివ్వని వాటిని పక్కనపెట్టి, ఉపయోగపడే వాటి శ్రద్ధకనబరచి పూర్తిచేస్తే కొంతలో కొంత ఉపశమనం కలుగుతోంది. ప్రస్తుతం దేశంలో నీటి నిల్వల సామర్థ్యం 25 వేల కోట్ల ఘనమీటర్లు భవిష్యత్తులో 35 వేల కోట్ల ఘనమీటర్లు పెంచాల్సిన అవసరాన్ని ఐక్యరాజ్యసమితి సైతం సూచిస్తోంది.

అనుసంధాన ఆవశ్యకత అవసరమంటున్న సుప్రీం

హిమాలయ ప్రాంతాలలో తొమ్మిది ఆనకట్టల నిర్మాణం, 14 అనుసంధాన ప్రక్రియలద్వారా నీటి మళ్ళింపుతోపాటు 30 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యాన్నీ ప్రస్తావించింది. ఈ ఉత్పత్తిలో ఎకాయెకి నాలుగు శాతం వృద్ధికి దోహదపడే అనుసంధాన మహాయజ్ఞ ప్రయోజనాల్ని పరిశీలించిన సుప్రీం కోర్టు సైతం సత్వరం ఇలాంటి జాతిప్రయోజనాలకు పట్టంకట్టి ఆచరణలో ముందుకు సాగాలని 2012 లోనే అప్పటి మన్మోహన్ సర్కార్‌కు సూచించింది. జల వనరులు, విద్యుదుత్పత్తి సమీకరణలతోనే జాతీయ ఆహార భద్రత ముడివడి ఉందనేది విస్మరించలేని ప్రధానాంశం. దేశంలో లభించే నీటిలో 80 శాతం వ్యవసాయానికీ, 10 శాతం పరిశ్రమలకు, మిగిలిన పది శాతం ప్రజావసరాలకు వినియోగపడుతున్నట్లు గణాంకాలు వివరిస్తున్నాయి.

సీజనల్ నదులలో నిరంతర జల ప్రవాహానికి దోహదం చేయాలి

మానవ తప్పిదాలతో, పర్యావరణ దుష్ప్రభావాలు పరీవాహక ప్రాంతాల్లో అదే పనిగా వృక్షాల్ని నరికివేత, కాలుష్య కారక రసాయనాలు నదులలో వదలడం, పనికిరాని వ్యర్థ పదార్థాలతో నదులను నింపడం, విచక్షణారహితంగా నదీజలాల వినియోగం, నదులపై పలుచోట్ల అడ్డుగోలుగా ఆనకట్టలు నిర్మించడం, నదీ పరివాహక ప్రాంతాల దురాక్రమణలు, పర్యావరణ మార్పులు, వర్షాభావం, మరొకచోట భారీ వర్షాలతో వరదలు ఇత్యాది అనేక ప్రకృతి పరమైన దుస్థితిలో జలకళతో నిండారుగా ప్రవహించే నదులు జలసిరిని కోల్పోయి వెలవెల బోతూ ఎండుతున్న నదులకు జీవం తీసుకురావడానికి వివేకాన్ని, శాస్త్రీయ విజ్ఞానంతో ముందుకు సాగితే జలకళ ఉట్టిపడి వ్యవసాయక దేశం సస్యశ్యామల మవుతోంది.

-దాసరి కృష్ణారెడ్డి, 9885326493


చెరకుకు నిర్లక్ష్యం తెగులు!



ఒకవైపు చెరకు క్రషింగ్ ప్రారంభమైంది. మరోవైపు చెరకు నాట్లు తరుణం ఆసన్నమైంది. ఈ రెండూ సజావుగా లేవు. సామర్థ్యానికి సరిపోయే చెరకు సరఫరా కాక యాజమాన్యాలు సతమతమౌతున్నాయి. చెరకు నాటి, నష్టాలను నెత్తినెత్తుకొని, అప్పులు తీర్చలేక, అవమానాలు భరించలేక, ఆత్మహత్యలు చేసుకోలేమని రైతులు చెరకు సాగును దూరం పెడుతున్నారు. చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతోందన్న విషయం నిజం. తెలుగు రాష్ట్రాలలోని 35 శాతం ఫ్యాక్టరీలు మూతపడటమే అందుకు నిదర్శనం. 2010 నాటికి ఉభయ తెలుగు రాష్ట్రాలలో 38 ఫ్యాక్టరీలు చెరకు క్రషింగ్ చేస్తుండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 26 మాత్రమే. 12 ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. 2000 నాటికి చెరకు నాట్లకు రైతులు పరుగులు తీసేవారు. ఇపుడు చెరకు పేరు చెపితే, భయపడి పారిపోతున్నారు. గిట్టుబాటు ధరలేక, నష్టాలు భరించలేక చెరకు సాగుకు రైతులు దూరమైపోతున్నారు. చెరకుసాగు పెరగటంవల్లరైతు, ఫ్యాక్టరీలు మాత్రమే లాభాలు కూడగట్టుకొంటున్నా యనుకోవటం పొరపాటు. కేంద్ర ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రభుత్వానికీ పంచదార వల్ల వేల కోట్ల ఆదాయం సమకూరుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలకు భూమి శిస్తులో నీటితీరువా చెరకుకు అదనం, పన్నుల ద్వారా రాబడి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వానికి కూడా వివిధ రకాల పన్నులతో ఆదాయం సమకూరుతుంది. అంతకు మించి విదేశీ మారక ద్రవ్యం చేకూరుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, చెరకు పండించే రైతుకు లభించే ధర కన్నా, వివిధ పన్నుల రూపంలో ప్రభుత్వాలకు ఆదాయం ఎక్కువ. దేశంలో గుర్తింపు పొందిన పంటలు 25కు పైగా ఉన్నాయి. ఏ పంట ద్వారా లభించని ఆదాయం చెరకు ద్వారా ప్రభుత్వాలకు సమకూరుతుంది. ఒక విధంగా చెరకు ప్రభుత్వాలకు బంగారు గుడ్లు పెట్టే బాతు. చెరకు ద్వారా పంచదార ఉత్పత్తి కావటమే కాకుండా మొలాసిస్, బెగాసిస్, ఫిల్టర్ కేకు లాంటివి, గతంలో వ్యర్థ పదార్థాలుగా గతంలో పరిగణించే వారు. అవిపుడు అర్థవంతమై పంచదార కన్నా విలువైన ఉప ఉత్పత్తులను రూపొందించి, రెట్టింపు ఆదాయం, తద్వారా వివిధ రకాల పన్నుల ద్వారా ప్రభుత్వాలకు ఆదాయం సమకూర్చి పెడుతున్నాయి. దేశంలో సగం కన్నా ఎక్కువ జనాభా దారిద్ర్యరేఖ కన్నా దిగువన ఉన్న విషయం ప్రభుత్వ గణాంకాలే స్పష్టపరుస్తున్నాయి. నిత్యం పనిచూపించే పైరు చెరకు ఒక్కటే. మిగిలిన ఏ పంట విషయంలో లేనన్ని పనిదినాలు చెరకు సాగులో ఉన్నాయి. అలాంటి ఆదాయ వనరున్న చెరకు పండించే రైతు చివరకు అనాథగా తయారవుతున్నాడు. చెరకు పంట పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్షతతో వ్యవహరిస్తున్నాయనక తప్పదు. రెండు ప్రభుత్వాలు రైతులకు సహకరించటంలేదు. ఏ పంటకైనా ధర నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానిదే. ఆ ధర గిట్టుబాటుగా ఉండాలన్న విషయం మరొకరు ప్రభుత్వానికి చెప్పాల్సిన అవసరం లేదు. రైతు ఆశించినంతగా లాభం రాకపోయినా, కనీసం నష్టం రాని ధరలను కేంద్రం నిర్ణయించాలి. జనాభాలో 70 శాతం వ్యవసాయ ఆధారంగా జీవిస్తున్న దశలో, ఆ జనాభాకు ఆధారమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. ప్రభుత్వాల విధి ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా చేర్చి మద్దతు ధరలను నిర్ణయించాలనీ, అపుడే వ్యవసాయం అభివృద్ధి చెందుతుందనీ డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ నేతృత్వంలోని వ్యవసాయ కమిషన్ 2006లో నివేదికను కేంద్రానికి అందజేసిందనీ కాని, ఉత్పత్తి వ్యయానికి సరిపోయేలా మద్దతు ధరలు నిర్ణయించటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమౌతోంది. ఇప్పటి టన్ను చెరకు ఉత్పత్తి వ్యయం రూ.4000 లు. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.2550 లు. అంటే ప్రతి టన్నుకు 1500 లు చొప్పున పండించిన రైతు నష్టపోతున్నాడని స్పష్టమౌతుంది. వ్యవసాయ జాతీయ కమిషన్ సూచించిన విధంగా ఉత్పత్తి వ్యయం కన్నా, 50 శాతం అదనంగా నిర్ణయించటం పక్కకుపెట్టి, ఉత్పత్తి ఖర్చు కన్నా టన్నుకు రూ.1500 లు తగ్గించి ధర నిర్ణయిస్తే రైతు బతికేదెలా?


మద్దతు ధర నిర్ణయించటంలో కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి కనబరుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా చెరకు రైతుల గోడు వినిపించుకోవటం లేదనే చెప్పాలి. గత విధానాలకు స్వస్తి పలికి, చెరకు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్యాయం చేస్తోంది. 1985లో కూడా కేంద్రం నిర్ణయించిన చెరకు మద్దతు ధర గిట్టుబాటు కాని పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. చెరకు రైతు సంఘాలు అప్పటి ముఖ్యమంత్రికి నందమూరి తారక రామారావుకు తమ ఇబ్బందులను వివరించాయి. వారి వివరణలో నిజం ఉందని అభిప్రాయపడిన ముఖ్యమంత్రి రామారావు చెరకు రైతుల్ని ఆదుకునే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్నంలో భాగమే రాష్ట్రప్రభుత్వ సలహా ధర వెలుగు చూసింది. కేంద్రం నిర్ణయించిన ధరతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సలహా ధరను కూడా కలిపి రైతులకు చెల్లించటం మొదలైంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వ సలహా ధర విధానాన్ని చాలా రాష్ట్రాలు ప్రారంభించాయి. ఎన్టీఆర్ చర్య దేశంలోని చెరకు రైతులకు ఆదర్శంగా నిలిచింది. ఈ విధానం (రాష్ట్ర ప్రభుత్వం సలహా ధర) చక్కెర ఫ్యాక్టరీలకు కంటకప్రాయమైంది. వారి లాభాల నుంచి, కొద్దిగా రైతులకు చెల్లించటం ఇష్టం లేకపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన సలహా ధరను ఎరవేయటం కోసం కోర్టులను ఆశ్రయించాయి. సలహా ధరను సూచించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదంటూ హైకోర్టుకు, ఆపైన సుప్రీం కోర్టుకు ఫ్యాక్టరీ యాజమాన్యాలు దారి తీశాయి. అక్కడ కూడా రైతులకే న్యాయం జరిగింది. చెరకు సాగుకు వనరులు, వసతులు అన్ని రాష్ట్రాలలోను ఒకేలా ఉండవు, ఉత్పత్తి వ్యయం ఎక్కువ తక్కువగా ఉంటుంది. ఆయా రాష్ట్రా లలోని వ్యయం ఆధారంగా సలహా ధరను సూచించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకుంది అంటూ 2004 లోనే స్పష్టమైన కోర్టు తీర్పు వెలువడింది. 1985లో మొదలైన రాష్ట్రప్రభుత్వ సలహాధర, ఫ్యాక్టరీలు చెల్లించటానికి మొరాయించి, కోర్టుల కెళ్ళి, 2002లో చెల్లింపులు నిలిపివేశాయి. 2004 కోర్టు రైతులకు అనుకూలంగా తీర్పు వెలువడినా, అది ఇప్పటికీ అమలు కావటం లేదు. రైతులకు మేలు జరగటం లేదు. చెరకు ద్వారా వచ్చే మొలాసిస్, బెగాసిస్, ఫిల్టర్ కేక్ లాంటి వాటి ద్వారా వచ్చే ఆదాయంలో సగం రైతుకు ఇవ్వాలనే నిబంధన అసలు అమలు కావటంలేదు. అటు కేంద్రం ఇటు రాష్ట్రం కూడా చెరకు రైతుల మొర వినిపించుకొనే స్థితిలో లేవు. పైగా చెరకు దీర్ఘకాలిక పంట చెరకు ఒక పంట తీసే కాలంలో స్వల్పకాలిక పంటలు మూడు రైతుకు అందుతాయి. స్వల్పకాలిక పంటలకు పెట్టుబడి కూడా తక్కువగా ఉంటుంది. చెరకుపై విసిగిపోయిన రైతు ఇతర పంటల వైపు మొగ్గుచూపితే పంచదార కొరత ఏర్పడటం తథ్యం. దిగుమతి చేసుకొనే దుస్థితి రావచ్చు. అందుకు ప్రభుత్వాలదే బాధ్యత.

-దాసరి ఆళ్వారస్వామి



రైతు కుటుంబం నుంచి ఇండియన్ ఆస్కార్ కమిటీ చైర్మన్ దాక

రాయలసీమలోని రైతు కుటుంబంలో పుట్టిన సివి రెడ్డి మొదట్లో గ్రంథాలయాలకు పుస్తకాలు అందిస్తుండేవారు. నవలలను అమ్ముతుండేవారు. అదే ఆయన జీవనోపాధి. వసంత అనే నవలను రాశారు. అప్పుడే తెలిసింది ఆయనకు రాసే శక్తి తనకుందని. అనంతరం పగలే వెన్నెల పేరుతో మరో నవలను రచించారు. అప్పుడే ఆయనకు చలనచిత్ర రంగంలో ప్రవేశించాలనే బుద్ధి పుట్టింది. మద్రాసుకు పయనమయ్యారు. కృష్ణంరాజు హీరోగా నటించిన చిలుక-గోరింక చిత్రంలో ఆయనకు డాక్టర్‌గా వేషం లభించింది. ఇండస్ట్రీలో అడుగుపెట్టినప్పటికీ ఆయన నటన తన ప్రధాన వృత్తి కాబోదని ముందే ఊహించారు. కృష్ణంరాజుగారితో స్నేహాన్ని అలాగే కాపాడుకున్నారు. సినిమా రంగాన్ని వదిలి బయటకొచ్చి, తనకున్న వ్యాపారాలను చేసుకుంటూ స్వశక్తితో ఎదిగారు. 1993లో రవీంద్ర మూవీస్ సంస్థను స్థాపించారు. డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి, అప్పటి రెవెన్యూ మంత్రి రవీంద్రా రెడ్డి ఆయనకు సహకరించారు. ఒక మలయాళ చిత్రం హక్కులను కొనుగోలు చేశారు. ముత్యాల సుబ్బయ్య దర్శకునిగా పెళ్ళిగోల చిత్రం తీశారు. వారిద్దరూ కలిసి, మద్రాసు ట్రస్టు పురంలో ఉన్న మా ఇంటికి వచ్చారు. సుబ్బయ్యగారు సివి రెడ్డిని నాకు పరిచయం చేశారు. తొలిపరిచయంలోనే ఆయన స్నేహశీలి అనే విషయం అర్థమైంది. ఆ కలయికలో మేం పెళ్ళిగోల అనే సినిమాకు పనిచేశాం. ఆ సినిమాకు నేను సంభాషణల రచయితగా ఉన్నాను. సినిమా షూటింగ్ మొత్తం ఆయన వెంట నడిచాను. ఏనాడు మార్పు రాని ఆత్మీయత సివి రెడ్డి సొంతం. సినిమా నడుస్తున్నంత కాలమే కాకుండా పరిచయమైన దగ్గర్నుంచి, అందర్నీ సమానంగా, స్నేహంగా చూసే తత్త్వం ఆయనది. ఆరోజుల్లో రచయితల్ని నిర్మాతలు కృష్ణదేవరాయలు మాదిరి నెత్తినపెట్టుకుని చూసేవారు. ఆస్థానంలో కవుల మాదిరిగా ఆత్మీయంగా మెలిగేవారు. ఇది మమ్మల్ని రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేలా చేసేది. ఆయన ప్రవర్తనలో సక్సెస్ లేదా ఫెయిల్యూర్ ఎటువంటి మార్పునూ తెచ్చేది కాదు. పెళ్ళిగోల తరవాత సివి రెడ్డి తానే రాసుకున్న కథతో బదిలీ అనే ఫిల్మ్ చేశారు. మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు కూడా ఆయనే చేపట్టారు. ఆ కథ వింటున్నప్పుడే నేను ఆయనకు ప్రతిపాదించా..స్క్రీన్‌ప్లే కూడా ఆయనే రాయాలని. డైరెక్షన్ కూడా చేయాలని. ఆ సినిమాకి ఆయనకు నంది అవార్డు లభించింది. ఉత్తమ తొలిచిత్రం విభాగంలో ఆయనకు అవార్డొచ్చింది. అమ్మా! నాన్న కావాలి అనే చిత్రాన్ని సాయిప్రకాశ్ దర్శకత్వంలో సివి రెడ్డి నిర్మించారు. మాటలు నేను రాశా. అనంతరం స్వీయ దర్శకత్వంలో వసంత అనే చిత్రం చేశారు. విజయరామరాజు, ఆడుతూ పాడుతూ తీశారు. తరవాత సంజీవ దర్శకత్వంలో శ్వేతనాగు తీశారు. ఈ చిత్రానికి నేను సంభాషణలు రాశాను. సౌందర్య ఈ చిత్రంలో హీరోయిన్. ఆ సినిమా విజయవంతంగా ఆడింది. దీన్ని తమిళంలో మధుమతి పేరుతో విడుదల చేశారు. అనంతరం కథ, మాటలు, స్క్రీన్‌ప్లే డైరెక్షన్‌తో పగలే వెన్నెల అనే సినిమాను చేశారు సివి రెడ్డి. ఆ నవలను ఆయనే రాసుకున్నారు. కన్నడలో సిటిజన్ అనే చిత్రాన్ని నిర్మించారు. దీన్ని ఒక్కణ్ణే పేరుతో తెలుగులో పునర్నిర్మించారు. తదుపరి ఢీ అంటే ఢీ చిత్రం తీశారు. 1993నుంచి 2017 వరకూ మొత్తం 13చిత్రాలు నిర్మించారు. అమ్మా నాన్న కావాలి చిత్రానికి 1999లో ఏపీ ప్రభుత్వం ఉత్తమ సందేశాత్మక చిత్రం అవార్డును ఇచ్చింది. ఆయన 25 ఏళ్లుగా సినిమా ఇండస్ట్రీలో ఉన్నా.. 2002 నుంచి తెలుగు ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కీ, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌కీ రకరకాల స్థాయిల్లో సేవలందించారు. 2004, 2006లో రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థకు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 2011, 2012 సంవత్సరాలలో ఆయన రెండుసార్లు ఇండియన్ పనోరమ జ్యూరీ మెంబర్‌గా వ్యవహరించారు. 2012లో ఇండియన్ ఆస్కార్ జ్యూరీ మెంబర్‌గా కూడా పనిచేశారు. 2013, 2016లో రెండుసార్లు నేషనల్ అవార్డ్స్ కమిటీకి జ్యూరీ సభ్యునిగా నామినేటయ్యారు. 2016లో డల్లాస్‌లో జరిగిన నాటా సభలకు సివి రెడ్డి గెస్ట్ ఆఫ్ ఆనర్‌గా హాజరయ్యారు.



ఇండియన్ ఆస్కార్ జ్యూరీ చైర్మన్ పదవి ఆయన జీవితానికే వన్నె తెచ్చే పదవి. 2017లో ఆయన ఈ పదవికి ఎంపికయ్యారు. బెస్ట్ ఫారిన్ ఫిల్మ్‌గా న్యూటన్‌ను ఎంపిక చేశారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, ఇండియన్ ఆస్కార్ జ్యూరీ చైర్మన్ కావడం గొప్ప విషయం. అది ఆయనకు గొప్ప విజయం. సివి రెడ్డి మరిన్ని మంచి చిత్రాలకు నిర్మాతగా, దర్శకుడిగా పనిచేయాలని ఆకాంక్షిస్తున్నా. ఎన్నో అవార్డులు పొందాలని కోరుకుంటున్నా.

సివి రెడ్డిగారి గురించి ఒక నిజం చెప్పకుండా ముగిస్తే.. అన్యాయం చేసినట్లే అవుతుంది. ఆయన ఆతిథ్యం అపూర్వమైనది. నేనే కాదు ఆయన్ను కలిసిన ఎవరైనా దీన్ని అంగీకరించి తీరాలి. డైరెక్టర్లు వై నాగేశ్వరరావు, మురళీమోహన రావు, వైవిఎస్ చౌదరి, కె. విశ్వనాథ్ సహా ఆయన అద్భుతమైన అతిథేయి అని కితాబిచ్చారు. సభ్యత, సంస్కారం, ఆప్యాయత, ఆత్మీయత, స్నేహం సివిరెడ్డిలో ఆనాటికీ.. ఈనాటికీ చెక్కుచెదరకుండా ఉంది. సక్సెస్‌లతో సంబంధం లేకుండా స్నేహబంధాన్ని కొనసాగించే గొప్ప మనిషి సివి రెడ్డి. ఇలాంటి నిర్మాతలు ఇండస్ట్రీకి ఆదర్శం కావాలని కోరుకుంటున్నాను.

వివాదం రేపిన వీఆర్వో మృతి



● ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం

పిట్లం, ప్రభన్యూస్: కామారెడ్డి జిల్లా, కారేగాం గ్రామ శివారులోని కాకివాగు వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన వీఆర్ఏ మృతి ఘటన స్థానికంగా ఉద్రిక్తతకు దారి తీసింది. గురువారం ఉదయం ఇసుక ట్రాక్టర్ ఢీకొని వీఆర్ఏ మృతి చెందాడని ఆరోపిస్తూ గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అడ్డుపడిన మరికొందరిని చితకబాదారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు, యజమానిని అదుపులోకి తీసుకున్నారు. అయితే గ్రామస్తులు మాత్రం ఇసుక తరలింపును అడ్డుకున్నందుకే వీఆర్ఏను ట్రాక్టర్‌తో గుద్ది చంపారని వారిని కఠినంగా శిక్షించాలని పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. బాన్సువాడ సీఐ ఘటనా స్థలానికి వచ్చి ఆందోళనకారులను సముదాయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను విచారించి, ఘటనాస్థలాన్ని పరిశీలించిన అనంతరం సీఐ శ్రీనివాస్ రావు గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అది ఇసుక ట్రాక్టర్ కాదని, సదరు ట్రాక్టర్ యజమాని బంధువులకు ఇటుక తరలించి ఖాళీగా తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుందన్నారు. వీఆర్ఏ సాయిలు(40) తన భార్యతో బుధవారం రాత్రి గొడవపడి కూతురు ఉంటున్న గ్రామానికి కాలిబాటన బయలుదేరుతుండగా వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొన్నట్టు స్పష్టం చేశారు. ఈ విషయం తమకు విచారణలో తేటతెల్లమైందని, నిందితులపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

● రూ. 1.12 లక్షల నకిలీ నోట్ల స్వాధీనం



జనగామ క్రైం, ప్రభన్యూస్ : జనగామలో నకిలీ దొంగనోట్ల చలామణి ముఠాను పట్టుకుని వారినుంచి రూ.1.12 లక్షల నగదు దొంగనోట్లు, 2 కార్లు, సెల్‌ఫోన్లతోపాటు కలర్ ప్రింటర్, పేపరు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకొని ముఠా సభ్యులను గురువారం రిమాండ్‌కు పంపినట్లు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. సీఐ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బెజవాడ రాజేష్(30) తొర్రూరు నిరుద్యోగి, ఎండీ చాందిని (39) తొర్రూరు, ఎండీ షఫీ(19) తొర్రూరు ఆటోడ్రైవర్ ముఠాగా ఏర్పడి రెండు సంవత్సరాలుగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారు. జనగామలో భవాని బ్యాంగిల్ స్టోర్‌కు ఏపీ36హెచ్0405నెంబర్ గల కార్లోవచ్చి నకిలీ రూ.2వేల నోటుతో రూ.270 సామానులు కొనుగోలు చేసి మిగతా డబ్బును తీసుకువెళ్లారు. షాపు యజమాని దొంగనోటుగా గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించిన పోలీసులు బుధవారం మధ్యాహ్నం హన్మకొండలో పట్టుకున్నట్లు తెలిపారు. వీరు గతంలో హుజురాబాద్, నర్సంపేట, హుస్నాబాద్, జమ్మికుంట, సిద్దిపేట, పెద్దపల్లి, పరకాల తదితర ప్రాంతాలలో సుమారు రూ. 7 లక్షల వరకు నకిలీ నోట్లను చలామణి చేసినట్లు తెలిపారు.

మంచిర్యాలలో టాస్క్‌ఫోర్స్ దాడులు

మంచిర్యాల, ప్రభన్యూస్ : మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, మందమర్రిలలో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ముందుగా మందమర్రి పట్టణంలోని ఎస్సీ వాడ పాత కల్లుబట్టి సమీపంలో కోడిపందాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సీఐ హరిలాల్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పందెం కోళ్ళతో పాటు నాలుగు మోటర్ సైకిల్స్, మూడు సెల్‌ఫోన్లు, రూ. 5,500లను స్వాధీనం చేసుకొని మందమర్రి ఎస్సై భాస్కర్‌కు అప్పగించారు. అదే విధంగా మంచిర్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో అమ్మాలని తీసుకు వచ్చిన గంజాయిని పట్టుకున్నారు. రెండున్నర కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు రాజీవ్‌నగర్‌కు చెందిన అర్కె సంపత్ అనే వ్యక్తిని గంజాయి కేసులో పట్టుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయ్‌సారథి ఆధ్వర్యంలో ఈ దాడులను చేపట్టారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని, ఎవరైనా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా నిర్భయంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తెలియ జేయాలని ఏసీపీ విజయ్‌సారథి సూచించారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా బంగారం పట్టుబడుతూనే ఉంది. కస్టమ్స్ అధికారుల తనిఖీలో పెద్ద మొత్తంలో బంగారాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. విభిన్న పద్ధతులలో బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో కస్టమ్స్ అధికారులు అంతే తీవ్రతతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. గురువారం కస్టమ్స్ అధికారులు జెడ్డా నుంచి వచ్చిన ఓ మహిళ వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన 353 గ్రాముల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

నేడు క్రిస్టియన్స్ ప్రేయర్స్ డే

● ప్రభుత్వ అతిథిగా అనీ గ్రాహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: బంగారు తెలంగాణ, స్వచ్ఛ భారత్ నిర్మాణం కోసం రాష్ట్ర క్రైస్తవులు శుక్రవారం ప్రేయర్ డేగా ఆచరిస్తున్నారు. అన్ని క్రైస్తవ సంఘాలతో కలిసి ఏర్పాటు చేస్తున్న ప్రార్థనా దినోత్సవాన్ని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు చేపడతారు. రాష్ట్ర ఐటి, పురపాలకశాఖ మంత్రి కె తారకరామారావు ఈ ప్రార్థనా దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన ఆధ్యాత్మిక వేత్త అనీ గ్రహంలోజ్ ప్రభుత్వ అతిథిగా ప్రార్థనల్లో పాల్గొంటారు. అనీ గ్రహంను రాష్ట్ర ప్రభుత్వం తమ ప్రతినిధిగా ఆహ్వానించడం ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రార్థనల్లో దాదాపు 2 లక్షల మంది భక్తులు పాల్గొంటారని చెప్పారు. ఇది మత ప్రచార కార్యక్రమం కాదని, దేశం, రాష్ట్రం కోసం క్రైస్తవులు తమ ప్రార్థనల్లో భగవంతుడికి ప్రార్థిస్తారని, ప్రేయర్ డే చైర్మన్ రెవరెండ్ డేనియల్, చీఫ్ ప్యాట్రన్, ఎమ్మెల్సీ డి. రాజేశ్వరరావు చెప్పారు.

ప్రజావాణికి లీగల్ వాలంటీర్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో జరిగే ప్రజా వాణి కార్యక్రమంలో పేదలకు న్యాయ సేవలు అందించేందుకు లీగల్ వాలంటీర్లతో పాటు ఫిర్యాదు గుర్తించిన న్యాయవాది కూడా హాజరవుతున్నారని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాసంస్థ సభ్య కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ వి. రామసుబ్రమణియన్ ఆదేశాల మేరకు వాలంటీర్లు ఇప్పటికే ప్రజావాణి కార్యక్రమాల్లో పాల్గొని పేదలకు న్యాయ సహాయం అందిస్తున్నట్లు సభ్య కార్యదర్శి బీఆర్ మధుసూదన్ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంధుల ఆరాధ్య దైవం బ్రెయిలీ

● జయంతి సభలో వాసుదేవరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రపంచాన్ని చూడలేని కళ్లను వెలిగించిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ డాక్టర్ కె. వాసుదేవరెడ్డి అన్నారు. అంధత్వంతో సమాజానికి దూరంగా బతికే వారికి జీవించే పరిస్థితులను కల్పించిన మహనీయుడని చెప్పారు. గురువారం ఇక్కడ రాష్ట్ర వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ 209వ జయంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డితో పాటు రాష్ట్ర మహిళాభివృద్ధి, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి జి. జగదీశ్వర్, డైరెక్టర్ శైలజ, బ్రెయిలీ ఉత్సవ కమిటీ చైర్మన్ నర్సింగరావు, సభ్యులు శ్రీశైలం, దయానంద్, ముక్తాదర్, ఎల్ గోపాల్‌రావు, గద్వాల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీపాద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రెయిలీ ప్రెస్ ఎడిటర్ ది వెంకటేశ్వరరావు, అంధ కళాకారులు అమోష్ ప్రకాష్ (మ్యూజిక్), వి. భాస్కరరావు (ఫ్లూటిస్ట్), ఎన్‌సిసి ఆఫీసర్ కళ్యాణచక్రవర్తి, సుబేదార్ జి. పాండ్యా రాజన్ తదితరులను వాసుదేవరెడ్డి, జగదీశ్వర్ , శైలజ ఘనంగా సత్కరించారు.

'ప్రాక్టికల్స్' పేరుతో దోపిడీ దందా



● కార్పొరేట్ కాలేజీల్లో రూ. 5000 నుంచి రూ. 10,000 వరకు వసూలు

● యాజమాన్యాలకు కాసులు కురిపిస్తున్న ప్రయోగ పరీక్షలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రయోగ పరీక్షల పేరుతో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు విద్యార్ధుల నుంచి కోట్లు దండుకుంటున్నాయి. ప్రాక్టికల్స్ చేయించకుండానే విద్యార్ధులకు మార్కులు వేయించి పాస్ చేయించడం కోసం కోట్లు వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ కాలేజీలు కోట్లలో వసూలు చేస్తుండగా, చిన్న, చిన్న ప్రైవేటు కాలేజీలు లక్షల్లో వసూలు చేస్తున్నాయి. ప్రయోగ పరీక్షల కోసం విద్యార్ధుల నుంచి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు సుమారు రూ. 60 కోట్ల వరకు వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ చేయించకపోవడంతో వారిని ప్రాక్టికల్ పరీక్షల్లో పాసు చేయించడంతోపాటు ఎక్కువ మార్కులు వేయించడం కోసం విద్యార్ధుల నుంచి యాజమాన్యాలు కాలేజీ ఫీజుతోపాటు అదనంగా ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్ ఫీజును వసూలు చేస్తున్నాయి. వసూలు చేస్తున్న వాటిలో కొంత మొత్తాన్ని పరీక్షలను నిర్వహించే ఎగ్జామినర్‌కు ఇవ్వడంతోపాటు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి వరకు ముట్టజెబుతున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.

రాష్ట్రంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు 1500 వరకు ఉన్నాయి. ప్రయోగ పరీక్షల కోసం ప్రైవేటు కాలేజీలు విద్యార్ధుల నుంచి రూ. 500 నుంచి రూ. 1000 వరకు వసూలు చేస్తుండగా... కార్పొరేట్ కాలేజీలు రూ. 3000 నుంచి రూ. 5000 వరకు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కాలేజీలు విద్యార్ధులకు ప్రాక్టికల్స్‌లో 20 నుంచి 27 మార్కులు వేయిస్తున్నారు. అదే కార్పొరేట్ కాలేజీల్లో మాత్రం 25 నుంచి 30 మార్కుల వరకు వేయిస్తున్నారు. ఈ పేరుతో విద్యార్ధుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే ఎంపీసీ, బైపీసీ విద్యార్ధులకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ఎంపీసీ వారికి భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రంలో ప్రయోగ పరీక్షలు ఉంటాయి. బైపీసీ వారికి భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రంతోపాటు బాటనీ, జువాలజీ కూడా ఉంటాయి. ఒక్కో సబ్జెక్టుకు 30 మార్కుల చొప్పున ఉంటాయి. అంటే ఎంపీసీ వారికి 60 మార్కులు, బైపీసీ వారికి 120 మార్కులు ప్రాక్టికల్స్ రూపంలో ఉంటాయి. ఈ మార్కులు ఇంటర్ మార్కుల్లో కలుస్తాయి, అవి ఎంసెట్‌లో వెయిటేజీకి ఉపయోగపడటమే కాకుండా జేఈఈ పరీక్ష రాయాలనుకునే వారికి కటాఫ్ మార్కులకు కూడా ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో విద్యార్ధుల నుంచి కాలేజీ ఫీజు కాకుండా అదనంగా వసూలు చేస్తారు. ఇలా అదనంగా ప్రాక్టికల్స్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు కోట్లలో ఉంటున్నాయి.

రూ. 60 కోట్ల వరకు వసూలు

ఇంటర్ సెకండియర్ చదివే విద్యార్ధులు 4 లక్షల మంది ఉంటారు. వారిలో సైన్స్ గ్రూప్ అంటే ఎంపీసీ, బైపీసీ చదివే విద్యార్ధులు సుమారు 1.80 లక్షల మంది ఉండగా వారిలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చదివే వారు సుమారు 1.50 లక్షల మంది ఉంటున్నారు. విద్యార్ధుల నుంచి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు ప్రాక్టికల్స్ పేరుతో వసూలు చేసే మొత్తం సుమారు రూ. 60 కోట్ల వరకు ఉంటుంది.

20 రోజుల పాటు ప్రాక్టికల్ పరీక్షలు

ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించడానికి ఇంటర్ బోర్డు డిపార్ట్‌మెంటల్ అధికారితోపాటు సబ్జెక్టు బోధించే వ్యక్తిని ఎక్స్‌టర్నల్ ఎగ్జిమినర్‌గా నియమిస్తుంది. వీరిలో డిపార్ట్‌మెంటల్ అధికారి సబ్జెక్టుతో సంబంధం లేకుండా ఉంటాడు. అతను పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేసి ఎగ్జామినర్‌కు ఇస్తాడు. సంబంధిత సబ్జెక్టు ఎగ్జామినర్ పరీక్షను నిర్వహిస్తాడు. ఒక ఎగ్జిమినర్ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహిస్తాడు. ఒక్కో బ్యాచ్‌కు 20 మంది విద్యార్ధులుంటారు. ఒక ఎగ్జామినర్ మూడు రోజులపాటు కొనసాగుతాడు. అంటే రోజుకు 40 మంది చొప్పున 120 మందికి ఒక ఎగ్జామినర్ పరీక్షను నిర్వహిస్తాడు. ఒక కాలేజీలో ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్ధులు 120 మంది కంటే ఎక్కువగా ఉంటే మరో ఎగ్జిమినర్‌ను నియమిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు 4 సెషన్లలో 20 రోజులపాటు కొనసాగుతాయి. ఒక్కో సెషన్‌లో 5 రోజులపాటు పరీక్షలు కొనసాగుతాయి.

విద్యార్థులందరికీ పౌష్టికాహారం

● మాంసాహారం అందిస్తున్న ఘనత తెలంగాణ సర్కార్‌దే

● డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి

రంగారెడ్డి, ప్రభన్యూస్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా, నార్సింగిలో ఉన్న అక్షయపాత్ర సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనంతో పాటు మిల్లెట్స్ (రాగులు, సజ్జలు, జొన్నలు) అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న వారంతా పేదలే కావడంతో వారికి నాణ్యమైన భోజనం అందించేందుకు తెరాస ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. కేవలం మధ్యాహ్న భోజన పథకానికే ప్రభుత్వం రూ.557కోట్లు ఖర్చు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చే నిధులు ఏమూలకు సరిపోవడం లేదని మధ్యాహ్న భోజన పథకానికి కేంద్రం కేవలం రూ. 189కోట్లు మాత్రమే ఇస్తోందని గుర్తు చేశారు. కేంద్రం నిధులు పెంచితే విద్యార్థులకు మరింత పౌష్టికాహారాన్ని అందిస్తామని కడియం హామీ ఇచ్చారు.



విద్యార్థుల కోసం 'అక్షయపాత్ర' తయారుచేసిన వంటకాలను పరిశీలిస్తున్న మంత్రి కడియం

ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారని, అందులో భాగంగానే ఖర్చుకు వెనకాడకుండా ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కస్తూర్బా గురుకులాల్లో చదువుకుంటున్న బాలికలకు వారంలో రెండు రోజులు మటన్, మూడురోజులు చికెన్ అందిస్తున్నామని వివరించారు. అక్షయపాత్ర సంస్థతో త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి పౌష్టికాహాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా వారానికి మూడు రోజులు గుడ్లు అందిస్తున్నామన్నారు. తెలంగాణలో అక్షయపాత్ర ఆధ్వర్యంలో హైటెక్ వంటశాలలను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తదితరులు పరిశీలించారు. అత్యాధుని పద్ధతుల్లో వంటలు తయారుచేసే విధానాన్ని అక్షయపాత్ర అధ్యక్షుడు శ్రీమాన్ సత్యగౌరచంద్రదాస వివరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, అంతర్జాతీయ పంటల పరిశోధన (ఇక్రిసాట్)సంస్థ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డాక్టర్ డేవిడ్‌టేర్గ్ విన్‌సన్, జాతీయ పోషకాహారం సంస్థ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మయ్య, యూనిసెఫ్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రాములు హాజరయ్యారు.

40 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

● కమిషనరేట్‌ను ముట్టడించిన నిరుద్యోగ జేఏసీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్‌ను జారీ చేయాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా కేవలం 8792 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని, వెంటనే మిగిలిన పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ గురువారం పాఠశాల విద్య కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించింది. నిరుద్యోగుల ముట్టడి కార్యక్రమానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ, నందగోపాల్, భూపేష్ సాగర్, రామకృష్ణ అబ్దుల్, మురళి, ప్రత్యూష, లక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధిపై జీఎం సమీక్ష



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) పరిధిలోని తిరుపతి, నెల్లూరు రైల్వే స్టేషన్ల సమీకృతాభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన నిర్ణయాలపై దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సిఆర్) జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ గురువారం తిరుపతిలో సమావేశమయ్యారు. ముందుగా రైల్ ల్యాండ్ డవలప్‌మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డిఎ), నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బిసిసి), రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో పాటు తిరుపతి డివిజనల్ రైల్వే మేనేజర్ విజయ్ ప్రతాప్, గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆర్. ధనుంజయులుతో కలిసి భేటీ అయ్యారు. తిరుపతి, నెల్లూరు రైల్వే స్టేషన్ల సమగ్రాభివృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలేమిటన్న అంశంపై జిఎం అభిప్రాయాలను తెలుసుకున్నారు. తలెత్తనున్న ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రయాణికులకు కల్పించాల్సిన సౌకర్యాలు, పరిపాలనా భవనాల నిర్మాణం, ఫుట్ ఓవర్ బ్రిడ్జీ (ఎఫ్ఒబి) నిర్మాణం తదితర వాటి కోసం అధికారులు రూపొందించిన ప్రణాళికలను పరిశీలించి కొన్ని మార్పులు, చేర్పులను సూచించారు. అనంతరం తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ(తుడా) వైస్ చైర్మన్, తిరుపతి మునిసిపల్ కమిషనర్‌లతోనూ సమావేశమయ్యారు. తిరుపతి ట్రాఫిక్ అధికారులతో భేటీ అయిన వినోద్‌కుమార్ రైల్వే స్టేషన్‌కు అప్రోచ్‌రోడ్ల నిర్మాణంపై చర్చించారు. పూజితా రెసిడెన్సీ వద్ద కల్వర్టు నిర్మాణం, రాయల్‌చెరువు వద్ద రోడ్ అండర్ బ్రిడ్జి నిర్మాణం, రిజర్వేషన్ కౌంటర్‌ను గోవిందరాజు పుష్కరిణి వద్దకు తరలించాలని నిర్ణయించారు.

హైదరాబాద్‌లో భిక్షాటన నిషేధం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భాగ్యనగరంలో భిక్షాటనపై నిషేధం విధించారు పోలీసులు. ఈ నెల 7 నుంచి రెండు నెలల పాటు ఈ నిషేధం అమలులో ఉంటుందని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర వాహనదారులకు అసౌకర్యం కలిగిస్తున్నారని యాచకులపై నిసేధం విధిస్తున్నట్లు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు చెప్పారు. అటు డ్రోన్ కెమెరాల వినియోగాన్ని కూడా నెలపాటు నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలను పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో బిచ్చగాళ్ల సమాచారమిచ్చిన వారికి రూ.500 పారితోషికం అందజేస్తామన్నారు. బిచ్చగాళ్ల సమాచారాన్ని 040 24511791, 040 25627846 నంబర్లకు తెలియజేయాలన్నారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్న దృష్ట్యా యాచకులను ఇప్పటికే చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలోని ఆనందాశ్రమాలకు తరలించిన విషయం విదితమే.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నేర్చుకోండి

● ప్రవాసులకు ఐటీ నిపుణుల సూచన ● గ్రీన్ కార్డు పరిశీలనలో ఉన్నా... హెచ్‌బీ1 రాకుంటే కష్టాలే

● భారతీయ ఐటీ ఉద్యోగులకు ట్రంప్ నిర్ణయం శరాఘాతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్ని రకాల వీసాలను కట్టడి చేయాలని తీసుకుంటున్న నిర్ణయాలు భారతీయుల్లో ఆందోళన కలిగిస్తోంది. గత రెండేళ్ళుగా హెచ్1-బీ వీసాలపై ఆయన చేస్తున్న ప్రకటనలపై అమెరికాలోని ఐటి సంస్థల్లో చర్చ జరుగుతుండగా, ప్రవాస భారతీయ ఐటి నిపుణుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తోంది. అమెరికా ఉద్యోగాలు తమ వారికేనంటూ 2016లో జరిగిన ఎన్నికల్లో ఆ దేశ ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు ట్రంప్ అడుగులు వేస్తున్నారు. అమెరికా యూనివర్సిటీల్లో ఉన్నత విద్యకు వెళ్ళే వీసాలను యదేచ్ఛగా ఇస్తూ, ఆ తర్వాత హెచ్1-బి వీసాలు మంజూరు చేయడంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తున్నారు. అమెరికా విశ్వవిద్యాలయాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా విద్యార్థులకు పెద్దఎత్తున వీసాలు ఇస్తున్నారు. 2017లోనే లక్షా 86వేల మంది భారతీయ విద్యార్థులకు వీసాలు ఇచ్చిన అమెరికా ఉద్యోగాలు చేసుకునేందుకు ఇచ్చే హెచ్1-బీ వీసా మంజూరులో మాత్రం కఠినంగా వ్యవహరిస్తోంది. అమెరికాలో ఉద్యోగం చేసేవారికి కనీసం లక్షా 30వేల డాలర్ల వేతనం ఉండాలని, హెచ్1-బీ వీసా ఉన్న వారిపై ఆధారపడిన వారి కుటుంబ సభ్యులకు ఇస్తున్న హెచ్-4 వీసాలను కూడా కఠినతరం చేయాలని ఇటీవలె నిర్ణయించడంతో భారతీయులపై ప్రతికూల ప్రభావం చూపుతోందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

ఈ రెండు నిబంధనలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో గ్రీన్‌కార్డు వీసాపై మరో ప్రతిపాదనతో విదేశీయులను అమెరికా నుంచి తరిమివేసేందుకు ట్రంప్ కొత్త వివాదానికి తెరతీశారు. గ్రీన్‌కార్డు ప్రాసెస్‌లో ఉన్న వారు హెచ్1-బీ వీసా గడువు ముగిస్తే తమ దేశాన్ని వదిలిపెట్టాల్సి ఉంటుందని ట్రంప్ కొత్త నిబంధన ప్రతిపాదించారు. హెచ్1-బీ వీసాపై ఉద్యోగం చేస్తున్నవారు తాము పనిచేస్తున్న కంపెనీల ద్వారా గ్రీన్‌కార్డు ప్రాసెస్ చేయించుకుంటారు. ప్రస్తుత నిబంధనల మేరకు గ్రీన్ కార్డు ప్రాసెస్‌లో ఉన్న వారికి ఐ-140 కార్డు ఇస్తారు. గ్రీన్‌కార్డు వచ్చేంత వరకు ఈ కార్డుతో అమెరికాలో ఉద్యోగం చేసేందుకు అనుమతి వస్తుంది. ప్రస్తుతం హెచ్1-బీ వీసాపై అమెరికాలో 10 లక్షల మంది ఉండగా, అందులో భారత్‌కు చెందిన ఐటి నిపుణులు 5 లక్షల మందికిపైగా ఉంటారని అంచనా. భారత ఐటి కంపెనీలు హెచ్1-బీ వీసాలు సంపాదించి అమెరికాలో తమ కార్యకలాపాల కోసం ఇక్కడి నుంచి ఉద్యోగులను తరలిస్తున్నాయి. హెచ్1-బీ వీసా ఇవ్వాలంటే ట్రంప్ ప్రతిపాదించిన లక్షా 30వేల డాలర్ల నిబంధనలతో భారతీయ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లో 90శాతం మంది వెనక్కి రావలసి ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారతీయ ఐటి నిపుణులను గ్రీన్‌కార్డు సాకుతో వెనక్కు పంపితే అమెరికా ఐటి వ్యవస్థ కుప్పకూలుతుందని భారతీయ ఐటి నిపుణులు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా, హెచ్1-బీ వీసాలను కఠినతరం చేయాలన్న ప్రతిపాదన వచ్చినపుడే అమెరికాలోని ఐటి దిగ్గజాలు మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్ తదితర సంస్థలు వైట్‌హౌస్ అధికారులను కలిసి చర్చలు జరిపారు. ఈ నిబంధనలతో భారతీయ నిపుణులు వెళ్ళిపోతే ఐటి రంగంపై ప్రభావం పడుతుందని తమ ఆందోళన వ్యక్తం చేసినట్టు వార్తలు వచ్చాయి. అలాగే భారతీయ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం కూడా వైట్‌హౌస్ అధికారులను కలిసి ఈ విషయమై పరిస్థితులను వివరించిన విషయం తెలిసిందే. అయితే అమెరికా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడం గమనార్హం. ఇప్పుడు వస్తున్న కొత్త బిల్లుతో ఐటి రంగంలో అనిశ్చిత పరిస్థితి ఏర్పడుతుందని ఐటి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అమెరికా వారికే ఉద్యోగాలివ్వాలన్న ట్రంప్ నిర్ణయం అమల్లోకి వస్తే అక్కడి వారికి ఐటిలో నైపుణ్యం లేనందున ఆ సంస్థలు గడ్డు పరిస్థితిని ఎదుర్కోవలసి వస్తుందని చెబుతున్నారు. ఈ తరుణంలో ఐటి రంగంలో వస్తున్న హైటెక్ స్పెషాలిటీ టెక్నాలజీ అందిపుచ్చుకోవడంలో తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలని ప్రవాస యువతకు సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, క్లౌడ్ సీడింగ్ తదితర కొత్త టెక్నాలజీల్లో తమ పరిజ్ఞానాన్ని ఆధునీకరించుకుంటే భారతీయుల ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం ఉండదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



భార్యా పిల్లలతో ఆత్మహత్య



విశాఖ క్రైం, ప్రభన్యూస్: విశాఖలోని ఆరిలోవ ముస్తఫా కాలనీలో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకున్న హృదయ విషాదకర సంఘటన స్థానికంగా కలిచివేసింది. గురువారం మొదటగా ఇద్దరు పిల్లలకు విషాహారం ఇచ్చిన తల్లిదండ్రులు తరువాత వారు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల వివరాలు ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన దేవిరెడ్డి రాజేష్‌రెడ్డి (35), సౌమ్య (30) భార్యాభర్తలు. వీరికి విష్ణు (7), జాహ్నవి (5) కొడుకు, కుమార్తె ఉన్నారు. 8 నెలల క్రితం ఉపాధి కోసం విశాఖలోని ఆరిలోవ ముస్తఫా కాలనీలో ఒక ఇంటిలో అద్దెకు దిగారు. దేవిరెడి, రాజేష్ రెడ్డి ఎలక్ట్రికల్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల పనులు లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ అనారోగ్యానికి గురైయ్యాడు. తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. అయితే వీరు ఆత్మహత్య చేసుకునే ముందు రాజేష్ రెడ్డి భార్య సౌమ్య చెన్నైలో ఉన్న తమ తల్లిదండ్రులకు ఆత్మహత్య చేసుకుంటున్నట్టు ఫోన్ ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ సమాచారాన్ని చెన్నైలో అమ్మాయి తల్లిదండ్రులు విశాఖలో ఆరిలోవ పోలీసులకు తెలియజేశారు. ఆరిలోవ పోలీసులు అతి కష్టం మీద సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా భార్యా భర్తలు నివాసం ఉంటున్న ఇంటిని గురువారం రాత్రి 8.30కి తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంటి తలుపులు తెరిచి చూడగా అప్పటికే భార్యాభర్తలు, పిల్లలు విగతజీవులుగా కనబడ్డారు. భార్యభర్తలు ఇరువురు ఇంటి స్లాబ్ కొక్కనికి తాళ్లతో వేలాడుతూ చనిపోయి ఉన్నారు. పిల్లలు మంచంపై మరణించి ఉన్నారు. విశాఖ నార్త్ ఏసీపీ రామచంద్రరావు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆరిలోవ ఇంచార్జ్ సిఐ షణ్ముఖరావు సారధ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

'గజల్' కస్టడీ పిటిషన్ తిరస్కరణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆలయవాణి రేడియోలో జాకీగా పనిచేస్తున్న ఓ యువతిని వేధించిన కేసులో గాయకుడు, రచయిత గజల్ శ్రీనివాస్ ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నాడు. ఈ కేసు విచారణలో భాగంగా నిందితుడిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాలుగు రోజుల పాటు గజల్ శ్రీనివాస్‌ని విచారిస్తామని చెప్పారు. ఈ కేసులో దర్యాప్తు పురోగతి కోసం తమ కస్టడీలోకి తీసుకుంటామన్నారు. వాదనలు విన్న కోర్టు కస్టడీని తిరస్కరించింది. గజల్ బెయిల్ పిటిషన్‌ను కూడా కోర్టు కొట్టేసింది. ఈ పిటిషన్‌పై కోర్టు శుక్రవారం విచారణ జరపనుంది. గజల్ శ్రీనివాస్ తరపున న్యాయవాదులు బెయిల్ పిటిషన్ వేశారు.

Andhraprabha business 2017
బిజినెస్
BUSINESS

అమ్మ చెప్పింది..చేశా!

ఇన్ఫీ సీఈవో వేతనం
రూ.18.6 కోట్లు



బెంగళూరు : ఇన్ఫోసిస్ సీఈవో బాధ్యతలు చేపట్టిన సలీల్ పారిఖ్ వార్షిక వేతనం రూ.18.6 కోట్లు.. వాటిలో వివిధ రకాల భత్యాలు కలుపుకుని ఉంటాయి. ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త వేతనాలు అమల్లోకి వస్తాయి. మొదటి మూడు నెలల వరకు ఆయనకు ప్రతి నెల రూ.2.37 కోట్లు వేతనం చెల్లిస్తారు. దీంతో పాటు ఫిక్స్‌డ్ లేది స్థిర వేతనంతో పాటు ఇతర లబ్దిలు ఆయన వర్తిస్తాయి. జనవరి 2వ తేదీన ఆయన బాధ్యతలు స్వీకరించారు. సీఈవో కొత్త వేతనాలపై ఇన్ఫోసిస్ వాటాదారుల అభిప్రాయాన్ని పోస్టల్ బ్యాలెట్ ద్వారా చేపడుతుంది. ఈ బ్యాలెట్ జనవరి 22 నుంచి ఫిబ్రవరి 20 వరకు కొనసాగుతుంది. ఈ బ్యాలెట్‌లోనే యూబీ ప్రవీణ్‌రావును తిరిగి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, హోల్‌టైం డైరెక్టర్‌గా నియమించడానికి అనుమతులు తీసుకుంటుంది. కాగా దీని ఫలితాలు ఫిబ్రవరి 24న వెల్లడిస్తారు. కంపెనీ ప్రతిపాదనల ప్రకారం పారిఖ్ వార్షిక వేతనం(ఫిక్స్‌డ్) రూ.6.5 కోట్లు దీంతో పాటు రూ.9.75 కోట్ల వార్షిక వెరియబుల్ ఫేలో 125 శాతం ఇది రూ.12.18 కోట్లుగా ఉంటుంది. దీంతో ఆయన వేతనం మొత్తం రూ.12.8 కోట్లుగా తెలుతుంది. దీంతో పాటు ఆయనకు రూ.3.25 కోట్ల షేర్లు ఇవ్వడం జరుగుతుంది. రూ.13 కోట్ల వరకు ఆయనకు పెర్ఫార్మెన్స్ ఈక్విటీ గ్రాంట్స్‌రూ.13 కోట్లు. వన్‌టైం ఈక్విటి గ్రాంట్ రూ.9.75 కోట్ల వరకు ఉంటాయి. గత ఏడాది ఆగస్టులో సీఈవో బాధ్యతల నుంచి తప్పుకున్న విశాల్‌సిక్కా 2016-17 ఆర్థిక సంవత్సరానికి అన్నీ కలిపి రూ.45.11 కోట్లు వేతనంలో రూపంలో తీసుకున్నారు. విప్రో సీఈవో అబిదలీ నీమూచ్‌వాలా వార్షిక వేతనం 2016-17లో 2.09 మిలియన్ డాలర్లు రూ.13.2 కోట్లు. కాగా టీసీఎస్ సీఈవో రాజేశ్ గోపీనాథన్ వేతనం రూ.6.22 కోట్లు. కాగా ఫారిక్ అనుకున్న వ్యాపార లక్ష్యాన్ని సాధించడంలో విఫలం అయితే ఆయన వార్షిక వేతనంతో పాటు ఆయనకు కంపెనీ ఇచ్చే ఇతర లబ్దిలు బోనస్, స్టాక్‌ఆప్షన్స్ అన్నీ తగ్గిపోతాయి.

గాడినపడ్డ సేవలరంగం పీఎంఐ



న్యూఢిల్లీ : గత నెల (డిసెంబర్)లో సేవలరంగం గాడినపడింది. మొత్తానికి చూస్తే సరాసరికంటే కాస్తా తక్కువగానే నమోదైందని పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గణాంకాలు సూచిస్తున్నాయి. డిసెంబర్‌లో సేవల రంగం సూచి 50.9 పాయింట్లుకు ఎగ బాకగా.. నవంబర్‌లో 48.5 పాయింట్ల వద్ద ముగిసింది. ఇదిలా ఉండగా.. పీఎంఐ 50 పాయింట్లను దాటితే ఫర్వా లేదని.. అంతకంటే కిందికి దిగితేమాత్రం మందగమనంలో కొనసాగుతోందని గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్‌లో సేవల రంగం స్వల్పంగా కోలుకుందని.. జీఎస్టి ప్రభావం ఇప్పటి వరకు కొనసాగిందని ఐహెచ్ఎస్ మార్కిట్ ఆర్థికవేత్త ఆష్నా దోదియా నివేదికలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తయారీరంగం మాత్రం డిసెంబర్‌లో జోరందుకుంది. నవంబర్ 50.3 పాయింట్లనుంచి డిసెంబర్ నాటికి 53.0 పాయింట్లకు ఎగబాకింది. అక్టోబర్ 2016 తర్వాత ఈ స్థాయిలో పుంజుకోవడం ఇదే మొదటిసారి. ఈ రెండు రంగాల్లో ఉద్యోగాల సృష్టి క్రమంగా పుంజుకుంటోందని తెలిపింది. ధరల విషయానికి వస్తే జీఎస్టి ఒత్తిడితో ధరలు పెంచాల్సి వచ్చిందని తయారీరంగానికి చెందిన వారు చెబుతున్నారు.

- జీయోకు ఆర్‌కామ్ ఆస్తుల బదలీ
- రూ.23 వేల కోట్లకు ఒప్పందం
- బ్యాంకర్లకు అణా, పైసాలతో చెల్లిస్తా:అనిల్ అంబానీ



హైదరాబాద్ : రిలయన్స్ కమ్యూనికేషన్స్ చైర్మన్ అనిల్ అంబానీ పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయి బయటపడ్డానికి ఆర్‌కామ్‌ను గత వారం అన్న ముఖేష్ అంబానీకి విక్రయించారు. ఆర్‌కామ్‌కు చెందిన వైర్‌లెస్ స్పెక్ట్రమ్, టవర్, ఫైబర్‌తో పాటు ఇతర ఆస్తులను రిలయన్స్ ఇన్ఫోకామ్‌కు విక్రయిస్తూ ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. అయితే ఇలాంటి కఠినమైన నిర్ణయం తీసుకోవడానికి దారి తీసిన పరిస్థితుల గురించి అనిల్ అంబానీ ఒక జాతీయ ఆంగ్ల దినపత్రికకు వివరించారు.

తన తల్లి కోకిలాబెన్ అంబానీ తనతో నీకు రుణం ఇచ్చిన ఏ ఒక్కరు రూపాయి కూడా నష్టపోరాదని గట్టిగా చెప్పడంతో, భారీ నష్టాల్లో కూరకుపోయిన వైర్‌లెస్ టెలికం వ్యాపారం నుంచి తప్పుకోవాని నిర్ణయించుకున్నానని చెప్పుకొచ్చారు. తల్లి ఆశీర్వాదం ఉంటే చాలు.. దానికంటే మనకు కావాల్సింది ఏముంటుందని అనిల్ అన్నట్లు పత్రిక వెల్లడించింది. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే ఆర్‌కామ్ తన అన్న ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ జియోకు వైర్‌లెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆస్తులను రిలయన్స్ వ్యవస్థాపకుడు.. వారి తండ్రి ధీరూభాయి అంబానీ జయంతి రోజు డిసెంబర్ 28న రూ.23,000కు విక్రయిస్తున్నట్లు ఒప్పందం కుదుర్చుకున్నారు. తాజాగా బ్యాంకర్ల సమావేశంలో అనిల్ మాట్లాడుతూ.. చట్ట ప్రకారం కంటే నైతికంగా మీకు నేను డబ్బు చెల్లించాల్సి ఉందన్నారు. ఇదిలా ఉండగా ఈ బకాయిల నుంచి తప్పించుకోవడానికి ఆర్‌కామ్ కనీసం మూడు వ్యూహాత్మక రుణ పునర్వ్యవస్థీకరణ ప్లాన్‌లు (ఎస్‌డీఆర్)ను గతేడాది జూన్‌లో ప్రకటించింది. వాటిలో ఒకటి ఎయిర్‌సెల్, బ్రూక్‌ఫీల్డ్‌లను రెంటిని విలీనం చేసుకోవాలనుకున్నారు. వాటి విలువ రూ.14,000కోట్లు, రూ.11,000 కోట్లు.. మొత్తం రూ.25వేల కోట్లకు చేరుతుంది. అయితే ఎయిర్‌సెల్ విషయానికి వస్తే చట్టపరమైన సమస్యలతో పాటు నియంత్రణా సంస్థల నుంచి అభ్యంతరాలను ఎదుర్కొంటోంది. బ్రూక్‌ఫీల్డ్ ధర ఎక్కువగా ఉండటంతో ఒకనెలలోనే ఈ రెండు ప్రయత్నాలు విఫలం అయ్యాయి.

నేను మారథన్ రన్నర్‌ను.. ఎప్పుడు ఫిట్‌గా ఉంటాను. ఈ సంక్షోభాలు తనను ఏమీ చేయలేవని.. తనకు ఇప్పుడు 58 ఏళ్లు.. వారెన్‌బఫెట్, రూపర్ట్‌మర్డోక్ లాంటి వారు కూడా తనలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారంతా 60 ఏళ్ల తర్వాతనే సంపదను ఆర్జించారని అని చెప్పారు.

జియో రాకతో కష్టాలు మొదలు : జియో రావడానికి రెండేళ్ల ముందునుంచే సమాయత్తమయ్యామని.. తమ ముందు రెండు ఆప్షన్స్ వచ్చాయన్నారు. ఒకటి ఆర్‌కామ్‌ను విక్రయించడమో లేదా.. వేరే ఏదైనా కంపెనీని కొనుగోలు చేయడమో చేస్తేనే మార్కెట్లో స్థిరపడగలమని భావించి ఆ దిశగా ప్రయత్నాలు కూడా మొదలుపెట్టామన్నారు. ఎస్ఎస్‌టిఎల్ (సిస్టెమా శ్యామ్ టెలీసర్వీసెస్) ఎయిర్‌సెల్; బ్రూక్‌ఫీల్డ్‌లతో ఒప్పందం గురించి ప్రకటించామన్నారు. జియోతో స్పెక్ట్రమ్ షేరింగ్ గురించి ప్రయత్నించామన్నారు. టెలికం రంగంలో పోటీ ఎక్కువగా ఉందని 10-12 కంపెనీలు ఒక దానితో ఒకటి పోటీ పడుతున్నాయి. భవిష్యత్తులో ఐదుకు మించి మార్కెట్లో నిలబడలేమని భావించామన్నారు. 120 కోట్ల మంది కల అతి పెద్ద మార్కెట్ కదా చాలా మందికి అవకాశాలుంటాయని భావించామని, ఇదే సమయంలో జియో సునామీలో వచ్చిపడిందని.. దీంతో టెలికంరంగం మొత్తం కుప్ప కూలిపోయింది. దీంతో రిజర్వుబ్యాంకు ఒక హెచ్చరిక నోట్‌ను జారీ చేసింది. దేశంలోకి టెలికం రంగానికి రుణాలివ్వమని స్పష్టం చేసింది. భారత్ టెలికం రంగానికి భారతీయ బ్యాంకులే రుణాలు ఇవ్వలేదంటే విదేశీ బ్యాంకులు ఎలా రుణాలు ఇస్తాయని అనిల్ ప్రశ్నించారు.

గత రెండు నెలల నుంచి ఇన్సాల్వెన్సీ నుంచి తప్పించుకోవడానికి గట్టి ప్రయత్నాలే చేసింది. చైనాబ్యాంకు రూ.9,000 కోట్ల బకాయికి ఇన్సాల్వెన్సీ కోర్టుకు లాగింది. అప్పటికే కంపెనీ తీవ్ర సంక్షోభంలో ఉంది. సెప్టెంబర్‌లో ఎరిక్‌సన్ తమకు రావాల్సిన బకాయిల కోసం ఇన్సల్వెన్సీ బ్యాంక్‌రప్టసీ (ఐబీసీ) కింది ఎన్‌సీఎల్‌టిని ఆశ్రయించింది. దీంతో ఆర్‌కామ్ 2జీ, డీటిహెచ్ సర్వీసులను మూసివేసింది. దీంతో స్టాక్ మార్కెట్లో ఆర్‌కామ్ షేరు పాతాళానికి పడిపోయింది. అంతర్జాతీయంగా తన కంపెనీ డిఫాల్ట్ అయ్యిందని ప్రముఖంగా వార్తా పత్రికల్లో వార్తలువచ్చాయి. బాండ్లపై చెల్లించాల్సిన వడ్డీ కూడా చెల్లించడంలో డిఫాల్ట్ అయ్యాయని ప్రముఖంగా వార్తలువచ్చాయన్నారు.

సినిమా ఇంకా బాకీ ఉంది గురూ!

ఆర్‌కామ్ సెటెల్మెంట్‌పై కుటుంబలో ఎలాంటి అసంతృప్తి కలిగిందా అన్న ప్రశ్నకు ..ఈసెటిల్మెంట్ తన తల్లి చెప్పినట్లు నడుచుకున్నానని చెప్పారు. ఒక వేళ తన తల్లి కట్టుబట్టలతో ఇచ్చేసి వెళ్లిపోమ్మనా.. తాను తల్లికి పాదాభివందనం చేసి వెళ్లిపోయేవాడినని అన్నారు. ఇక్కడ గుర్తించుకోవాల్సింది. తన తండ్రి ధీరూబాయి పెట్రోల్ పంపులో రూ.500ల ఉద్యోగం నుంచి ఈ స్థాయికి ఎదిగారన్నారు. తన ఫిట్‌నెస్ తన బలమన్నారు. బాలీవుడ్‌లో సరదాగా చెప్పే డైలాగ్ తన ప్రయాణం గురించి ప్రస్తావిస్తూ.. ఫిక్చర్ అబీ బాకీ హై దోస్త్ అన్నారు.

ఆర్‌కామ్ బాకాయిదార్లతో సెటిల్మెంట్ తర్వాత మీడియాతో మాట్లాడుతున్నప్పుడు అనిల్ మిత్రుడినుంచి ఫోన్ కాల్ వచ్చింది. స్నేహితుడు సరదాగా అనిల్ ... సల్మాన్‌ఖాన్ నుంచి రాయల్టీ అడుగు .. ఎందుకంటే టైగర్ అబీ జిందా హై కదా అన్ని సరదాగా వ్యాఖ్యానించారు.

నేను సామాన్యుడిని..

తాను పెద్ద ధనవంతుడిని కాదు.. అదే సమయంలో పేరు ప్రఖ్యాతలున్న వ్యక్తిని కాను.. నేను సామాన్యుడిని అని అనిల్ అన్నారు. బిలియనీర్ అయినా సామాన్యుడు అయినా.. పుట్టినప్పుడు ఒట్టి చేతులతో వచ్చాం.. వెళ్లేటప్పుడు కూడా ఒట్టి చేతులతో వెళ్లాల్సిందే కదా అన్నారు. తన తండ్రి ధీరూభాయితో తనతో ఎల్లప్పుడూ అనేవారు.. డబ్బు అనేది తమాషాఅయిన కమాడిటీ అని.. చేతిలో డబ్బు ఉంటే మరింత డబ్బు సమకూరుతుంది.. డబ్బు లేదంటే వారి జోలికే రాదనేవారన్నారు.

ఇలాంటి సంక్షోభ సమయంలో తాను తన తండ్రి ధీరూభాయి అంబానీ వద్దకు వెళ్లి తన కథ వినిపించి ఉంటే.. ఒక్కసారి తనవైపు చూసి.. ఎందుకు ఆందోళన చెందుతున్నావు.. దీన్నే ఉక్కును సానబట్టాలని అంటారని.. ఉక్కురాడ్‌ను నిప్పుల్లో వేస్తాం.. తీస్తాం... మళ్లీ వేస్తాం.. ఇలా పలుమార్లు చేస్తేనే అది మరింత పటిష్టంగా బలంగా మారుతుందని అంటారన్నారు. ఇలాంటి పరిస్థితులు వచ్చినప్పుడే కదా నీవు మరింత బలపడేదని అనే వారన్నారు.




ఏటీఎంలో రూ.200 నోట్లు
బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం



ముంబై : రూ.200 కరెన్సీనోటు ప్రజలకు అందుబాటులో ఉంచడానికి బ్యాంకులు ఎటీఎంలను రూ.200 నోటు విడుదల చేయడానికి సాంకేతికంగా మార్పులు చేయాలని ఆర్‌బీఐ బ్యాంకు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆర్‌బీఐ ఆదేశాలను బ్యాంకులు పాటించాలంటే ఎటీఎంలపై సుమారు రూ.110 కోట్ల వరకు వ్యయం చేయాల్సి వస్తుందని బ్యాంకింగ్ రంగానికి చెందిన నిపుణులు చెబుతున్నారు. అయితే ఆర్‌బీఐ ఇప్పటికే ఎటీఎం తయారీ కంపెనీలకు వీలైనంత త్వరగా ఎటీఎంల నుంచి రూ.200 నోట్ల విత్‌డ్రా చేసుకోవడానికి సాంకేతికపరమైన మార్పులను చేయాలని కోరింది. అయితే ఎటీఎంల నుంచి రూ.200 విత్‌డ్రా చేసుకోవడానికి కనీసం 5-6 ఆరు నెలల సమయంపడుతుందని చెబుతున్నారు. కాగా ఆర్‌బీఐ అధికార ప్రతినిధి దీనిపై స్పందించడానికి నిరాకరించారు. కేంద్రంలోనే నరేంద్రమోడీ ప్రభుత్వం నవంబర్ 8, 2016న పెద్దనోట్లను రద్దు చేసిన తర్వాత రూ.500, 2000 నోట్లను విడుదల చేసింది. అయితే రూ.2,000 నోటుకు చిల్లర లభించక ప్రజలు ఇబ్బందులు పడ్డంతో పాటు ప్రభుత్వంపై పెద్దెత్తున విమర్శలు గుప్పించారు. కాగా ఎటీఎం పరిశ్రమకు చెందిన నిపుణుడు లోనీ అంటోని మాట్లాడుతూ ఎటీఎం రీకాలిబ్రేషన్ పనులు ఇప్పుడే మొదలయ్యాయని చెప్పారు.

జెఎల్‌ఆర్ అమ్మకాలు 3594 యూనిట్లు



ముంబై : టాటా గ్రూపు నకు చెందిన జాగ్వార్ అండ్ ల్యాండ్‌రోవర్ ఇండియా 2017లో మొత్తం 3,594 యూనిట్లు విక్రయించింది. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 48 శాతం అమ్మకాలు పెరిగాయి. గతేడాది కొత్త మోడల్స్‌ను మార్కెట్లో విడుదల చేయడంతో పాటు ధరలు కూడా అందుబాటులో ఉండటంతో అమ్మకాలు పుంజుకున్నాయి. లగ్జరీ కార్ల మార్కెట్లో ప్రస్తుతం దేశంలో టాప్ మూడు స్థానాలు జర్మనీకిచెందిన మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యు, ఆడి ఆక్రమించాయి. జెఎల్‌ఆర్ నాలుగవ స్థానాన్ని ఆక్రమించింది. జాగ్వార్‌కు చెందిన అన్నీ మోడల్స్‌కు మార్కెట్లో మంచి స్పందన లభించిందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. దీనికి వ్యతిరేకంగా ఆడి అమ్మకాల్లో కేవలం రెండు శాతం మాత్రమే పెంచుకుంది. మొత్తం 7876 యూనిట్లు విక్రయించింది. కాగా మెర్సిడెజ్ బెంజ్‌తో పాటు బీఎండబ్ల్యు ఇంకా గతేడాది అమ్మకాల గణాంకాలను వెల్లడించలేదు.

మొబైల్ యాప్ ద్వారా ఆర్థిక సాయం
ఫింటెక్ స్టార్టప్ ఎర్లీసాలరీ సీఈవో అక్షయ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉద్యోగాలు చేసే యువకులకు నెల చివరిలో అవసరాలకు ఆర్థిక సాయం అందించేందుకు ఫింటెక్ స్టార్టప్ ఎర్లీసాలరీ సరికొత్త పథకాన్ని ఆవిష్కరించింది. ఆర్థిక అవసరాలను తీర్చేందుకు మొబైల్ యాప్ ద్వారా రుణ సౌకర్యం కల్పించేందుకు ఈ సంస్థ ముందుకు వచ్చింది. ఇన్వెస్టర్ల నుంచి సిరిస్-బి ఫండింగ్ కింద ఎయిట్ రోడ్స్ వెంచర్స్ రూ.100 కోట్ల ఆర్థిక సాయం అందించింది. ఈ ఏడాది చివరి నాటికి నెలకు లక్ష మందికి రుణాలు అందించాలన్న లక్ష్యంతో ఈ నిధులను వినియోగిస్తామని ఎర్లీసాలరీ సీఈవో అక్షయ్ మెహ్రోత్రా చెప్పారు. స్నేహితులు, కుటుంబ సభ్యులు, యాజమాన్యాల నుంచి రుణం తీసుకునే బదులుగా మొబైల్ యాప్ ద్వారా రియల్ టైమ్‌లో తమ ఇంటినుంచే తమ బ్యాంకు ఖాతాలకు తక్షణమే నగదు జమచేసే విధంగా సదుపాయం కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. క్రెడిట్ బ్యూరో రేటింగ్ లేకుండానే వేగవంతంగా రుణాల ఆమోదం కోసం, రిస్క్ అసెస్‌మెంట్‌కు సోషల్ మీడియాను, మెషిన్ లెర్నింగ్ స్కోర్ కార్డ్స్‌ను ఉపయోగించి స్వల్పకాలిక రుణాలు పొందే అవకాశాలు కల్పిస్తున్నట్లు అక్షయ్ తెలిపారు.

బడ్జెట్ 2018-19
జైట్లీకి ఆమ్‌ఆద్మీ కోరికల చిట్టా



సంప్రదాయబద్దంగా పార్లమెంటుకు సమర్పించే బడ్జెట్ కాస్తా ముందుకు జరిపి ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతున్నారు. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టనున్నారు. ఈసారి బడ్జెట్ మాత్రం ప్రజాకర్షక బడ్జెట్‌గా ఉంటుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. 2019లో సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్నాయి కాబట్టి వా టిని దృష్టిలో ఉంచుకొని ప్రజాకర్షక బడ్జెట్‌కే ఆయన పెద్దపీట వేస్తారు. మీడియాలో వస్తున్న వార్తలను బట్టి ప్రభుత్వం గ్రామీ ణ ప్రజలను దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌ను రూపుదిద్దుతారని చెబుతున్నారు.

రైతులకు ఆర్థిక భద్రత : వ్యవసాయరంగానికి చెందిన నిపుణలు రైతుల కోసం ఆదాయ భద్రత చట్టాన్ని తీసుకురావాలని, అలాగే కౌలు రైతులకు, రైతు కూలీలకు కోసం కొన్ని సంస్కరణలు తేవాలని సూచిస్తున్నారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ నెలకు రూ.1,600 ఆదాయం వచ్చేలా కృషి చేయాలని... బతకడానికి ఇది చాలా చాలా తక్కువని.. అయినా దేశంలోని రైతులు మాత్రం ఆదాయపుభద్రత చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు కౌలురైతులకు, రైతు కూలీలకు ప్రయోజనాలను కల్పించాలని భారతీయ రైతుల సంఘం కన్సార్షియం (సీఐఎఫ్ఏ) సెక్రెటరీ జనరల్ బి దశరథరెడ్డి డిమాండ్ చేస్తున్నారు.

మహిళల సాధికారికత కోసం : రాబోయే కేంద్రబడ్జెట్‌లో ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేయబోతోంది. పట్టణ ప్రాంతాల్లో కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా మహిళలకు ఉపాధి అవకాశాల పెంచడానికి ప్రయత్నిస్తుంది. కేంద్రంలోని మోడీ సర్కార్ మహిళా సాధికారికత కోసం గత బడ్జెట్లలోని పలు పథకాలను తీసుకొచ్చింది. అయితే ఇవి చాలావు.. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కొన్ని పథకాలు తీసుకురావాల్సి ఉంది. మహిళల సాధికారికత కోసం ప్రభుత్వం ఇటీవలే మైనారిటీల కోసం ట్రిపుల్ తలాక్‌ను లోకసభలో ఆమోదింపజేసింది. దీంతో పాటు ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం మోడీ ప్రభుత్వం మహిళలు రుతుస్రావం సమయంలో రెండు రోజుల వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలనే నిబంధనలు తీసుకొచ్చింది. ఇటీవల ప్రపంచబ్యాంకు విడుదల చేసిన నివేదిక ప్రకారం గత 20 ఏళ్ల నుంచి మహిళాకార్మికులు భారత్‌లో రోజు రోజుకు తగ్గుముఖం పడుతున్నారని.. జాతీయ శాంపిల్ ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఒ)గణాంకాలు తెలియజేస్తున్నాయని స్పష్టంచేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద 2016-17లో పెద్ద మొత్తంలో మహిళలు పెద్దమొత్తంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కింద మొత్తం 5.04 కోట్ల గృహస్తులకు ఉపాధి కల్పించారు. మొత్తం 138.64 లక్షల పనులు జరగ్గా వాటిలో 56 శాతం మహిళలు పాల్గొన్నారని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్రభుత్వం మహిళల కోసం ఇప్పటి వరకు పలు పథకాలను తీసుకొచ్చింది. వాటిలో మహిళలకు సమాన హక్కులు, న్యాయ సహాయం, ఉపాధి అవకాశాలున్నాయి.

పన్నులు తగ్గించండి అసోచామ్ : వచ్చే బడ్జెట్‌లో కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగానికి చెందిన ప్రత్యేకంగా విడిభాగాలపై వాస్తవ వ్యయంపై 150-200 శాతం వరకు పన్ను మినహాయింపు ఇవ్వాలని పరిశ్రమల రంగానికి చెందిన అసోచామ్ బుధవారం నాడు ప్రభుత్వాన్ని కోరింది. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ రంగంలో ముఖ్యంగా బ్యాంకు రుణాలపై వడ్డీ, ఇంధనం, లాజిస్టిక్స్ / రవాణాపై ఎక్కువ వ్యయం అవుతోంది కాబట్టి పన్ను మినహాయింపులు ఇవ్వాలని కోరుతోంది. ఎలక్ట్రానిక్స్‌రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు మందగిస్తున్నాయి కాబట్టి వెంచర్ క్యాపిటల్ ఫూల్‌ను ప్రవేశపెట్టాలని.. బ్యాంకుల సహకారంతో స్పెషల్ పర్పస్ వెహికిల్‌ను ఏర్పాటు చేసి పబ్లిక్ - ప్రైవేట్ భాగస్వామ్యంలో పెట్టుబడులను ఆహ్వానించాలని అసోచామ్ ప్రకటనలో పేర్కొంది. సెక్షన్ 80సీ కింది పెట్టుబడుల పరిమితి రూ.2 లక్షలకు పెంచండి : 80సీ కింది ప్రస్తుతం ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్, ఇన్స్యూరెన్స్‌తో పాటు ఇతర పోస్టాఫీసు పొదుపు పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడులకు అనుమతిస్తున్నారు.

దీన్ని రూ.2లక్షల వరకు పెంచాలని ఆర్థికమంత్రిని ప్రజలుకోరుతున్నారు. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నిబంధనలు కొనసాగుతున్నాయి. సెక్షన్ 80సీ కింద గృహరుణాలపై, ట్యూషన్ ఫీజు, ప్రిన్సిపల్ (అసలు) చెల్లింపుపై కొన్ని రాయితీలు ఇస్తున్నాయి. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుఉంటే ప్రజలు తమ వద్ద ఉన్న డబ్బును బంగారంతో పాటు ఇతర ఆస్తుల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిచూపరని వారు చెబుతున్నారు.



ఈ ఏడాది మార్కెట్‌కు
మొదటి బోణీ
సెన్సెక్స్ 176 పాయింట్ల వృద్ధి

ముంబై: స్టాక్ మార్కెట్లు ఈ ఏడాదికి మొదటిసారి లాభాలతో గట్టెక్కాయి. ఈ ఏడాది ప్రారంభమైన మూడు రోజుల వరకు స్టాక్ మార్కెట్లు నష్టాలను చవిచూశాయి. కాగా ప్రభుత్వం బ్యాంకులకు మూలధనం సమకూర్చడానికి సమయాత్తం అవడంతో సెన్సెక్స్ 33,970 వద్ద ముగిసింది. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్లు కూడా నిలకడగా ట్రేడ్ కావడంతో దేశీయ మార్కెట్లకు బాగా కలిసొచ్చిందని బ్రోకర్లు చెప్పారు. బ్యాంకులకు రూ.80వేల కోట్ల మూలధనం సమకూర్చడానికి ఆర్థికమంత్రిత్వశాఖ గురువారం పార్లమెంటు అనుమతి కోరింది. తాజా పరిణామాలతో ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకు షేర్లు ఎస్‌బీఐ 1.72 శాతం, యూకో బ్యాంకు, ఐడీబీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా, ఒరియంటల్ బ్యాంకు ఆఫ్ కామర్స్‌తో పాటు ఇతరబ్యాంకు షేర్లలో రూ.8.50 శాతం వరకు ర్యాలీ ఏర్పడింది. దీంతో పాటు డిసెంబర్ నెల సేవల రంగం పుంజుకోవడంతో సెంటిమెంట్ మరింత బలపడింది. బీఎస్ఈ సూచి గురువారం నాడు 33,912.49 వద్ద మొదలై అటు తర్వాత 33,995.40 నుంచి 33,802 మధ్య ఊగిసలాడి 33,969.64 వద్ద ముగిసింది. మొత్తానికి బీఎస్ఈ 176.26 పాయింట్లు లాభపడింది. గత మూడు ట్రేడింగ్ సెషన్‌లలో సెన్సెక్స్ 263.45 పాయింట్లు నష్టపోయింది. ఎన్ఎస్ఈ కూడా 61.60 పాయింట్ల వరకు లాభపడి 10,504.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,513 నుంచి 10,441.45 మధ్య ఊగిసలాడింది. ఇదిలా ఉండగా బుధవారంనాడు విదేశీ ఇన్వెస్టర్లు రూ.96.31 కోట్లు షేర్లు కొనుగోలు చేస్తే, దేశీయ ఇన్వెస్టర్లురూ.269.20 కోట్ల షేర్లు విక్రయించారు. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్ల విషయానికి వస్తే టాటాస్టీల్ 3.74శాతం లాభపడగా.. డాక్టర్ రెడ్డీస్ 3.14 శాతం వీటితో పాటు ఎల్అండ్‌టి, ఒఎన్‌జీసీ, ఏషియన్‌పెయింట్స్, సన్‌ఫార్మా, కోల్ ఇండియా, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, బజాజ్ ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బ్యాంకు, అదానీపోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు 3.08 శాతం వరకు లాభపడ్డాయి. లోహ సూచి 2.77శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 2.53 శాతం, క్యాపిటల్‌గూడ్స్ 2.11 శాతం, పీఎస్‌యు 0.99 శాతం, చమురు సహజవాయువు 0.80 శాతం, బ్యాంకెక్స్ 0.51 శాతం, విద్యుత్ సూచి 0.33 శాతం వరకు లాభపడిన వాటిలో ఉన్నాయి.

కెనాన్ నుంచి డ్రీమ్ లాబో 5000 ఆవిష్కరణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రముఖ డిజిటల్ ఇమేజింగ్ సంస్థ కెనాన్ ఇండియా డిజిటల్ ఫోటో ప్రింటింగ్‌లో డ్రీమ్ లాబో 5000లను విజయవాడలో గురువారం ఆవిష్కరించింది. ప్రొఫెషనల్ ప్రింటింగ్ ఫోర్టుపోలియోలో ప్రతిష్టాత్మక ఉత్పత్తిగా డ్రీమ్ లాబోను ఆకృతి ప్రింటెక్స్‌లో ఏర్పాటు చేశారు. దేశంలో ఇంతవరకు ఐదు డీమ్ లాబో 5000ను ఏర్పాటు చేశామనీ, ఆంధ్రపదేశ్‌లో మొదటిసారిగా ఏర్పాటు చేసినట్లు కెనాన్ డైరెక్టర్ పునీత్ దత్తా చెప్పారు. హైడెఫినేషన్, ఫోటో షూటింగ్, ఫోటో ప్రింటింగ్‌కు పెరుగుతున్న డిమాండ్ తగ్గట్టుగా వెడ్డింగ్ ఫోటోగ్రఫీ విభాగానికి డ్రీమ్ లాబో 5000 పని చేస్తుందని చెప్పారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో సంప్రదాయ సిల్వల్ హలైడ్ టెక్నాలజీని అందిస్తోందని, అదనంగా ప్రొడక్షన్ ఫోటో, స్మాట్ బ్యాచ్ ప్రింట్ ఆన్ డిమాండ్ (పీవోడీ) మార్కెట్స్‌కు ప్రీమియం క్వాలిటీ ప్రింటింగ్ అందిస్తోందని పునీత్ దత్త చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా శాసనసభ్యుడు బోండా ఉమామహేశ్వరరావు, తెదేపా యువ నాయకుడు దేవినేని అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక చేసిన స్యాంసంగ్ ఫోన్లపై
రూ.1500 క్యాష్‌బ్యాక్ ఆఫర్



న్యూఢిల్లీ : స్మార్ట్‌ఫోన్స్ సెగ్మెంట్‌లో తమ వాటాను మరింత పెంచుకునేందుకు ఎయిర్‌టెల్, వొడాఫోన్‌లు స్యాంసంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఒప్పందంలో భాగంగా గెలాక్సీ జె- సీరీస్ ఫోను కొనుగోలుపై రూ.1,500 వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను అందుబాటులో ఉంచాయి. ఇది వచ్చే రెండేళ్ల వరకు అమల్లో ఉంటుంది. వివరాల్లోకి వెళితే ఎయిర్‌టెల్ గెలాక్సీ జె2 (2017) గెలాక్సీ జె5 ప్రైమ్, గెలాక్సీ జె7 ప్రైమ్, గెలాక్సీ జె7 ప్రో మోడల్ ఫోన్లపై ఈ స్కీం వర్తిస్తుంది. వీటి ధర రూ.6,990 నుంచి రూ.19,000 వరకు ఉంటుంది. వొడా స్కీం కింద క్యాష్ బ్యాక్ మొత్తంమూడు మోడల్స్‌పై అందిస్తోంది. గెలాక్సీ జె2 ప్రొ ధర రూ.8,490, గెలాక్సీ జె7 నెక్స్ట్ రూ.10,490 గెలాక్సీ జె7 రూ.16,900గా నిర్ణయించింది. ఈ స్యాంసంగ్ స్మార్ట్‌ఫోన్లు కొనుగోలు చేసిన కస్టమర్లకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తోంది. రూ.199కి రోజుకు 1జీబీ డేటా ఆఫర్‌తో పాటు దేశం మొత్తం అపరిమిత కాల్స్ ఆఫర్ చేస్తోంది. ఎయిర్‌టెల్ కస్టమర్ల విషయానికి వస్తే మొత్తం రూ.5,000కు రీచార్జి చేయించుకోవాల్సి వస్తోంది. వొడా విషయానికి వస్తే నెలకు రూ.198 చొప్పున రెండు సంవత్సరాలకాలం పాటురూ.4,752 విలువ చేసే రీచార్జీ చేయించుకోవాల్సి ఉంటుంది. కస్టమర్ ఈ నిబంధనలకు ఒప్పుకొంటేనే క్యాష్ బ్యాక్ వర్తిస్తుందని రెండు కంపెనీలు ఒక ప్రకటనలో వివరించాయి. రూ.1,500 క్యాష్‌బ్యాక్ కస్టమర్లకు 24 నెలల్లోపు అందజేయడం జరుగుతుందని ఎయిర్‌టెల్, వొడాలు ప్రకటనలో వివరించాయి.

ఫీజులకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఆయన నివాసంలో కలిసి తిరుపతిరావు కమిటీ చేసిన సిఫారసులపై తీవ్ర నిరసన వ్యక్తంచేశాయి. ఈ సమయంలో శ్రీహరికి సంఘాల నేతలకు మధ్య కొంత వాగ్వాదం జరిగినట్టు కూడా ప్రచారం జరిగింది. హైదరాబాద్‌తో పాటు జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాల్లో ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇప్పటికే విద్యార్థుల నుంచి పెద్దఎత్తున ఫీజులను వసూలు చేస్తున్నాయని, ప్రవేశాలకు సంబంధించి ఏమాత్రం పారదర్శకత పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు హెచ్ఎండిఏ పరిధిలో ఉన్న కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో డొనేషన్ల పేరుతో విద్యార్థులను దోచుకుంటున్నారని, ఒక్కో ఇంటర్నేషనల్ పాఠశాల నాలుగో తరగతి విద్యార్థి మొదలు ఆపై చదువులకు ఏటా వార్షిక ఫీజుల పేరుతో రూ.4 నుంచి 5 లక్షలు వసూలు చేస్తున్న వైనాన్ని పేరెంట్స్ అసోసియేషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చాయి. తిరుపతిరావు కమిటీ చేసిన సిఫారసులు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేవని ఆయన చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని రుసుములను పెంచితే ఆందోళనకు సిద్ధమవుతామని అసోసియేషన్ నేతలు హెచ్చరికలు జారీచేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమీషనర్ కిషన్‌ను కలిసి తమ నిరసనను వ్యక్తంచేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఫీజులే మోయలేని భారంగా ఉన్నాయని అయితే తిరుపతిరావు కమిటీ అందుకు విరుద్ధంగా యాజమాన్యాలకు ప్రయోజనం చేకూర్చేలా ఏటా 10శాతం ఫీజులను పెంచుకోవచ్చని సిఫారసు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు ఏమాత్రం దృష్టి సారించని ప్రభుత్వం ఫీజుల విషయంలో యాజమాన్యాలకు స్వేచ్ఛను ఎలా కల్పిస్తారని వారు నిలదీశారు. గత నాలుగైదు రోజులుగా విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ రాజకీయ పక్షాల నుంచి వస్తున్న నిరసనలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తాత్కాలికంగా తిరుపతిరావు కమిటీ సిఫారసులను నిలుపుదల చేయాలని ఆయన ఇచ్చిన నివేదికను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఆయా రాజకీయ పక్షాల్లో నెలకొన్న వ్యతిరేకత భావనను తొలగించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించినట్టు తెలుస్తోంది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఏటా ఫీజుల రూపంలో వస్తున్న ఆదాయమెంత? జీతభత్యాలకు, వసతి సౌకర్యాలకు, మౌలిక సదుపాయాలకు కల్పిస్తున్న నిధులెన్ని? పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో పాటు క్రీడలకు ఎటువంటి ప్రాధాన్యత ఇస్తుంది ఆ వివరాలను తిరుపతిరావు కమిటీ ఏమాత్రం తన నివేదికలో ప్రస్తావించకుండా ఫీజుల పెంపుపైనే ప్రధానంగా దృష్టి సారించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఎన్నికల సమయం కావడంతో ఫీజుల పెంపుపై తొందరపడి ఎటువంటి నిర్ణయం తీసుకోరాదని ప్రైవేట్ పాఠశాలలను కట్టడి చేయడంతో పాటు డొనేషన్ల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న వైనంపై కూడా దృష్టిసారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫీజుల రూపంలో వస్తున్న ఆదాయంలో ఐదుశాతం యాజమాన్యాలు తమ వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చని తిరుపతిరావు కమిటీ చేసిన సిఫారసులను కూడా వెనక్కి తీసుకోవాలని ప్రతిపాదించినట్టు సమాచారం. సంపన్నులు ఎలాగూ ఇంటర్నేషనల్ పాఠశాలలకు తమ పిల్లలను ఉన్నత విద్యాభ్యాసం కోసం పంపిస్తారని వారు ఎంతైనా ఫీజులు చెల్లించేందుకు వెనకాడరని అదే మామూలు పాఠశాలల్లో ఫీజులు పెరిగితే పేద, మధ్య తరగతి వర్గాలు వాటిని ఎలా చెల్లిస్తారని తల్లిదండ్రుల సంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఏటా 10శాతం ఫీజులు పెంచుకోవచ్చనే ప్రతిపాదనను ఆమోదించవద్దని, న్యాయస్థానం తప్పుబట్టినా 91వ ప్రభుత్వ ఉత్తర్వులోని అంశాన్ని సవరించి 42వ ఉత్తర్వుపై ఉన్న స్టేను తొలగించి తాజాగా ఫీజును ఖరారు చేయాలని సంఘం అధ్యక్షుడు మాగాటి నారాయణ, ప్రధాన కార్యదర్శి బుర్రా రాములు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రైవేట్, ఎయిడెడ్, ఇతర పాఠశాలల్లో వార్షిక ఫీజులను పెంచుకునేందుకు అవకాశం లేదని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆర్.ఆచార్య ఆదేశించారు. నర్సరీ, ప్రీప్రైమరీ, ఎల్‌కేజీ, మొదటి తరగతినుంచి 10వ తరగతి వరకు ప్రస్తుతం ఉన్న ఫీజులను కొనసాగించాలని వచ్చే ఏడాది కూడా ఈ ఫీజులే అమలవుతాయని ఆమె ఆ ఉత్తర్వులో స్పష్టంచేశారు. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ప్రస్తుతం అమలులో ఉన్న ఫీజులే కొనసాగుతాయని ఆమె వివరించింది.



ఉద్యోగాల భర్తీ ఎంతవరకొచ్చింది!

(మొదటి పేజీ తరువాయి)

నియామకాల విషయంలో మీరేం చేస్తున్నారంటూ తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ తనను కలిసిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ (టిఎస్ పీఎస్సీ) చైర్మన్, కార్యదర్శి, ఇతర సభ్యులనుద్దేశించి ప్రశ్నించిన సందర్భమిది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకు సర్వీస్ కమీషన్ బృందం గురువారం ఉదయం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసింది. ఈ సందర్భంగా తనను కలిసిన కమీషన్ సభ్యులనుద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ లక్షా 20వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్నారు. మరీ సర్వీస్ కమీషన్ ఏం చేస్తోంది? ఇంతవరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారు? ఎప్పటిలోగా ఖాళీలన్నింటినీ భర్తీ చేస్తారని గవర్నర్ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. సర్వీస్ కమీషన్ 34వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని వీటికి సంబంధించి దశల వారీగా నోటిఫికేషన్లు జారీ చేస్తున్నామని గవర్నర్‌తో కమీషన్ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి చెప్పారు. టీఆర్‌టీ మినహామిగతా అన్ని ఖాళీలను వచ్చే రెండు, మూడు మాసాల్లో భర్తీచేసి ఆయా శాఖలకు సమాచారం అందిస్తామని ఆయన చెప్పినట్టు సమాచారం. ప్రభుత్వం ప్రకటిస్తున్నట్టు లక్షా 20వేల ఖాళీలను భర్తీచేసే అవకాశం ఒక్క సర్వీస్ కమీషన్‌కే లేదని, ఇంకా ఐదు నియామక సంస్థలు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోందని చక్రపాణి పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ), పోలీసు నియామక సంస్థ (పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు), సింగరేణి కాలరీస్, వైద్య ఆరోగ్యశాఖ, తెలంగాణ జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థలు ఆయా శాఖల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నాయని తెలిపారు. పోలీస్ నియామక సంస్థ ఇప్పటికే 10వేల ఖాళీలను భర్తీ చేసిందని, సింగరేణి కూడా 10వేల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టిందని వివరించారు. వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు పద్ధతిన వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని నియమించుకుంటోందని గుర్తుచేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలో కూడా ఆ సంస్థలు నియామకాల ప్రక్రియను చేపట్టాయని తెలిపారు. సర్వీస్ కమీషన్ ఏర్పడ్డాక చేపట్టిన నియామకాలపై చక్రపాణి పూర్తి వివరాలను గవర్నర్‌కు వివరించినట్టు తెలుస్తోంది. టిఆర్‌టి మినహా సర్వీస్ కమీషన్ 22వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్టు ఆయన గవర్నర్‌తో చెప్పినట్టు సమాచారం.

గవర్నర్‌ను కలిసిన అనంతరం టిఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి మీడియాతో మాట్లాడుతూ, ఉద్యోగాల భర్తీకి తమ కమీషన్ అవలంబిస్తున్న విధానాలను వివరించామని చెప్పారు. ఉద్యోగ నియామకాల ప్రక్రియతో పాటు ఇప్పటి వరకు జరిగిన నియామకాల గురించి గవర్నర్‌కు తెలిపామని చెప్పారు. త్వరలో భర్తీ చేయనున్న ఉద్యోగాలకు సంబంధించి గవర్నర్ అడిగి తెలుసుకున్నారని వివరించారు.

అభినందించిన గవర్నర్

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పారదర్శకంగా నియామకాలను చేపడుతున్న సర్వీస్ కమీషన్‌ను గవర్నర్ నరసింహన్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని ఆయన కోరారు.

అమ్మా నాన్నని గెంటేసిన ఓ కొడుకు!

(మొదటి పేజీ తరువాయి)

కనీసం విలువివ్వకుండా విచక్షణారహితంగా నిర్ణయాలు తీసుకుంటుండడంతో పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. శృతిమించిన సతీష్ గురువారం ఉదయం తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా బయటికి గెంటి వేశాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఎటుపోవాలో తెలియక వృద్ధ దంపతులు ఆ ఇంటి వద్దనే కన్నీరుమున్నీరవుతూ దారిన పోయేవారికి తమ గోడు వినిపిస్తున్నారు. ఆ వృద్ధ దంపతుల దీన పరిస్థితికి ఇరుగుపొరుగువారు బాధపడుతుండగా కన్న కొడుకు మాత్రం కనికరం చూపడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే... వరకట్న కేసులు పెడతామంటూ కొడుకు సతీష్ బెదిరింపులకు దిగటం విశేషం.

కన్న కొడుకే శత్రువుగా మారడంతో తల్లిదండ్రుల పరిస్థితి దీనంగా మారింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అయోమయంలో పడ్డారు. వారిని కలిసిన వారందరికీ తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ప్రియుడి కోసం భర్తని చంపించింది

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చి భర్తను దారుణంగా చంపించింది. భార్య పేరు జ్యోతి. భర్త నాగరాజు.... సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. ప్రియుడు దీపక్. ఈ త్రికోణ కథలో బోలెడన్ని కొత్త ట్విస్టులు. అంతా అయ్యాక మిగతావారు తనని ఇరికిస్తారేమోనని అనుమానించి... భయపడి.. ఆత్మహత్య చేసుకోబోయి... గొంతుకోసుకుని... చివరికి పోలీసులకు చిక్కి... కథంతా వెళ్లకక్కారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నాగరాజును నరేష్‌తో పాటు మరో ముగ్గురు హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. నాగరాజును చౌటుప్పల్‌లో హత్య చేసినట్లు తేలింది. చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసు నమోదైంది. ఈ హత్య కేసులో నరేష్, దీపక్, కార్తీక్ సహా మరో వ్యక్తిని పోలీసలు అదుపులోకి తీసుకున్నారు. నాగరాజును హత్య చేయించింది అతని భార్య జ్యోతి అని పోలీసుల విచారణలో వెల్లడైంది. తన అక్రమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి సుపారీ ఇచ్చి ఈ దారుణానికి పాల్పడినట్లు తేలింది. దీంతో జ్యోతితో పాటు హత్యకు పాల్పడిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల క్రితం మృతదేహం లభ్యం కాగా.. అది గుర్తు తెలియని మృతదేహంగా చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నిందితుల్లో ఒకరి ఆత్మహత్యాయత్నంతో వెలుగులోకి...

హైదరాబాద్‌లో నలుగురు యువకులు కలిసి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను హత్య చేశారు. ఈ హత్య విషయం ఎక్కడ బయట పడుతుందోనని భయపడి ఆ నలుగురు యువకుల్లో ఒకరు ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి అసలు విషయం చెప్పాడు. తాము ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను హత్య చేశామని, ప్రేమ వ్యవహారమే ఇందుకు కారణమని అతను చెప్పాడు. గుట్టు విప్పిన యువకుడి పేరు నరేష్. నరేష్ లాలాగూడలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతను బ్లేడుతో గొంతును కోసుకున్నాడు. ఇలా ఎందుకు చేశావని అడిగితే విషయం చెప్పాడు. నలుగురు కలిసి ఓ టెక్కీని హతమార్చినట్లు చెప్పాడు.

తమ స్నేహితుడు ప్రేమ వ్యవహారంలో అడ్డు వస్తున్నాడని టెక్కీని హత్య చేసినట్లు చెప్పాడు. ఈ సంఘటన ఐదు రోజుల క్రితం జరిగినట్లు చెప్పాడు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన టెక్కీని పిలిపించి మద్యం తాగినట్లు చెప్పాడు. అతనిని అపస్మారకస్థితిలోకి వెళ్లేలా చేశామని, ఆ తర్వాత చంపినట్లు చెప్పాడు. అతను చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం నల్గొండ జిల్లాలోని సాగర్‌లో పడేసినట్లు చెప్పాడు. నరేష్ లాలాపేటలోని ఓ కంపెనీలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అతను చెప్పడంతో ఐదు రోజుల తర్వాత విషయం వెలుగుచూసింది. హత్య ఎక్కడ బయట పడు తుందో, ఈ కేసులో తననే ఇరిక్కిస్తారేమోనని భయపడి అతడు ఆత్మహత్యాయత్నం చేసినట్లుగా చెప్పాడని తెలుస్తోంది. ఆత్మహత్యాయత్నం చేసిన నరేష్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆయనను పోలీసులు విచారించారు. మృతుడి పేరు నాగరాజు అని తెలుస్తోంది. నరేష్ ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం సాగర్‌లో నాగరాజు మృతదేహాన్ని కనుగొనాల్సిందిగా అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నరేష్ ఇచ్చిన వాంగ్మూలంతో కేసు మిస్టరీ వీడినట్లయింది.


జూబ్లీహిల్స్‌లో పట్టపగలు దారి దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

వీళ్లు మామూలు దొంగలు కాదని.. దోపిడీలు, హత్యలు చేసే దారిదోపిడీ ముఠాగా భావిస్తున్నారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లు పరిశీలించిన తర్వాత దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రత్యేక టీమ్స్‌ను రంగంలోకి దింపారు. దోపిడీ ముఠా పట్టుకెళ్లిన బండి వివరాలు.. ఏయే ట్రాఫిక్ సిగ్నల్స్ నుంచి వెళ్లింది అనే విషయాలను బయటకు తీసే పనిలో పడ్డారు.

పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు మరో అరుదైన అవార్డు

బెస్టాఫ్ త్రీల్లో ఒకటిగా ఎంపిక



హైదరాబాద్, ఆంధ్రప్రభ: లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ గజల్ గాయకుడు గజల్ శ్రీనివాస్‌ను అరెస్టు చేయడంతో తెలుగు రాష్ట్రాల్లో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పేరు మార్మోగింది. ఈ మోడల్ పోలీస్‌స్టేషన్ పేరు మరో మూడు రోజుల్లో దేశవ్యాప్తంగానూ వినిపించనుంది. కేంద్రం ఆధీనంలోని హోం మంత్రిత్వ శాఖ(ఎంహెచ్ఏ) ఈ పోలీస్‌స్టేషన్‌ను దేశంలోనే బెస్టాఫ్ త్రిలో ఒకటిగా ఎంపికచేయడమే దీనికి కారణం. శనివారం నుంచి మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ప్రారంభం కానున్న 52వ వార్షిక డీజీపీలు, ఐజీపీల సదస్సులో కేంద్రం పంజాగుట్ట పోలీసులకు అవార్డు అందించనుంది. 51వ డిజిపిల సదస్సు 2016లో హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో జరిగింది. అప్పుడు ఉత్తమ పోలీస్‌స్టేషన్ల గుర్తింపును తీర్మానంగా చేశారు. మౌలిక వసతులు, పనితీరు, ప్రజల మన్నన తదితర అంశాలను పరిగణనలోనికి తీసుకుంటూ దేశంలోనే ఉత్తమంగా నిలిచే పది పోలీస్‌స్టేషన్‌లను గుర్తించాలని, వాటిలో మూడింటిని బెస్టాఫ్ త్రీగా ఎంపిక చేసి అవార్డులు ఇవ్వాలని ఆ సదస్సులో నిర్ణయించారు. 2017 డిసెంబర్‌లో జరగాల్సిన 52వ వార్షిక సదస్సు ఈ నెలకు వాయిదా పడింది. మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లోని టెక్కెన్‌పూర్‌లో ఉన్న బీఎస్ఎఫ్ అకాడమీలో శనివారం నుంచి మూడు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది.

ఎమ్మార్ కేసులో.. ఎల్‌వి సుబ్రహ్మణ్యంకు విముక్తి

సీబీఐ వాదనలను తోసిపుచ్చిన హైకోర్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎమ్మార్ ప్రాపర్టీస్ కేసులో సీనియర్ ఐఎఎస్ అధికారి ఎల్‌వి సుబ్రహ్మణ్యంకు ఊరట లభించింది. ఆయనపై సిబిఐ నమోదు చేసిన కేసును కొట్టి వేస్తూ ఉన్నత న్యాయస్థానం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మార్ కేసులో ఎల్‌వి సుబ్రహ్మణ్యంను నిందితుడిగా పేర్కొంటూ 2012 లో సిబిఐ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. పూర్వపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎపిఐఐసి ఎండిగా పని చేసిన సమయంలో సుబ్రహ్మణ్యం ఎమ్మార్ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు సిబిఐ చార్జిషీట్‌లో పేర్కొంది. సుబ్రహ్మణ్యంను విచారించేందుకు అనుమతించాలంటూ కేంద్రాన్ని కూడా సిబిఐ కోరింది. సిబిఐ వినతిని తిరస్కరించాలని, ఆయనను కోర్టులో విచారించాల్సిన అవసరం లేదని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసింది. అయినప్పటికీ కేంద్రం ఎల్‌వి ప్రాసిక్యూషన్‌కు అనుమతించింది. ఈ నేపథ్యంలో సుబ్రహ్మణ్యం సిబిఐ తనపై నమోదు చేసిన కేసును కొట్టి వేయాలంటూ హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను వేశారు. విధి నిర్వహణలో తానెలాంటి అవకతవకలకు పాల్పడలేదని, నిబంధనల మేరకే తాను నిర్ణయాలు తీసుకున్నానని వాదించారు. ఎల్‌వి వాదనను సిబిఐ తోసిపుచ్చింది. ఎపిఐఐసి ఎండిగా ఎల్‌వి సుబ్రహ్మణ్యం నిబంధనలను పక్కకు పెట్టారని, ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని, కొంత ప్రలోభాలకు లొంగిపోయారని సిబిఐ వాదించింది. ఇరువైపుల వాదనలను విన్న న్యాయస్థానం ఎల్‌వి సుబ్రహ్మణ్యంపై కేసును కొట్టి వేస్తూ ఆదేశాలిచ్చింది. దీంతో గడచిన ఐదేళ్ళుగా కోర్టు చుట్టూ తిరిగిన సీనియర్ ఐఎఎస్ అధికారికి విముక్తి లభించింది.

సమష్టిగా కృషి చేయాలి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యుత్ రంగంలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను మరింత ఇనుమడింపచేసేందుకు ఉద్యోగులు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం సాయత్రం మింట్ కాంపౌండ్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఏర్పాటు చేసిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయరంగానికి 24గంటల విద్యుత్ సరఫరాలో విజయం సాధించటంలో ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేయాలని కోరారు. అనంతరం 2018-డైరీని ఆవిష్కరించారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, జన్కో సంస్థల సీఎండీ ప్రభాకర్ రావు. విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్ రావు, 1104 విద్యుత్ కార్మికసంఘం నేతలు పద్మారావు, సాయిబాబా, మధుసూధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హార్టికల్చర్ డైరెక్టర్ పదవి నుంచి వెంకట్రామిరెడ్డిని తొలగించాలి'

హైదరాబాద్, ఆంధ్రప్రభ: హార్టికల్చర్ డైరెక్టర్ పదవి నుంచి మంత్రి ఈటల రాజేందర్ వియ్యంకుడైన వెంకట్రామిరెడ్డిని వెంటనే తప్పించాలని టీ పీసీసీ అధికార ప్రతినిధి కొనగాల మహేష్ డిమాండ్ చేశారు. నాన్ ఐఎఎస్ కేడర్‌కు చెందిన వెంకట్రామిరెడ్డి గతేడాది నవంబర్ 30వ తేదీన్నే పదవీ విరమణ పొందారని గురువారం ఆయన గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సర్వీసుల్లో కొనసాగించరాదని ఆర్థిక శాఖనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని మహేశ్ తెలిపారు. సీఎం కేసీఆర్‌కు అధికారి నచ్చితే ప్రమోషన్, నచ్చకపోతే డిమోషన్ అన్నట్లుగా పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. నాబార్డు నిధులు స్వాహ చేయడానికే వెంకట్రామిరెడ్డిని నియమించారని ఆయన ఆరోపించారు.

టీఆర్ఎస్ ప్రభుత్వానికి మూల్యం తప్పదు

- నేడు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- వివిధ విద్యార్థి సంఘాల హెచ్చరిక

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉపవాస దీక్ష చేస్తున్న మంద కృష్ణమాదిగపై సీఎం కేసీఆర్, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిలు కుట్రలు చేస్తున్నారని వివిధ విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని వారు హెచ్చరించారు. గురువారం ఉస్మానియా వర్సిటిలో వివిధ విద్యార్థి సంఘం నేతలు హాజరయ్యారు. శుక్రవారం బీజేపీ కార్యాలయాన్ని ముట్ట డిస్తామన్నారు. ఈ సమావేశంలో ఓయూ జేఏసీ- వరంగల్ రవి, ఎంఎస్ఎఫ్- పల్లెర్ల సుధాకర్, కొమ్ము శేఖర్, ఎస్ఎఫ్ఐ- మూర్తి, పీడీఎస్‌యూ- విష్ణు, టీవీవీ- నజీర్, డీఎంఎస్ఏ- నరేష్, టీవీఓయూ- సలీమ్‌పాషా, డీఎస్‌యూ- రంజీత్, బీఎస్ఎఫ్- వేల్పుల సంజయ్, టీఎస్‌యూ- కృష్ణమాదిగ, ఎంఎస్ఓ- హబీబ్‌ఖాద్రీతో పాటు సోమశేఖర్, సురేష్, అవినాష్ తదితరులు హాజరయ్యారు.

చంచల్‌గూడ జైలు నుంచి

గ్యాంగ్‌స్టర్ ఆయూబ్ ఖాన్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: గ్యాంగ్‌స్టర్ గోల్డ్‌స్మగ్లర్ అయూబ్‌ఖాన్ చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యాడు. హైకోర్టు పీడీ యాక్ట్ కొట్టివేయడంతో అయూబ్‌ఖాన్ విడుదలయ్యాడు. నకిలీ పాస్‌పోర్టు కేసుతో సహా హత్యలు, కిడ్నాప్‌లు, బెదిరింపులు, దాడులు, సెటిల్మెంట్‌లు ఇలా 72 కేసుల్లో అయూబ్‌ఖాన్ నిందితుడు. పీడీ యాక్ట్‌కొట్టేయడంతో గురువారం సాయంత్రం అయూబ్ చంచల్‌గూడ జైలునుంచి విడుదలయ్యాడు.

'గుళ్లో' లెక్క తీయండి!

- కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లకు కాంగ్రెస్‌కు ఆదేశం
- వచ్చే ఎన్నికల ప్రచారానికి రాహుల్ గాంధీ సన్నాహాలు



న్యూఢిల్లీ: ఎన్నికలు ముంచుకొస్తున్న కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రముఖ హిందూ దేవాలయాలు, పుణ్య క్షేత్రాల జాబితా రూపకల్పనలో ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తలమునకలై ఉన్నారు. గుజరాత్ ఎన్నికల్లో హిందూత్వ వ్యూహంలో దేవాలయాలను సందర్శించిన పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పైన పేర్కొన్న మూడు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో గుడి బాట పట్టాలని నిర్ణయించారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ సర్వసాధారణ వ్యూహాన్ని తోసిరాజనట్టుగా కాంగ్రెస్ అధ్యక్షుడు గుజరాత్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా కనీసం 14 దేవాలయాలను సందర్శించారు.

దేవాలయాలు, మఠాల వేటలో..

రానున్న మాసాల్లో కీలకమైన ఎన్నికలు ముంచుకొస్తున్న విజయవంతమైన హిందూత్వ వ్యూహాన్ని కొనసాగించాలని రాహుల్ వ్యూహకర్తల బృందం నిర్ణయించింది. ఆ క్రమంలో రాహుల్ దేవస్థానాల సందర్శనకు కొనసాగింపు అన్నట్టుగా దేవస్థానాలు, మఠాల జాబితాను రూపొందించాల్సిందిగా మూడు రాష్ట్రాల పార్టీ శాఖలకు ఆదేశాలు అందాయి. సదరు దేవస్థానాలు, మఠాలు ఆ ప్రాంతంలో ఆధ్యాత్మికంగా, రాజకీయంగా ప్రాముఖ్యతను సంతరించుకొని ఉండాలి. కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పార్టీ బాగా రాణించే క్రమంలో హిందూత్వ శ్రేణులకు బీజేపీ ఇచ్చే పిలుపునకు ధీటుగా పనిచేసేది ఒక్క దేవ స్థానాల సందర్శన మాత్రమే నని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అది నేరుగా హిందువుల మనోభావాలకు దగ్గర అయినట్టు ఉంటుందని తలుస్తోంది.

కలిసొచ్చిన శివభక్తి తత్వం

అయితే రాహుల్ గాంధీ దేవస్థా నాలతో పాటు మసీదులను సందర్శి స్తారని కాంగ్రెస్ పార్టీ గట్టిగా చెబుతూ వస్తున్నది. అయినప్పటికీ రాహుల్ గాంధీ స్వయంగా తాను శివ భక్తుడనని చెప్పుకోగా పలు వురు కాంగ్రెస్ నేతలు ఆయ న ప్రకటనకు వత్తాసు పలికారు. సీనియర్ నేత రాజ్ బబ్బర్ సైతం పార్టీ అధ్యక్షున్ని శివభక్తుడు అని పేర్కొన్నారు. తద్వారా అత్యధిక హిందువుల ఓట్లు తన ఖాతాలో పడేలా చూసుకోవ డానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. బీజేపీని దెబ్బ తీయాలంటే ఆ పార్టీ మార్గంలోనే వెళ్ళాలనే ధోరణి కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తున్నది.

రాహుల్ సందర్శన కోసం చర్చోపచర్చలు

రాహుల్ గాంధీ రాజస్థాన్‌లోని పుష్కర్‌లో ప్రసిద్ధి చెందిన బ్రహ్మ దేవాలయం, జోధ్‌పూర్‌లో చాముండి మాత దేవస్థానాన్ని సందర్శించే అవకాశం ఉంది. పూర్తి జాబితా ఇంకా ఖరారు కావాల్సి ఉంది. కర్నాటకలో కూడా ఆయన కొన్ని ముఖ్యమైన మఠాలను సందర్శించవచ్చు. ఆయన పర్యటనలకు సంబంధించి చర్చోపచర్చలు, సమావేశాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి.

గెలుపే లక్ష్యం

కొన్ని రాష్ట్రాల్లో గెలవడం మాకు అత్యంత కీలకం. అప్పుడే 2019లో బ్రహ్మాండంగా పోరాడగలుగుతాం. అందు కు రామనామం, శివానామస్మరణం సాయపడుతుంద నుకుంటే ఎందుకు వదులుకుంటాం అని రాహుల్ గాంధీ వ్యూహకర్తల బృందంలోని ఒకానొక సీనియర్ సభ్యుడు తేల్చి చెప్పారు. పలు సంవత్సరాలుగా ఘనమైన విజయాన్ని నమోదు చేసుకోలేకపోయిన అత్యంత పురాతన పార్టీ ప్రస్తుతం దైవ సహాయం కోసం ఎదురు చూస్తున్నది.

బీజేపీకి 2014 లోక్‌సభ ఎన్నికలకు తోడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల్లోనూ హిందూత్వ అనుకూల వైఖరి ఎంతగానో కలసి వచ్చిందనే ముక్తాయింపునకు పార్టీ అంతర్గత మదింపులో కాంగ్రెస్ చేరుకుంది. మైనారిటీలను మచ్చిక చేసుకోవాలనే కాంగ్రెస్ వైఖరి ప్రతికూల ఫలితాలను ఇచ్చింది. అంతిమంగా బీజేపీ ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే కీలకమైన కారణాల్లో ఒకటిగా నిలిచింది. అందుకనే కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల వ్యూహాన్ని సమూలంగా మార్చివేసుకుంది. ఒకవైపు

హిందుత్వంతో కాషాయ పార్టీ విజయ విహారం

ముస్లిములను దూరం చేసుకోకుండా వ్యవహరిస్తూనే హిందూ సంఘాలపై విమర్శలకు దిగకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఇదే విషయమై మజ్లిస్ అధినేత అసద్దుదీన్ ఒవైసీ లాంటి కాంగ్రెస్ పూర్వ మిత్రులు రాహుల్‌ను విమర్శించారు. అయితే గుజరాత్‌లో విజయాన్ని అత్యంత దగ్గరగా చూసిన కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాలయాల సందర్శనను అంత తేలిగ్గా వదులుకునేలా లేరు.

వచ్చేవారం బహ్రెయిన్‌కు రాహుల్

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత తొలి పర్యటన అన్నట్టుగా ఈ నెల ఏడవ తేదీ నుంచి తొమ్మిదవ తేదీ దాకా బహ్రెయిన్‌లో పర్యటించనున్నారు. పార్టీ వర్గాలు చెప్పిన దాన్ని బట్టి బహ్రెయిన్ కింగ్‌డమ్ అతిథిగా రాహుల్ అక్కడ పర్యటిస్తారు. అక్కడి ప్రవాస భారతీయుల ఆహ్వానం మేరకు ఈ నెల ఎనిమిదవ తేదీన వారిని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. బహ్రెయిన్ ప్రధానమంత్రి ఖలీఫా బిన్ సల్మాన్ అల్ ఖలీఫా, రాజ కుటుంబానికి చెందిన సభ్యులను రాహుల్ కలిసే అవకాశం ఉంది. ఆయన దుబాయ్‌లో ఎన్నారైలను ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. కానీ ఆ పర్యటన వాయిదా పడింది. గత ఏడాది అమెరికా పర్యటన తరహాలో బహ్రెయిన్ పర్యటన ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాహుల్ గాంధీ తొమ్మిదవ తేదీన భారత్‌కు తిరిగి వస్తారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తన మాతృమూర్తి సోనియా గాంధీతో కలిసి గోవాలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.

ఫిష్ ఫార్మింగ్ రీసెర్చ్ సెంటరివ్వండి

- జనగామలో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలి
- కేంద్ర మంత్రులను కలిసిన తెలంగాణ ఎంపీ భూరనరసయ్యగౌడ్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రానికి ఇన్‌ల్యాండ్ ఫిష్ ఫార్మింగ్ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను మంజూరు చేయాల్సిందిగా కేంద్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కోరారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా ఢిల్లీలో ఉన్న ఎంపీ, పలువురు కేంద్ర మంత్రుల్ని కలిసి తెలంగాణ రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి పనులు, ప్రాజెక్టుల గురించి విజ్ఞప్తులు అందజేశారు. గజేంద్ర సింగ్ షెకావత్‌ను గురువారం మధ్యాహ్నం కలిసిన బూర, తెలంగాణ రాష్ట్రంలో రిజర్వాయర్లు, పెద్ద సరస్సులు కాకుండా 46,000 చెరువులు, కుంటలు ఉన్నాయని వివరించారు. ఈ



నేపథ్యంలో రాష్ట్రంలో చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 40 కోట్ల చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేయాలనుకుంటోందని వెల్లడించారు. తద్వారా రైతులకు వ్యవసాయంతో పాటు చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఈ క్రమంలో చేపల పెంపకాన్ని మరింత శాస్త్రీ యంగా ముందుకు తీసుకెళ్లేందుకు పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేయాలని బూర నర్సయ్య గౌడ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసిన ఎంపీ, శాతవాహన, చార్మినార్, శిరిడీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు జనగాం రైల్వేస్టేషన్లో హాల్ట్ సదుపాయం కల్పించాలని కోరారు.

కాలుష్యానికి కారణమవుతున్న

కంపెనీలపై చర్యలు తీసుకోండి

- కేంద్రమంత్రులకు వైకాపా నేతల ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విశాఖ జిల్లా అచ్యుతాపురం ఎస్‌ఈజడ్‌లో పర్యావరణ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు కేంద్ర మంత్రులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో ఉన్న ప్రత్యేక ఆర్థిక మండళ్లలో దాదాపు 40 కంపెనీలు నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ ఆ ప్రాంతాన్ని కాలుష్య కాసారంగా మార్చేస్తున్నాయంటూ ఆ పార్టీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి హర్షవర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. 40 కంపెనీలు పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన మురుగు నీటిని శుద్ధి చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయనందున అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లోని అనేక గ్రామాల్లో తాగునీరు కలుషితంగా మారిపోయిందని వారు మంత్రికి వివరించారు. శుద్ధి చేయని కాలుష్య జలాలను ఆయా కంపెనీలు సముద్రంలోకి విడుదల చేస్తున్నందున సముద్ర జలాలు కూడా కలుషితమై మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని విజయ సాయిరెడ్డి హర్షవర్ధన్ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్‌ఈజడ్‌లోని కంపెనీల కారణంగా భూగర్భ జలాలు, సముద్ర జలాలు కూడా కలుషితమైపోతూ రైతులు, మత్స్యకారులకు ఎనలేని నష్టాన్ని



కలిగిస్తున్నాయని, ఈ సమస్యపై పరిసర బాధిత గ్రామాల ప్రజలు అనేకమార్లు ఆందోళనలు చేపట్టారు. తమ గోడు పట్టించుకోవాలంటూ పలుమార్లు విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదని, తక్షణమే దీనిపై స్పందించాలని కోరారు. ఎస్‌ఈజడ్‌లో పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్న కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుని బాధిత గ్రామాల ప్రజలను జల, వాయు కాలుష్యం బారి నుంచి కాపాడాలంటూ వినతి పత్రం సమర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ బృందం రక్షణ శాఖా మంత్రి నిర్మలా సీతా రామన్‌ను కలిశారు. రాంబిల్లి మండలంలోని నౌకాదళ ప్రత్యామ్నాయ ఆపరేషన్ బేస్ ఏర్పాటు కోసం తరలించిన అనేక తీర ప్రాంత గ్రామాల ప్రజల దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు. మరోవైపు ఫాతిమా కాలేజీ విద్యార్థులకు న్యాయం చేయాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వై.వి సుబ్బారెడ్డి కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డాను కలిశారు. విద్యార్థులకు మెడికల్ సీట్లు ఇచ్చేలా ఆర్డినెన్స్ జారీ చేయాలని కోరారు. కేరళ, పాండిచ్చేరి తరహాలో సూపర్ న్యూమరీ సీట్లు సృష్టించి విద్యార్థులకు తగిన సహాయం చేయాలని సుబ్బారెడ్డి అడగ్గా... సుప్రీంకోర్టులో రివిజన్ పిటిషన్ వేస్తామని నడ్డా ఆయనకు హామీ ఇచ్చారు.

బెస్ట్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా భారత సంతతి వ్యక్తి

సింగపూర్: 2018 సంవత్స రానికి ఆసియా-పసిఫిక్‌లో ఉత్తమ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ గా సింగపూర్‌లో భారత సంతతికి చెందిన రవి మేనన్ ఎంపికయ్యారు. సింగపూర్ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకు రావడంలో కీలక పాత్ర పోషించిన సెంట్రల్ బ్యాంక్ మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్(ఎంఏఎస్) మేనేజింగ్ డైరెక్టర్ రవి మేనన్‌ను ఇంగ్లండ్‌కు చెందిన ది బ్యాంకర్ అనే మ్యాగజైన్ బెస్ట్ సెంట్రల్ బ్యాంక్ గవర్నర్‌గా గుర్తించింది. ఫైనాన్షియల్ టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో నడుస్తున్న సదరు మ్యాగజైన్ ప్రతియేటా చేపట్టే ఈ గుర్తింపు ప్రక్రియలో భాగంగా జరిపే సర్వేలో బ్యాంకర్లు, ఆర్థికవేత్తలను భాగస్వాములను చేస్తుంది. సింగపూర్ ఆర్థిక మంత్రి హెంగ్ స్వీ కెయిట్ కూడా 2011లో ఉత్తమ బ్యాంకర్‌గా గుర్తింపు పొందారు. గత మూడు సంవత్సరాలుగా వియత్నాం, భారత్, బంగ్లాదేశ్ దేశాలకు చెందిన సెంట్రల్ బ్యాంకర్లుగా గుర్తింపు పొందారు.

10న పీఎస్ఎల్వీ – సీ 40 ప్రయోగం

సూళ్లూరుపేట, ప్రభ న్యూస్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ నెల 10న పీఎస్ఎల్‌వీ -సీ40 ప్రయోగాన్ని చేపట్టి సతీష్ ధవన్ స్పేషన్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి రాకెట్‌ను నింగిలోకి పంపేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రయోగానికి సంబంధించి పీఎస్ఎల్‌వీ -సీ40 క్యాంపియన్‌ను ప్రారంభించి నాలుగు దశల రాకెట్ అనుసంధాన పనులను పూర్తి చేయడం జరిగింది. ఈ రాకెట్ ద్వారా 30 ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు. వీటిలో దేశీయ అవసరాల కోసం కార్టోశాట్ -2 సిరీస్‌లో ఒక ఉపగ్రహం ఉండగా మిగిలిన 29 ఉపగ్రహాలను విదేశాలకు చెందినవి. గత ఏడాది ఆగస్టు 31న నిర్వహించిన పీఎస్ఎల్‌వీ -సీ39 ప్రయోగం విఫలం కావడంతో జనవరి 10వ తేదీ చేపట్టే ప్రయోగాన్ని విజయవంతం చేసేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు కృషిచేస్తున్నారు.

విశాఖ రైల్వేజోన్ ఆంధ్రుల హక్కు

లోక్‌సభలో ఎంపీ అవంతిశ్రీనివాస్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ ప్రజలు గత పదేళ్లుగా రైల్వే జోన్ కోసం డిమాండ్ చేస్తున్నారని అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్ అన్నారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని ఆయన లోక్‌సభలో కోరారు. విజయ వాడ, గుంటూరు, గుంతకల్, వాల్తేర్ డివిజన్లను కలిపి జోన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అవంతి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో అత్యధిక ఆదాయం గడిస్తున్నది వాల్తేర్ డివిజనేనని అవంతి చెప్పారు. 2013-14లో రూ. 6,280 కోట్ల ఆదాయంతో మొత్తం జోన్‌లోనే ఈస్ట్ కోస్ట్ జోన్ 50 శాతం కంటే ఎక్కువ ఆదాయం గడించిందని హర్షం వ్యక్తం చేశారు. విశాఖ నగరానికి సహజ వనరులు పుష్కలంగా ఉన్నాయని, విశాఖ రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే 2 మేజర్ పోర్టులు, కావాల్సినంత స్థలం అందుబాటులో ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఆసియాలోనే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం విశాఖపట్నమని అవంతి తెలిపారు. తూర్పు నావికాదళం, ప్రభుత్వ ప్రైవేటు రంగ భారీ పరిశ్రమలు, వైద్య, విద్య, క్రీడా, మౌలిక వసతులు నగరంలో ఉన్నాయని వివరించారు. అందుకే జోన్ కేంద్రంగా వైజాగ్ అన్నివిధాలుగా అనువుగా ఉంటుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. జాప్యం లేకుండా రైల్వే జోన్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆయన మరోసారి కేంద్రాన్ని కోరారు.


సినిమా టిక్కెట్ల ధర పెంపునకు పచ్చజెండా

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో సినిమా టిక్కెట్ల ధరలను పెంచి వసూలు చేసే వెసులుబాటును థియేటర్ల యజమానులకు హైకోర్టు కల్పించింది. ఇందుకోసం లైసెన్సింగ్ అథారిటీ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతిని పొందాల్సిన అవసరంలేదని, హైకోర్టు స్పష్టం చేసింది. ముందుగా సంబంధిత అధికారులకు సమాచారాన్ని ఇచ్చి థియేటర్లు టిక్కెట్ల ధరలు పెంచుకోవచ్చునని పేర్కొంది. అయితే సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు థియేటర్లకు అనుమతినిస్తూ తేది.12-12-2016న సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును హైకోర్టు సమర్థించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ.భట్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా టిక్కెట్ల ధరలు పెంచుకునేందుకు అనుమతినిచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థిస్తూ రెండు రాష్ట్రాలకు చెందిన థియేటర్ల యజమానులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు శాస్త్రీయ పరిమితులు నిర్ణయించడంపై ఎంతో కాలంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు నాన్చివేత ధోరణి అవలంభిస్తున్న కారణంగా ప్రజలకు సినిమా చూడటం ఖరీదైన వ్యవహారంగా పరిణమించింది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల తీరుపై హైకోర్టు అసహనాన్ని , అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంలో జనవరి3 వరకు స్పష్టమైన నిర?యాన్ని తీసుకోవాలని, క్లాసుల వారీగా ధరలను పొందుపరుస్తూ జీవోలతో రావాలని రెండు తెలుగు రాష్ట్రాలను హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే రెండు ప్రభుత్వాలు కూడా సానుకూలంగా స్పందించకపోవడంతో న్యాయమూర్తి పై ఆదేశాలు జారీ చేశారు.

కోడి పందేలపై హైకోర్టు సీరియస్

- కార్యాచరణ నివేదిక సమర్పించండి
- ఏపీ సీఎస్, డీజీపీలకు హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహిస్తున్న కోడి పందేలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సారి నిర్వహించరాదని హైకోర్టు బ్రేకు వేసింది. ఇక నుంచి కోడి పందేలను నిర్వహించకుండా చూసే బాధ్యత ఏపీ సర్కారుదేనని తేల్చి చెప్పింది. ఒక వేళ కోడి పందేలు జరిగితే ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా అధికారులందరినీ బాధ్యులను చేస్తామని హైకోర్టు తీవ్రంగా హెచ్చరించింది. కోడి పందేల పేరుతో మద్యం, జూదం, గుండాట వంటి క్రీడలు విచ్చలవిడిగా కొనసాగుతున్నా, వాటిని నిలువరించడంలో విఫలమైన ఏపీ ప్రభుత్వంపై హైకోర్టు అసహనాన్ని,అసంత ప్తిని వ్యక్తం చేసింది. వచ్చే సంక్రాంతి పండగ సందరఇంగా అక్రమంగా కోడిపందేలు , జూదం తదితర క్రీడలు జరగకుండా తీసుకున్న చర్యలను వివరిస్తూ కార్యాచరణ నివేదికను సమర్పించాలని హైకోర్టు ఏపీ సీఎస్, డీజీపీలను ఆదేశించింది. కోడిపందేలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలంటూ గత సంవత్సరంలో జారీ చేసిన హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన 43 మంది తహసీర్దార్లపై తీసుకున్న చర్యలను వివరిస్తూ అదనపు అఫిడవిట్ దాఖలు చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ /సంబంధిత అధికారి ని హైకోర్టు ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జి.శ్యాం ప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ ప్రజాహిత వ్యాజ్యాలపై గురువారం మరో సారి విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలు వెలువరించింది. తదుపరి విచారణ సంక్రాంతి సెలవుల తర్వాతకి వాయిదా వేసింది. పశ్చిమ గోదావరి జిల్లా , భీమవరం మండలంలోని వెంప, శ్రీరాంపూర్ గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న కోడిపందేలు, జూదం, గుండాట వంటి క్రీడలు యధేచ్ఛగా నిర్వహిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం తీసుకోవడం లేదని పేర్కొంటూ కె.రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత



వాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. 2017లో వెలువరించిన ఆదేశాల మేరకు కోడిపందేల నిర్వహణను నిలువరించడంలో 43 మంది తహసీల్దార్లు,49 మంది స్టేషన్ హౌస్ అధికారులు(ఎస్ హెచ్ వో) విఫలమైనట్లు పేర్కొంటూ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ లు సమర్పించిన నివేదికలను ధర్మాసనం పరిశీలించింది. గతంలో తాము జారీ చేసిన ఆదేశాలను ధిక్కరించిన అధికారులపై ఏ చర్యలు తీసుకున్నారని ఏపీ ఏజీని ధర్మాసనం ప్రశ్నించింది. తాము గత సంవత్సరం(2017)లో జారీ చేసిన ఆదేశాలను ధిక్కరించిన అధికారులను ఈ ప్రజాహిత వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చి , వారిపై కోర్టు ధిక్క రణ కేసులు ఎందుకఀ నమోదు చేయకూడదో వివరించాలంటూ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ సందర్భంగా ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ.. కోర్టు ఆదేశాలను అమలు చేయని 43 మంది తహసీల్దార్లు, 49 మంది స్టేషన్ హౌస్ అధికారులపై తీసుకున్న చర్యలను వివరిస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి గడువు కావాలని అభ్యర్థించారు. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది పి.వెంకట్ రెడ్డి వాదనలు వినిపిస్తూ గత ఏడాది ధర్మాసనం ఆదేశించినట్లు అన్ని మండలాల్లో తనిఖీ బ ృందాలను ఏర్పాటు చేయలేదన్నారు.

ఏర్పాటు చేసిన కొన్ని కమిటీలు కూడా తనిఖీలు చేపట్టడం లేదని తెలిపారు. ఆ బృందాల్లో తహసీల్దార్, ఎస్ఐ, తో పాటు స్వచ్ఛంద సంస్థ(ఎన్ జీ వో) సభ్యుడిని కూడా చేర్చాలని కోర్టు ఆదేశించినప్పటికీ చేర్చలేదన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ..ఈ కోడి పందేల్లో పాల్గొనేందుకు తిరుపతి ,వరంగల్ నుంచి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో వెళ్తుంటారని తమకు తెలుసని వ్యాఖ్యానించింది. తీర్పును వెలువరించేందుకు ధర్మాసనం తదుపరి విచారణ సంక్రాంతి సెలవుల తర్వాతకి వాయిదా వేసింది.



సమస్యలుంటే చెప్పండి.. పరిష్కరిస్తా

- గ్రామాభివృద్ధిపై చిట్యాల వాసులతో స్పీకర్ ముచ్చట్లు

చిట్యాల, ప్రభన్యూస్ : తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూధనచారి జయశంకర్ భూపాలపల్లి జిల్లా, చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో బుధవారం రాత్రి ప్రగతి నిద్ర చేశారు. చలికాలం కావడంతో చలి నుంచి కాపాడుకునేందుకు గురువారం గ్రామస్థులతో కలిసి చలిమంటలు కాగారు. అనంతరం గ్రామ అభివృద్ధి పై ప్రజలతో చర్చించారు. చిన్ననాటి నుంచి పల్లె జీవన విధానాన్ని వృద్ధులతో ముచ్చటించి గుర్తు చేశారు. గ్రామంలో తిరుగుతూ ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ద్విచక్ర వాహనం పై చెరువు కు చెరుకుని కట్ట పై నడిచారు. గ్రామంలో భీరన్న గుడికి రూ.5 లక్షలు ,గ్రామంలో సెంట్రల్ లైటింగ్, రూ.10 లక్షలతో సీసీ రోడ్లకు నిధులు , చల్లగరిగకు అదనంగా మరో 25 డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తానని స్పీకర్ తెలిపారు. సీఎం ఆశీస్సులతో నియోజక వర్గానికి అదనంగా 2వేల డబుల్ బెడ్రూం ఇండ్లు తెచ్చానని వచ్చే సంవత్సరం ముఖ్యమంత్రితో మాట్లాడి మరో 2వేల డబుల్ బెడ్ రూం ఇండ్లు తీసుకువస్తానని తెలిపారు.

అన్ని రంగాల్లో భూపాలపల్లి నియోజక వర్గాన్ని రాష్ట్రంలో ముం దంజలో ఉంచే విధంగా నిరంతరం ప్రజల మధ్యలో ఉండి అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. స్పీకర్ గ్రామస్థులతో గ్రామం లో పర్యటిస్తుండగా వాణి విద్యానికేతన్ పాఠశాల దాటే సమయంలో విద్యార్థులు వందేమాతం గీతాలాపాన చేస్తుండగా అక్కడే నిలబడి గీతాలాపన చేసి గీతం పూర్తయిన తర్వాత ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు కుంభం రవీందర్ రెడ్డి. కర్రె అశోక్ రెడ్డి, బాలగోని రమేష్, నోముల నాగరాజు, కన్నెబోయిన అశోక్, సమ్మయ్య ,రబ్బాని, బాబా రాజు, తదితరులు ఉన్నారు.

దానకిషోర్‌కు అదనపు బాధ్యతలు

మైనారిటీస్ సంక్షేమశాఖ కార్యదర్శిగా నియామకం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మైనారిటీస్ సంక్షేమ శాఖ ద్వారా వివిధ పథకాలను అల్ప సంఖ్యాక వర్గాలకు అందేలా కృషి చేస్తానని యం. దానకిషోర్ అన్నారు. గురువారం సచివాలయంలో మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యదర్శిగా సయ్యద్ ఒమర్ జలీల్ నుంచి ఆయన అదనపు బాధ్యతలు స్వీకరించారు. మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్య దర్శి అదనపు బాధ్యతలు అప్పగించి నందుకు ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బదలీపై వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా వెలుతున్న సయ్యద్ ఒమర్ జలీల్‌ను ఈసందర్భంగా ఆయన అభినం దనలు తెలిపారు. మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యదర్శి బాధ్యతలు అప్పగిస్తూ.... ఇది ఛాలెంజిగ్ జాబ్ అన్నారు. దానకిషోర్ ఇదివరకు మైనార్టీస్ శాఖ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉన్నందున సమర్ధవంతంగా నిర్వహించగలడని సయ్యద్ ఒమర్ జలీల్ అన్నారు.

నువ్వా..? నేనా..?

- వైన్స్, బార్ల మధ్య మొదలైన పోరు
- ఫిర్యాదుల పరంపర
- కఠిన చర్యలు తప్పేలా లేవు
- కీలక నిబంధనల దిశగా సర్కార్





హైదరాబాద్, ఆంధ్రప్రభ: మద్యం వ్యాపారుల్లో యుద్ధం ఆరంభమైంది. బార్లు, వైన్ షాపుల మధ్య అంతర్యుద్ధం నడుస్తోంది. నూతన ఏడాది వేడుకల సందర్భంగా జరిగిన విక్రయాలతో ఇది మరింత తీవ్రమైంది. ఒకవైపు రిటైల్‌గా మద్యం విక్రయిస్తూనే మరోవైపు బార్లకు తీవ్ర పోటీ ఇస్తున్న సిట్టింగ్‌లపై ఇరు వర్గాల మధ్య పచ్చ గడ్డివేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. చివరకు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకునే వరకు దారితీసింది. ఒకవైపు హోర్డింగ్‌లు, అడ్వర్టయిజ్‌మెంట్ల అంశంలో నెలకొన్న అనిశ్చితిని మించి ఇప్పుడు కొత్త వివాదం అధికారులకు తల నొప్పులు తెస్తోంది. ఆబ్కారీ కమిషనర్‌గా పనిచేసిన చంద్రవదన్ బదలీ కావడంతో బార్లు, వైన్(రిటైల్) షాపుల నడుమ ప్రచ్ఛన్న పోరు తీవ్ర రూపం దాల్చింది. వైన్ షాపుల సిట్టింగ్ రూములపై నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని, నియంత్రణలను చేపట్టా లని కోరుతూ బార్ల యాజమాన్యాలు ప్రభుత్వా నికి ఫిర్యాదు చేశాయి. ప్రస్తుతం ఒక్కో రిటైల్ మద్యం దుకాణానికి రూ.2 లక్షలతొ పర్మిట్ రూమును ప్రభుత్వం ఇస్తుండగా, రిటైల్ రీతిలో కూడా మద్యాన్ని విక్రయించేకునే వెసులుబాటు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంది. బార్లకు అయితే సొంత వంట గదితోపాటు ఎలాంటి రిటైల్ విక్రయాలు లేకుండా సిట్టింగ్‌లకు మాత్రమే అనుమతి ఉంది. కాగా బార్లకు ఒకగంట అదనంగా అంటే రాత్రి 11 గంటలవరకు పనివేళలను నిర్ణయించారు. కానీ వైన్ షాపులకిచ్చిన సిట్టింగ్ రూములతో తాము బిజినెస్ కోల్పోతు న్నామని, ఇక వ్యాపారం చేయలేమని చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించింది. రెండు వర్గాల ఆందోళనలు, పరస్పర ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్రంలో బార్లు, మద్యం దుకాణాలపై నిబంధ నలు కఠినంగా అమలు చేయాలని సర్కార్ యోచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2162 రిటైల్ దుకాణాలు, 852 బార్లు, 24 క్లబ్బులు, 8 టూరిజం లైసెన్సులతో మద్యం వ్యాపారలు సాగుతున్నాయి. వీటిని అక్టోబర్ 1నుంచి సెప్టెంబర్ 31 వరకు అను మతించిన సంగతి తెలిసిందే. 21 ఏళ్లలోపు మైనర్లకు మద్యం సరఫరా, సమయం మించిన తర్వాత మద్యం విక్రయాలు, పర్యవేక్షణ లేమి వంటి వాటికి చెక్ పెట్టేలా కార్యా చరణ సిద్ధం చేస్తున్నారు. ఇకెవరైనా నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దుతోపాటు పీడీ యాక్టు కేసులను కూడా నమోదుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తోంది. ప్రతీ బార్, వైన్ షాపు తప్పనిసరిగా 21 ఏళ్లలోపు మైనర్లకు మద్యం విక్రయించేది లేదని బోర్డును ఏర్పాటు చేయాల్సింగా ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతీ బార్, మద్యం దుకాణానికి చెందిన సిట్టింగ్‌లో సీసీ(క్లోజ్డ్ సర్క్యూట్) కెమెరాలను ఏర్పాటుకు ఆదేశించారు. ఏదేమైనా మద్యం దుకాణం రాత్రి 10 గంటలకు, బార్ 11 గంటలకు మూసివేసేలా పోలీసులకు కీలక ఆదేశాలు అందించారు. కల్లు దుకాణాల్లో దాడులను మరింత తీవ్రం చేయాలని, సరిహద్దు ప్రాంతాల్లో ఎన్‌డీపీపై ఉక్కు పాదం మోపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు రాష్ట్రంలో ఎక్కువగా ఉదయం నిర్దేశిత సమయానికి ముందే మద్యం దుకాణాలు, బార్లు తెరిచి విక్రయా లను ప్రారంభిస్తున్నారని అందిన సమాచారంపై ప్రభుత్వం స్పందించింది. వీటిపై దాడులకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో మద్యం విక్రయాలు, ఏఏ సమయాల్లో ఎక్కువగా జరుగుతున్నాయోనని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ప్రధానంగా ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు 60 శాతం విక్రయాలు సాగుతున్నాయని, రాత్రి 7 తర్వాత 12 గంటలవరకు 40 శాతం వినియోగం జరుగుతున్నట్లు గుర్తించారు. తాజాగా ట్రాక్ అండ్ ట్రేస్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడ ఎలా విక్రయాలు జరుగుతున్నాయని గుర్తించడం సులువవుతోంది. దీనిని బార్లలో కూడా అమలులోకి తెచ్చి వీడియా కెమెరాలకు అనుసంధానించాలని నిర్ణయించారు.

పీడీ, బైండోవర్‌లకు లొంగని వైనం...

ఇప్పటికే పీడీ యాక్టు, బైండోవర్‌లను అమలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు రావడంలేదని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో చట్ట సవరణద్వారా కఠిన శిక్షలకు ఉపక్రమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1968లో ఉమ్మడి రాష్ట్రంలో రూపొందించిన ఏపీ ప్రొహిబిషన్ యాక్టులో కాలానుగుణంగా అనేక మార్పులు చేర్పులు తేవాలని ఆదేశించారు.

వ్యాపారులపై కూడా పీడీ యాక్టు...

పీడీ యాక్టు...ప్రివెన్షన్ ఆఫ్ డిటెన్షన్ యాక్టు, దీనిని పార్లమెంటు చట్టంతో 1950లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1), 21(2) ద్వారా అమలులోకి తెచ్చారు. ఇందులో 34 సెక్షన్లు ఇమిడి ఉన్నాయి. దీనిని మరింత విస్తరించి మైనర్లకు మద్యం విక్రయించే వ్యాపారులపై కూడా మోపాలని నిర్ణయించారు.

భారత బయోటెక్ నుంచి టైఫాయిడ్ వ్యాక్సిన్

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ అభివృద్ధి చేసింది. సంప్రదాయ యాంటీబయోటెక్ మందులకు లొంగని టైఫాయిడ్‌ను కూడా నయం చేయగల ఈ మందు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానుందని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ కృష్ణా యల్లా చెప్పారు. అవకాశాలు కల్పిస్తే భారత్ ఎవరికీ తీసిపోదనేందుకు పూర్తిగా దేశీయ సాంకేతికతతో తయారైన టైఫ్‌బార్ - టీసీవీ నిదర్శనమన్నారు. తాజాగా అందరికీ పంపిణీ చేసేందుకు ఈ వ్యాక్సిన్ ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అర్హత సాధించిందని ఆయన తెలిపారు. ఈ వ్యాక్సిన్ అభివృద్ధికి రూ.150 కోట్లు ఖర్చు చేశామని ఆయన చెప్పారు. 6 నెలల పిల్లల నుంచి కూడా ఈ వ్యాక్సిన్ వాడవచ్చునని, దాదాపు 25 మైక్రో గ్రాముల డోస్‌తో టైఫాయిడ్ వ్యాధికి దూరం కావచ్చునని చెప్పారు. ప్రస్తుతం ఒక్కో డోస్‌కు రూ.1500 వరకు ఖర్చవుతుందని, వాడకం పెరిగినకొద్ది ధరలు తగ్గుతాయని డాక్టర్ కృష్ణా తెలిపారు.

వరల్డ్ బుక్‌ఫెయిర్‌లో పాక్ స్టాల్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జరుగనున్న వరల్డ్ బుక్ ఫెయిర్-2018లో పాకిస్తాన్ పాల్గొననుంది. ఇప్పటివరకు 44 వరల్డ్ బుక్ ఫెయిర్‌లు జరుగగా శనివారం ప్రగతి మైదానంలో ప్రారంభం కానున్న బుక్ ఫెయిర్ 45వది. ఇటీవల భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తలు తలెత్తిన నేపథ్యంలో ఆదేశం నుంచి ఒకే ఒక్క పబ్లిషర్ ఈ ప్రదర్శనలో స్టాల్ పెట్టి పుస్తక ప్రదర్శనలో పాలుపంచుకోనున్నాడు. ఈ ప్రదర్శనను నేషనల్ బుక్ ట్రస్ట్, ఐటీపీవో సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. పాక్ పుస్తకాలకు పాఠకుల నుంచి డిమాండ్ బాగానే ఉందని పాక్ ప్రదర్శనలో పాల్గొనడంపట్ల తాము హర్షిస్తున్నామని నేషనల్ బుక్ ట్రస్ట్ డెరెక్టర్ రీటా చౌదరీ మీడియాతో చెప్పారు.

ఇక పరుగులే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదిలో ఎకరాకు రెండు విడతలుగా రూ.8వేలను ఈ కొత్త సంవత్సరం నుంచే అందించాలని నిర్ణయించింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువరించక ముందే ప్రారంభించిన అన్ని పథకాలను, కార్యక్రమాలను పూర్తిచేసి ప్రజల్లోకి వెళ్ళాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు సమాచారం. కొత్త రాష్ట్రంలో రెండోసారి ఎన్నికలకు వెళ్ళనున్న తెరాస ప్రభుత్వానికి 2018వ సంవత్సరం అత్యంత కీలకం కానుంది. ప్రభుత్వం సైతం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకు సాగాలని ఇప్పటికే నిర్ణయించింది. భారతదేశ యవనికపై తనదైన ముద్రవేసిన ప్రభుత్వం మూడున్నరేళ్ళ పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలకు శ్రీకారం చుట్టింది. ఈ పథకాల్లో అత్యంత కీలకంగా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పథకంగా ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచా రం. 18 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందిం చాలని, మరో 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిం చాలని ప్రతిపాదించింది. మొత్తం 36 లక్షల ఆయకట్టు కు నీరందించేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది పూర్తిచేసి రైతుల పొలాల్లోకి నీరును పారించాలని సీఎం కేసీఆర్ లక్ష్యంగా నిర్దేశించు కున్నారు.

ప్రభుత్వం ముందున్న మరో కీలక లక్ష్యం రెండు పడకగదుల ఇళ్ళ నిర్మాణం. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకైన ఈ పథకాన్ని పూర్తి చేయడం ద్వారా పేద, మధ్య తరగతి వర్గాల్లోని గుండెల్లో తన పేరును చిరస్థాయిగా నిలిచేలా సీఎం కేసీఆర్ ఈ పథకానికి అంకురార్పణ చేశారు. ఇప్పటి వరకు రెండు లక్షల 75వేల ఇళ్ళ నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులను మంజూరు చేసిన ప్రభుత్వం ఈ ఏడాదిలో ఈ ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలోని ఇళ్ళ నిర్మాణ పనులు కొన్నిచోట్ల ఆశించిన స్థాయిలో జరుగుతున్నా అనేక ప్రాంతాల్లో మందకొడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేక జిల్లాలు, నియోజక వర్గాల్లో గుత్తేదార్లు ఇళ్ళ నిర్మాణానికి ముందుకు రావడం లేదని బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతుందన్న భయంతో వారు వీటి నిర్మాణానికి అంతగా ఆసక్తి కనబరచడం లేదన్న ఫిర్యాదులు ఉన్నా యి. ఈ తరుణంలో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకానికి నిధుల లేమీ లేకుండా చూడాలని ప్రతిపాదించింది. వచ్చే నెల శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్‌లో ఈ పథకానికి పెద్దఎత్తున నిధులను కేటాయించాలని ప్రతిపాదించింది. బడ్జెట్ ప్రతిపాద నలను సిద్ధం చేస్తున్న ప్రభుత్వం ఈ పథకానికి విరివిగా నిధులను ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నట్టు తెలుస్తోంది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే 2018లో ఇళ్ళ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వం భావిస్తున్న మరో కీలకమైన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు మిషన్ భగీరథ. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి నల్లా ద్వారా రక్షిత మంచినీరు అందించాలని చేపట్టిన ఈ కార్యక్రమం ఈ ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని ప్రభుత్వం భావించింది. ఈ పథకం పూర్తి చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు కూడా అడగనని సీఎం కేసీఆర్ ఢంకా బజాయించి చెప్పిన సంగతి తెలిసిందే. ఇచ్చిన హామీని నిలబెట్టు కునేందుకు ఈ పథకాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని 25 శాతం గ్రామాలకు ఈ పథకం ద్వారా ఇంటింటికి నీరు అందిం చామని, జనవరి చివరి నాటికి మరో 40శాతం గ్రామాలకు ఈ నీటిని నల్లా ద్వారా అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలోని 54వేల ఇళ్ళకు రక్షిత మంచినీటిని అందించే లక్ష్యంగా ప్రభు త్వం ఈ పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే.

కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టిన రోజునే రాష్ట్రంలోని వ్యవసాయ రంగానిక 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా పథకానికి ప్రభుత్వం అంకురార్పణ చేసింది. మూడు జిల్లాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో రాష్ట్రంలోని 31 జిల్లాలకు ఈ ఉచిత విద్యుత్ సరఫరా పథకాన్ని విస్తరింపజేసింది. సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయడం ద్వారా ఏడాదిలో రైతులు మూడు పంటలు పండించవచ్చని తద్వారా వారు ఆర్థికంగా బల పడతారన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. దీంతోపాటు రైతులకు ఈ ఏడాది నుంచే ఎకరాకు రూ.8వేల పెట్టుబడి సాయం కింద రెండు విడతలు ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ ఖరీఫ్ నుంచే ఈ సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

నేడోరేపో ఐపీఎస్‌ల బదలీలు

- సీఎం పరిశీలనలో దస్త్రం
- కీలక శాఖల్లో పోస్టింగుల కోసం ఎవరికివారు ప్రయత్నాలు
- తన మార్క్ మార్పు కోసం మహేందర్‌రెడ్డి యత్నం
- జిల్లాల పర్యటనలో డీజీపీ బిజీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రానున్నది ఎన్నికల సంవత్సరం. ఈ కోణంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విషయంలో ఆచీ తూచీ నిర్ణయం తీసుకుంటోంది. ప్రజల నాడికి అనుగుణంగా పాలనా నిర్ణయాలతో పాటు వాటిని అమలు చేసే వారెవరనే విషయాన్ని పరిశీలించి బాధ్యతలను కట్టబెడుతోంది. ఇటీవల సీనియర్ ఐఎఎస్‌లను స్థాన చలనం చేసిన ప్రభుత్వం ఇప్పుడు సీనియర్ ఐపిఎస్‌ల బదలీలపై దృష్టి పెట్టింది. ఏ అధికారి సామర్థ్యం ఎంత, ఎవరికి ఏ బాధ్యతను అప్పగిస్తే బాగుంటుందన్న విషయాలను సిఎం నిశితంగా తెలుసుకుంటున్నారని అంటున్నారు.

సాధారణ ఎన్నికలకు ముందు జరుపుతున్న బదలీలు ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలిగేలా ఉండొద్దన్న అభి ప్రాయంతో ఉన్న సిఎం అధికారుల జాబితాను ముందుంచుకుని చర్చిస్తున్నారని తెలిసింది. డిజిపిగా ఎం. మహేందర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న అనంతరం చెప్పుకోతగ్గ స్థాయి బదలీలు పోలీసు శాఖలో జరగలేదు. బాధ్యతలు తీసుకున్న నెల రోజుల తర్వాత డిజిపి జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టారు. క్షేత్ర స్థాయిలో పోలీసుల పని తీరు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అభి



ప్రాయాలను తెలు సుకునేందుకు మహేందర్‌రెడ్డి తనదైన శైలిలో ప్రయత్నాలను ముమ్మరం చేస్తూనే పాలనపై తనదైన మార్క్‌ను చూపించేందుకు ప్రయత్నాలను ముమ్మ రం చేస్తున్నారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ తో పాటు ఎసిబి చీఫ్ లాంటి కీలక శాఖలను పూర్తి స్థాయి అధికారుల నియామకంలో తన మార్క్ కోసం ప్రయ త్నిస్తున్నారన్న చర్చ పోలీసు శాఖలో జరుగుతోంది.

హైదరాబాద్ పోలీసు కమిషనర్ పదవి కోసం సీనియర్ ఐపిఎస్‌లు అంజనీకుమార్, రాజీవ్ త్రివేది లు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. వాస్తవానికి రాజీవ్ త్రివేది డిజిపి పదవిని ఆశించినా ఫలించలేదు. ఈసారి బదలీలలో ఈయనకు మంచి పోస్టింగ్ ఇవ్వాలని సిఎం భావిస్తున్నట్లు సమాచారం. మరోపక్క పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా పని చేస్తున్న సివి ఆనంద్ పేరు కూడా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఆనంద్ పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకు వచ్చిన సంస్కరణలు, ఫలితాలపై సిఎం గతంలోనే అభినందించిన నేపథ్యంలో ఈసారి ఆనంద్‌కు మంచి పోస్టింగ్ రావచ్చని అధికారులు అంటున్నారు. అదే విధంగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న అకున్ సబర్వాల్‌కు స్థాన చలనం కల్పించి కీలకమైన ఇంటెలీజెన్స్ బాధ్యతలను కట్ట బెట్టే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న నవీన్‌చంద్‌కు రాష్ట్రంలోని ఏదో ఒక కమిషనరేట్‌కు కమిషనర్‌గా నియమించవచ్చని తెలిసింది.

ఎసిబి చీఫ్‌గా కొనసాగుతున్న జె.పూర్ణచందర్ రావు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా కూడా కొనసాగుతున్నారు. పూర్ణచందర్‌రావును ఎసిబిలోనే ఉంచి నియామక బోర్డు చైర్మన్‌గా గోపీకృష్ణను నియమించవచ్చని అంటున్నారు. సైబరాబాద్, కరీంనగర్, వరంగల్ కమిషనర్‌లతో పాటు మరికొంత మంది కమిషనర్లకు కూడా స్థాన చలనం ఉండవచ్చని, వీరికి మరింత కీలకమైన బాధ్యతలను అప్పగించే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

పేదలకు పెద్దదిక్కుగా ఉంటా

- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా
- అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకుంటా
- ప్రతినయాపైసా తిరిగి ఇప్పిస్తా
- మరుగుదొడ్డి నిర్మించుకోండి
- ఆత్మగౌరవం పెంచుకోండి
- లేకపోతే మౌన దీక్ష చేస్తా
- ఇచ్ఛాపురం జన్మభూమిలో ఏపీ సీఎం చంద్రబాబు



ఇచ్ఛాపురం శ్రీకాకుళం, ప్రభన్యూస్ బ్యూరో: రాష్ట్రంలో పేదలందరికీ నేనే పెద్ద దిక్కుగా ఉంటా, వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటా, అన్నివేళలా అండగా ఉంటానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అన్నారు. 5వ విడత జన్మభూమిలో భాగంగా గురువారం జిల్లాలోని ఇచ్ఛాపురంలో మధ్యాహ్నం 2 గంటలకు జన్మభూమి సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పేదల సంక్షేమం కోసం తాను రేయింబవళ్ల కష్టించి పనిచేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో అసమానతలను తగ్గించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నానని తెలిపారు. పేదల జీవన ప్రమాణాలను పెంచేందుకు తాను ఎన్నో ప్రణాళికలను రూపొందించానని, కనీసం నెలకు రూ.10 వేల ఆదాయం లభించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ముందు ముందు దీన్ని మరింత పెంచేందుకు మరిన్ని పథకాలను ప్రవేశపెడతానని తెలిపారు. గత నాలుగేళ్లలోనే పేదల జీవన ప్రమాణాలు కొంత మెరుగయ్యాయని అన్నారు. ఇదే విషయాన్ని ఆయన సభాముఖంగా ప్రజలను గట్టిగా చప్పట్లు కొట్టి తెలపాలని కోరగా, పెద్దఎత్తున హర్షధ్వానాలు వినిపిం చాయి. నదుల అనుసంధానంతోనే రాష్ట్రా న్ని కరవు రహిత రాష్ట్రంగా చేయగలమని ఇందుకు సంబంధించి ఇప్పటికే గోదావరి, కృష్ణా నదులను అనుసంధానించామని తెలిపారు. త్వరలోనే వంశధార, నాగావళి నదులను అనుసంధా నిస్తామని హర్షధ్వానాల మధ్య చెప్పారు. అంతేకాకుండా, ఇచ్ఛాపురం వరకూ నీటిని తీసుకువస్తామని తెలిపారు. మార్చినాటికి రాష్ట్రా న్ని ఓడీఎఫ్‌గా మారుస్తామని, ఇందులో విఫలమైతే తానే స్వయంగా ధర్నా చేస్తానని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరించారు.

రాష్ట్రంలో బహిరంగ మలవిసర్జన పూర్తిగా నిరోధించేందుకు చేపట్టిన స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఎవరైనా గ్రామాల్లో మరుగుదొడ్లను నిర్మించుకోకపోతే తానా గ్రామానికి వచ్చి బస చేసి మౌన పోరాటం చేస్తానని చంద్రబాబునాయుడు తెలిపారు. భారత్ కోసం, స్వచ్ఛభారత్ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ మిషన్ కమిటీకి తనను చైర్మన్‌గా నియమిం చారని, ఆ మేరకు తాను ఆయా రాష్ట్రాలలో పర్యటించి ఏ విధంగా స్వచ్ఛభారత్ చర్యలు చేపట్టాలో తెలియజేస్తూ నివేదిక అందజేశామన్నారు. అందులో భాగంగా ప్రతీ ఇంటికీ మరుగుదొడ్లు నిర్మించాలని సూచించామని దీనికి కేంద్రం అంగీకరించి కేంద్ర ప్రభుత్వం రూ.7,200 మరుగుదొడ్డి నిర్మాణానికి అందిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.7,800 కలిపి రూ.15 వేలు ఇస్తుందని తెలిపారు. ఆ మేరకు రాష్ట్రాన్ని ఈ సంవత్సరం మార్చి 31వ తేదీలోగా బహిరంగ మల విసర్జన రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో నెల్లూరు, కృష్ణ, గుంటూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాలు ఓడిఎఫ్ జిల్లాలుగా ప్రకటించడం జరిగిందని, ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు ఈ సంవత్సరం మార్చి 31వ తేదీలోగా పూర్తిగా ఓడిఎఫ్ జిల్లాలుగా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. మరుగుదొడ్ల నిర్మాణం వలన గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ ఆరోగ్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. మరుగుదొడ్లు నిర్మించకపోతే తాను ఒకరోజు మౌనదీక్ష చేస్తానని, అయినా ప్రజలు స్పందించకపోతే తానే స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి అక్కడ ప్రజలందరూ మరుగుదొడ్లు నిర్మించుకునేంతవరకూ అక్కడే ఉండి ఆ తరువాత అమరావతి వెళ్తానని తెలిపారు.

దాదాపు గంటసేపు ప్రసంగించిన ముఖ్యమంత్రి పూర్తిగా పారిశుధ్యం, మరుగుదొడ్లపైనే ప్రసంగించడం జరిగింది. ఒకవేళ ఎక్కడైనా విఫలమైతే తానే స్వయంగా ధర్నా చేస్తానని, ఒకరోజంతా నిరాహారదీక్ష చేస్తానని ముఖ్యమంత్రి కలెక్టర్లను హెచ్చరిం చారు. రాష్ట్ర సమస్యలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ డిపాజిట్ దారులు దాదాపు 20 లక్షల మంది ఉన్నారని, వీరిలో ఎక్కువ శాతం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వారేనని అన్నారు. అందుకే వీరందరికీ న్యాయం చేయాలన్న లక్ష్యంతో అగ్రిగోల్డ్ సంస్థలను పూర్తిగా అమ్మివేసి డిపాజిట్ దారులందరికీ త్వరలోనే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఒక ప్రైవేటు సంస్థ ముంబాయి నుంచి వచ్చి అగ్రిగోల్డ్ ఆస్తులను తీసుకుని డిపాజిట్‌దారులకు చెల్లింపులు చేసేందుకు ముందుకు వచ్చిందని, అయితే కోర్టుల్లో పూర్తిగా వివాదాలు పరిష్కారం అయిన తరువాత పరిహారం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద రానున్న సంవత్సరంలో 19.50లక్షల ఇళ్లు నిర్మించనున్నామని ఇందులో ఇప్పటికే లక్ష ఇళ్లు లబ్ధిదారులచేత సామూహిక గృహ ప్రవేశం చేయించామని, త్వరలో మరో రెండున్నర లక్షల ఇళ్లు గృహ ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు. ఇంత వరకు జరిగిన పనులు, కార్యక్రమాలు ఒక ఎత్తయితే, 2018లో పూర్తిస్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి పనులు జరుగుతాయని తెలిపారు.

మళ్లీ తెరపైకి డ్రగ్స్ కేసు

సాక్ష్యాధారాల సేకరణ పూర్తి: అకున్ సబర్వాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశ వ్యాప్తం గా, ముఖ్యంగా సినీ రంగంలో పెను సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో మరోసారి కదలిక మొదలవుతుంది. ఈ కేసులో కీలక నిందితులు ఒక్కొక్కరు బెయిల్‌పై బయటకు వస్తున్న తరుణంలో చార్జ్‌షీట్లను దాఖలు చేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు నిర్ణ యిం చారు. విదేశాలలో తయారైన డ్రగ్స్‌ను అత్యంత పకడ్బంధీగా రాష్ట్రానికి దిగు మతి చేసుకుని విక్రయిస్తున్న ముఠాను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ సమాచారం ఆధారంగా అధికారులు 22 మందిని అరెస్టు చేసి, సినీ రంగానికి చెందిన 12 మంది ప్రముఖులను విచారించారు. విచారణలో భాగంగా దర్యాప్తు అధికారులు సినీ దర్శకుడు పూరి జగన్నాథ్, నటుడు తరుణ్‌ల నుంచి గోళ్ళు, వెంట్రుకలు నమూనాలుగా సేకరించారు. దీంతో సినీ నటి చార్మీ కోర్టుకు వెళ్ళి నమూనాలపై స్టే తెచ్చుకున్నారు. మొత్తంగా 12 కేసులను నమోదు చేశారు. దాదాపు ఆరు మాసాల పాటు స్తబ్ధుగా ఉన్న ఈ కేసును మరోసారి వేడెక్కించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. నిర్ణీత గడువులోగా చార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడంతో కేసులో కీలక నిందితులలో ఒకరైన కెల్విన్ ఇటీవలే బెయిల్‌పై విడుదలయ్యాడు. మరొక నిందితుడు మైక్ కమింగో కూడా బెయిల్ కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశాడు. సినీ రంగంలోని వారితో పాటు విచారించిన వారు, పట్టుబడ్డ ఇద్దరు కీలక నిందితులు మొత్తం 24 మంది నమూనాలను పరీక్షల కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఈ నమూనాల పరీక్షల రిపోర్టులలో తాజాగా అయిదింటి వివరాలను ఫోరెన్సిక్ అధికారులు కోర్టుకు సమర్పించారు. కోర్టు నుంచి ఈ వివరాలను సేకరించిన దర్యాప్తు అధికారులు చార్జ్‌షీట్‌లను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కేసులో నమూనాల రిపోర్టులు అందుతున్నాయని, మరో పక్క సాక్ష్యాల సేకరణ పూర్తయిందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. సేకరించిన ఆధారాలు, రిపోర్టులలోని సారాంశాలను క్రోడీకరించిన అనంతరం చార్జీషీట్‌ను దాఖలు చేస్తున్నామని, ఎట్టి పరిస్థితులలో నిందితులు తప్పించుకునేందుకు వీలు లేకుండా పకడ్బంధీగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు.

నెలనెలా ఖాళీల భర్తీ

అందరికీ పదోన్నతులు

- దేశంలోనే ఆదర్శవంతమైన పోలీస్ వ్యవస్థ
- ప్రతిపౌరుడు యూనిఫాంలేని పోలీసే
- రాష్ట్రవ్యాప్తంగా థర్డ్ పార్టీ కాల్ సెంటర్లు
- రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్ /వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో : పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో ఉన్న ఖాళీలను నెల నెల భర్తీ చేస్తామని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. ఒక్క పోస్టు కూడా ఖాళీ పెట్టకుండా భర్తీచేస్తామని, అందరికి ప్రమోషన్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీసులు కూడా పదోన్నతి విషయంలో సామరస్యపూర్వ కంగా పరిష్కరించుకోవాలని, అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకరావాలని ఆయన సూచించారు.
దేశంలోనే ఆదర్శవంతమైన పోలీస్ వ్యవస్థ రాష్ట్రంలో ఉందని మరింత చేరువ కావడానికి శాఖపరంగా నిర్ణయాలు తీసుకున్నట్లు రాష్ట్ర డీజీపీ మహేం దర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సత్వరన్యాయం కోసం థర్డ్ పార్టీ కాల్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర మంతటా ఒకేరక మైన నాణ్యమైన సేవలందించడానికి పోలీస్ శాఖ ప్రయత్నిస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడు యూనిఫాంలేని పోలీస్‌గా వ్యవహరించి తెలంగాణ రాష్ట్రాన్ని శాంతి భద్రతల నిలయంగా మార్చడానికి సహకరించాలన్నారు. గురువా రం నాడు జిల్లాకు వచ్చిన ఆయన పోలీస్‌శాఖ పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం కాజీపేటలోని ఎన్ఐటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో పోలీస్ శాఖ రాజీలేకుండా పనిచేస్తుందని రాష్ట్ర మంతటా ఒకే రకమైన పోలీస్ వ్యవస్థను అమలులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. పోలీస్ శాఖ పనితీరుపై ప్రజల మనోభావాలను తెలుసుకునేందుకు కమ్యూనిటీ పోలీసింగ్ ఆక్టివిటి సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనివల్ల ప్రజలు పోలీసుల భాగస్వామ్యంతో శాంతి భద్రతల పరిరక్షణ సులవు అవుతుందని, ప్రజల మనోభావాలకు అనుగుణంగా పోలీస్ శాఖ మరింత ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు. పోలీస్ శాఖ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తున్న ఫ శాంతి భద్రతల పరిరక్షణ ద్వారా అభివృద్ధి సాధ్యమవు తుందని అందుకు పెట్టుబడులు సహకరిస్తాయని డీజీపీ మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం శాంతి భద్రతల నిలయంగా పెట్టుబడులకు ధామంగా ఉండా లని, విదే శాల నుంచి

శాంతి భద్రతల ద్వారానే పెట్టుబడులు

పెట్టుబడులు రావాలని అందుకు పోలీస్ శాఖ పని తీరు దోహదపడుతుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంలో భాగంగా ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పోలీస్ శాఖ పనిచేసి ప్రజల ఆధారాభిమానాలు పొందాలని అన్నారు.



లితాలను ఇవ్వడా నికి శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నామన్నారు. ఆ లక్ష్య సాధనలో పోలీసులు యజ్ఞంలా ముందుకు వెళ్లాలన్నారు. ప్రజల భాగస్వామ్యం, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రజలు సుఖశాంతులతో ఉండేలా పోలీస్ వ్యవస్థలో సమూల మార్పు తీసుకొచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కమ్యూనిటీ పోలీసింగ్ ఆక్టివిటి సెంటర్‌లను ఏర్పాటు చేస్తామని, దీనివల్ల ప్రజలు, పోలీసులు భాగస్వామ్యంతో శాంతి భద్రతల పరిరక్షణ సులవు అవుతుందన్నారు. నేరాల పరిశోధనలో ఆధునిక టెక్నాలజీ ఉపయోగంపై అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు, టెక్నాలజీతో నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తామన్నారు. సోషల్ మీడియా మానిటరింగ్ సెంటర్‌లు అన్ని జిల్లాల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్ లు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లతో అనుసంధానం చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ఎన్నో సత్ఫలితాలు సాధించామని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధమైన, నాణ్యమైన సేవలందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రజలు నచ్చేవిధంగా పనిచేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, దీనివల్ల ప్రజలకు పోలీసులపై గౌరవం పెరుగుతుందని, పోలీసులు, ప్రజల పట్ల ప్రవర్తించిన తీరుపై పోలీస్ వ్యవస్థతో పాటు ప్రభుత్వానికి కీర్తి ప్రతిష్టలు ఆధారపడుతాయని డీజీపీ అన్నారు. ఆ దృష్టితో పోలీసులకు దిశనిర్ధేశం చేస్తున్నామన్నారు. నేరాల నియంత్రణకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఐజీ నాగిరెడ్డి, వరంగల్ సీపీ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

అన్నదాతకు కరెంట్ కష్టాలుండవ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రంలో ఇక నుంచి వ్యవసాయరంగానికి విద్యుత్ కొరత ఉండదని రాష్ట్ర వ్యవసా యశాఖ మంత్రి పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం సచివాలయం లోని తన చాంబర్‌లో వ్యవసాయశాఖ -2018 క్యాలెండర్, విత్తన ధృవీకరణ సంస్థ డైరీలను మంత్రి ఆవిష్కరించారు. ఇదే సందర్భంలో ఉద్యాన విశ్వవిద్యాలయం -2018 క్యాలెండర్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం మాట్లాడుతూ రాష్ట్రంలో 24లక్షల మోటర్లకు 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా కోటి ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు. రైతులు అప్పుల బారిన పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఎకరానికి రూ.8000 పెట్టుబడిగా సమకూరుస్తుందని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సి.పార్థసారధి, కమీషనర్ జగన్మోహన్, ఉద్యాన శాఖ డైరెక్టర్ ఎల్ వెంకటరామిరెడ్డి, విత్తన ధృవీకరణ సంస్థ డైరెక్టర్ కేశవులు తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖలో 1800లైన్‌మెన్ పోస్టుల త్వరలో భర్తీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రప్రభుత్వం విద్యుత్ శాఖలో ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీఎస్ ఎన్‌పీడీసీఎల్ పరిధిలో 1800జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి త్వరలోనే ప్రకటన జారీకానుంది. సంస్థ పాలకమండలి సమావేశం తరువాత మరో వారం పదిరోజుల్లో ఈ నియామకాల ప్రకటన జారీ చేయనున్నట్టు అధికారులు తెలిపారు. వరంగల్ కేంద్రంగా పనిచేస్తున్న సంస్థ ట్రాన్స్‌కోలో 330 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టులు, 174 సబ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్), 1100 జూనియర్ లైన్‌మెన్ పోస్టులతో పాటు మొత్తం 1604 పోస్టుల భర్తీకి ప్రకటన జారీకాగా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలో 150 ఏఈ పోస్టులు, 500జూనియర్ అసిస్టెంట్, 100 జూనియర్ అక్కౌంట్స్ ఆఫీసర్ పోస్టులతో పాటు 2000 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి మరో వారం రోజుల్లో ప్రకటన వెలువడుతుందన్నారు

మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించండి

లోక్‌సభ జీరో అవర్లో కేంద్రాన్ని కోరిన ఎంపీ సీతారాం నాయక్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను జాతీయ గిరిజన పండుగ లేదా వేడుకగా గుర్తించాలని మహబూబాబాద్ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటు సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో జీరో అవర్లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఉత్తరాది రాష్ట్రాల్లో జరుపుకునే వనాజ్ ఉత్సవాన్ని జాతీయ గిరిజన పండుగగా గుర్తించినందున, ఆ తరహాలోనే దక్షిణ, మధ్య భారత దేశాల్లో ప్రాచుర్యం పొందిన మేడారం జాతరను కూడా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మేడారం జాతర చరిత్ర, విశేషాలు, ప్రత్యేకతలను ఆయన సభలో వివరించారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ నగరానికి 110 కి.మీ. దూరంలో గోదావరి దండకారణ్యంలోని మేడారం గ్రామంలో జరిగే సమ్మక్క - సారలమ్మ జాతర ప్రతి రెండేళ్లకు ఓసారి మాఘ శుద్ధ పౌర్ణమి నాడు ప్రారంభమై నాలుగు రోజులపాటు జరుగుతుందని సీతారాం నాయక్ తెలిపారు. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ జాతరను 1996లో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాష్ట్ర పండుగగా గుర్తించిందని చెప్పారు. ఈ జాతరను ఉత్తరాదిన జరిగే కుంభమేళాతో పోల్చవచ్చని సీతారాం నాయక్ అన్నారు. ఎందుకంటే కుంభమేళా తరహాలోనే ఇక్కడికొచ్చే భక్తులంతా విధిగా పక్కనే ఉన్న సంపన్నవాగులో (కాలక్రమంలో జంపన్నవాగుగా మారింది) స్నానమాచరిస్తారని వివరించారు.

లాలూ మనుషులు ఫోన్లు చేశారు

- సీబీఐ జడ్జి శివ్‌పాల్‌సింగ్ సంచలన వ్యాఖ్యలు
- జైల్లో చలి ఎక్కువగా ఉంది: లాలూ
- దాణా కేసులో శిక్ష ఖరారు నేటికి వాయిదా

రాంచి: సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం జడ్జి శివపాల్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. లాలూ మనుషుల నుంచి తనకు ఫోన్ కాల్స్ వచ్చాయని చెప్పారు. తనను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారన్న ఆయన, సంభాషణల వివరాలను వెల్లడించలేదు. దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్ యాదవ్ సహా, ఇతర నిందితులకు శిక్ష ఖరారును సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది. వాస్తవానికి ఈ కేసులో బుధవారమే శిక్ష ఖరారు చేయాల్సి ఉంది. అయితే, న్యాయవాది ఒకరు మరణించిన నేపథ్యంలో గురువారానికి వాయిదా వేశారు. కొద్దిసేపు వాదనల తర్వాత మరోమారు శిక్షఖరారు అంశం వాయిదా పడింది. శిక్ష ఖరారు తీర్పును వీడియోకాన్ఫరెన్సు ద్వారా వెల్లడించాలా? లేక కోర్టులోనే చెప్పాలా? అనే విషయంపైనా శుక్రవారం నిర్ణయం తీసుకుంటారు. కాగా, కోర్టులో వ్యక్తిగతంగా హాజరయ్యేందుకు లాలూ ప్రసాద్ సుముఖత వ్యక్తం చేశారు. తన మద్దతుదారులు ఎవరూ కోర్టు గదిలో ఎలాంటి నినాదాలు చేయబోరని ఆయన అభయమిచ్చారు. వాదనల అనంతరం న్యాయమూర్తికి, లాలూకి మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. జడ్జి మాట్లాడుతూ, 'నీ కోసం చాలా రిఫరెన్సులు వచ్చాయి. నీ శ్రేయోభిలాషులు నాకు ఫోన్లు చేశారు. అయినా, నేను చట్టం ప్రకారమే నడుచుకుంటాను' అని శివ్‌పాల్ సింగ్ వెల్లడించారు. ఈ సందర్భంగా లాలూ తనదైన శైలిలో స్పందించారు. స్థిమితమైన మనస్సుతో తీర్పు చెప్పండి అని కోరారు. రూ. 89.27 కోట్ల రూపాయల నిధులను కాజేసిన 21 ఏళ్ల కిందటి అవినీతి కేసులో, గతనెల 23న సీబీఐ న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. లాలూతోపాటు మరో 15మందిని దోషులుగా నిర్ధారించింది. ఇదిలావుండగా, 70 ఏళ్ల లాలూకు ఆరోగ్యసమస్యలు ఉన్నాయని, వీలైనంత మేరకు తక్కువ శిక్ష విధించాలని జడ్జికి విన్నవించుకుంటామని ఆయన తరఫు న్యాయవాది మీడియాకు తెలిపారు. మరోవైపు గరిష్ట శిక్ష విధించాలని సీబీఐ న్యాయవాదులు వాదిస్తున్నారు. లాలూ యాదవ్‌ను ప్రస్తుతం బిర్సా ముండా జైలులో ఉంచారు. ఇదిలావుండగా తీర్పుపై విమర్శలు చేసినందుకు గాను ఆర్జేడీ నేతలు తేజస్వి యాదవ్, రఘువంశ్ సింగ్, శివానంద్ తివారితోపాటు కాంగ్రెస్ నాయకుడు మనీశ్ తివారీకి బుధవారం కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ అయ్యాయి. ఈనెల 23లోగా వివిరణ ఇవ్వాలని సీబీఐ కోర్టు ఆదేశించింది.

జైల్లోనే మందకృష్ణ దీక్ష

- అరెస్టుకు నిరసనగా తెలుగు రాష్ట్రాల్లో నిరసనలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు మరో 26 మంది ఎమ్మార్పీఎస్ నాయకులు చంచల్‌గూడ జైల్లో ఉపవాస దీక్షను కొనసాగిస్తున్నారు. కృష్ణమాదిగ చేపట్టిన దీక్షకు జైల్లో ఉన్న ఇతర ఖైదీలు కూడా మద్దతు ప్రకటించి తమ సంఘీభావం తెలిపారు. అరెస్టుకు నిరసనగా రెండు తెలుగు రాష్ట్రాల్లో దీక్షలు, ధర్నాలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఎమ్మార్పీఎస్, కృష్ణ మాదిగపై టీఆర్ఎస్ ప్రభుత్వం కక్షగట్టిందని వివిధ పార్టీల నేతలు మండిపడ్డారు. అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పలు పార్టీల నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అరెస్టు చేసిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను వెంటనే విడు దల చేయాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం గవర్నర్ నరసింహన్‌ను కలవా లని నిర్ణ యం తీసుకున్నారు. అంతే కాకుండా కాంగ్రెస్, టీడీపీ, బీజేపీతో పాటు వామప క్షాలు, తెలంగాణ ఇంటిపార్టీ, ప్రజా సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలోనూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నేత సంపత్‌కుమార్ తెలిపారు.

ఉద్యమ నేతపై అక్రమ కేసులా..?



వర్గీకరణ సాధనతో పాటు సమాజంలో నెలకొన్న వివిధ సామాజిక అంశాలపై ఉద్యమం చేస్తున్న ఉద్యమకారుడు మంద కృష్ణమాదిగను అరెస్టు చేసి జైల్లో పెట్టడం టీఆర్ఎస్ ప్రభుత్వానికి తగదని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని ఆయన డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు.

మాదిగ జాతిని జైల్లో పెట్టినట్లే..

మంద కృష్ణను జైల్లో పెట్టడమంటే మాదిగ జాతి మొత్తాన్ని జైల్లో పెట్టడమేనని మాజీ మంత్రి మోత్కుపల్లి నరిసింహులు మండిపడ్డారు. గురువారం ఆయన అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. వర్గీకరణ చేయాలని అడిడితే అరెస్టులు చేసి జైల్లో పెట్టడమేంటని.. సీఎం కేసీఆర్ మాదిగలను అణిచివేసే కుట్రలు చేస్తున్నారని మోత్కుపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. జైల్లో ఉపవాస దీక్ష చేస్తున్న మంద కృష్ణమాదిగకు ఎలాంటి హాని జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని ఆయన హెచ్చరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని కాంగ్రెస్ ఎమ్మెల్యే సంపత్ కుమార్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి తెలంగాణ ఇంటిపార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

ప్రభుత్వం కక్ష కట్టింది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎమ్మార్పీస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష పూర్వ కంగా వ్యవహరిస్తోందని భాజపా శాసనసభా పక్షం నాయకుడు జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. దురుద్దేశపూర్వకంగా నే ఆయనను కేవలం వారం రోజుల వ్యవధిలోనే రెండు సార్లు జైలుకు పంపిందని మండిపడ్డారు. మంద కృష్ణపై ద్వేషం పెంచుకుని తెలంగాణ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరును నిలదీస్తున్నందుకే ఆయనపై వ్యక్తిగత ద్వేషం పెంచుకోవడం తగదన్నారు. మొత్తం ఎమ్మార్పీస్ ఉద్యమాన్నే అణిచివేసే విధంగా తెరాసప్రభుత్వం వ్యవహించడం సిగ్గుచేటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమాలు చేయడం, నిరసనలను శాంతియుతంగా వ్యక్తం చేసే స్వేచ్ఛ కూడా తెలంగాణ రాష్ట్రంలో లేదా? అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు.

అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు

లాభమా...? నష్టమా..?



- కాంగ్రెస్‌లో తర్జన భర్జన
- సీట్ల సంఖ్య పెంపుతో నష్టమే : సీనియర్లు
- కమిటీ వేయాలని నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఉన్న అసెంబ్లీ నియోజక వర్గాల పెంపు రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాఫిక్‌గా మారింది. ఇరు రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజక వర్గాల సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో నియోజక వర్గాల సంఖ్య పెంచడం వల్ల లాభమెవరికి..? నష్టమెవరికనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ఈ అంశంపైన హస్తం పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరూ సీట్ల సంఖ్య పెరగడం వల్ల లాభమే అంటుంటే.. మరికొందరూ మాత్రం నష్టమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్టీ విధానం ఎలా ఉండాలనేదానిపైన టీ పీసీసీ ఆధ్వర్యంలో ఒక కమిటిని వేయాలనే నిర్ణయానికి వచ్చింది. కమిటి నివేదికను పార్టీ హై కమాండ్‌కు అప్పగించాక.. సీట్ల సంఖ్య పెంపు బిల్లును రాజ్యసభలో అడ్డుకోవాలనే యోచనలో టీ కాంగ్రెస్ ఉన్నట్లు సమాచారం.

ఒక వేళా కేంద్ర ప్రభుత్వం సీట్లు పెంచేందుకు ముందుకు వస్తే.. పునర్విభజన చట్టంలో పొందుపర్చిన వాటిన్నింటిని

సీట్ల పెంపునకు పునర్విభజన మెలిక

అమలు చేయాలని మెలిక పెట్టాలనే నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే విభజన చట్టంలో సీట్ల సంఖ్యను పెంచాలని అప్పటి యూపీఏ ప్రభుత్వమే పేర్కన్నదని, ఇప్పుడు అడ్డుకోవడమేంటని రెండు తెలుగు రాష్ట్రాల్లోని టీఆర్ఎస్, టీడీపీ ప్రభుత్వాలు విమర్శలు చేసే అవకాశం ఉందని, ఆ రెండు పార్టీల వాదనలు గట్టిగా తిప్పికొట్టాలంటే చట్టంలో పొందుపర్చిన వాటన్నింటిని అమలు చేయాలనే డిమాండ్‌ను తెరపైకి తీసుకురావాలనే యోచనలో ఉన్నారు. నియోజక వర్గాల సంఖ్య పెంపుతో అధికార టీఆర్ఎస్‌కే ఎక్కువగా లాభం ఉంటుదని, దాంతో బిల్లును అడ్డుకోవడమే అభిప్రాయ వ్యక్తం అవుతోంది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్, టీడీపీతో పాటు ఇతర పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలను, ప్రజా ప్రతినిధులతో పాటు చాలా మంది సీనియర్లను చేర్చుకున్నారు. దీంతో కారు ఓవర్‌లోడ్‌తో ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతే కాకుండా ఇప్పుడున్న టీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో సగం మందిపైన ప్రజల్లో వ్యతిరేకత ఉందనే అభిప్రాయాన్ని కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. సీట్లు పెరడం వల్ల పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారితో పాటు పాతవారికి కూడా టికెట్లు ఇచ్చేందుకు అధికార టీఆర్ఎస్‌కు మంచి అవకాశం ఇచ్చినట్లవు తుందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నియోజక వర్గాల పెంపు అంశాన్ని వ్యతిరేకించాలని పార్టీలో అంతర్గత చర్చ జరుగుతోంది. నియోజక వర్గాలు పెరగడం వల్ల వాటి స్వరూపమే పూర్తిగా మారిపోవడం, చిన్నవిగా ఉండటం వల్ల అధికార టీఆర్ఎస్ అన్ని రకాలుగా తమకు అనుకూలంగా మల్చుకునే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు.

సీట్లు సర్దుబాటుకు అవకాశం

ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ లో మరో వాదన కూడా వినిపిస్తోంది. నియోజక వర్గాల సంఖ్య పెరగడం వల్ల టీఆర్ ఎస్ సిట్టింగ్‌లకు టికెట్ ఇవ్వ డం.. వారిపైన వ్యతిరేకతను సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. అంతే కాకుండా టీఆర్ ఎస్ వ్యతిరేక శక్తులను ఏకతాటిపైకి తీసుకుచ్చి వారితో వచ్చే ఎన్నికల్లో కలిసి పని చేయడానికి సీట్ల సర్ధుబాటుకు అవ కాశం ఉంటుందని చర్చ జరుగుతోంది. పార్టీ కోసం కష్టపడుతున్న వారికి అవకాశం ఇవ్వడంతో పాటు కలిసొచ్చే పార్టీలతో సీట్లు సర్దుబాటులో ఇబ్బందు లు ఉండవని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయ పడ్డారు. డిలిమిటేషన్‌ను అడ్డుకోలేని పరిస్థితి ఉంటే.. రాజకీయం ఎలా ఎదుర్కోవాలో ఇప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ ఒక అంచనాకు రావాలనే భావనలో నాయకులు ఉన్నారు. ఎన్నికల ముందే హడావుడి కాకుండా ఒక నిర్ధిష్టమైన కార్యాచరణతో ముందుకు పోవాలని భావిస్తున్నారు.

తెదేపాకే బడుగుల మద్దతు

- స్వార్థపరులే పార్టీని వీడారు
- తెదేపా విజయాలను ప్రచారం చేద్దాం
- కార్యకర్తల శిక్షణా తరగతుల్లో ఎల్. రమణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కొందరు నాయకులు స్వార్థంతో పార్టీని వీడినప్పటికీ బడుగు, బలహీన వర్గాల్లో పార్టీపట్ల ఆదరణ తగ్గలేదని, కార్యకర్తలు కూడా పార్టీకే అంకితమై ఉన్నారని తెలుగు దేశంపార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎల్.రమణ అన్నారు. తెదేపా ప్రభుత్వంలోనే తెలంగాణలో బడుగు, బలహీన వర్గాలకు రాజకీయాల్లో అవకాశాలు వచ్చాయని, దీంతో పార్టీపై ప్రజల్లో ఎన్నో ఆశలు ఉన్నాయని ఆయన అన్నారు. పార్టీని ఇబ్బందులు పెట్టేందుకు అనేక శక్తులు కుటిల యత్నాలు చేస్తున్నాయని, పార్టీ కార్యకర్తలంతా సమిష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలుగుదేశంపార్టీ కార్యకర్తల శిక్షణా తరగతులను ఆయన గురువారం ఎన్‌టిఆర్ భవన్‌లో ప్రారంభించారు. దశల వారీగా ఇచ్చే శిక్షణలో భాగంగా మొదటి విడత తరగతులకు 124 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కాశీనాథ్ శిలువేరు నిర్వాహకులుగా వ్యవహరించారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, రాష్ట్రంలో దొరలు, పటేళ్ళ మధ్య పోరాటం జరుగుతుందని, ఈ పరిస్థితుల్లో ప్రజల కోసం నిలిచే తెదేపా మళ్ళీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నా రు.తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ, పార్టీ ఇచ్చిన అవకాశాలతో ఆస్తులు, ప్రతిష్ట కూడగట్టుకున్న స్వార్థపర నేతలే పార్టీని వీడారని దుయ్య బట్టారు. వచ్చే ఎన్నికల్లో ఇలాంటి శక్తులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. 1978 ఎన్నికల్లో రాష్ట్రంలో జనతా పార్టీ నుంచి ఎన్నికైన 60 మంది ఎమ్మెల్యేలను వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి తప్ప మిగతా వారంతా కాంగ్రెస్‌లో చేరారని, కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఫిరాయిం పుదారులంతా ఓటమి పాలయ్యారని ఆయన గుర్తుచేశారు. 1983లో తెదేపా టికెట్‌పై ఓడిపోయిన కేసీఆర్, తుమ్మల, ఎర్రబెల్లి, నాగంలాంటి నేతలను ఎన్‌టిఆర్ మళ్ళీ గెలిపించి ఆ తర్వాత వారికి పార్టీలో, ప్రభుత్వంలో గుర్తింపునిచ్చారని ఆయన గుర్తుచేశారు. రాజకీయ బిక్షపెట్టిన పార్టీకి ద్రోహం చేసిన వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని రావుల కోరారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.పెద్దిరెడ్డి మాట్లా డుతూ, తెదేపా తెలంగాణకు 8 లక్షల మంది సైనికులు, అపార అనుభవం కలిగిన చంద్రబాబు నాయకత్వం, ఎన్‌టిఆర్ ఆశీస్సులు ఉన్నందున వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి మంచి రోజులు రానున్నాయని ఆశాభావం వ్యక్తంచేశారు. బడుగు, బలహీన వర్గాల్లో పార్టీకి మళ్ళీ ఆదరణ వస్తోందని, పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

వ్యవసాయానికి సాంకేతికత జోడించాలి

కమిషనర్ జగన్మోహన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వ్యవసాయరంగానికి సాంకేతికత జోడించి అధిక ఉత్పత్తులు సాధించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమీషనర్ జగన్మోహన్ అన్నారు. ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం ఏవోల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అధికారులను ఆగ్రానమిస్టులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని వారికి అందేలా ఏవోలు కృషి చేయాలన్నారు.
వీసీ డా.ప్రవీణ్ రావు మాట్లాడుతూ వివిధ రకాల పంటల్లో ఉత్పాదకత పెంచేందుకు కృషి చేయాలన్నారు. పంటల సాగు వివరాలు ఎప్పటికపుడు సేకరించా లన్నారు. భూసార పరీక్షల ఆధారం గా పంటలసాగును చేపట్టే విధంగా రైతుల్లో అవగాహన పెంచాలని ప్రవీణ్ రావు పేర్కొన్నారు.

2019లో అధికారం మాదే

సీఎల్‌పీఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మిర్యాలగూడ, ప్రభన్యూస్ : రాబోయే 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని.. అందుకోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సీఎల్‌పి ఉపనేత, నల్గొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలంలోని ఉట్లపల్లి, తడకమల్ల గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగు తుందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపర్చడంలో పూర్తిగా విఫలమయ్యా రని విమర్శించారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు ఆచరణకు నోచుకోలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వ మోసపూరిత పాలనను ప్రజలందరి గుర్తించారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

సోమయ్య కుటుంబానికి అండగా ఉంటా

ఉట్లపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యులు సోమయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండదండగా ఉంటానని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అకాల మరణం చెందిన సోమయ్య కుటుంబాన్ని గురువారం పరామర్శించిన వెంకట్‌రెడ్డి వారికి 20వేల రూపాయల ఆర్థికసాయం అందజేశారు. సోమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీరాష్ట్ర కార్యదర్శి సైకిలాబ్‌నాయక్, జడ్‌పిటిసి శంకర్‌నాయక్, ఎంఏ కరీం, పొదిల శ్రీనివాస్, చిరుమర్రి కృష్ణయ్య, బసవయ్యగౌడ్, చిరంజీవి, ఈశ్వరాచారి తదితరులు ఉన్నారు.



తలాక్ బిల్లు ఇప్పటికింతే!

- ప్రతిష్ఠంభన తీవ్రం
- పట్టువీడని ప్రతిపక్షం
- మెట్టుదిగని ప్రభుత్వం
- చర్చకు విపక్షం ససేమిరా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లుపై ప్రతిష్ఠంభన వీడలేదుపైగా ఇంకా తీవ్రమైంది. ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందేనని విపక్షాలు, ఆ అవసరం లేదని చర్చ జరగాలని అధికారపక్షం పట్టుబట్టడంతో రాజ్యసభలో గందరగోళం నెలకొంది. దాంతో సభ శుక్రవారానికి వాయిదా పడింది. గురువారం మధ్యాహ్నం తర్వాత ట్రిపుల్ తలాక్ బిల్లు రాజ్యసభ ముందుకు వచ్చింది. ఇటీఈ సందర్భంగా ఆ వెంటనే కేంద్రగా, ఆర్థికమంత్రి, రాజ్యసభ నేత అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ, బుధవారం విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానం చెల్లదని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారని చెప్పారు. సెలెక్ట్‌కమిటీలో సభ్యులు అందరూ ఉండాలని, అందులో బీజేపీ లేకుండా కమిటీ పేర్లను ప్రతిపాదించడం చెల్లదని జైట్లీ స్పష్టం చేశారు. అయినా, 24గంటల ముందు తీర్మానాన్ని ప్రతిపాదించాలని పలు సాంకేతిక అంశాలను లేవనెత్తారు. నిబంధనలు, సంప్రదాయాలన్నింటిని కాంగ్రెస్‌పార్టీ ఉల్లంఘిస్తోందన్నారు. లోక్‌సభలో తమ అభ్యంతరాలపై పట్టుబట్టని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభలో రెండునాల్కల ధోరణితో వ్యవహరిస్తోందని అన్నారు.

అయితే, బీజేపీ తీసుకు వచ్చిన ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాల్సిందేనని ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ కోరారు. బిల్లు తప్పుల తడకగా ఉందని, దీంతో ముస్లిం మహిళలకు న్యాయం జరగకపోగా, అన్యాయం చేస్తుందన్నారు. ట్రిపుల్ తలాక్ బిల్లు ఉద్దేశాన్ని తాము వ్యతిరేకించడం లేదని అన్నారు. అయితే తలాక్ చెప్పిన భర్తకు మూడేళ్లు జైలు శిక్ష విధిస్తే ఆ సమయంలో భార్య, పిల్లలు బాగోగులు ఎవరూ చూసుకుంటారని ప్రశ్నించారు. దీని వల్ల ముస్లిం మహిళలకు అన్యాయం జరుగుతుందని అన్నారు.

ఈ వాదనతో టిఎంసి ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, బిజెడి ఎంపీ సుఖేందరాయ్ ఏకీభవించారు. ట్రిపుల్ తలాక్ బిల్లును సభలో చర్చ చేపట్టకుండా, సెలెక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని డిమాండ్ చేశారు. తాము అన్ని నిబంధనల ప్రకారమే తీర్మానాన్ని ప్రవేశపెట్టామని, బుధవారం అర్ధంతరంగా ఆగిపోయిన ఓటింగ్‌ను చేపట్టాలని కోరారు. అయితే సభలో ఈ అంశంపై ఏకాభిప్రాయం లేదని డిప్యూటీ చైర్మన్ కురియన్ అన్నారు. సభలో గందరగోళం ఉన్న సమయంలో దీనిని చేపట్టలేమన్నారు. సభ గందరగోళం నెలకొనడంతో జిఎస్టీ సవరణ బిల్లును చేపట్టాలని అధికారపక్షం కోరగా, కాంగ్రెస్ పార్టీ సభ్యులు అడ్డుకున్నారు. ఇరుపక్షా లు పరస్పరం నినాదాలతో సభ దద్దరిల్లింది. దాంతో సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ కురియన్ ప్రకటించారు.

సెలెక్ట్ కమిటీకి పంపేది లేదు...

ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపేదే లేదని బీజేపీ పట్టుదలతో ఉంది. శుక్రవారం బిల్లును రాజ్యసభ చేపట్టే అవకాశం లేదు. దాంతో బిల్లు భవితవ్యం బడ్జెట్ సెషన్‌లో తేలనుంది. ఈ లోగా కాంగ్రెస్ పక్షా న చేరిన రాజకీయ పార్టీలు అన్నాడిఎంకె, డిఎంకె, బిజెడి లాంటి పార్టీలను బుజ్జగించి తమ దారిలోకి తెచ్చుకోవాలని బిజెపి వ్యూహకర్తలు ఆలోచిస్తున్నారు. దాని వల్లే గత రెండురోజులుగా ఈ అంశంపై ముందుకు వెళ్లలేని పరిస్థితిని స ష్టించారు.

కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు

- పాక్‌కు 15ఏళ్లలో 33 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం:అమెరికా
- డబుల్ గేమ్ ఆడుతున్న పాక్: నిక్కీ హేలీ
- డ్రాగన్ సమర సన్నాహం
- యుద్ధానికి సిద్ధం కండి: జిన్‌పింగ్

న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై పాక్ వైఖరిని తప్పుపడుతూ అమెరికా ఆంక్షలతో ఊరుకోకుండా నిర్దిష్ట చర్యలకు ఉపక్రమించింది. గురువారం, ఉగ్రవాదులకు ఊతం ఇస్తున్న పాకిస్తాన్‌పై నిర్దిష్ట చర్యలు తీసుకోనున్నామని అమెరికా అధ్యక్షభవనం నుంచి ఒక ప్రకటన వెలువడింది. ఈ అంశాన్ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా పరిగణనిస్తున్నాడని వైట్‌హౌస్ తెలిపింది. అమెరికా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని పాకిస్తాన్ దుర్వినియోగంచేస్తూ అమెరికాను వంచించిందని అధ్యక్ష భవనం మీడియా కార్యదర్శి సారా సాండర్స్ విలేకరుల సమావేశంలో అన్నారు. గత 15 ఏళ్లుగా అమెరికా 33 బిలియన్ డాలర్ల ఆర్థిక సహాయాన్ని అందించగా పాకిస్తాన్ మోసంచేసి ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ వారికి స్వర్గధామంగా మారిందన్నారు. 'పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని నిరోధించడానికి ఇంకా చర్యలు తీసుకోవాల్సి ఉంది, మేము కూడా అదే కోరుకుంటున్నాం' అని సాండర్స్ చెప్పారు. కొన్ని రోజుల్లో ఈ చర్యలను ప్రకటించి పాకిస్తాన్‌పై ఒత్తిడిని పెంచుతామన్నారు. అయితే ఏమేం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలన్నదానిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని.. రెండు రోజుల్లోగా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు ప్రకటిస్తామని సాండర్స్ తెలిపారు. సోమవారం అధ్యక్షుడు ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ.. గత పదిహేనుళ్లుగా అమెరికా తెలివితక్కువ తనంతో 33 బిలియన్‌డాలర్ల సహాయాన్ని పాకిస్తాన్‌కు చేసిందని అన్న విషయం తెలిసిందే. ట్రంప్ ప్రకటన వెలువడిన ఒకరోజు తర్వాత అధ్యక్షభవనం నుంచి మరొక ప్రకటన వెలువడింది.

అమెరికా రాయబారులను పంపించేయండి: ఇమ్రాన్‌ఖాన్



ఇస్లామాబాద్: అమెరికా అధ్యక్షుడు పాక్‌ను మోసకారి దేశమని ప్రకటించటం పట్ల తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ ఛైర్మన్ ఇమ్రాన్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్ నుంచి అమెరికా రాయబారులను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. అంతేకాక, అఫ్ఘని స్తాన్‌కు వెళ్లే అమెరికా దళాలను పాకిస్తాన్‌గుండా అనుమతించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వారికి ఆహార సరఫరాను ఆపాలన్నారు. అమెరికా నేతృత్వంలో ఉగ్రవాదంపై పాక్ పోరాడి 70వేలమందికి పైగా తమ దేశస్థులను పోగొట్టుకుందన్నారు. 100 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టాన్ని తమ దేశం చవిచూసిందన్నారు. పాకిస్తాన్ ఒకరి తరపున యుద్ధం చేయటాన్ని ఆపేయాలని తాను ఎప్పటినుంచో చెపుతున్నాని ఇమ్రాన్ అన్నారు.

ఉక్కిరిబిక్కిరవుతున్న పాక్

అమెరికా తమ దేశంపై విధిస్తున్న ఆంక్షలతో పాక్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అమెరికా ప్రకటనలు ఇరుదేశాల మధ్య సంబంధాలను కఠినంగా మారుస్తున్నాయి. పరస్పర విశ్వాసాలకు ఇవి విఘాతం మారాయి అని పాకిస్తాన్ విచారాన్ని వ్యక్తం చేసింది. మరోవైపు పాకిస్తాన్ విదేశాంగ మంత్రి క్వాజా ఆసిఫ్ తమకు అమెరికా 15 ఏళ్లో 33 బిలియన్ డాలర్లు మించిన సహాయాన్ని అందించిదన్న ట్రంప్ ప్రకటన తప్పని ట్వీట్ చేశారు. ట్రంప్ ఒక ఆడిట్ సంస్థతో మదింపుచేస్తే ఈ విషయం నిరూపితమవుతుందని అన్నారు.

అమెరికాతో పాక్ బంధం 7 దశాబ్దాల నాటిది

పాక్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించిన తర్వాత ఆదేశంతో తొలిసారిగా సంబంధాలను ఏర్పరుచున్న దేశం అమెరికానే. సోవియట్ యూనియన్, అమెరికా మధ్య పరోక్షయుద్ధ కాలంలో కూడా పాక్ కీలక పాత్ర వహించి అమెరికావైపు మొగ్గింది. 1972లో చైనాలో అమెరికా అధ్యక్షుడు నిక్సన్ పర్యటనకు ఏర్పాటుచేసి అమెరికా, చైనాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పడానికి పాక్ యంత్రాంగం ప్రయత్నించింది. జుల్ఫికర్ అలీబుట్టో కాలంలో మధ్య, దక్షిణాసియా ప్రాంతాల్లో సోవియట్ ప్రాబల్యంను తగ్గించడానికి ఉద్దేశించిన ఆపరేషన్ సైక్లోన్‌లో భాగంగా పాకిస్తాన్‌లో సోవియట్‌యూనియన్‌కు వ్యతిరేకంగా ఆఫ్ఘన్ ముజాహిదీన్‌లకు శిక్షణ ఇచ్చేందుకు నిధులను అందించింది. ఇదే ప్రస్తుతం అమెరికాకు ప్రతికూలంగా మారింది. అప్పుడు నిధులు అందించి ఇప్పు డు ఉగ్రవాదులను పోషిస్తున్నామని మా దేశా న్ని నిందించడం సరికాదని పాక్ అంటోంది. సోవియట్ యూనియన్ పతనానంతరం రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. పాక్, భారత్‌తో పోటీప డి అణు కార్యక్రమం చేపట్టడంతో అమెరికా ప్రెస్లర్ సవరణను ఆమోదించి ఆంక్ష లు విధించింది. 2005 తర్వాత అఫ్ఘన్ తాలి బాన్, క్వెట్టా షురా సంస్థల ఉగ్రవాదులకు పాక్ ఆశ్రయ మిస్తోందని అమెరికా ఆరోపించింది. 2011లో అమెరికా మాజీ సైనికుడు, సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ కాంట్రాక్టర్ రేమండ్ అల్లెన్ డేవిస్ లాహోర్‌లో హత్యకు గురవడం, అబోట్టాబాద్‌లో ఒసమా బిన్ లాడెన్ అమెరికా భద్రతాదళాల చేతిలో హతంకావటం, సలాలలో నాటో దళాలు పాక్-ఆఫ్ఘన్ సరిహద్దుల్లో దాడుల ఘటనతో మళ్లీ రెండు దేశాల మధ్య అపనమ్మకాన్ని పెంచాయి.

ఆంక్షలు భారత్‌కు అనుకూలమే..

ట్రంప్ ఇటీవల భారత్‌ను వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ప్రకటించారు. అంతేకాక అధ్యక్ష భవనంకు భారత్ నిజమైన మిత్రుడు అని అన్నారు. హిందూ మహాసముద్రంలో చైనా ప్రాబల్యంను నిరోధించడానికి అమెరికా, భారత్‌లు ఉమ్మడిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. అటు పాకిస్తాన్ ఉగ్రవాదు లకు ఆశ్రయమివ్వడాన్ని నిలిపివేయాలని ప్రధాని నరేంద్రమోడీ, ట్రంప్‌లు ఉమ్మడి ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2015, 2016లో ముంబై, పఠాన్‌కోట్ దాడులకు సంబంధించి ఇరువురు ప్రస్తావించా రు. హిజ్బుల్‌ముజాహిదీన్ నేత సయీద్ సలావుద్దీన్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించేటట్లు భారత్ ప్రయత్నించింది. ప్రస్తుతం సయీద్ హిజ్బుల్, సైమైక్య జిహా ద్ కౌన్సిల్‌కు నేతగా మారారు.పాకిస్తాన్. పివోకే ప్రాంతంలో పాక్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ పాలన నడిపిస్తోంది. మరోవైపు జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదులను చొప్పించి, అశాంతికి మూలకారణమవుతోంది. ఈ విషయంలో అమెరికా వైఖరి ఇంకా స్పష్టం కావాల్సివుంది. ఇక చైనా తలపెట్టిన వన్ బెల్ట్- వన్‌రోడ్‌లో భాగంగా నిర్మిస్తున్న కారిడార్‌పై భారత్ ఆందోళన వ్యక్తం చేస్తున్నవిషయం తెలిసిందే. చైనా మౌలిక సదుపాయాలను పెంచుకోవచ్చు కాని ఇతర దేశాల సార్వభౌమత్వానికి భంగం కలిగించరాదని ఇరు నేతలు ప్రకటించారు. పాకిస్తాన్‌పై ట్రంప్ ఆంక్షలు, చర్యలు దక్షిణాసియాలో భారత్ పెద్దన్న పాత్ర పోషించడానికి ఆటంకాన్ని తొలగించిందని చెప్పవచ్చు. అయితే చైనా రూపంలో మరో ఆటంకం పొంచివుంది. చైనా రహదారి నిర్మాణంకు పాక్ సహకరిస్తోంది. అమెరికా ఆధిక్యతను చైనా, రష్యాలు ప్రశ్నించడం, చైనాకు పాక్ దగ్గరవడం తదితర అంశాలు అమెరికాకు మరింత ఆగ్రహం తెప్పిస్తున్నాయనటంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో పాక్ ఉగ్రవాదులకు స్వర్గ దామంగా మారిందని అమెరికా గుర్తించటం.. భారత్‌కు కొంతలో కొంత ఊరటనిస్తుందని సందేహం లేదు. దీనిపై ఎప్పటినుంచో అమెరికాకు భారత్ తెలిపినప్పటికి పట్టించుకోలేదు.





యుద్ధానికి సిద్ధం కండి



ఉ. కొరియా, అమెరికాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తల నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైనిక దళాలనుద్దేశించి ప్రసంగించాడు. సైనిక దళాలు తగిన శిక్షణతీసుకుని శక్తివంతం కావాలన్నారు. జిన్‌పింగ్ సందేశాన్ని దేశవ్యాప్తంగా 4000 సైనిక పటాళాలు ప్రత్యక్షప్రసారంలో వీక్షించాయి. ఈ ప్రసారంలో చైనా సైనిక పాటవం, అధ్యక్షుడు వారినుద్దేశించే ప్రసంగం చిత్రీకరించారు. వేలకొద్దీ దళాలు, 300 వ్యవస్థీకరించిన సైనిక వాహనాలు 7000 మంది చైనా సైనికులతో తీర్చి దిద్దిన ట్రూప్‌లు తమ అధ్యక్షుడి ఆదేశాల కోసం ఎదురుచూడటం కన్పించింది. 'సైన్యాని కంతటికి నేను ఆదేశాలు జారీచేస్తున్నాను. అన్ని స్థాయిల్లో సైన్యం తగిన శిక్షణను చేపట్టి బలోపేతం చేయండి.. యుద్ధానికి సిద్ధంగా ఉండండి' అని జిన్‌పింగ్ అన్నారు. సైన్యం ప్రజల భాగస్వామ్యం, పోటీతో శిక్షణను చేపట్టాలి.



మోడీకి నెతన్యాహు ప్రత్యేక కానుక

జెరూసలెం: ఇజ్రాయెల్ ప్రధా నమంత్రి బెంజిమిన్ నెతన్యాహు తన మిత్రుడు నరేంద్ర మోడీకి ప్రత్యేక కానుక ఇవ్వబోతున్నారు. లవణ జలా లను శుద్ధిచేసే గాల్-మొబైల్ జీప్‌ను భారత ప్రధానమంత్రి స్వయంగా అందజేస్తారు. ఈనెల 14నుంచి ప్రారం భమయ్యే నాలుగు రోజుల ఇండియా పర్యటనలో దీనిని మోడీకి బహుకరిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. గతేడాది జూన్‌లో మోడీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లినప్పుడు దీని గురించి నెత న్యాహు వివరించారు. మెడిటెర్రనీన్ సముద్ర తీరానినికి చేరుకున్న సమ యంలో ఈ బగ్గీ జీప్‌ను సందర్శించారు. సముద్ర జలాలను స్వచ్ఛమైన నీటిగా మార్చే ప్రత్యే క ఏర్పాటు కలిగిన ఈ జీపు నరేంద్రుడిని ఎంతగానో ఆకట్టుకుంది. తాజా పర్యటన నేపథ్యంలో గాల్-వాటర్ జీపును మిత్రుడికి ప్రత్యేక కానుకగా ఇవ్వాలని నెతన్యా హు నిర్ణయించారు. నాటి పర్యటనలో ఇద్దరు నేతలు మోకాళ్ల లోతు సముద్ర జలాల్లో నడుచుకుంటూ సరదాగా చిట్‌చాట్ చేసుకున్నారు. అనంతరం బగ్గీ జీపు లో పయనించారు. వైన్‌గ్లాస్‌లలో నింపిన డీసాల్టేషన్ నీటిని మోడీ రుచిచూశారు.

ముంబైలో మరో అగ్ని ప్రమాదం

ముంబై: దేశ ఆర్థిక రాజధా నిలో మరో అగ్ని ప్రమాదం సంభ వించింది. గురువారం తెల్లవారు జామును ఈస్ట్ అంధేరి ప్రాంతం లోని మైమూన్ మంజిల్ అపా ర్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు కుటుంబ సభ్యులు మరణించారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మృ తులను సకిన కపాసి (14), మొహిసిన్ (10), తస్లీమ్ (42), దావూద్ అలి (80)గా గుర్తించారు. మూడో అంతస్థులో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇరుగుపొరుగు వారికీ గాయాలయ్యాయి. వీరిని హోలీస్పిరిట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. తెల్లవారు జామున 2 గంటలకు మొదలైన మంటలను 4.15 గంటలకు చల్లార్చారు. దాదాపు రెండు గంటలపాటు ఫైర్ సిబ్బంది శ్రమించారు. 14 మంది మృతికి కారణమైన కమల మిల్స్ ఘటన మరువక ముందే ఈ సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

కిమ్‌కు కేరళ సీఎం ప్రశంసలు

కోజికోడ్: కేరళ సీఎం పిన రయి విజయన్ ఉత్తర కొరియాను మద్దతు పలికేలా ప్రశంసలతో ముంచెత్తారు. కొరియా అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గడంలేదనీ విజయ వంతంగా అమెరికా వ్యతిరేకతను అనుసరిస్తోందని విజయన్ ఉత్తర కొరియాను పొగడ్తలతో ముంచెత్తా రు. ఇటీవలన కోజీకోడ్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో విజయన్ ఈ వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్ర ప్రయోగాలపై అమెరికా, ఉత్తర కొరియా మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత అమెరికాను హెచ్చరించేలా ఉత్తర కొరి యా క్షిపణి ప్రయోగాలు చేపట్టింది. కొత్త ఏడాది కూడా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ అణువిస్పోటన బటన్ ఎల్లప్పుడూ తన టేబుల్‌పైనే ఉంటుందని వివాదస్పద వ్యాఖ్యలు చేయటం బదులుగా ట్రంప్ అదేవిధంగా బదులిచ్చిన సంగ తి విదితమే. ఉత్తర కొరియా ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా వ్యవహరిస్తున్న నేపథ్యంలో కేరళ సీఎం ఉత్తర కొరియాకు మద్దతుగా మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకొంది.

బీఎస్‌ఎఫ్ దాడిలో ఉగ్రవాది హతం

న్యూఢిల్లీ: పాక్‌నుంచి అక్రమంగా దేశంలోకి ప్రవేశించబోయిన చొరబాటుదారుడిని సరిహద్దు భద్రతా దళాలు కాల్చి చంపాయి. గురువారం ఉదయం ఏడుగంటలకు భారత్ -పాకిస్థాన్ అంతర్జాతీయ సరిహద్దు (ఐబి) వద్ద ఉన్న కంచె దూకి దేశంలోకి వచ్చేందుకు సదరు వ్యక్తి యత్నించాడు. దీంతో అతడిని నిలువరించేందుకు భద్రతా దళాలు కాలుపులు జరిపాయని అధికారులు వెల్లడించారు. జమ్మూ కాశ్మీర్ ఆర్‌ఎస్ పురా సెక్టార్లో అర్నియా వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. కాగా ఈ ప్రాంతంలో ఇంకా చొరబాటుదారులు ఉన్నరా అని నిర్ధారించుకునేందుకు గాలింపులు చేపట్టారు. గతేడాది సెప్టెంబరులో యూరి సెక్టార్‌లో భారీ ఆయుధాలతో చొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భారత సైన్యం మట్టుబెట్టింది.

ఆధార్ ఎంతో భద్రం: యూఐడీఏఐ

న్యూఢిల్లీ: ఆధార్‌కార్డులోని వ్యక్తిగత విషయాల గోప్యత విషయమై యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీ ఏఐ) మరో సారి స్పందించింది. కేవలం రూ.500 అందజేస్తే ఒక బిలియన్ (100 కోట్ల) ఆధార్ నెంబర్లకు సంబంధించిన వారి వివరాలు ఇస్తున్నారని పత్రికల్లో వార్తలు ప్రచురితం అయ్యాయి. దీంతో కార్డుదారులు ఎలాంటి భయాబ్రాంతులకు గురికావొద్దని, వ్యక్తిగత వివరాలు రాబట్టుకోవడం అసాధారణమని, ఇలాంటి రూమర్లను వ్యాప్తి చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అని యూఐడీఏఐ అధికారులు గురువారం కొట్టిపారేశారు. బయోమెట్రిక్ విధానంలో అందరి వివరాలు ఎంతో జాగ్రత్తగా ఉన్నాయని ప్రకటించింది. ఈమేరకు అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు. భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని తేల్చి చెప్పారు. కేవలం ఉన్నతాధికారులకు మాత్రమే వివరాలు చూసే అవకాశం ఉంటుందని, దీనికి కూడా ఆధార్ కార్డు నెంబర్ అత్యవసరం అవుతుందని తెలిపారు. ఎవరైనా అడిగితే కేవలం ఆధార్ నెంబర్, పేరు మాత్రమే చెప్పాలని, బయోమెట్రిక్ సంబంధించిన అంశాలు ఏవీ ఇవ్వొద్దని సూచించారు. ఎవరు హ్యాక్ చేసినా క్షణాల్లో పట్టుకునే విధమైన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు.

మాల్యా నేరస్థుడు: ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ: అప్రతిష్ఠ పాలైన వ్యాపారవేత్త విజయ్ మాల్యాను ఒక ప్రకటిత నేరస్థుడిగా ఢిల్లీ కోర్టు బుధవారం నిర్ధారించింది. ఫెరా ఉల్లంఘన కేసులో పదే పదే సమన్లు జారీ చేసినప్పటికీ న్యాయస్థానం ఎదుట హాజరుకావడంలో మాల్యా వైఫల్యాన్ని పరిగణనలోకి తీసుకున్న చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ దీపక్ షెహ్రావత్ ఈ మేరకు ఆదేశం జారీ చేశారు. గడచిన 30 రోజుల్లో విజయ్ మాల్యా ఈ న్యాయస్థానం ఎదుట హాజరుకావడంలో విఫలమయ్యారు. ఆయన తరపున ఎలాంటి ప్రాతినిధ్యం లేని దృష్ట్యా ఆయన్ను ఒక ప్రకటిత నేరస్థుడిగా నిర్ధారించడమైనది అని కోర్టు పేర్కొంది. న్యాయస్థానం గత ఏప్రిల్ 12న మాల్యాపై ఓపెన్ ఎండెడ్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ తరహా వారెంట్ అమలులో ఎలాంటి కాల పరిమితి ఉండదు. అలాగే 2016, నవంబర్‌లో మాల్యాపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తున్న సందర్భంగా ఆయన తిరిగి రావడానికి మొగ్గు చూపడంలేదని, దేశ న్యాయవ్యవస్థపై చిన్నచూపు ఉన్నదని కోర్టు పేర్కొంది. పలు కేసుల్లో విచారణలను ఎదుర్కొంటూ కోర్టుకు గైర్హాజరవుతున్న మాల్యాపై నిర్బంధ ప్రక్రియ మొదలుపెట్టాల్సి ఉందని న్యాయస్థానం తెలిపింది.

ఉరి నుండి యావజ్జీవం

- జిగిషా హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పు



న్యూఢిల్లీ : గతేడాది ఐటీ ఉద్యోగిని జిగిషా ఘోష్ హత్య కేసులో నిందితులుగా ఉన్న రవికపూర్, అమిత్ శుక్లాకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించింది. బెంచ్ న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.మురళీధర్, ఐఎస్ మెహతా పై శిక్షను ఖరారు చేశారు. గతేడాది ట్రయల్ కోర్టు ఇద్దరితో పాటు బల్జీత్ మాలిక్‌కు ఉరి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టుకు వెళ్లగా వారికి ఉరి శిక్షను జీవిత ఖైదుగా తగ్గిస్తూ.. న్యాయమూర్తులు గురువారం తీర్పు చెప్పారు. 9ఏళ్ల క్రితం జిగిషాను వీరు ఉదయం 4 గంటల సమయంలో ఆఫీస్ కారులో వసంత్ విహార్‌లోని ఆమె స్వగృహంలో డ్రాప్ చేయడానికి వెళ్లారు. దీనికి ముందు ఆమెపై లైంగిక దాడి జరిగింది. అనంతరం ఆమెను హత్య చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. జిగిషా మృతదేహాన్ని హర్యానాలోని సూరజ్‌కుండ్ సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. జిగిషాను హత్య చేసిన అనంతరం ముగ్గురు దుర్మార్గులు ఆమెకు సంబంధించిన బంగారు నగలు, రెండు సెల్‌ఫోన్లు, డెబిట్, క్రెడిట్ కార్డులను 2009, మార్చి 18న ఎత్తుకెళ్లారు. ముగ్గురిని పోలీసులు వారంలోపు అరెస్టు చేశారు. ఏటీఎం కార్డు వీరిని పట్టించింది. దక్షిణ ఢిల్లీలోని సరోజినీ మార్కెట్‌లో వీరు జిగిషా ఏటీఎంతో విలువైన వస్తువులు కొనుగోలు చేశారు.

జిగ్నేష్, ఉమర్‌పై ఎఫ్ఐఆర్

- అల్లర్లకు వీళ్లే కారణమంటూ ఫిర్యాదు
- విశ్రామ్‌బాగ్ పీఎస్‌లో పలు సెక్షన్ల కింద కేసు
- ముంబైలో మేవానీకి ఎదురు దెబ్బ
- విద్యార్థి సదస్సును అడ్డుకున్న పోలీసులు
- గుజరాత్‌లో ర్యాలీ...

పుణెలో ఇద్దరి మృతికి కారణమైన భీమాకోరేగావ్ ర్యాలీకి సంబంధించి కారకులపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ప్రాథమికంగా గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ, విద్యార్థి నేత ఉమర్ ఖలీద్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇద్దరు తమ ప్రసంగాలతో దళితులను రెచ్చగొట్టడంతోనే ర్యాలీలో అల్లర్లు చెలరేగాయని నిర్ధారించుకున్నారు. అదేవిధంగా ముంబైలో తలపెట్టిన విద్యార్థి సదస్సును సైతం పోలీసులు అడ్డుకున్నారు. మేవానీతో పాటు ఉమర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్‌లోనూ దళితుల ర్యాలీని ఉడానా రైల్వే స్టేషన్ వద్ద నిలువరించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా 149 సెక్షన్ విధించారు. గుజరాత్ హోంమంత్రి ప్రదీప్ సింగ్ జడేజా పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

పుణె : భీమా కోరేగావ్‌లో అల్లర్లు వ్యాపించడానికి, అది కాస్త మహారాష్ట్ర వ్యాప్తంగా పాకడానికి దళిత నాయకుడు జిగ్నేష్ మేవానీతో పాటు జవహర్‌లాల్ యూనివర్సిటీ విద్యార్థి ఉమర్ ఖలీద్ కారణంటూ ఇద్దరిపై పోలీసులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. డిసెంబర్ 31న చేసిన రెచ్చగొట్టే ప్రసంగమే అల్లర్లకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. మరాఠా, దళితుల మధ్య ఇంత పెద్ద గొడవకు కారణం కావడంతోనే ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు పుణె పోలీసులు తెలిపారు. జిగ్నేష్ మేవానీ తాజాగా గుజరాత్‌లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. భీమాకోరేగావ్ యుద్ధం జరిగి 200 సంవత్సరాలు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని ఎల్గర్ పరిషత్ ఆధ్వర్యంలో పుణెలోని శనివార్‌వాడలో డిసెంబర్ 31న ఓ కార్యక్రమం నిర్వహించారు. దీనికి జిగ్నేష్‌తో పాటు జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖలీద్ పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. పుణెకు చెందిన అక్షయ్‌బిక్కడ్ ఇద్దరిపై దక్కన్-జిమ్‌ఖానా పోలీస్‌లతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివార్‌వాడ విశ్రామ్‌బాగ్ పీఎస్ పరిధిలోకి రావడంతో వారు ఈ కేసును సదరు పీఎస్‌కు రెఫర్ చేశారు. జనవరి 1న జరిగిన మారణకాండకు ఇద్దరే కారణమంటూ బిక్కడ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. దీంతో విశ్రామ్‌బాగ్ పోలీసులు ఇద్దరిపై ఇద్దరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భీమాకోరేగావ్ యుద్ధాన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని జేఎన్‌యూ విద్యార్థి ఖాలీద్ పిలుపునివ్వడం ఏంటని ప్రశ్నించారు. మరాఠాలను ఉద్దేశించి.. భీమాకోరేగావ్‌లో దాడులకు దిగారని, ప్రతీకారం తీర్చుకునేందుకు సమయం ఆసన్నమైందని, పేశ్వాయ్‌లపై యుద్ధం చేసి విజయం సాధిస్తేనే.. భీమా కోరేగావ్ ఘటనకు సరైన న్యాయం చేయగలమని ఖాలీద్ పిలుపునివ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు నేపథ్యంలో మేవానీ, ఖాలీద్‌పై రెచ్చగొట్టే ప్రసంగం చేసి గొడవలకు కారణమైనందుకు ఐపీసీ 153 (ఏ), ప్రజలను అల్లర్లు చేయడానికి పిలుపునివ్వడంతో ఐపీసీ 505తో పాటు 117 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.



ముంబైలో సభను అడ్డుకున్న పోలీసులు

దళిత నాయకుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవానీకి మహారాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఝలకే ఇచ్చింది. గురువారం ఆయన పాల్గొనాల్సిన ఓ సదస్సును పోలసులు అడ్డుకున్నారు. ఈ మేరకు విలే పార్లేలోని భాయ్‌దాస్ హాల్ ఆడిటోరియాన్ని పూర్తిగా తమ స్వాధీనంలోకి తీసుకున్న పోలీసులు.. అక్కడి నుండి విద్యార్థులను బలవంతంగా బయటకు పంపించేశారు. కార్యక్రమం రద్దైన విషయాన్ని నిర్వాహకుడు, ఛత్ర భారతి ఉపాధ్యక్షుడు సాగర్ భాలేరావు ప్రకటించారు. అఖిల భారత విద్యార్థుల సదస్సుకు జిగ్నేష్, జేఎన్‌యూ నేత ఉమర్ ఖలీద్‌తో పాటు ఎమ్మెల్సీ కపిల్ పాటిల్ కూడా హాజరుకావాల్సి ఉంది. ఈ కార్యక్రమం కోసం చాలా రోజుల క్రితమే అనుమతి తీసుకున్నప్పటికీ.. పోలీసులు ఇప్పుడు ఒక్కసారిగా అడ్డుకోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుజరాత్‌లో ర్యాలీ అడ్డగింత

మహారాష్ట్రలో చెలరేగిన భీమాకోరేగావ్ మంటలు గుజరాత్‌కు వ్యాపించాయి. మేవానీతో పాటు పలువురు దళిత నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ ఆఫీసు ఎదుట ధర్నాకు ర్యాలీగా బయలుదేరగా మధ్యలో పోలీసులు అడ్డుకున్నారు.

సమస్త అంబేద్కర్ సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనను పోలీసులు ఉడానా రైల్వే స్టేషన్ వద్ద రోడ్డు బ్లాక్ చేసి నిలువరించారు. హోంమంత్రి ప్రదీప్ సింగ్ జడేజా శాంతి భద్రతల విషయమై పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు.

కేంద్రానికి చేరిన నివేదిక

భీమాకోరేగావ్ ఘటన నేపథ్యంలో మహారాష్ట్రలో జరిగిన అల్లర్లపై కేంద్ర హోంశాఖ నివేదిక అందింది. గట్టి నిఘా పెట్టాలని ఈ సందర్భంగా గుజరాత్, మహారాష్ట్ర పోలీసులకు సూచించింది. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెటింగ్ నిర్వహించాలని ఆదేశించింది. అల్లర్లలో ఇద్దరు మృతి చెందగా, వారిలో 16 ఏళ్ల బాలుడు ఉన్నారని వివరించింది. పరిస్థితిని ఎప్పటికప్పుడు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమీక్షించాలని కేంద్ర హోంశాఖ సూచించింది.

క్రీడాప్రభ

మధ్యాహ్నం 1.30 నుంచి సోనీ టెన్ 1, టెన్ 3లో



విరాట్ కోహ్లి సేనకు పెను సవాలు.. రెండేళ్లుగా ఆడింది ఆట.. పాడింది పాటగా సాగిన టీమ్ఇండియాకు కఠి సవాలు... దక్షిణాఫ్రికా పర్యటన రూపంలో ఎదురు కానుంది.. మరికొన్ని గంటల్లోనే! ఈ సవాలును భారత జట్టు దీటుగా ఎదుర్కోగలుగుతుందా? పేస్‌కు అనుకూలించే పిచ్‌పై వారి భీకర పేసర్ల దాటికి మన బ్యాట్స్‌మెన్ ఎదురొడ్డి నిలబడగలరా? దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో వారి బ్యాట్స్‌మెన్‌ను భారత బౌలర్లు నిలవరించగలరా? ఆ దేశంలో ఒక్క సిరీస్ అయినా గెలవని టీమ్ఇండియా ఈ సారైనా ఆ లోటును తీర్చుకుంటుందా? దక్షిణాఫ్రికాలో ఆడిన 17 టెస్టుల్లో కేవలం రెండే గెలిచిన భారత్.. విజయాల రికార్డును మెరుగుపరచుకుంటుందా? ఈ ప్రశ్నలన్నింటికీ మరికొన్ని గంటల్లోనే సమాధానాలు దొరుకుతాయి. ఏదేమైనా లంక వంటి బలహీన జట్టుతో వారి దేశంలో.. మన గడ్డపై సాదాసీదా టెస్టులు చూసి విసిగిన భారత క్రికెట్ అభిమానులకు అసలు సిసలు టెస్టు పోరు మజాను ఆస్వాదించే అవకాశం వచ్చింది. కఠిన సిరీస్‌కు సమాయత్తమైన కోహ్లిసేనను క్రికెట్ అభిమానులంతా దీవిస్తున్నారు... 'జయీభవ!'.. అని!

విజయీభవ!

• కోహ్లిసేనకు కఠిన సిరీస్ • దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్ట్ నేటినుంచి

• కేప్‌టౌన్‌లో రసవత్తర సిరీస్‌కు నాంది!

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికాలో టెస్టు సిరీస్ గెలిచిన తొలి భారత జట్టుగా చరిత్ర సృష్టించాలని విరాట్ కోహ్లిసేన కృతనిశ్చయంతో ఉంది. రెండేళ్లుగా అప్రతిహత విజయాలు సాధిస్తూ భీకర ఫామ్‌లో ఉన్న టీమ్ఇండియాకు అందుకు ఇదే సరైన తరుణం. ఆటగాళ్లు రెట్టించిన విశ్వాసంతో ఉన్నారు. ఉపఖండంలో బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, లంకలలో 2017 జరిగిన సిరీస్‌లలో విజయం సాధించి ఐసీసీ టెస్ట్ చాంపియన్ షిప్ గెలుచుకున్న దక్షిణాఫ్రికా చేతిలో ఓడినా నెంబర్ వన్ ర్యాంకుకు ఎలాంటి ఢోకా ఉండబోదు. కానీ ప్రపంచ నెంబర్ వన్ జట్టు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆడి గెలిచినపుడే ఆ హోదాకు విలువ ఉంటుంది. ఆస్ట్రేలియా జట్టు ఒక్కటే ఇంతవరకు ఆ గౌరవాన్ని దక్కించుకుంది. దక్షిణాఫ్రికాలో ఓడిపోని విదేశీ జట్టు ఏదైనా ఉందంటే.. అది ఆసీసే. 2015లో భారత్ వచ్చి 0-3తో టెస్టు సిరీస్ ఓడిన దక్షిణాఫ్రికా.. ఆ సంగతిని ఇంకా మరిచిపోయివుండదు. ఆ ఓటమితో ఆ జట్టు నెంబర్ వన్ ర్యాంకును కోల్పోయింది. దీంతో డు ప్లెసిస్‌సేన అవకాశం కోసం వేచి చూస్తోంది. ప్రతీకారం కోసం వేచిచూస్తున్న దక్షిణాఫ్రికాతో తలపడి గెలవడమంటే ఆషామాషీ కాదు. సొంతగడ్డపై దక్షిణాఫ్రికా జట్టు బలోపేతమైంది. పరిస్థితులు కూడా వారికి కలిసి వస్తాయి. అందుకే ఆ జట్టును వారి దేశంలోనే ఎదుర్కోవడం కఠిన సవాలే. దక్షిణాఫ్రికా గడ్డపై ఆడే ఏ జట్టుకైనా ముందుగా ఎదురయ్యే సవాలు.. ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే పరిస్థితుల్లో డేల్ స్టెయిన్, మోర్కెల్, రబడా, ఫిలాండర్‌లతో కూడిన పేస్ దాడిని ఎదుర్కోవలసి రావడం. తిరుగులేని బ్యాటింగ్ ప్రదర్శన చేసే ఆమ్లా, డీన్ ఎల్గర్, డివిలియర్స్, డు ప్లెసిస్‌లను ఔట్ చేయగలగడం. భారత జట్టు ఈ ఏడాది సుదీర్ఘ విదేశీ పర్యటనలకు దక్షిణాఫ్రికాతో సిరీస్ నాంది కానుంది.

బ్యాటింగ్ పిచ్!

భారత జట్టుకు ఓ శుభవార్త.. కేప్‌టౌన్లో సర్వసాధారణమైన పేస్ పిచ్ ఈసారి ఉండబోదన్నది వార్తల సారాంశం. నీటి కొరత కారణంగా పిచ్‌పై పచ్చికను పెంచడానికి అవకాశం లేకపోవడంతో ఫ్లాట్ వికెట్‌నే తయారు చేయగలిగారని తెలుస్తోంది. దీంతో కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా బౌలర్ల నుంచి భీతిగొలిపే స్థాయిలో పేస్ దాడి ఉండకపోవచ్చు. ఐతే టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్ ఎలాంటి ప్రమత్తతకు తావులేకుండా వారి బౌలర్లను ఎదుర్కోవాలి. బ్యాటింగే సిరీస్ ఫలితాన్ని తేల్చేది. బౌలర్లపై చీఫ్ కోచ్ రవిశాస్త్రి అపార నమ్మకంతో ఉన్నాడు. 20 వికెట్లు తీయగలరని ధీమాగా చెబుతున్నాడు. కానీ బ్యాట్స్‌మెన్ పరిస్థితులకు అనుగుణంగా ఆడి రాణించాలన్నది ఆయన సలహా.

పుజారా చుట్టూ...

టెస్టు క్రికెట్‌లో తిరుగులేని బ్యాట్స్‌మెన్ చటేశ్వర్ పుజారా.. ఈ పర్యటనలో భారత బ్యాటింగ్‌కు కీలకం. అతణ్ని ఇరుసుగా చేసుకొని తక్కిన బ్యాట్స్‌మెన్ ఇన్నింగ్స్‌ను నిర్మించాల్సివుంటుంది. దక్షిణాఫ్రికాలో మొదటి సారి పర్యటించినపడు పుజారా, విరాట్, రహణే అద్భుతంగా రాణించి రెండు టెస్టులలో వరుసగా 280, 272, 209 పరుగులు సాధించారు. బ్యాటింగ్‌లో పుజారా రాణింపుపైనే భారత్ విజయావకాశాలు ప్రధానంగా ఆధారపడి ఉన్నాయన డంలో సందేహం లేదు. 2015లో లంక పర్యటన నాటి నుంచి విజయ్, ధావన్, రాహుల్‌ల ఓపెనింగ్ జోడీ తొలి వికెట్‌కు 34.20 సగటుతో పరుగులు సాధించారు. ఈ సగటు మేటి జట్ల ఓపెనింగ్ భాగస్వామ్యాల కంటే చాలా తక్కువగా ఉంది. అదే తొలి రెండు వికెట్ల భాగస్వామ్యాలు కలిపుకుంటే.. సగటు 45.69. ఆసీస్ (50-51) మాత్రమే మన కంటే మెరుగ్గా ఉంది. మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే పుజారా రెండో వికెట్‌కు విజయ్‌తో కలిసి 71.18 సగటుతో పరుగులు సాధించాడు. టాప్ ఆర్డర్‌లో పుజారా ఎంత కీలకమో ఈ గణాంకాలే చెబుతున్నాయి. దక్షిణాఫ్రికాలో ఆడిన నాలుగు ఇన్నింగ్స్‌లో పుజారా 44.42 సగటుతో పరుగులు సాధించాడు. దానిలో ఓ సెంచరీ (153), ఓ అర్ధ సెంచరీ (70) ఉన్నాయి.

ఆ ముగ్గురూ రాణిస్తేనే...

గత ఏడాది టెస్టుల్లో తిరుగులేని బ్యాటింగ్‌తో కెప్టెన్‌గా విరాట్ కోహ్లి.. ఆసీస్ సారథి స్మిత్ తర్వాత అత్యధిక పరుగులు సాధించాడు. దక్షిణాఫ్రికాలో 119, 96 స్కోర్లు చేశాడు. ఆ టెస్టు డ్రాగా ముగిసింది. రహానే 69.66 సగటుతో రెండు అర్ధశతకాలు, 47 పరుగుల స్కోరు చేశాడు. రహానే రెండు సార్లు (97, 96) సెంచరీలను తృటిలో చేజార్చుకున్నాడు. మురళీ విజయ్ అపుడు పెద్దగా రాణించకున్నా.. ఓపెనింగ్‌లో తిరుగులేని అతని టెక్నిక్, దూకుడు కీలకమవుతుంది. ఈ ముగ్గురూ ఇన్నింగ్స్ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాలి.



ఇండిపెండెన్స్ కప్‌తో కోహ్లి, డు ప్లెసిస్

ధావనా?.. రాహులా

రాహుల్, విజయ్‌లకు గాయాల కారణంగా గత జులైలో ఓపెనర్‌గా జట్టులోకి వచ్చిన శిఖర్ ధావన్... 8 ఇన్నింగ్స్‌లో నమ్మశక్యం కాని 92.43 సగటుతో 550 పరుగులు సాధించాడు. వీటిలో రెండు సెంచరీలు కూడా ఉన్నాయి. ఇవన్నీ ఉపఖండంలో సాధించినవే. దక్షిణాఫ్రికాలో ధావన్ సగటు 19 మాత్రమే. టెక్నిక్ విషయంలో రాహుల్‌దే పైచేయి అయినప్పటికీ ఓపెనింగ్‌లో కుడి, ఎడమ కూర్పు కోసం ధావన్‌కే జట్టు యాజమాన్యం ప్రాధాన్యం ఇచ్చే అవకాముంది.

ఆరో స్థానం ఎవరిది?

భారత బ్యాటింగ్‌లో ఆరో స్థానంపైనే ఇపుడు ప్రధాన చర్చ. భారత్ ఆరుగురు బ్యాట్స్‌మెన్, ఐదుగురు బౌలర్ల కూర్పుతో బరిలోకి దిగితే ఆల్‌రౌండర్‌గా ఎదుగుతున్న హార్దిక్ పాండ్యకు అవకాశం రావడం ఖాయంగా కనిపిస్తోంది. ఐతే కేవలం మూడు టెస్టులే ఆడిన పాండ్యను తుది జట్టులో ఆడిస్తారో లేదో చూడాలి. ఈ స్థానం కోసం పోటీ పడుతున్న రోహిత్ శర్మ భీకరఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ పరుగుల వరద పారించాడు. గత జూన్ నుంచి 32 మ్యాచ్‌లలో 1793 పరుగులు సాధించాడు. వన్డేల్లో మూడో డబుల్ సెంచరీ కొట్టాడు. రోహిత్ టెస్టుల్లోకి తిరిగి వచ్చాక ఆరో స్థానంలో 102, 65, 50 స్కోర్లు చేశాడు. టీ20ల్లో 35 బంతుల్లోనే వేగవంతమైన శతకం బాదాడు. ఈ గణాంకాలను బట్టి అతణ్ని పక్కన పెట్టడం అసాధ్యమనిపిస్తోంది. దీనికి తోడు పాండ్య ఆగస్టు తరువాత టెస్టుల్లో ఆడకపోవడంతో మొగ్గు రోహిత్ వైపు ఉంది.

ఉమేశ్ ఉంటాడా?

భారత బౌలింగ్ విభాగంలో భువనేశ్వర్, షమి, ఇషాంత్ ఖాయంగా ఉండొచ్చు. ఉమేశ్‌కు బెంచ్‌కు పరిమితం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. లంకపై ఆకట్టుకోవడం.. దక్షిణాఫ్రికా పరిస్థితుల్లో బౌలింగ్ చేసిన అనుభవం ఇషాంత్ వైపు మొగ్గు వచ్చింది. రంజీ సెమీస్‌లో విదర్భ సహచరుడు గుర్బాణి ముందు తేలిపోయిన ఉమేశ్‌కు మైనస్ అయింది. స్పిన్నర్లలో జడేజా జ్వరంతో బాధపడుతుండడంతో అశ్విన్‌కు చోటు ఖాయమైంది.

మిడిలార్డర్‌లో డు ప్లెసిస్

దక్షిణాఫ్రికా కెప్టెన్ డు ప్లెసిస్ తిరిగి మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగుతాడు. కీపర్ డి కాక్ నూరు శాతం ఫిట్‌గా లేకపోవడంతో డివిలియర్స్ కీపింగ్ చేస్తాడు. ఆల్‌రౌండర్ క్రిస్ మోరిస్ తిరిగి జట్టులోకి వచ్చాడు. దక్షిణాఫ్రికా సెలెక్షన్‌లో ప్రధాన సమస్య ... డేల్ స్టెయిన్, మోర్నీ మోర్కెల్‌లలో ఒకరిని ఎంచుకోలసి రావడం. ఐతే స్టెయిన్ 2016 నవంబరు తర్వాత అంతర్జాతీయ క్రికెట్ ఆడలేదు. మోర్నీ 2017లో 39 వికెట్లు పడగొట్టాడు. స్టెయిన్‌ను తొందరపడి ఆడించబోమని కోచ్ సూచనప్రాయంగా చెప్పాడు. దీంతో మోర్నీతో పాటు రబడా, ఫిలాండర్ పేస్ విభాగంలో ఉంటారు.


తుది జట్లు (అంచనా)

భారత్: విజయ్, ధావన్, పుజారా, విరాట్ కోహ్లి (కెప్టెన్), రహానే, రోహిత్-పాండ్య, అశ్విన్, సాహా (కీపర్), భువనేశ్వర్, షమి, ఇషాంత్.


దక్షిణాఫ్రికా: డీన్ ఎల్గర్, మార్క్రమ్, ఆమ్లా, డివిలియర్స్ (కీపర్), డు ప్లెసిస్ (కెప్టెన్), తెంబా బవుమా, మోరిస్- ఫెహ్లుక్ వాయో, ఫిలాండర్, రబాడ, కేశవ్ మహరాజ్, మోర్కెల్.

పిచ్: కేప్‌టౌన్‌లో నీటికి కొరత ఉండడంతో పిచ్‌పై పెద్దగా పచ్చిక లేదు.

వాతావరణం: ఆకాశంలో అక్కడక్కడా మేఘాలున్నాయి. అయినా వేడి అధికంగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలు.



"ఎక్కువగా బంతుల్ని ఆడకుండా విడిచి పెట్టాల నుకొని టెస్టు మ్యాచ్ ఆడరాదు. మేం పరుగులు సాధించాలి. మంచి బౌంతు లేస్తే అందుకు తగ్గట్టుగానే ఆడతాం" - **మురళీ విజయ్.**



"ఈ పర్యటనకు ముందు భారత్ ఎక్కువగా సొంత గడ్డపై టెస్టులు ఆడింది. పూర్తి భిన్నంగా ఉండే దక్షిణాఫ్రికా పరిస్తితుల్లో ఆ జట్టు ఎలా ఆడుతుందో చూడాలి - **ఫిలాండర్.**

మీడియా సమావేశానికి కోహ్లి డుమ్మా

కేప్‌టౌన్: భారత జట్టు గురువారం ప్రాక్టీసుకు దూరమైంది. కెప్టెన్ విరాట్ కోహ్లి మ్యాచ్‌కు ముందు జరిగే మీడియా సమావేశానికి గైర్హాజరయ్యాడు. ద్వైపాక్షిక సిరీస్‌కు మీడియా సమావేశానికి కెప్టెన్ హాజరు కావడం ఆనవాయితీగా వస్తోంది. విరాట్‌కు బదులు సహాయక కోచ్ సంజయ్ బంగర్ మీడియా సమావేశానికి హాజరయ్యాడు. అదీ గంటకు పైగా ఆలస్యంగా వచ్చాడు.



ఢిల్లీ డేర్‌డెవిల్స్ హెడ్ కోచ్‌గా పాంటింగ్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఇండియన్ ప్రిమియర్ లీగ్ ఫ్రాంచైజీ ఢిల్లీ డేర్‌డెవిల్స్ హెడ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు గురువారం ఢిల్లీ సీఈఓ హేమంత్ దువా ఓ ప్రకటన చేశాడు. 43ఏళ్ల పాంటింగ్ గతంలో ముంబై ఇండియన్స్ కు 2015, 16లలో రెండు సీజన్లకు కోచ్‌గా పని చేశాడు. ముంబై 2015లో ట్రోఫీ గెలిచింది. అంతకుముందు పాంటింగ్.. కోల్‌కత నైట్ రైడర్స్, ముంబై ఇండియన్స్‌కు ఆడాడు. ఢిల్లీ ఫ్రాంచైజీ గురువారం శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, క్రిస్ మోరిస్‌లను అట్టేపెట్టుకుంది. ఐపీఎల్ వేలం ఈనెల 27, 28 తేదీల్లో జరుగుతుంది.

23 కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికా 54 టెస్టుల్లో గెలిచిన మ్యాచ్‌లు. 20 టెస్టుల్లో ఓడి.. 11 డ్రా చేసుకుంది.

272 రెండు టెస్టుల్లో విరాట్ చేసిన పరుగులు


477 ఇషాంత్, భువీ, షమి, ఉమేశ్, పాండ్య కలిసి 164 టెస్టుల్లో తీసిన వికెట్లు.

పేసర్లు... పిచ్‌ను అశ్విన్‌కు అనుకూలంగా మార్చాలి




న్యూఢిల్లీ: కేప్‌టౌన్ టెస్టులో పిచ్‌ను భారత పేస్ బౌలర్లు స్పిన్నర్ అశ్విన్‌కు అనుకూలంగా ఉండేలా చేయాలని మాస్టర్ సచిన్ టెండూల్కర్ సలహా ఇచ్చాడు. దక్షిణాఫ్రికా వికెట్లు సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలించవు కాబట్టి పేసర్లు పిచ్‌పై తమ బంతులతో చాలినంత 'రఫ్'గా తయారు చేయాలన్నాడు. 2010-11 పర్యటనలో స్పిన్నర్ హర్భజన్ కోసం ఫాస్ట్ బౌలర్ జహీర్‌ఖాన్ ఇలాగే చేశాడని గుర్తు చేశాడు. "2010-11లో కేప్‌టౌన్ టెస్టులో హర్భజన్ (7-120) ఏడు వికెట్లు పడగొట్టాడు. ఎడమచేతి వాటం పేస్ బౌలర్లు జహీర్, సొత్సొబె.. పిచ్‌ను అవసరమైనంత 'రఫ్'గా తయారు చేశారు. ఇషాంత్, శ్రీశాంత్ కూడా రౌండ్ ద వికెట్ బౌలింగ్ చేయడంతో కుడి చేతి వాటం బ్యాట్స్‌మెన్‌కు భజ్జీ బౌలింగ్ చేయడానికి సాయపడింది. దక్షిణాఫ్రికా పరిస్తితులు అశ్విన్కు సవాలే" అని మాస్టర్ చెప్పాడు.





విరాట్, ధోని, రోహిత్ పాత ఫ్రాంచైజీల్లోనే

గంభీర్‌కు కోల్‌కత ఝలక్



ముంబై: ఊహించినట్లే ధోనీ, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మను ఆయా ఫ్రాంచైజీలు అట్టేపెట్టుకున్నాయి. 2018 కోసం ప్రకటించిన రిటెన్షన్ విధానం ప్రకారం గురువారం ధోనీని చెన్నై సూపర్ కింగ్స్, కోహ్లిని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రోహిత్‌ను ముంబై ఇండియన్స్ అట్టేపెట్టుకున్నాయి. విరాట్ కోహ్లికి రూ.17 కోట్లు దక్కనున్నాయి. గౌతం గంభీర్‌కు కోల్‌కత నైట్ రైడర్స్ ఝలక్ ఇచ్చింది. ఆ ఫ్రాంచైజీ గంభీర్‌ను విడిచిపెట్టింది. దీంతో గంభీర్ వేలంలోకి వస్తాడు. సునీల్ నరైన్, రసెల్‌లను మాత్రమే అట్టేపెట్టుకుంది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్ రోహిత్‌ను ముంబై కొనసాగించనుంది. ముంబై.. పాండ్య, బుమ్రాలను కూడా అట్టేపెట్టుకుంది. ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్‌ను రాజస్థాన్ రాయల్స్, వార్నర్‌ను హైదరాబాద్ ఫ్రాంచైజీ అట్టేపెట్టుకున్నాయి. "కొందరు ఆటగాళ్లను అట్టేపెట్టుకోవడానికి అవకాశం లభించింది. జట్టును ముందుకు తీసుకెళ్లగల ఆటగాళ్లను తీసుకోవాలనుకున్నాం. వార్నర్, భువీ ప్రభావమంతమైన ఆటగాళ్లు" అని హైదరాబాద్ టీమ్ మెంటర్ వీవీఎస్ లక్ష్మణ్ అన్నాడు. "రోహిత్‌తో ముంబై ఇండియన్స్‌కు విడదీయరాని బంధం ఉంది. పాండ్య, బుమ్రా మాకు ప్రత్యేక ఆటగాళ్లు. కొందరిని అట్టేపెట్టుకుంన్నందుకు సంతోషంగా ఉంది" అని ముంబై ఫ్రాంచైజీ అధిపతి ఆకాశ్ అంబానీ అన్నాడు.

ఫ్రాంచైజీలు అట్టేపెట్టుకున్న ఆటగాళ్లు

చెన్నై సూపర్ కింగ్స్: మహేంద్రసింగ్ ధోని, సురేశ్ రైనా, రవీంద్ర జడేజా.
ఢిల్లీ డేర్‌డెవిల్స్: రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, క్రిస్ మోరిస్.
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: విరాట్ కోహ్లి, డివిలియర్స్, సర్ఫరాజ్‌ఖాన్,
ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య, జస్ప్రీత్ బుమ్రా.
సన్ రైజర్స్ హైదరాబాద్: డేవిడ్ వార్నర్, భువనేశ్వర్ కుమార్.
కోల్‌కత నైట్‌రైడర్స్: సునీల్ నరైన్, ఆండ్రీ రసెల్
కింగ్స్ ఎలెవన్ పంజాబ్: అక్షర్ పటేల్. **రాజస్థాన్ రాయల్స్:** స్టీవ్ స్మిత్








రాణించిన రూట్, మలన్

• ఇంగ్లండ్ 233-5 • ఆసీస్‌తో యాషెస్ చివరి టెస్ట్

సిడ్నీ: కెప్టెన్ జో రూట్ (83, 141 బంతుల్లో, 8 ఫోర్లు), మలన్ (55 బ్యాటింగ్, 160 బంతుల్లో, 5 ఫోర్లు) రాణించడంతో యాషెస్ చివరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ మొదటి రోజు 5 వికెట్లు నష్టపోయి 233 పరుగులు చేసింది. రూట్ మరోసారి సెంచరీ చేజార్చుకున్నాడు. మిచెల్ మార్ష్ అద్భుతంగా డైవ్ చేసి క్యాచ్ పట్టడంతో రూట్ నిరాశగా వెనుదిరిగాడు. ఆట చివర్లో రూట్ పెవిలియన్ దారిపట్టాడు. ఆ తర్వాత బెయిర్‌స్టో 5 పరుగులకే ఔటయ్యాడు. మొదటి రోజు ఇంగ్లండ్, ఆసీస్ సమ ఉజ్జీలుగా నిలిచాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ఓ మోస్తరుగా సాగింది. 95 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. మలన్‌తో కలిసి రూట్ నాలుగో వికెట్‌కు 133 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. కానీ స్టార్క్ బౌలింగ్‌లో శతకం పూర్తి కాకుండానే వెనుదిరిగాడు. ఓపెనర్ కుక్ 39 పరుగులతో రాణించాడు. హాజెల్‌వుడ్ (2-47), కమిన్స్ (2-44) రెండేసి వికెట్లు పడగొట్టారు.



జో రూట్

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: కుక్ (ఎల్బీ) (బి) హాజల్‌వుడ్ 39, స్టోన్‌మన్ (సి) పైనె (బి) కమిన్స్ 24, విన్స్ (సి) పైనె (బి) కమిన్స్ 25, రూట్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 83, మలన్ బ్యాటింగ్ 55, బెయిర్‌స్టో (సి) పైనె (బి) హాజెల్‌వుడ్ 5, ఎక్స్‌ట్రాలు 2, మొత్తం (81.4 ఓవర్లలో 5 వికెట్లకు) 233. **వికెట్ల పతనం:** 1-28, 2-88, 3-95, 4-228, 5-233. **బౌలింగ్:** స్టార్క్ 16-4-63-1, హాజెల్‌వుడ్ 17.4-2-47-2, కమిన్స్ 17-4-44-2, లియోన్ 26-4-61-0, మార్ష్ 5-0-17-0.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Dwaraka

కలర్ కాంబో

రంగులు రెండు... జత కలిసే!



దుస్తుల సెలక్షన్‌లో కలర్ కాంబినేషన్ చాలా ముఖ్యం. ఏ రంగు మనకు నప్పుతుందో తెలుసుకోవటమే కాకుండా...ఏ రంగులు కలిస్తే... మరింత అందమొస్తుందో కూడా తెలుసుకుంటే ఆహా అనిపించేలా దుస్తులను ఎంపిక చేసుకోవచ్చు. ఈ మధ్యకాలంలో చీరలను కొనటం కాకుండా కుట్టించుకోవటం చూస్తున్నాం. మనకు నచ్చిన రంగులను కలిపి ఒక చీరగా తయారుచేసుకునే అవకాశాన్ని బొటిక్‌లు కల్పిస్తున్నాయి. అయితే ఒకచీరలో రెండు రంగులను కలపాలంటే కచ్చితంగా కలర్ ట్రెండ్స్ తెలిసి ఉండాలి. ఏ రంగులను కలిపితే చీర ఎంత అందంగా మారుతుందో... ఊహించగలగాలి. బోర్డర్ వర్క్, ప్రింట్లు, ప్యాట్రన్స్..ఇలా చీర ఏ డిజైన్‌లో ఉన్నా రంగుల కలయికే దాని అందంలో ప్రధాన పాత్రని పోషిస్తుంది. ఇక్కడ కనబడుతున్నవన్నీ అలాంటి రంగుల కలయికలే. ఈసారి మీరు షాపింగ్‌కి వెళ్లేప్పుడు ఈ కలర్ కాంబినేషన్లను దృష్టిలో ఉంచుకోండి....కొన్ని రంగుల కలయికలు ఎంత అందంగా ఉంటాయో ఈ చీరల్లో స్పష్టంగా తెలుస్తోంది.





మిస్టర్ పర్‌ఫెక్ట్‌లు పెరుగుతున్నారు!

విలువలు, నియమాలు, పద్ధతులు ఇవన్నీ ఇంతకుముందు తరాలకే కానీ... ఇప్పటివారికి అలాంటివేమీ పట్టటం లేదనేది చాలామంది అభిప్రాయం. అంటే వెనుకటితరాలే అంతా సవ్యంగా ఉండాలనే మనస్తత్వంతో ఉండేవారనే కదా అర్థం. అయితే ఒక అధ్యయనం మాత్రం ఈ అభిప్రాయం తప్పని రుజువు చేసింది.

మూడు దశాబ్దాల క్రితంవారి కంటే నేటి కాలేజి విద్యార్థులే పర్‌ఫెక్షనిజం అంటే పడిచచ్చిపోతున్నారని...వారు తమ శరీరం, మైండ్, కెరీర్..ఈ మూడు విషయాలు... ఎలాంటి లోపాలు లేకుండా పర్‌ఫెక్ట్‌గా ఉండాలని ఆశిస్తున్నారని ఆ అధ్యయనం చెబుతోంది. అయితే ముఖ్యంగా నూతన శతాబ్దంలో అంటే 2000 సంవత్సరం తరువాత యవ్వనంలోకి అడుగుపెట్టిన వారిపై ఈ ప్రభావం మరింతగా ఉందని తెలుస్తోంది. ఎందుకంటే ఈ కాలం తరువాతే యూనివర్శిటీలు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలనే పోటీని పిల్లల మధ్య పెంచడం మొదలుపెట్టాయని ...మరింత అర్హతలు ఉన్నవారిగా నిలవటం అనేది వారి ముందున్న లక్ష్యంగా మారిందని బాత్ ఇన్ బ్రిటన్ యూనివర్శిటీకి చెందిన అధ్యయనవేత్త థామస్ కర్రాన్ అంటున్నారు.

ఈ అధ్యయనం కోసం 1980ల చివరల్లో కాలేజి చదివిన వారినుండి 2016 నాటి కాలేజి విద్యార్థుల వరకు మొత్తం 41,641మందిని ఎంపిక చేసుకున్నారు. వీరంతా అమెరికన్, కెనడియన్, బ్రిటీష్ కాలేజీలకు చెందినవారు. వీరి నుండి సేకరించిన అభిప్రాయాలను బట్టి చూస్తే...దాదాపు మూడు దశాబ్దాల కాలంలో...మూడు రకాలుగా పర్‌ఫెక్షనిజం యువతలో పెరిగిందని వెల్లడైంది. ఎలాగైనా నేను పర్‌ఫెక్ట్‌గా ఉండాలి...అనుకుంటున్నవారు 10శాతం పెరిగితే, సమాజంలో అందరూ అలాగే ఉంటున్నారు కనుక ఆ ఒత్తిడి కారణంగా... తాము అలాగే ఉండాలని అనుకుంటున్నవారు 33శాతం, ఇక ఇతరుల అంచనాలు తమపై చాలా ఎక్కువగా ఉండటం వలన,

ఒక విషయం గమనించాలి. ఇంతకుముందు తరాలు విలువలు, గౌరవ మర్యాదలకు ప్రాధాన్యతని ఇస్తే నేటి తరం పూర్తిగా భౌతిక అంశాలను గురించే ఆలోచిస్తోంది.

యువతరంలో ఇలాంటి ఆలోచనలు పెరగడానికి చాలా కారణాలు దోహదం చేస్తున్నాయని అధ్యయన నిర్వాహకులు అంటున్నారు. వీటిలో సోషల్ మీడియా వినియోగం ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. సోషల్‌మీడియాలో ఎక్కువగా ఉండటం వలన... ఇతరులతో తమని తాము పోల్చుకుం టూ...తమని తాము తక్కువ చేసుకుంటున్నారని...సామాజిక ఒంటరితనానికి సైతం గురవుతున్నారని...అందుకే వారి ఆలోచనల్లో సంపూర్ణ సవ్యత అనే భావం పెరిగిపోతున్నదని ఈ అధ్యయన నిర్వాహకులు చెబుతున్నారు. శారీరక అందం, విద్య, సంపాదన, కెరీర్‌లో లక్ష్యాలు...ఈ విషయాల్లో తాము ఎవరికీ తక్కువ కాకూడదని యువత భావిస్తోందని...అదే వారిని పర్‌పెక్షనిస్టులుగా మార్చేస్తున్నదని..ఈ అధ్యయనంలో తేలింది.

ఇతర కారణాల వలన పర్‌ఫెక్ట్‌గా ఉండాలని అనుకుంటున్నవారు 16శాతం పెరిగినట్టుగా అధ్యయనంలో గమనించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న అంశాల్లో ఇదీ ఒకటని ఈ అధ్యయనానికి సహరచయితగా వ్యవహరించిన... ఇంగ్లండు లోని యార్క్ సెంట్ జాన్ యూనివర్శిటీకి చెందిన ఆండ్రూ హిల్ అన్నారు. మొత్తానికి నేటి యువత పర్‌ఫెక్షనిజం వలలో పడినట్టుగా ఈ అధ్యయనం చెబుతోంది. మనలోనూ సోషల్‌మీడియా వినియోగం ఎక్కువగానే ఉంది కనుక...ఇది మనకూ వర్తిస్తుంది మరి.



ఆరోగ్యం 'నీరు' కారుతుంది!

వాటర్ ఫాస్టింగ్ విధానంపై నిపుణుల హెచ్చరిక

ఈమధ్య కాలంలో వాటర్ ఫాస్టింగ్ అనే మాట సోషల్ మీడియాలో చాలా పాపులర్ అయ్యింది. అంటే ఏ ఆహారం తీసుకోకుండా కేవలం... నీరు కాఫీ టీలను మాత్రమే తాగుతూ బరువు తగ్గటం. వాటర్ ఫాస్ట్ అనే యాష్ట్యాగ్‌తో జనం తమ అభిప్రాయాలను, అనుభవాలను పోస్ట్ చేస్తూ ఒకరినొకరు ఉత్సాహపర చుకుంటున్నారు. అయితే ఈ విధానం అత్యంత ప్రమాద కరమైనదని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. బరువు పెరిగిపోతామనే భయంతో ఆహారం తీసుకోలేని మానసిక సమస్య... అనొరెక్సియాతో ఇది సమానమని, దీని వలన శరీరంలోపలి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని...ఈటింగ్ డిజార్డర్ నిపుణుడు జానీ లాబినర్ తెలిపారు. నీరు, కాఫీటీలు మాత్రమే తాగితే మన శరీరం ఇది అత్యవసర స్థితి అని భావించి..కొవ్వు నిల్వలను వాడకుండా కాపాడుకుంటూ... కండరాలనుండి తనకు కావాల్సిన పోషకాలను తీసుకుంటుంది.



దాంతో ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలుగుతుందని జానీ అంటున్నారు. ట్విట్టర్‌లో కొంతమంది వాటర్ డైట్ కారణంగా తమ చర్మం చాలా అందంగా మారిపోయిందని, చాలా బాగా నిద్రపడుతోందని చెబుతున్న క్రమంలో... నిపుణుల నుండి ఇలాంటి హెచ్చరికలు వస్తున్నాయి. అయితే కొంతమంది మాత్రం తాము చాలా నీరస పడిపోయామని చెప్పారు. టొరోంటోకి చెందిన కిడ్నీ వైద్యుడు జాసన్ ఫంగ్ మాత్రం ఒబేసిటీ మరీ ఎక్కువగా ఉన్నా, టైప్ టు డయాబెటిస్ ఉన్నా...వాటర్ డైట్ మంచిదే అంటున్నారు. అయితే తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ అవసరమని తెలిపారు.

రంగవల్లిక



15 చుక్కలు
మధ్య చుక్క
8 వచ్చే వరకు

ఎల్ చరిత
మర్రిపూడి
ప్రకాశం జిల్లా






బొజ్జం పద్మా రెడ్డి
హన్మకొండ

21 చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు



21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చే వరకు

కె. ప్రజ్ఞ
మేళ్ళచెరువు, సూర్యాపేట





శ్రీపాద శ్రీదేవి
పూర్ణానందంపేట
విజయవాడ

13 చుక్కలు
5 వరుసలు
5 వచ్చే వరకు
సరిచుక్క

మీరూ ముగ్గులు పంపొచ్చు

అడ్రసు: లైఫ్ c/o ఆంధ్రప్రభ,
8-2-293/82/ఎ/75, ఫ్లాట్ నెం:75, రోడ్ నెం:9, జూబ్లీహిల్స్, హైదరాబాద్-28
lifepage2012@gmail.com

ముగ్గుని ఎ4 సైజున్న మందపాటి పేపరుమీద వేయాలి. ఔట్ లైన్‌ని, చుక్కలను బ్లాక్ స్కెచ్ పెన్నుతో వేసి లోపల రంగులు నింపాలి. ఎన్ని చుక్కలు ఎన్ని వరుసలు అనే వివరాలను స్పష్టంగా రాయాలి.

చింతన

అవతార ప్రయోజనాలెన్నెన్నో!



విష్ణువు దశావతారాలు మనకు తెలుసు. ఆయన 24 అవతారాలెత్తాడని భాగవతం చెబుతోంది. ఆయన ఎన్ని అవతారాలెత్తినా వాటిలో పైకి కనిపించే ప్రయోజనంతో బాటు మరెన్నో కూడా ఉన్నట్టు నిశితంగా పరిశీలిస్తే కనబడుతుంది. రామావతార ప్రయోజనం రావణ వధే కాదు. ధర్మవర్తన అంటే ఏమిటో, అది ఎలా ఉండాలో చూపేదే.





ఏకోదేవః సర్వభూతేశు భూతః
సర్వ భూతేశు గూఢాః, సర్వ వ్యాపి
సర్వభూతాంతరాత్మ, కర్మసాక్షి, కార్యాధ్యక్షః
సర్వభూతాధి వాసః, సాక్షీ చేకో, కేవలో నిర్గణస్యః

విష్ణు స్వరూపంలోని దశావతరాల ప్రాముఖ్యతను తెలిపే ముందు పరమాత్మ పది రూపాలుగా అవతరించాడని చెప్పాలి. విష్ణువు అనే ఒకే ఒక్క నిర్గుణ స్వరూపం నుండి వివిధ అవతారాలను సందర్భాను సారంగా ఆయనే ఎత్తారని తెలుసుకోవాలి.

ఆఅవతారాల పరిక్రమ ణంలో మత్స్యావతారం మొదటి దని భాగవతం అష్టమ స్కంధం లో శుకమహర్షి పరీక్షిత్ మహారాజుకి చెప్పారు. చేప వంటి జీవి నీటిలో బ్రతుకు తుంది. నీటిలోని ప్రాణ వాయువుని మాత్రమే గ్రహించి బ్రతుకుతుంది. అలాంటి అల్ప రూపాన్ని భగవంతుడు ఎందుకు ధరించాడు అంటే హయగ్రీవుడు అనే రాక్షసుడు వేదాలను తస్కరించి నీటిలో పారవేసిన సందర్భంలో వాటిని బయటకు తేవడానికి నీటి యందు ప్రవేశించే అనువైన రూపం ఉన్న మత్స్యమూర్తి అవతారం ఎత్తాడని అర్థం చేసుకోవాలి.

కలలో నందును మున్నెఱుంగని మహాకష్టాత్ముడైనట్టి దు
ర్బలుడాపత్సమయంబునన్ నిజ పాదాబ్జాతంబులుల్లంబులో
దలపన్నంతన మెచ్చి యార్తిహరుడై తన్నైన నిచ్చున్;సుని
శ్చల భక్తిన్ భజియించు వారికితడే సంపద్విశేషోన్నతుల్

అప్పటి వరకు తనను కనీసం తలచని, పిలవని, గుర్తు చేసుకోని వానికి కూడా ఆపదసమయంలో పిలిచిన వెంటనే తనను తాను అర్పించుకోడానికి సిద్ధమవుతాడు, విశేషమైన సంపదనిస్తాడని అర్థం. దశావతారాలలో ప్రతి అవతారమందు భగవంతునిలో ఆ ఆర్తి జగద్విదితం.

సమస్త సృష్టిని నిర్వహించడానికి పరిపాలించడానికి తానే స్వయంగా సారథ్యం వహించటాన్ని తెలియజేస్తూ కూర్మావతారాన్ని ఎత్తాడు విష్ణువు. పాలసముద్రంలో మంధర పర్వతాన్ని కవ్వంగా చేసి దేవతలు, దానవులు వాసుకిని త్రాడుగా చేసుకుని చిలుకు తుంటే కవ్వానికి ఆధారం లేక పర్వతం అటు ఇటూ కదులుతున్న సందర్భంలో దేవతల ఆర్తిని అర్థం చేసుకున్న విష్ణువు వారిని గెలిపించడానికి వారి బాధ్యతను తాను మోయాలని భావించి ఎంతటి బరువునైనా మోయగలిగే తాబేలుగా మారి తన డిప్పపై మంధర పర్వతాన్ని మోసి క్షీరసాగరమథనాన్ని జరిపించాడు. అందుకే పోతనగారు ఆ కూర్మాన్ని వర్ణిస్తూ ''లక్ష యోజనముల వెడలు..'' అంటూ సీసపద్యంతో ప్రారంభించి ''కూర్మి చెలువందనక మహాకూర్మ మయ్యె.. '' అనే తేటగీతి పద్యంతో ముగించారు. లక్షయోజనాలు గల తాబేలుగా మారిన వైనాన్ని పోతన వర్ణించినట్లు మరేకవి వర్ణించలేదు. అత్యంత సుందరాకారుడైన విష్ణువు సమస్థ విశ్వభారాన్ని తనదిగా చేసుకున్న ఆ అనంతతత్వాన్ని మనం తెలుసుకోవాలి.

హిరణ్యాక్షుడు భూమిని సముద్రగర్భంలో దాచినప్పుడు భూదేవి, సమస్త దేవతా లోకం విన్నపం మేరకు స్థితికారుడైన విష్ణువు వరాహావతారాన్ని ధరించి తన ముట్టెతో భూమిలోపలి భాగాన్ని తవ్వుతూ ఉన్నపుడు అంతటి సముద్రపు నీరు ఆయన రోమాలలోనికి పోయి నీరు సగం ఇంకిపోవడాన్ని వర్ణించడం స్కాంద పురాణంలోని ''నమస్తే దేవదేవేశ..'' అనే స్తోత్రంలో చూడ వచ్చు. లోక విరుద్ధమైన సమస్యను తన పరిపాలనా దక్షతతో తీర్చడానికి వివిధ అవతారాలలో భగవంతుడు వస్తాడు అనటానికి ఇంతకంటే నిదర్శనమేమున్నది.

ఎవడు సృజించు ప్రాణుల
నెవ్వడు రక్షించు ద్రుంచునెవ్వడనంతుం
డెవ్వడు విభుడెవ్వడు వా
డివ్విధమున మనుచు భేనుచు హేలారతుడై

అనంత కోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీమన్నారాయణుడు నృసింహావతారాన్ని ఎత్తటానికి కారణం హిరణ్యకశిపుని సంహారం కన్నా మిన్నగా ప్రహ్లాదుని భక్తి వైదుశ్యాన్ని లోకానికి తెలియజేయ డానికే అని స్పష్టంగా తెలుస్తుంది.

(మిగతా భాగం వచ్చే సంచికలో)

- అట్లూరి వెంకటరమణ
9177237945

కాకినైనా కాకపోతిని

జంతువులు, పక్షుల్లో కొన్నిటికి పూర్వజన్మ జ్ఞానం వంటి వాటి వల్ల భగవద్భక్తి ఉంటుంటుంది. కొందరు మహాత్ములకు ఎంతో పుణ్యం ఉన్నా ఏదో పాప ఫలం వల్ల జంతు జన్మ వచ్చి ఉండ వచ్చు. వారిలో పూర్వపు భక్తి ఈ జన్మలో కొనసాగుతుంటుంది. కొన్ని జంతువుల భక్తి మనకు తెలియకపోవచ్చు. కారణం వాటి అంతరంగం మనకు తెలియకపోవడమే. కొన్ని జీవులు మాట్లాడడం నేర్చుకుంటాయి. ఆ విధంగా వాటి నామజపం వంటివి పైకి కనిపించవచ్చు, వినిపించవచ్చు. ఇటువంటి రెండు రకాల భక్తికి సంబంధించిన సంఘటనలు తెలుసుకుందాం. కనబడని భక్తి గురించి రామకృష్ణ పరమహంస ఒకసారి విజయకృష్ణగోస్వామి అనే భక్తునికి ఒక గాథను వినిపించారు. ఆ కథ ఇది.

రాముడు అరణ్యవాసంలో ఉన్నాడు. శ్రీరాముడు, లక్ష్మణుడు ఒకసారి పంపానదిని దర్శించారు. ఇద్దరూ నదీతీరాన నడుస్తుండగా లక్ష్మణుని దృష్టి ఒక కాకి మీద పడింది. ఆ కాకికి దాహం వేస్తోంది. మాటిమాటికి నది అంచువరకు పోతోంది. కాని నీరు తాగకుండా వెనుకకు వస్తోంది. ఈ విచిత్ర దృశ్యం చూసి ఆ కాకి అలా ఎందుకు చేస్తోందో అర్థం చేసుకోలేకపోయాడు లక్ష్మణుడు. కారణం తెలుసుకోవాలన్న ఉత్సుకతతో ఉన్నాడు. వెంటనే రాముని అడిగాడు, 'అన్నయ్యా! అదేమిటి? ఆ కాకి అలా చేస్తున్నదేమిటి? అని ప్రశ్నించాడు. దానికి శ్రీరాముడు సమాధానమిస్తూ, 'లక్ష్మణా ఆ కాకి గొప్ప భక్తుడు. రాత్రింబవళ్లు రామనామాన్ని జపిస్తూ ఉంటాడు. అందువలన గొంతు ఎండిపోయి దాహం అవుతోంది. నీటి వద్దకు పోయినా నీరు తాగి గుటకవేసే లోపల రామనామ జపం ఆగిపోతుందేమోనన్న భయంతో నీటిని తాగటం లేదు' అన్నాడు. రాముడు అవతారపురుషుడు కనుక ఆ కాకి అంతరంగం తెలుసుకున్నాడు. మానవుల కుండే జన్మ పరంపరలో ఒక్క జన్మలోనైనా అటువంటి భాగ్యాన్ని ప్రసాదింపు మని రాముని వేడుకుందాం! ఆదర్శ జీవి ఆ కాకి!

మహనీయుల సేవలో జంతువులు

మొండితనం నుంచి ముముక్షత్వంలోనికి

చైనాలోని లేషాన్ నుంచి బోటో పట్టణానికి ఒక చిలుకను తెచ్చారు. అది నిగనిగలాడుతూ పచ్చగా ఉండేది. అందమైన ఎర్రటి ముక్కుతో అందరినీ ఆకర్షించేది. దానికి మాటలు నేర్పుదామని ఎందరో ఎన్ని విధాలుగానో ప్రయత్నించారు. కాని నేర్పలేకపోయారు. పైపెచ్చు అలా ప్రయత్నించేవారిని ముక్కుతో పొడిచేది కూడా. చివరకు దానిని ఒక బౌద్ధ గృహస్థు కుటుంబానికి ఇచ్చారు. ఆ కుటుంబ యజమాని వాంగ్. ఆయన ఇంట్లో ఎన్నో రకాల జంతువులు ఉండేవి. అవి కలిసిమెలసి ఉండేవి. అది బౌద్ధ ఆరామం కాకపోయినా, బౌద్ధ సంఘాన్ని మరిపించే దిగా ఉండేది. వారి ఇంట్లో టేప్‌రికార్డర్‌లో బుద్ధుని నామాలు, అమితాభ బుద్ధుని నామాలు వినబడుతుండేవి. అంతవరకూ ఎంత మంది ఎన్ని నామాలు పలికించాలని ప్రయత్నించినా వినని ఆ చిలుక తరచు వింటున్న అమితాభబుద్ధ, జ్ఞాని బోధిసత్వ అనే నామాలను పలకసాగింది. ఒకసారి, అరసారి పలకటం కాదు ఇంటికి వచ్చిన ప్రతి బౌద్ధభిక్షువును 'అమితాభబుద్ధ, అమితాభబుద్ధ' అనే పేరుతో పలుకరించేది. వాంగ్ మౌనంగా ప్రార్థించేటప్పుడు ఆ చిలక మౌనంగా ఉండేది. వాంగ్, ఇతరులు బుద్ధనామాలను బయటకు వినిపించేలా పలికేటప్పుడు అది కూడా వంత పాడేది. దానికి ఇతర నామాలు నేర్పుదామని ప్రయత్నించినా అది వాటిని నేర్చుకోలేదు. ఆ చిలుక అలా చాలా కాలం చేసిన తరువాత ఒక పర్యాయం అస్వస్థతకు గురైంది. ఇక కోలుకోకపోవడంతో చిలుక మరో జన్మ ఎత్తవలసిన సమయం ఆసన్నమైందని అందరూ గ్రహించారు. ఆ సమయంలో కూడా చిలుక 'నమో అమితాభ' అని పలకటం అందరూ విన్నారు. చిలుక తుది పలుకులు కూడా 'నమో అమితాభ, నమో అమితాభ'!.



- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

దినఫలాలు

మేష రాశి: ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో శ్రమ అధికంగా ఉంటుంది. ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు చేకూరుతాయి. ఆర్థిక చిక్కులు లేకపోలేదు. శత్రువృద్ధి ఉంటుంది.

వృషభ రాశి: సంబంధ బాంధవ్యాల విషయంలో జాగ్రత్తలు పాటిం చాలి. మానసిక రుగ్మతలు ప్రబలమవుతాయి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో దూకుడు నిర్ణయాలు పనికిరావు. కోర్టు వ్యవహారాల్లో మాత్రం నెగ్గుకురాగలుగుతారు. ఆదాయం పర్వాలేదు.

మిథున రాశి: దూరప్రయాణాలు లాభిస్తాయి. వ్యాపార నిర్ణయాలు అనుకూలం. ఆర్థిక ప్రయత్నాలు లాభిస్తాయి. అవమానకర సంఘటనలు బాధి స్తాయి. ఆరోగ్యం అనుకూలం. దురుసు మాటలు సమస్యలను తెస్తాయి. విద్యా పరమైన విషయాల్లో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. గృహసంబంధిత కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. విమర్శలు ఉన్నా పనులను పూర్తిచేయగలుగుతారు. ఆరోగ్యం ఖర్చులు తగ్గు తాయి. శత్రుభీతి తగు తుంది. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. వాహననిర్ణయాలు లాభిస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. విదేశీ ఒప్పందాలు లాభిస్తాయి. ఖర్చులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆర్థిక నష్టాలను భర్తీ చేసుకొనే ప్రయత్నాలు కొనసాగుతాయి. ఆదాయంలో ఆశాజ నకమైన వాతావరణం ఉంటుంది.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. స్థిరాస్తి కొనుగోళ్లు కలసి వస్తాయి. రాజకీయ ప్రతిబంధకాలు పెరుగుతాయి. ఆరోగ్యంలో చిరుసమస్యలు ఉంటాయి. రాజకీయ ప్రతికూలత ఉంటుంది. ఆదాయంలో ఆశించిన విజయాలు సాధించగలుగుతారు.

తులా రాశి: నూతన వస్తు కొనుగోళ్ళు లాభిస్తాయి. ఉద్యోగ ప్రయ త్నాలు కలిసి వస్తాయి. శారీరిక శ్రమ ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. అపార్థాలకి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: దూర ప్రయాణాలు ఆశించిన ప్రయోజనాలని కలిగి స్తాయి. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. శారీరిక రుగ్మతలు పెరుగుతాయి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. చేపట్టే కార్యాలలో అలసత్వం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. ఆరోగ్య పరీక్షలు రక్షణను కలిపిస్తాయి. సహనం తగ్గుతుంది. గతంలోని ఒత్తిడులు ఇంకా కొన సాగుతాయి. వ్యాపార ప్రయత్నాలలో ప్రోత్సాహం ఉంటుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు మాత్రం దగ్గరవుతాయి.

మకర రాశి: ఉద్యోగ ప్రయత్నాలు లాభిస్తాయి. గృహకార్యాలు, కార్య క్రమాలు లాభిస్తాయి. నూతన ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. మంచి కార్యాలలో విజయాలు ఏర్పడతాయి. వరస ప్రయత్నాలతో ఆదాయం పెరుగుతుంది.

కుంభరాశి: కోర్టు వ్యవహారాలు, ప్రక్రియలు ఉపకరి స్తాయి. చిరు ఆరోగ్య సమస్యలు వెలుగు చూస్తాయి. ఆరో గ్యంలో జాగ్రత్తలు పాటించాలి. ఒత్తిడులను తట్టుకోగలు గుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. చిరుసమస్యలు గృహరీత్యా కొనసాగుతాయి. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పనులలో గతంలోని వేగం తగ్గు తుంది. ఆదాయం పర్వాలేదు.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

హిరణ్మయ వర్షము-అధిదేవత


ధర్మం-మర్మం

హిరణ్మయ వర్షమున నారాయణ భగవానుడు తన ప్రీతిపాత్రమైన కూర్మరూపమున అధివసిం చును. సూర్యుడు, ఈ వర్ష పురుషులైన పితృ గణాధి పతులతో కలిసి కూర్మరూప భగవానుని మంత్రంతో జపిస్తూ ఆరాధిస్తాడు.

భాగవతంలోని కూర్మ మంత్రాన్ని ప్రతి నిత్యం పఠిస్తే స్థిరత్వము, ఉన్నతి, మంచి విద్యాబుద్ధులు, సహనము, సామర్థ్యము, పరోపకార బుద్ధి కలుగు తాయి. ప్రత్యేకించి ఉత్తమ సంతానాన్ని, గృహాన్ని కోరువారు ఈ మంత్రాన్ని జపించాలి. కూర్మము ప్రయోజనాన్ని ఆశించి ఆరాధించదగినది కావున అన్ని జటిల సమస్యలకు అనితర సాధ్యమైన కార్య సిద్ధికి కూర్మమంత్ర జపం శీఘ్రఫలప్రదం.

మంత్ర జప విధానము :

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రములు ధరించి లలాటమున తిలక మును దిద్దుకుని పూజామందిరంలో దీపా రాధన చేసి తమ నిత్యకృత్యములైన సంధ్యావంద నాది కార్యక్రమములను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.



- డా॥ కందాడై రామానుజాచార్య

భగవద్గీత

భిన్నా ప్రకృతికి అన్యమైనదీ ఉంది!



అధ్యాయం 7

శ్లోకం 5:

అపరేయమితస్త్వన్యాం
ప్రకృతిం విద్ధి మే పరామ్।
జీవభూతాం మహాబాహో
యయేదం ధార్యతే జగత్॥

తాత్పర్యం: ఓ మహాబాహుడవైన అర్జునా! వాటికి (భిన్నా ప్రకృతికి) అన్యముగా న్యూనమైన ప్రకృతి ఉప యోగించుకొను జీవులను కూడి యున్న నా ఉన్నతమైన శక్తి వేరొక్కటి కలదు.

భాష్యం: ఈ శ్లోకము నందు జీవుడు భగవంతుని ఉన్నత శక్తిగా వర్ణించబడినాడు. జీవుడు భగవం తుని వలే దివ్యగుణమును కలిగి ఉన్నందున ఉన్నతమైన శక్తిగా పరిగణించబడినాడు. అయితే జీవుడు పరిమాణములో ఎన్నడు భగవంతుడితో సమానుడు కాలేడు. జీవుడు భౌతిక మోహములో తానే అధిపతినని భావించి భౌతిక ప్రకృతి సంపదను అనుభవిస్తూ ఉండటం చేత ఈ భౌతిక జగత్తు నడిపించబడు తుంది. జీవుని ప్రమేయము లేనిదే ఎక్కడ వేసిన వస్తువు అక్కడే ఉంటుంది. భౌతిక ప్రకృతి స్వతహాగా చలించదు. అయితే ఈ జీవి కూడా భగవంతుని శక్తిలో భాగమే కనుక శక్తివంతుడైన భగవంతుని ఆధీనము లోనే ఉండవలసి వస్తుంది. ఎప్పుడైతే జీవుడు భగవంతుని ఆధిపత్యాన్ని గుర్తించి శరణు పొందుతాడో భౌతిక మోహము తొలగి ముక్తుడు లేదా కృష్ణచైతన్యవంతుడు అవుతాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

సెల్ఫు(ఆత్మ)



శ్రీ రమణాశ్రమం

25-2-47

నేటి ఉదయం ఒక గుజరాతీ యువతి భర్త, బిడ్డలతో బొంబాయి నుండి వచ్చింది. నడి వయస్సు, ముఖవిలాసం చూస్తే విద్యావతి అని అనిపించింది. భర్త, ఖద్దరు కట్టటం వల్ల కాంగ్రెసునందభిమానిగా తోచింది. గౌరవనీయమైన కుటుంబమని నడవడికలో గోచరిస్తున్నది. స్నానపానాదులు ముగించుకొని, పదిగంటల కంతా గునగున నడిచే బిడ్డలతో గుంపుగా వచ్చి హాల్లో కూర్చున్నారు. వాలకం చూస్తే ప్రశ్నించేట్టున్నదని తోచింది. పావుగంటయిందో లేదో, ప్రశ్నలు ప్రారంభమైనవి.

''భగవాన్, సెల్ఫును (తనను) పొందటం ఎట్లా?' ' అన్నదామె. ''ఎందుకు సెల్ఫు పొందటం?'' అన్నారు భగవాన్. 'శాంతి కోసం' అన్నదామె. ''ఆ అదీ సమాచారం. శాంతి అనేది ఒకటున్నదన్నమాట'' అన్నారు భగవాన్. ''అవును. ఉన్నది'' అన్నదామె. ''సరే, మంచిది, దాన్ని పొందాలని తెలుస్తున్నది గదా? ఎట్లా తెలుస్తున్నదీ? అది ఎప్పుడైనా నీవనుభవించి ఉండాలి. కలకండ తీపి తెలిసి ఉంటే గదా కలకండ తినాలని బుద్ధి పుట్టటం. అందువల్ల శాంతి నీకనుభవమైనదే. అప ్పుడప్పుడు నీవు అనుభవిస్తున్నావన్నమాట. కాకుంటే శాంతి కావాలన్న కోరిక ఎందుకు కలుగుతుంది? ఏదో శాంతి కావాలి, శాంతి కావాలని ప్రతి జీవి కోరటం కనపడుతూనే ఉంది. అందువల్ల, శాంతియే స్వరూపమనీ, యథార్థమనీ, స్థిర పడుతున్నది. ఆ శాంతినే 'ఆత్మ'అనూ, 'పరమాత్మ' అనూ, 'సెల్ఫు' అనూ, ఏమన్నా అను. అదే కావాలి మనకు. ఏం? అంతేనా?'' అన్నారు భగవాన్.

''అవును. అది , ఏవిధంగా వస్తుంది?'' అన్నదామె. ''ఉన్నదే శాంతి. ఉన్నదాన్ని ఏవిధంగా వస్తుంది అంటే ఏం జెప్పగలం. ఎక్కడనుంచైనా తేవలసిందైతే గదా ప్రయత్నం? తెచ్చుకొన్నది మనోవ్యాపారం. దాన్నే పోగొట్టు కోవాలి'' అన్నారు భగవాన్. ''ఏవిధంగా పోగొట్టుకోవాలి?'' అన్నదామె. ''ఏదో ఒక నియమం ఏర్పరచుకొని సాధన చేయాలి'' అన్నారు భగవాన్. ''సాధనకు ఏకాంతవాసం అవసరమా? సర్వభోగత్యాగమే చాలునా?'' అన్నదామె. ''త్యాగ మంటె అంతరత్యాగమే గాని, బాహ్యత్యాగం కా''దని రెండవ ప్రశ్నకు మాత్రమే ప్రత్యుత్తరమిచ్చి మౌనం వహించారు భగవాన్. భోజనశాలలో గంట మ్రోగింది.

పెద్ద కుటుంబీకురాలైన ఆమె అడిగిన మొదటి ప్రశ్నకు భగవాన్ ఏమని ప్రత్యుత్తరమిస్తారు? ఆమె విద్యా వినయ సంపన్నురాలు కూడాను. గృహస్థులగు స్త్రీ పురుషులకు సాధారణంగా భగవాన్ ఇట్లాగే బోధిస్తూ వుంటారు. ఆ బోధలో యథార్థమే ధ్వనిస్తుంది. అంతరత్యాగమంటే సామాన్యమా? అందువల్ల త్యాగ మంటే అంతరత్యాగమే గాని బాహ్యత్యాగం కాదని సెలవిచ్చి వూరుకున్నారు భగవాన్. 'అంతరత్యాగమంటే యేమి?'' అన్న ప్రశ్న వస్తే ప్రత్యుత్తరమున్నూ వచ్చేదేమో గాని భోజనశాలలో గంట మ్రోగటం వల్ల అంతా గప్‌చుప్‌గా లేచి వెళ్లారు. ఏకాంత నివాసమైన నా కుటీరానికి నేను వచ్చి చేరాను.ఎవరికి ఏది ఉచితమో (ప్రాప్తమో) వారికది ఈశ్వరుడు నిర్ణయించే వుంచుతాడు సుమా. ''నీవెందుకు ఒంటరిగా వుంటా''వని భగవాన్ ఎప్పుడైనా నన్నడిగారా, ఇతరు లతోనైనా ప్రస్తావించారా. ఏదీ లేదు. ''ఎందువల్ల?'' అంటే నా స్థితికి ఇది సరి అన్నమాట.

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

Business సరిగమలు

మీరు ఏదేని పెట్టుబడి పెట్టినట్లయితే పన్ను మినహాయింపు ఉందో లేదో చూసుకోవాలి. పన్నుమినహాయింపు మీద దృష్టి కేంద్రీకరించాలి. దీర్ఘకాలంలో పెట్టుబడి పెట్టినట్లయితే మీరు అనవసరంగా పన్నులు కట్టడం వల్ల రిటర్నుల మీద తీవ్ర ప్రభావం చూపుతుంది.



పన్ను ఆదా అవకాశాలు

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను ఆదా చేసుకునేందుకు చక్కని పెట్టుబడి పథకాల గురించి మనలో చాలామంది అన్వేషిస్తున్నారు. స్మార్ట్ ఇన్వెస్టర్లు ఉత్తమమైన పెట్టుబడి మార్గాల్లో పెట్టడం ద్వారా అటు పన్ను ఆదాతో పాటు ఇటు అధికరాబడులను పొందుతున్నారు. సెక్షన్ 80 సీ పరిధికి మించి ఉన్న పన్ను ఆదా పెట్టుబడి మార్గాలేమిటి? వేతన ఉద్యోగులకు, వ్యాపారులకు ఎలాంటి పన్ను ఆదా పథకాలు అనుకూలం.. 2018లో ఇలాంటి అవకాశాలను అందింపుచ్చుకోవాలి.

పింఛను పథకాలు

పదవీవిరమణ తర్వాత ఇవి ఆదాయం అందిస్తాయి. వీటిలో డిఫర్డ్ యాన్యుటీ, ఇమీడియట్ యాన్యుటీ అని రెండురకాలున్నాయి.
డిఫర్డ్ యాన్యుటీ తీసుకుంటే పదవీ విరమణ దాకా పెట్టుబడి పెడుతూ ఉండాలి. పదవీ విరమణకు చేరుకోగానే జమ అయిన మొత్తంలో నుంచి 60శాతం దాకా వెనక్కి తీసుకోవచ్చు. మిగతాదియాన్యుటీ ఫండ్‌లో వేయాలి. దీనిద్వారా రెగ్యులర్ ఇన్‌కమ్ అందుకోవచ్చు.
ఇమీడియట్ యాన్యుటీలో మాత్రం ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలి. తర్వాతి నెల పింఛను పొందొచ్చు. ఈ రెండు పదవీ విరమణ కోసం ఉద్దేశించినవి. ఇవి కాకుండా అదనంగా మెడికల్ ఇన్సూరెన్స్, ఇంటి అద్దెపై, పిల్లల ట్యూషన్ ఫీజులపై పన్ను ఆదా చేసుకోవచ్చు.

ఇల్లు కొనుగోలు

తొలిసారి ఇంటిని కొనుగోలు చేసేవాళ్లలో మీరు ఒకరైతే గృహరుణవడ్డీ తిరిగి చెల్లింపుపై అదనంగా రూ 50వేల దాకా పన్ను ఆదాపొందొచ్చు. సెక్షన్ 80ఇఇ ఈ వెసులుబాటును కల్పిస్తుంది. ఉదాహరణకు మొదటిసారి గృ హరుణం తీసుకున్నవారు ఒక ఏడాదిలో రూ 2.6 లక్షల వడ్డీ చెల్లించారనుకుందాం. అప్పుడు సెక్షన్ 24 క్రింద రూ 2 లక్షలు, ఇంకా సెక్షన్ 80ఇఇ క్రింద రూ 50వేలు మొత్తంంగా రూ 2.5 లక్షల పన్ను మినహాయింపు పొందొచ్చు.

జీవిత బీమా పాలసీలు

ఆర్థిక ప్రణాళికలో మొట్టమొదట చేయాల్సిన పని జీవిత బీమా తీసుకోవడం. మంచి టర్మ్ ప్లాన్‌ను ఎంచుకోవాలి. అతితక్కువ ప్రీమియం ఉండేలా ఎక్కువ కవరేజిని ఇస్తాయి. పాలసీదారు తదనంతరం తనపై ఆధారపడి బ్రతికేవారికి ఆర్థిక తోడ్పాటు కల్పిస్తాయి. 10 లేదా 15 ఏళ్లవార్షిక ఖర్చులకు సమానమైన టర్మ్ పాలసీ కొనుగోలు చేయడం మంచిది. జీవిత రక్షణతో పాటు పన్ను ఆదాను ఇవి కల్పిస్తాయి.



యూనిట్ లింక్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (యూలిప్స్)

2010 సంవత్సరంలో ఐఆర్‌డీఏ నియమాలు జారీచేశాక బీమా సంస్థలు యూలిప్స్ చార్జీలను గణనీయంగా తగ్గించేశాయి. జీవితానికి ఇవి రక్షణ కల్పిస్తాయి. కొత్త యూలిప్స్ పాలసీలకు తక్కువ పాలసీ లేదా నిర్వహణ చార్జీలున్నాయి. దీంట్లో ఇంత రాబడి వస్తుందని గ్యారెంటీ లేదు. 5నుంచి 11శాతం మధ్యలో రాబడిని అందించేఅవకాశం ఉంది. 10-12 ఏళ్లకాలం పాటు దీంట్లో ఉంచితే మంచి రాబడులను చూడవచ్చు.
స్టాక్ మార్కెట్లు, మ్యూచువల్ ఫండ్లపై నమ్మకం లేనివారు వీటిని కొనుగోలు చేయవచ్చు. పెట్టుబడితో పాటు జీవిత రక్షణ కల్పిస్తాయి ఇవి. సెక్షన్ 80 సీ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు.

నేషనల్ సేవింగ్ సర్టిఫికేట్

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ లేదా జాతీయ పొదుపు పత్రాలను పోస్టాఫీసుల్లో జారీ చేస్తారు. దీనిపై వడ్డీ భారత ప్రభుత్వం చెల్లిస్తుంది. అందుకే ఇది సురక్షితమైన పెట్టుబడిగా అభివర్ణించవచ్చు.
5 ఏళ్ల కాలవ్యవధితో ఇవి అందుబాటులో ఉన్నాయి. కనీసం రూ 500లతో కొనవచ్చు. ఆ తర్వాత రూ 1000, రూ 5వేలు, రూ 10వేల పత్రాలు లభిస్తాయి. ఇందులో గరిష్టంగా ఎన్ని పత్రాలైనా కొనొచ్చు. వడ్డీ రేట్లు వార్షికంగా 7.6శాతంగా నిర్ణయించారు. వడ్డీని ప్రతి ఆరునెలలకోసారి లెక్కిస్తారు. వచ్చే వడ్డీపై పన్ను వర్తిస్తుంది. ఐటీ రిటర్నులు దాఖలు చేసేటప్పుడు ఇది చూపించాల్సి ఉంటుంది. సెక్షన్ 80సీ క్రింద రూ 1.5 లక్షల దాకా పన్ను ఆదా కోసం క్లెయిం చేసుకోవచ్చు. వ్యక్తులు, ఉమ్మడిగా, సంరక్షకుల ఆధ్వర్యంలో మైనర్లు ఈ పత్రాలు తీసుకునేందుకు అర్హులు.

న్యూ పెన్షన్ స్కీం

సెక్షన్ 80 సీసీడి క్రింద ఎన్‌పీఎస్ టైర్ 1 ఖాతాలో పెట్టే పెట్టుబడిపై అదనంగా రూ 50వేల పన్ను ఆదా చేసుకోవచ్చు. టైర్ 1 ఖాతాలో పెట్టే సొమ్మును రిటైర్‌మెంట్ దాకా విత్ డ్రా చేసుకునే వీల్లేదు. అంటే అప్పటిదాకా సొమ్ము లాక్ అయి ఉంటుంది.

వాలంటరీ పీఎఫ్

ఉద్యోగి తన ప్రావిడెంట్ ఖాతాకు జమచేసు కోగలిగితే అదనపు సొమ్మునే వాలంటరీ పీఎఫ్ అంటారు. ఇది ఉద్యోగ భవిష్యనిధిలోభాగంగా 12శాతం జమచేసేదానికి అదనం. వేతనంలోని బేసిక్, డీఏలు కలిపితే ఎంత ఉంటుందో అంత గరిష్టసొమ్ము జమచేసుకోవచ్చు. దీనికి ఈపీఎఫ్ వడ్డీ రేటే వర్తిస్తుంది. ఈపీఎఫ్ వార్షిక వడ్డీ రేటు ప్రస్తుతానికి 8.65శాతంగా ఉంది. దీన్ని మరింత తగ్గించే యోచన ఉంది. ఈ ఫండ్‌లో పెట్టే పెట్టుబడులను రిటైర్‌మెంట్ తర్వాతే తీసుకోవచ్చు. పన్ను ఆదా చేసుకునేందుకు ఇది చక్కని పథకం. మెచ్యూరిటీ తర్వాత వచ్చే రాబడులకు పన్ను వర్తించదు.

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్

60 ఏళ్లు దాటిన వారికి ఇది అనుకూలం. ఈ పథకం సీనియర్ సిటిజన్స్‌కు అద్భుతంగా ఉంటుంది. వార్షికంగా 8.3శాతం వడ్డీ లెక్కించినా.. చెల్లించేది మాత్రం మూడునెలలకోసారి. ఈ పథకం కాలవ్యవధి 5 ఏళ్లు. కనీసం రూ 1000 డిపాజిట్ చేయవచ్చు. గరిష్టంగా 15 లక్షల దాకా అనుమతిస్తారు. దీనిపై వచ్చే వడ్డీకి పన్ను వర్తిస్తుంది. ఒక ఏడాది తర్వాత ముందస్తు ఖాతా మూసివేతకు అనుమతిస్తారు. అదీ 1.5శాతం ఫైన్‌తో ఇక రెడేళ్ల తర్వాత తీసుకుంటే 1శాతం రుసుము విధిస్తారు.

ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు

ఇది కాస్త పాతపెట్టుబడి విధానం. సెక్షన్ 80 సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. గతేడాది పెద్దనోట్ల రద్దు తర్వాత వడ్డీ రేట్లు గణనీయంగా తగ్గాయి. వడ్డీ రేట్లు 4.5 నుంచి 7శాతం మధ్యలో ఉన్నాయి. దీనిపై వచ్చే రాబడిపై పన్ను వర్తిస్తుంది. అంటే పెట్టుబడిపై మాత్రమే పన్ను మినహాయింపు లభిస్తుంది. వడ్డీపై కాదన్నమాట. పన్ను ఆదానిచ్చే ఎఫ్‌డీల లాకిన్ పీరియడ్ 5 ఏళ్లు. కొన్ని బ్యాంకుల వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి. డీసీబీ బ్యాంక్ 7.1, కరూర్ వైశ్యాబ్యాంక్ 7శాతం, లక్ష్మి విలాస్ బ్యాంక్ 7శాతం, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ 7.2శాతం, రత్నాకర్ బ్యాంక్ 7.2శాతం ఉన్నాయి. ఇతర పౌరులతో పోలిస్తే సీనియర్ సిటిజన్స్‌కు అరశాతం వడ్డీ ఎక్కువ ఇస్తారు.



సుకన్య సమృద్ధి యోజన

ఇది కేవలం ఆడపిల్లల సంక్షేమం కోసం ఉద్దేశించింది. ఏటా 8.1శాతం వడ్డీ అందించనుంది. మెచ్యూరిటీ సొమ్ము పూర్తి పన్ను మినహాయింపునకు అర్హత సాధిస్తుంది. కనీసం రూ 1000 మొదలుకొని రూ 1.5లక్షల దాకా పెట్టుబడి పెట్టొచ్చు. దీని కాలవ్యవధి అమ్మాయికి 21 ఏళ్లు నిండేవరకు ఉంటుంది. ఐతే ఆలోపు కావాలంటే కొన్ని షరతులకు లోబడి సొమ్మును విత్ డ్రా చేసుకోవచ్చు. అమ్మాయికి 15 ఏళ్లు వచ్చే దాకా డిపాజిట్లకు అనుమతిస్తారు. 16వ ఏటా నుంచి 21 ఏళ్ల దాకా డిపాజిట్ చేసేందుకు అనుమతించరు.



మనీ విషయంలో మన జీవితంలో గుణపాఠాలు నేర్చుకోవాలి. ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఇవి ఎంతో దోహదప డుతుంటాయి.

హోం వర్క్

ఏదేని పెద్ద లక్ష్యం పెట్టుకున్నట్లయితే ముందే హోం వర్క్ చేసుకోవడం మంచిది. అలా చేయనిపక్షంలో విజయాలు మీకు వరించవు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టేవారికి హోం వర్క్ తప్పనిసరి. సంబంధిత కంపెనీలు, స్టాక్‌ల మీద అధ్యయనం చేయాలి. ప్రస్తుత మార్కెట్ మీద కూడా అధ్యయనం చేయాలి. ప్రభుత్వ విధానాలు స్టాక్స్ మీద ఏ మేరకు ప్రభావం పడతాయో తెలుసుకోవాలి. ఒకవేళ హోం వర్క్ బాగా చేస్తే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

లక్ష్యం నిర్ధేశించుకోవాలి

హోం వర్క్ పూర్తి చేసిన తర్వాత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. రిటైర్‌మెంట్ తర్వాత మన లక్ష్యం తెలుసుకోవాలి. ఉదాహరణకు మీ కూతురు వివాహానికి రూ 20 లక్షల రూపాయలు అవసరమవుతాయనుకోండి. కేవలం 15 సంవత్సరాలు మాత్రమే వ్యవధి ఉందనుకోండి. 15 సంవత్సరాల్లో 15 లక్షలు సంపాదించాలని నిర్దేశించుకోండి. ఇంటిఖర్చులు తగ్గించు కోవచ్చు. అప్పుడు మాత్రమే మీరు ఈ పని చేయగలుగుతారు.

సొంత టీం

మీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్న తర్వాత దాన్ని సాధించడానికి స్వంత టీం ఉండాలి. అప్పుడు మాత్రమే లక్ష్యాన్ని చేరుకోగలుగుతారు. ఇన్సూరెన్స్ ఏజెంట్స్ లేదా ఇతర ఏజెంట్స్ ఇచ్చే సలహాలు సూచనలు ఎప్పటికీ పాటించకండి. మీ పెట్టుబడులకు ఆసక్తికరమైన కమిషన్ వచ్చినట్లయితే మాత్రమే వారి సలహాలను తీసుకోండి. ఏజెంట్లు వారి కమిషన్‌లకు ఆశపడి మిమ్మల్ని ప్రలోభపెడుతుంటారు. కాబట్టి మీరు స్వంతంగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలి.

నిర్ణీత గడువు

మీ లక్ష్యాన్ని సాధించుకోవడానికి నిర్ణీత గడువు పెట్టుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇలా చేయని పక్షంలో మీ లక్ష్యం కాస్త నీరుగారిపోతుంది.

అధిక రాబడులకు ఈఎల్ఎస్ఎస్

అతితక్కువ లాకిన్ పీరియడ్ అయిన ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్ అనేది పన్ను మినహాయింపు ఉంటుంది. సెక్షన్ 80 సి పరిధిలోకి వస్తుంది కాబట్టి పన్ను మినహాయింపు ఉంది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ కనీసం 15 ఏళ్ల పాటు ఉండాలి. అదే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ మాత్రం లాకిన్ పీరియడ్ ఐదేళ్లు ఉంది.
దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెట్టుబడులు పెట్టి తద్వారా అధిక రాబడులు సాధించాలనుకునేవారికి సరైన మార్గంలో ఈఎల్ఎస్ఎస్ ఒకటి. ఈక్విటీ మార్కెట్లలో నేరుగా పెట్టుబడి పెట్టకుండా లాభాలను ఆర్జించేవారి కోసం ఉద్దేశించినవే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు. అయితే వీటిలో మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ట్యాక్స్ తగ్గించుకునేందుకు కూడా ఇవి బాగా ఉపయోగపడతాయి. వీటి గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.
సాధారణ మ్యూచువల్ ఫండ్లలాగే ఈఎల్ఎస్ఎస్ పథకంలోనూ ప్రారంభ చార్జీలు వర్తించవు.
మూడేళ్ల లాక్ ఇన్ పీరియడ్ వర్తిస్తుంది. కాబట్టి పెట్టుబడులను మూడేళ్ల వరకూ విత్ డ్రా చేసుకునే వీలుండదు.
ఫండ్ నిర్వహణ చార్జీలు మాత్రం ఆయా మ్యూచువల్ ఫండ్ సంస్థను బట్టి ఉంటుంది.
కొంత నష్టభయాన్ని తట్టుకునేలా, పన్ను ఆదా పథకాల్లో పెట్టాలనుకునేవారికి ఈఎల్ఎస్ఎస్ పథకం సరైన ఎంపిక.
అప్పుడే సంపాదన మొదలుపెట్టిన యుక్తవయసు వారికి ఈఎల్ఎస్ఎస్ పథకం అనుకూలం. ఈ కోవకు చెందిన వారికి నష్టాన్ని తట్టుకునే సామర్థ్యంతో పాటు దీర్ఘకాల లక్ష్యాలకు ఈ పథకం ఉపకరిస్తుంది.

> పన్ను ప్రణాళిక ప్రతీ ఒక్క వ్యక్తికి అవసరమే. ఆర్థిక సంవత్సరంలో ఏదో ఒక సందర్భంలో అవసరం రావచ్చు. కొందరు పెట్టుబడి పెట్టగానే లాభాలు ఆశిస్తారు. అటువంటి పన్ను మినహాయింపు అనేది ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీమ్‌లో ఉంది.

పెట్టుబడి విధానం

ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో రెండు విధాలుగా పెట్టుబడి పెట్టేందుకు వీలుంటుంది. ఏకమొత్తంగా ఒకసారి పెట్టుబడి పెట్టడం ఒక పద్ధతి. మరో విధానంలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా నెలనెలా నిర్ణీత తేదీలో నిర్ణీత సొమ్మును పెట్టుబడి పెట్టవచ్చు.
సిప్ విధానంలో కనీసం రూ 500 నుంచి పెట్టుబడి పెట్టేందుకు వీలుంటుంది.



పెట్టుబడి ఆప్షన్లు

ఈఎల్ఎస్ఎస్ పథకానికి సంబంధించి గ్రోత్, డివిడెండ్ పే అవుట్ అనే రెండు రకాల ఆప్షన్లు అందుబాటులో ఉన్నాయి.
గ్రోత్ ఆప్షన్ ద్వారా దీర్ఘకాలంపాటు పెట్టుబడి వృద్ధికి అవకాశం ఉంటుంది. అదే డివిడెండ్ పే అవుట్ ఆప్షన్‌ను ఎంచుకుంటే పెట్టుబడిపై వచ్చే లాభాలను ఎప్పటికప్పుడు తీసుకోవచ్చు. అంటే మూడేళ్ల లాక్ ఇన్ పీరియడ్ సమయం కోసం వేచిచూడకుండా చెల్లిస్తారు.

రాబడి


దీర్ఘకాలంలో మంచి రాబడులను అందించిన చరిత్ర ఈఎల్ఎస్ఎస్ పథకానికి ఉంది.
స్టాక్ మార్కెట్ సూచీలు, సెన్సెక్స్, నిఫ్టీలు, ఈఎల్ఎస్ఎస్‌కు బెంచ్ మార్క్‌లా పనిచేస్తాయి. దీనికి అనుగుణంగా రాబడి ఉటుంది.

నష్టభయం

ఈ పథకంలోని పెట్టుబడులను ఈక్విటీ ఆధారితషేర్లలోపెడతారు. మార్కెట్లో లాభనష్టాలకు అనుగుణంగా పెట్టుబడుల తీరు ఉంటుంది. స్వల్పకాలంలో నష్టభయం అధికంగా ఉంటుంది. అయితే దీర్ఘకాలంలో నష్టభయం ప్రభావం పెట్టుబడులపై తక్కువగా ఉంటుంది.

పన్ను వివరాలు

ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సీ ప్రకారం ఈఎల్ఎస్ఎస్ పథకంలో పెట్టుబడులకు రూ 1.5 లక్షల వరకూ పన్ను మినహాయింపు ఉంటుంది.
లాక్ ఇన్ పీరియడ్ ఉంటుంది కాబట్టి ఈ పథకంలో పెట్టుబడిని మూడేళ్ల కన్నా ముందే వెనక్కి తీసుకుంటే పెట్టుబడిపై మినహాయింపు పొందిన పన్ను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.
డివిడెండ్ల ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను ఉండదు.
దీర్ఘకాలంలో పెట్టుబడి ద్వారా వచ్చే లాభాలకు పన్ను వర్తించదు.



ముఖ్యాంశాలు

ఈ పథకానికి సంబంధించి పెట్టుబడులను ఈక్విటీ మార్కెట్‌లోని వివిధ కంపెనీల షేర్లలో పెడతారు.
ఏదో ఒక రంగానికి, కంపెనీకో ఈ ఫండ్లను పరిమితం చేయరు
ఫండ్ నిర్వాహకుడు ఫండ్లను నిర్వహిస్తాడు.

బిట్ కాయిన్ మానియా వదిలేయండి

పెట్టుబడులు పెట్టడానికి భిన్నంగా ఆలోచించండి. బిట్‌కాయిన్ మానియాను వదిలేస్తే పెట్టుబడులకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. బిట్ కాయిన్‌లు అంటూ చాలామంది కొంగజపం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల ముమ్ముందు తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది. 2017లో ఎదురైన అనుభవాలు ఈ సంవత్సరం గుణపాఠంగా మార్చుకోండి.
2017లో ఈక్విటీల్లో కేటాయింపులు చేసినవారికి మంచి సంవత్సరంగా చెప్పుకోవచ్చు. కానీ ఫిక్స్‌డ్ ఇన్‌కం ప్రొడక్ట్‌లలో వడ్డీ రేట్లు బాగా పడిపోయాయి. నిఫ్టీ 50 30.71శాతానికి ఎగబ్రాకింది. నిఫ్టీఫ్రీఫ్లోట్ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 60.41శాతానికి చేరింది. నిరుడుతో పోలిస్తే ఇది ఎక్కువే. అలాగే విలువ కూడా పెరిగింది. ఖరీదైన మార్కెట్‌గా అవతరించింది.
పోస్టాఫీసు చిన్నమొత్తాల పొదుపు పథకాల మీద పెట్టుబడులు పెట్టినవారికి ఈ సంవత్సరం అంతబాగాలేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు పెట్టినవారికి రాబడులు లేకుండా పోయాయి. వడ్డీ రేట్లు బాగా తగ్గిపోయాయి. కొన్ని చిన్న బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద ఎక్కువ రిటర్నులను అందించాయి. సీనియర్ సిటిజన్ స్కీం, సుకన్య సమృద్ధి పథకాలు ఆకర్షణీయంగా ఉన్నాయి.
విలువను అంతకంతకూ పెంచుకుంటూ దూసుకుపోతున్న క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్‌కి ఈ ఏడాది ఆరంభంలో ఎదురుదెబ్బ తగిలింది. రెండేళ్లుగా ఏడాది తొలిరోజు లాభాల్లో దూసుకెళ్లిన ఈ కరెన్సీ విలువ 2015 తర్వాత తొలిసారి తగ్గింది. ఈ ఏడాది తొలిరోజైన సోమవారం దీని విలువ న్యూయార్క్‌లో 13, 624, 56 డాలర్లకు పడిపోయింది. అంతకుముందు ఆదివారం దీని విలువ 14,156 డాలర్లుగా ఉంది.
గతేడాది డిసెంబర్ 18న తొలిసారిగా 19,511 డాలర్ల గరిష్టాన్ని తాకిన బిట్ కాయిన్. ప్రపంచం మొత్తం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. 2017లో జనవరి 1న 3.6శాతం దీని విలువ పెరిగింది. అప్పట్లో దీని విలువ 998 డాలర్లుగా ఉండగా.. ఏడాదిలో 1300 శాతం దీని విలువ పెరిగింది. 2016 జనవరి ఒకటో తేదీన కూడా దీనివిలువ 0. 873శాతం పెరిగింది. కాగా 2015లో 1. 855 శాతం బిట్ కాయిన్ విలువ తగ్గింది. రెండేళ్ల తర్వాతతొలిసారిగా ఆరంభంలో బిట్ కాయిన్‌కు ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది.
మరో వైపు బిట్ కాయిన్ విలువ పెరుగుతుండడంతో భారత్‌లో సామాన్యులు సైతం వీటి పట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంట్లో పెట్టుబడి శ్రేయస్కరం కాదని, ఎప్పటికైనా ప్రమాదమేనని అటు కేంద్రం సహా, ఆర్‌బీఐ హెచ్చరికలు జారి చేస్తూనే ఉన్నాయి.



స్థిరాస్థులవైపు మళ్లండి

రియల్ ఎస్టేట్ రంగానికి చెరగని చిరునామా సంవత్సరంగా మిగిలిపోయింది.
అనేక రాష్ట్రా లు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీలను ఏర్పాటు చేస్తున్నాయి. కానీ అమలు మాత్రం కొద్దిగా తాత్సారం అవుతుంది.
ఎక్కువధర అయిన పెట్టి స్థిరాస్తులను కొనుగోలు చేయండి.

బిట్ కాయిన్ మోజులో పడకండి

ఈ సంవత్సరం బిట్ కాయిన్ వార్తలు బాగానే వస్తున్నాయి. ఒక రోజు పెరుగుతుంది. మరుసటి రోజు బాగా తగ్గుతుంది. భారతీయ బిట్ కాయిన్ ఎక్స్‌చేంజిల్లో నమోదు ఎక్కువగానే ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కూడా ఎగబడుతున్నారు. బిట్ కాయిన్ విషయంలో ప్రభుత్వం కూడా నియమ నిబంధనలను ఏర్పాటు చేయాలని భావిస్తుంది.
బిట్ కాయిన్స్ డివిడెండ్స్ ఇవ్వవు. నగదుగా మార్చలేవు. ఎలాంటి విలువ లేదు.
10శాతం కంటే ఎక్కువగా పెట్టుబడులు పెట్టకూడదు. ఫైనాన్షియల్ ప్లానర్ అయిన అరవింద్ ఇదే విషయాన్ని చెబుతున్నాడు. పన్నులు కట్టే అవకాశం ఎక్కువగా ఉంది.

సెబీ నమోదిత పెట్టుబడి సలహాదారు

చివరగా చెప్పేదేమిటంటే మీ కెరీర్‌లో మీ ఆదాయం బాగా పెరగాలంటే సెబీ నమోదిత పెట్టుబడి సలహాదారుడిని తీసుకోవాలి. వ్యక్తిగత ఆర్థిక వ్యవహారాలు మాత్రం సంక్లిష్టంగా మారిపోతున్నాయి. విలువైన తప్పులు మళ్లీ మళ్లీ చేయకండి.ఆర్థిక వ్యవహారాలు గాడిలో ఉండే విధంగా జాగ్రత్త పడాలి. దీర్ఘకాలంలో లాభాలు రావడానికి అవకాశం ఉంటుంది.

ఎక్కువమంది కోరుకునే ఆస్తి రియల్ ఎస్టేట్

పారదర్శకతను మరింతగా పెంచేందుకు నిరుడు పాలసీలలో అనేక మార్పులు చోటుచేసుకున్నప్పటికీ రియల్ ఎస్టేట్ భారతీయులకు అందరూ కోరుకునే ఆస్థిగానే కొనసాగుతోంది. 15 లక్షలమందికి పైగా కొనుగోలుదారులు ప్రాపర్టీకోసం చాలా చురుగ్గా అన్వేషించారని మ్యాజిక్ బ్రిక్స్ నివేదిక పేర్కొంది. భారతదేశపు ప్రఖ్యాతిగాంచిన ప్రాపర్టీ సైట్ మ్యాజిక్ బ్రిక్స్ గత 12 నెలల్లో వినియోగదారుల ప్రవర్తనను విశ్లేషించి 2017లో భారత్ ఇళ్ల వేటను ఎలా సాగించింది అన్న అంశాన్ని పరిశీలించి ఆసక్తికరమైన కన్స్యూమర్ ట్రెండ్‌ను గమనించింది. ఆ సంవత్సరంలో వివిధ పాలసీ స్థాయి జోక్యాల అనంతరం రియల్ బయ్యర్‌లు మార్కెట్‌ను వదిలి వెళ్లారన్న అపోహను తుడిచివేసింది.



నయనతార, బాలకృష్ణ

జై సింహా విజయంపై నమ్మకముంది

- నిర్మాత సి.కళ్యాణ్



బాలకృష్ణ నయనతార జంటగా రూపొందిన చిత్రం జై సింహా. సీకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. కేఎస్ రవికుమార్ దర్శకులు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న జైసింహా సంక్రాంతి విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత సి. కళ్యాణ్ చిత్ర విశేషాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ....జైసింహాగా బాలకృష్ణ ఆకట్టుకుంటారు. ఆయనది చాలా శక్తివంతమైన పాత్ర. కథా బలంతో తెరకెక్కించిన చిత్రమిది. ముందు డేట్స్ లేవన్న నయనతార, ప్రకాష్ రాజ్...ఫోన్‌లో కథ గురించి తెలుసుకుని తప్పకుండా నటిస్తామంటూ ముందుకొచ్చారు. ఫ్లాష్ బ్యాక్ బాగున్న బాలకృష్ణ సినిమాలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. జైసింహాలో నేపథ్య సన్నివేశాలు బాగా వచ్చాయి. ముఖ్యంగా విశాఖలో తెరకెక్కించిన సన్నివేశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. యాక్షన్ సన్నివేశాలే కాదు..పాటల్లోనూ యువ కథానాయకులకు పోటీగా చేశారు మా హీరో. సంక్రాంతికి అభిమానులకు జైసింహా మరో పండగ అవుతుంది. దర్శకులు కేఎస్ రవికుమార్ కథను బాలకృష్ణకు తగినట్లు పవర్‌ఫుల్‌గా రూపొందించారు. రత్నం సంభాషణలు థియేటర్‌లో ఈలలు వేసేలా ఉంటాయి. గతంలో బాలకృష్ణతో పరమవీర చక్ర చిత్రాన్ని చేశాను. ఆ సినిమా విషయంలో నాకు సంతృప్తి దక్కింది. జాతీయ స్థాయిలో సమైక్యతా పురస్కారం లభించింది. వీటన్నింటికంటే గురువు గారు దాసరి గారితో సినిమా నిర్మించాననే సంతోషం కలిగింది. మరో హిట్ సినిమా చేద్దామనే ఆలోచన బాలకృష్ణ దాసరి గారు ఇద్దరిలో ఉండేది. ఇంతలో గురువు గారు చనిపోయారు. థియేటర్‌లు దొరక్కే చిన్న సినిమాలు చచ్చిపోతున్నాయి. బాగుందన్న సినిమా ప్రేక్షకులు చూసేందుకు అవకాశం ఉండటం లేదు. రేపు సంక్రాంతికి మా చిత్రంతో పాటు పవన్ కళ్యాణ్ సినిమా విడుదలవుతోంది. ఈ రెండు చిత్రాలకే అత్యధికంగా థియేటర్‌లు కేటాయించారు. ఇక ఇందులో చిన్న చిత్రాలకు అవకాశం ఎక్కడుంది. ఏదైనా థియేటర్‌లు దొరికినా...అవి ఏ మూలనో, పాతబడినవి దొరుకుతాయి. అన్ని సౌకర్యాలు ఉన్న థియేటర్ వాళ్లు స్టార్ హీరో సినిమాలే తీసుకుంటారు. బాగా లేని థియేటర్‌లో చిన్న సినిమా ప్రదర్శనకు వచ్చినా ఎవరూ చూడరు. ఈ విషయంలో స్పష్టమైన విధానం ఒకటి రావాలి. ఇక క్యూబ్, యూఎఫ్‌వో రెండూ కలిసిపోయాయి. నిర్మాతల దగ్గర ఎక్కువ డబ్బు తీసుకుంటున్నాయి.

ఈ సమస్యపై మార్చి 31 నుంచి సమ్మె జరగబోతోంది. డిజిటల్ ప్రదర్శనల్లో దోపిడీ తగ్గకపోతే నిర్మాతలు మిగలరు. ఇక కొంతమంది హీరోలు మాత్రమే సినిమాలు చేసుకునే పరిస్థితి వస్తుంది. అన్నారు.

ఆశ్చర్యం... ఆనందం



కీర్తిసురేష్, పవన్‌కల్యాణ్, అను ఇమ్మాన్యుయేల్

సరిగ్గా పద్దెనిమిది సంవత్సరాల క్రితం బద్రి సినిమా అమెరికాలో కొన్ని సెంటర్లలో విడుదలవగానే పెద్ద విజయంగా అప్పట్లో అభివర్ణించారు. అయితే ఇప్పుడు అజ్ఞాతవాసికి ఏ భారతీయ చలన చిత్రానికి ఇవ్వనంత భారీ విడుదలను అమెరికాలో ఇస్తున్నందుకు నాకు నిజంగా ఆశ్చర్యంగా, ఆనందంగానూ ఉంది. మీరు చూపిన ఈ ప్రేమకు, గౌరవానికి శిరస్సు వంచి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నా అంటూ పవన్‌కల్యాణ్ వీడియోలో స్పందించారు. ఆయన కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఎస్.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి ఒకరోజు ముందుగా అమెరికాలో ప్రీమియర్ షోలు ప్రదర్శింపబడనున్నాయి. పవన్ 25వ చిత్రంగా రూపొందిన ఈ చిత్రం రికార్డుల వేటను కొనసాగిస్తోంది. అమెరికాలో అత్యధిక థియేటర్స్‌లో విడుదలవుతున్న తొలి భారతీయ చిత్రంగా రికార్డును సాధించింది. అక్కడి లాస్ ఏంజెల్స్‌లోని యూనివర్సల్ స్టూడియో స్లోని సిటీవాక్ థియేటర్లో ఈ చిత్రాన్ని ప్రదర్శించనుండటం ఓ ప్రత్యేక గుర్తింపుకు కారణమవుతోంది. ఈ విషయాన్ని చిత్రబృందం పోస్టర్ ద్వారా ప్రకటించింది. 9వ తేదీ సిటీవాక్ థియేటర్లో చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. ఇక అమెరికాలో దాదాపు 209 లొకేషన్స్‌లో సుమారు 547 స్క్రీన్స్‌పై ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిసింది. గతంలో బాహుబలి-2 చిత్రం 140 లొకేషన్స్‌లో మాత్రమే విడుదలైంది. ఇప్పుడు ఆ రికార్డును అజ్ఞాతవాసి అధిగమించింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ తన ఫ్యాన్స్‌కు కృతజ్ఞతలను వీడియో రూపంలో తెలియజేశారు. ఇందులో ఆయన ఏమన్నారంటే...ప్రవాస తెలుగువారందరికీ నా హృదయ పూర్వక నమస్కారాలు. ఉన్న వూరిని వదిలి పక్క వూరికి వెళ్లి పనిచేయటం ఎంతో కష్టం. అలాంటిది రాష్ట్రాన్ని వదిలి, దేశాన్ని వదిలి...దేశం కాని దేశంలో చదువుకోవటం, అక్కడ పనిచేయటం ఇంకా కష్టం. దాంతో పాటు ఆత్మగౌరవం దెబ్బతినకుండా అక్కడ ఓ జీవితాన్ని ఏర్పరచుకోవడం, అక్కడ స్థానికతను సంపాదించటం ఎంత కష్టమో నాకు బాగా తెలుసు. అందుకే మీరంటే నాకు చాలా గౌరవం. మీరెక్కడున్నా..మీ వెనుక మీతో పాటే నేను...అక్కడ మీకో చిన్న సమస్య ఎదురైతే ఇక్కడ కోట్ల గొంతులు మీకు అండగా నిలుస్తాయి అని అన్నారు.

ఫస్ట్ ఇంపాక్ట్ అదిరింది



లగడపాటి శ్రీధర్

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం నా పేరు సూర్య, నా ఇల్లు ఇండియా. అనూ ఇమ్మాన్యూయేల్ నాయికగా నటిస్తోంది. రచయిత వక్కంతం వంశీ ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ పతాకంపై లగడపాటి శ్రీధర్ నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఏప్రిల్‌లో నాపేరు సూర్య, నా ఇల్లు ఇండియా సినిమాను తెరపైకి తీసుకురావాలని నిర్ణయించారు. ఇటీవల సినిమా ఫస్ట్ ఇంపాక్ట్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌కు మంచి స్పందన వస్తోందని నిర్మాత లగడపాటి శ్రీధర్ చెప్పారు. అల్లు అర్జున్‌కు మరింత పేరు తీసుకొచ్చే సినిమా అవుతుందన్నారు. శ్రీధర్ మాట్లాడుతూ...నా పేరు సూర్య, నా ఇల్లు ఇండియా ఫస్ట్ ఇంపాక్ట్ కు మంచి స్పందన వస్తోంది. ప్రతి ఒక్కరూ మీ సినిమా హిట్ అని చెబుతున్నారు. తెలుగులో బాహుబలి తర్వాత అంతటి కమర్షియల్ హిట్ ఈ సినిమా అవుతుందని ఆశిస్తున్నాం. సినిమా మొదలు పెట్టేప్పుడు మీ ప్రొడక్షన్‌కు మంచి పేరు రావాలని అల్లు అర్జున్ నాతో అన్నారు. ప్రతి విషయంలో మా హీరో జాగ్రత్తలు తీసుకున్నారు. బన్నీ వాసు సహకారంతో అనుకున్న సమయానికి సినిమా చిత్రీకరిస్తున్నాం. వక్కంతం వంశీ రచయితగా ఎంత పేరు తెచ్చుకున్నారో దర్శకుడిగా అంతే మెప్పిస్తారు. ఆయన గత చిత్రాలు కిక్, టెంపర్ లాంటివన్నీ కలిస్తే నా పేరు సూర్య, నా ఇల్లు ఇండియా. ఏప్రిల్‌లో మీ ముందుకు సినిమాను తీసుకొస్తాం. అన్నారు.

నిజాయితీగా ఉండాలనే సారథి



రేవంత్, సమ్మోహిత్

రేవంత్, సమ్మోహిత్, అనిత రాఘవ, తేజారెడ్డి నాయకానాయికలుగా నటించిన చిత్రం సారథి. అల్లం భువన్ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో అల్లం భువన్ మాట్లాడుతూ, ఇది నా మొదటి సినిమా. రంజిత్ డైలాగ్స్ చాలా బావుంటాయి. నిజాయితీగా ఉండటమే రాజకీయ నాయకుల, పోలీసుల విధి అన్న ప్రధాన అంశంతో ఈ చిత్రాన్ని మలచడం జరిగింది అని అన్నారు. హీరో రేవంత్ మాట్లాడుతూ, ఇప్పటివరకు 25 లఘు చిత్రాల్లో నటించాను. మొదటిసారి వెండితెరకు హీరోగా పరిచయమవుతున్నా. ఆడియోకు మంచి స్పందన లభించింది అని అన్నారు. హీరోయిన్ అనితరాఘవ మాట్లాడుతూ, ఈ చిత్రకథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అని అన్నారు. ఇంకా ఈ సమావేశంలో అతిథి జి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: టి.కె. పరంధామ, సంగీతం: వి.కిరణ్‌కుమార్.

ఆర్పీ పట్నాయక్ పునరాగమనం

ఇకపై సంగీత దర్శకుడిగా సినిమాలు చేస్తానన్నారు ఆర్పీ పట్నాయక్. పదిహేడేళ్లుగా ఆయన బయట సినిమాలకు స్వరకల్పన చేయడం ఆపేశారు. 2004లో సంగీత దర్శకుడిగా సినిమాలు చేయనని ప్రకటించిన ఆర్పీ...ఆ తర్వాత నటుడిగా, దర్శకుడిగా కొనసాగారు. స్వీయ దర్శకత్వ చిత్రాలకు మాత్రమే స్వరాలు అందించారు. ఆర్పీ పట్నాయక్ తాజాగా నీతో ఏదో చెప్పాలని ఉంది అనే వీడియో ఆల్బమ్ చేశారు. ఈ పాటకు సాహిత్యం, సంగీతం అందిస్తూ దర్శకత్వం వహించారు.



అనుదీప్‌తో కలిసి నటిస్తూ...గాయని సత్య యామిని ఈ పాటను ఆలపించింది. నీతో ఏదో చెప్పాలని ఉంది వీడియో ఆల్బమ్ విడుదల కార్యక్రమం హైదరాబాద్ ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. సంగీత దర్శకుడు కోటి పాటను విడుదల చేశారు. అనంతరం సంగీత దర్శకుడు కోటి మాట్లాడుతూ...ఆర్పీ పట్నాయక్ సంగీతం చేయనని చెప్పినప్పుడు బాధపడిన వాళ్లలో నేనూ ఉన్నాను. మంచి కంపోజర్..పాటలు చేయాలని కోరుకున్నాను. ఆర్పీ పట్నాయక్ పాటలకు అభిమానిని. కొత్త ఏడాదిలో ఆర్పీ ఇలాంటి ప్రైవేట్ ఆల్బమ్ చేయడం సంతోషకరం. మన దగ్గర వందమంది దాకా పేరున్న గాయనీ గాయకులు ఉన్నారు. వాళ్లంతా స్వతహాగా ప్రతిభను చూపించుకోవాలి. మరో సంగీత దర్శకుడి పాటలు పాడి పేరు తెచ్చుకోవడం కంటే...సొంతంగా ఓ పాట స్వరపర్చి, సాహిత్యం రాసుకుని అది శ్రోతలకు నచ్చేలా పాడాలి. అప్పుడే గాయనీ గాయకులు తమ నిజమైన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పగలగుతారు. అన్నారు. సత్య యామిని మాట్లాడుతూ...ఆర్పీ గారి పాటలు పాడి గాయనిగా ఎదిగాను. ఇప్పుడు ఆయన స్వరపర్చిన వీడియో ఆల్బమ్‌లో నటించడం ఆనందంగా ఉంది. అని చెప్పింది. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ....కొన్ని అనుకోని కారణాలతో 2004లో సంగీత దర్శకత్వం చేయడం ఆపేశాను. ఆ తర్వాత కొన్ని లక్షల మందిని కలిశాను. ప్రతి పదిమందిలో ఎనిమిది మంది మీరు మళ్లీ సంగీతం ఎప్పుడు చేస్తున్నారు అని అడిగారు. నా సంగీతాన్ని కోల్పోతున్న వాళ్లలో నేనూ ఉన్నాను. నేను పాటలు ఆపేస్తున్నట్లు ప్రకటించిన రోజు మొదట నన్ను వెతుక్కుంటూ వచ్చి కలిసిన వ్యక్తి కోటి గారు. నువ్వు సంగీతం చేయాల్సిందే అని మందలించారు. నాపై ఆయనకున్న అభిమానం అది. మీ అందరి కోసం చెబుతున్నాను ఇకపై మళ్లీ స్వరకల్పన చేస్తాను. నేను సంగీత అందించే చిత్రాలకు దర్శకుడి పనిలో జోక్యం కలిగించుకుంటానని అపోహ ఉంది. అది నిజం కాదు. నా మొత్తం ప్రయాణంలో దర్శకుడికి ఇవ్వాల్సిన గౌరవం ఇస్తూనే పనిచేశాను. ఇకపైనా అలాగే ఉంటాను. నా పాటలు విని ప్రేమలో పడిన యువత ఎందరో ఉన్నారు. ఈ ప్రేమ పాటను విని కొత్తగా ప్రేమలో పడతారు. మన దగ్గరున్న గాయనీ గాయకులు ఇలాంటి ఆల్బమ్స్ చేస్తే...కొత్త తరహా సంగీతం శ్రోతలకు చేరుతుంది. అన్నారు.



పూజా హెగ్డే

పూజకు వేళయింది

ఇప్పుడిప్పుడే పూజా హెగ్డేకు టాలీవుడ్‌లో క్రేజ్ పెరుగుతోందన్న అంశం హాట్ టాఫిక్‌గా మారింది. వాస్తవానికి ఇప్పటివరకు ఈ భామ మూడు తెలుగు సినిమాల్లో నటిస్తే వాటిలో రెండు చిత్రాలు నిరాశనే మిగిల్చాయి. అయినప్పటికీ తెలుగులో కొదవలేకుండా వరుస సినిమాల్లో నటించే అవకాశాలు ఆమెను వరిస్తుండటం విశేషం, నాగచైతన్య కథనాయకుడిగా రూపొందిన ఒక లైలా కోసం చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమెకు ఆ చిత్రం ఆశించినస్థాయిలో గుర్తింపును ఇవ్వలేకపోయింది. ఆ తర్వాత ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ముకుంద చిత్రం కూడా ఆశించిన ఫలితాన్ని అందించలేకపోయింది. అయితే ఈ మధ్యనే వచ్చిన అల్లు అర్జున్ చిత్రం డి.జె., (దువ్వాడ జగన్నాథమ్) చిత్రం కమర్షియల్‌గా బాగానే ఆడటంతో పూజకు క్రేజ్ రావడం ఆరంభమైంది.

మరోవైపు డి.జె. కంటే ముందు కెరీర్ పరంగా ఏ భాషకు చెందిన సినీరంగంలో నిలదొక్కుకోవాలన్న సందిగ్ధ సమరంలో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి మొహెంజదరో చిత్రంలో నటించింది. ఆ చిత్రం బాక్సాఫీసు వద్ద మంచి కలెక్షన్లను సాధించినప్పటికీ బాలీవుడ్‌లా ఆమెకు తగినంత గుర్తింపును ఇవ్వలేకపోయింది. ఇదిలావుండగా...ప్రస్తుతం ఆమె సల్మాన్‌ఖాన్ నటిస్తున్న రేస్-3 చిత్రంలో నటిస్తూనే తెలుగు సినీరంగానికి కూడా ఎక్కువ ప్రాధాన్యమిస్తోంది. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా శ్రీవాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సాక్ష్యం చిత్రంలో కథానాయికగా, రామ్‌చరణ్, దర్శకుడు సకుమార్‌ల కలయికలో రూపొందుతున్న రంగస్థలం చిత్రంలో ఓ ప్రత్యేక గీతంలో మెరవబోతున్న ఆమెకు మరో రెండు క్రేజీ ప్రాజెక్టులలో అవకాశాలు లభించినట్లు పరిశ్రమలో చెప్పుకుంటున్నారు. నితిన్, దర్శకుడు కృష్ణచైతన్యల కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం తర్వాత నితిన్ , సతీష్ వేగేశ్న కలయికలో శ్రీనివాస కల్యాణం పేరుతో దిల్‌రాజు ఓ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతు న్నాయి. ఈ చిత్రంలో హీ రోయిన్‌గా సాయిపల్లవిని ఎంపికచేస్తారంటూ వినిపించింది. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం పూజను ఎంపిక చేశారట. ఇదిలావుండగా...మహేష్‌బాబు, కొరటాల శివల కలయికలో భరత్ అను నేను చిత్రం తెరకెక్కుతోంది. దీని తర్వాత వంశీ పైడిపల్లి దర్శకత్వంలో మహేష్ ఓ చిత్రం చేయబోతున్న విషయం తెలియంది కాదు. ఇందులో మహేష్ సరసన కూడా పూజనే ఖరారు చేశారని పరిశ్రమలో చెప్పుకుంటున్నారు.